www.andhrajyothy.com

విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 352

నిప్పుల కొలిమిలా రాష్ట్రం

ఎండలకు తోడైన వడగాలి

94 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు



పోరుమామిళ్లలో 44.5 డిగ్రీలు

నంద్యాలలో 43.7 డిగ్రీలు నమోదు

నేడు, రేపూ కొనసాగనున్న గాడ్పులు 2

నైరుతి ఆశాజనకం

జూన్ నాటికి ఎల్‌నినో బలహీనం

జూలై నెలాఖరుకల్లా లానినా

రుతుపవనాల సీజన్‌లో మంచి వర్షాలు

ఐఎండీ డీజీ మృత్యుంజయ మహాపాత్ర

శనివారం | 6-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 |

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి ఉ. 10.21 తదుపరి త్రయోదశి; నక్షత్రం: శతభిషం మ. 3.40 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా. 9.21-10.46; దుర్ముహూర్తం: ఉ. 6.10-7.48; అమృతఘడియలు: ఉ. 9.12-10.38, తె. 5.52 మొదలు; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.10; సూర్యాస్తమయం: 6.26

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అవ్వాతాతలపై ఎవరికి ప్రేమ?

జగన్‌వి కోతలు.. బాబువి చేతలు



గతంలో లబ్ధిదారులందరికీ అమలు

ఐదేళ్లలో రూ.200 నుంచి 2 వేలకు పెంపు

కొత్తగా 19 లక్షలకు పైగా మంజూరు

జగన్ వచ్చాక కొత్తగా 12 లక్షలలోపే

అదీ పాతవాటిని తొలగించి మంజూరు

రకరకాల నిబంధనల పేరిట 6 లక్షలు కట్

3 వేలకు పెంపుపై 'విడతల వారీ' డ్రామా

ఇప్పుడూ పింఛన్ల పంపిణీపై కహానీలు

బాధ్యత తనది కాదన్నట్టు సీఎం వైఖరి

బస్సు యాత్రలో పచ్చి అబద్ధాలు

'వలంటీర్ల'పైనే మొదటి సంతకం చేస్తారట

జగన్ దృష్టిలో వారు ఉన్నట్లా? లేనట్లా?

చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 19 లక్షలకు పైగా కొత్త పెన్షన్లు మంజూరు చేయగా.. జగన్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు 12 లక్షల పెన్షన్లు కూడా కొత్తగా మంజూరు చేయలేదు. పైగా రకరకాల నిబంధనలతో పాత పెన్షన్లకు కత్తెర వేశారు.

> చంద్రబాబు హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 54.06 లక్షల పెన్షన్లు ఉండేవి. అయితే చంద్రబాబు 39 లక్షలు పెన్షన్లు మాత్రమే ఇచ్చారని, తాము 66 లక్షలకు తీసుకెళ్లామని జగన్ పదే పదే అబద్ధాలు చెబుతున్నారు.

ఏప్రిల్‌లో పెన్షన్ల పంపిణీని కావాలనే జాప్యం చేశారు. ఖజానాలో ఉన్న సొమ్మును అస్మదీయ కాంట్రాక్టర్లకు చెల్లించేశారు. పింఛన్లకు నిధుల విడుదలను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేశారు. ఇళ్ల వద్దనే పెన్షన్ ఇవ్వడానికి సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉన్నా చర్యలు తీసుకోలేదు. అసలు ఈ బాధ్యత తనది కాదన్నట్టుగా ముఖ్యమంత్రి జగన్ కక్ష గట్టినట్టు వ్యవహరించారు. ఇప్పుడు అబద్ధాలు చెబుతూ ప్రతిపక్షాలపై నిందలు వేస్తున్నారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'నా అవ్వా తాతలు' అంటూ ప్రేమ ఒలకబోసే వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు నిజంగానే వారిపై ప్రేమ ఉందా? పెన్షన్ లబ్ధి జరిగింది ఎవరి హయాంలో? తాజా పరిణామాల నేపథ్యంలో ఇదో చర్చనీయాంశంగా మారింది. ఏ కోణంలో చూసినా చంద్రబాబు హయాంలోనే అవ్వాతాతలకు మేలు జరిగిందని చెప్పవచ్చు. తెలుగుదేశం హయాంలో అర్హులైన లబ్ధిదారులందరికీ పెన్షన్లు ఇచ్చేవారు. రూ.200 ఉన్న పెన్షన్‌ను

మిగతా 2వ పేజీలో...



బద్వేల్ నియోజకవర్గంలో నిర్వహించిన రోడ్‌షోలో షర్మిల, సునీత అభివాదం

జగన్.. నువ్వు నాయకుడివేనా?

బాబాయిని చంపినవారికి సీటు ఇస్తావా?

అవినాశ్‌ను ఎందుకు కాపాడుతున్నావ్?

న్యాయం, ధర్మం ఎక్కడున్నాయి?

ఈ ఘోరాన్ని ఆపడానికే ఎంపీగా నిలబడ్డా

హత్యా రాజకీయాలు చేసే అవినాశ్‌ను కాపాడే జగన్‌ను ఓడించండి: షర్మిల

కడప ఎంపీ సీటు కోసమే వివేకా హత్య

షర్మిలకు ఇవ్వాలని కోరితే అవినాశ్ వద్దన్నాడు

వివేకాను హత్య చేయించాడు: సునీత

బస్సుయాత్రలో అన్నపై విరుచుకుపడ్డ చెల్లెళ్లు

కడప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): 'సొంత బాబాయి వైఎస్ వివేకానందరెడ్డిని చంపినవారిని శిక్షించలేని నీవు నాయకుడివి ఎలా అవుతావు?' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై ఆయన సోదరి, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విరుచుకుపడ్డారు. ఈ కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని కాపాడుతున్నాడని, హత్య చేసినవారికే మళ్లీ పార్టీ టికెట్ ఇచ్చాడని, న్యాయం, ధర్మం ఎక్కడుందని ప్రశ్నించారు. ఈ ఘోరాన్ని ఆపడానికే వైఎస్సార్ బిడ్డగా తాను ఎంపీగా నిలబడ్డానని, ఇది న్యాయానికి, అధర్మానికి జరుగుతున్న పోరాటమని అన్నారు. తనవైపు న్యాయముందని, మరోవైపు వివేకా హత్య కేసు

మిగతా 11వ పేజీలో...



పసుపు కండువా కప్పి రఘురామను పార్టీలో చేర్చుకుంటున్న చంద్రబాబు



పాలకొల్లు సభకు హాజరైన జనం

ఏప్రిల్ నుంచే 4 వేలు పెన్షన్

ఏప్రిల్, మే, జూన్ పింఛన్‌కు వెయ్యి అదనం

ఆ 3 నెలలదీ కలిపి జూలైలో ఇంటికే..

అవ్వాతాతలకు చంద్రబాబు కీలక హామీ

ఆక్వాకు రూపాయిన్నరకే విద్యుత్

జోన్‌తో సంబంధం లేకుండా వర్తింపు

పెన్షనర్లను బలిగొన్న జగన్ రాజీనామా చెయ్

శవ రాజకీయానికి కుట్ర.. ఇంటికే పంపిణీ వద్దని ఈసీ చెప్పలేదే?

అడ్డుకున్నానని నాపై నెపమా?.. ఇంత నీచం, దుర్మార్గం ఉంటుందా?

యువతకు జాబ్ రావాలంటే ఎన్డీయే.. గంజాయి కావాలంటే జగన్

నిరుపేదలకు 2 సెంట్ల స్థలం.. ఇంటి నిర్మాణం చేసిస్తాం

నరసాపురం, పాలకొల్లు ప్రజాగళం సభల్లో బాబు

రాజమహేంద్రవరం, భీమవరం/నరసాపురం/పాలకొల్లు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): "ఏప్రిల్ నుంచే రూ.4 వేల చొప్పున పింఛన్ ఇస్తాను. ఏప్రిల్, మే, జూన్‌ల్లో మీరు తీసుకునే రూ.మూడు వేలకు అదనంగా వెయ్యి చొప్పున జూలై నుంచి ఇచ్చే పింఛన్‌లో కలిపి అందిస్తాను" అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పింఛనుదార్ల

మిగతా 11వ పేజీలో...

వలంటీర్లా.. కార్యకర్తలా?

తీరు మార్చుకోని వైసీపీ నేతలు



కాకినాడలో జరిగిన భేటీలో పాల్గొన్న వలంటీర్లు

ద్వారంపూడి కన్వెన్షన్‌లో రహస్య సమావేశం

రాజీనామా చేయాలని వలంటీర్లకు ఆదేశం

పార్టీ కార్యకర్తలుగా పనిచేయాలని హుకుం

రాజీనామా లేఖలతో వచ్చిన వలంటీర్లు

వలంటీర్లకు నగదు తాయిలాల పంపిణీ?

ఇది... కాకినాడ సిటీ వైసీపీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి చెందిన 'డీ' కన్వెన్షన్ సెంటర్! ఇందులో సమావేశమైన వీళ్లంతా వైసీపీ కార్యకర్తలు కాదు! అక్కడ జరుగుతున్నది రాజకీయ సమావేశమూ కాదు! వీళ్లంతా వలంటీర్లు! వీళ్లందరితో ద్వారంపూడి ముఖ్య అనుచరులు

మిగతా 12వ పేజీలో...



ఏపీకి ప్రత్యేక హోదా

పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారెంటీ

యువత, మహిళ, రైతు, శ్రామిక వర్గాలకు న్యాయం.. అభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం

25 గ్యారెంటీల ద్వారా ఐదు న్యాయాల అమలు

కొలువుల్లో మహిళకు 50%.. పేద మహిళకు లక్ష

50% రిజర్వేషన్ల పరిమితిని తొలగించేలా సవరణ

ఎమ్మెస్పీకి చట్టబద్ధత, ఉపాధి కూలి రూ.400 2

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'న్యాయ పత్రం' విడుదల

ఒకవైపే సీఎస్ చూపు



తెలంగాణకు వెళ్లేందుకు 2 వేల మంది ఉద్యోగులు సీఎస్ సంతకం కోసం ఎదురుచూపులు

వారిని కాదని 'సంతకాల దొంగ'కు ఏర్పాట్లు

సీఎంవో స్కామ్ నిందితుడిపై అంత ప్రేమేంటో!

సీఎం డిజిటల్ సంతకం ఫోర్జరీ చేసిన అటెండరు

బెయిల్‌పై రాగానే హైదరాబాద్ లేక్‌వ్యూకు 12

ఇప్పుడు శాశ్వతంగా తెలంగాణకు పంపే ఏర్పాట్లు

ప్రభుత్వం మారితే తిప్పలు తప్పవనుకుంటున్నారా?

విభజన చట్టం ప్రకారం ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ఏపీలో పనిచేస్తున్న రెండువేలమంది ఉద్యోగులు తెలంగాణకు వెళతామని ఏళ్ల తరబడి అడుగుతున్నారు. సీఎస్ చిన్న సంతకం చేస్తే రిలీవ్ అవ్వాలని ఎదురుచూస్తున్నారు. వారందరినీ కాదని సీఎంవోలో సీఎం, అధికారుల డిజిటల్ సంతకాలు ఫోర్జరీ చేసిన కేసులో నిందితుడిగా ఉన్న ఓ ఉద్యోగిని ఆగమేఘాలపై తెలంగాణకు తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఒక 'సంతకాల దొంగ' పట్ల సీఎస్ చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ రాష్ట్ర సచివాలయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



వార్తలు సమాప్తం

తొలి తెలుగు టీవీ న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ ఇక లేరు

గుండెపోటు, చికిత్స పొందుతూ మృతి 2

3 దశాబ్దాలకు పైగా దూరదర్శన్‌లో సేవలు

కవిత్వం, నవలలూ రాసిన శాంతిస్వరూప్

ముగిసిన అంత్యక్రియలు.. పలువురి సంతాపం

ముస్లిం మహిళపై వైసీపీ నేత భార్య దాష్టీకం

రాత్రి నమాజ్ చేసుకుని ఇంటికి వెళ్తుండగా దుర్భాషలు

దొంగతనం చేసేందుకు వచ్చావని మాటలతో అవమానం

మహిళ కుమారుడిపై చెప్పుతో దాడి.. నేత ఇంటిని ముట్టడించిన ముస్లింలు.. వైసీపీ నేత శ్రీనివాసరెడ్డి అరెస్టు

నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఘటన 3

వైసీపీ శవ రాజకీయం

3 నెలల కిందటే రద్దయిన పింఛన్ కోసం వెళ్లి వృద్ధురాలు చనిపోయిందని ఏడుపు 11

6 నెలలుగా మంచమే దిగలేదన్న కుటుంబం

నిజమేనని ధ్రువీకరించిన ఎంపీడీవో, ఈవో

అయినా.. విపక్షాలపై వైసీపీ నేతల నిందలు

రోత పత్రికలో రోత రాతలు.. విష ప్రచారం

వైసీపీకి ఇక్బాల్ రాజీనామా 11

ఎమ్మెల్సీ పదవికి కూడా... 10న టీడీపీలో చేరిక!

పాక్ ఉగ్రవాదులపై 'రా' గురి!

వారి దేశంలోనే స్పాట్.. 2020 నుంచి 20 మంది హతం 2

స్థానిక యువతతో ఆపరేషన్లు.. వారికి పెద్ద ఎత్తున డబ్బులు

ఉత్తుత్తి నొక్కుడుతో జగన్మాయ

పిల్లల ఫీజులకేం చెబుతారు?

పింఛన్ల జాప్యాన్ని విపక్షంపైకి నెట్టారు

మరి బటన్లు నొక్కిన సొమ్ములెక్కడ జగన్?

విద్యాదీవెన బటన్ నొక్కి నెల దాటింది

వలంటీర్లు అక్కర్లేదు.. పడితే నేరుగా ఖాతాల్లోకే

ఇప్పటికీ తల్లిదండ్రులకు చేరని 'దీవెన' నగదు

నిధులు లేకుండానే బటన్ నొక్కివదిలేసిన వైనం

90 శాతం మందికి అందని ఫీజులు

కోడ్ అంటూ అధికారుల అడ్డగోలు సాకులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"ప్రతిపక్షాలు వలంటీర్లపై ఈసీకి ఫిర్యాదు చేయడం వల్లే పింఛను పంపిణీ ఆలస్యమైంది. దీనికి పూర్తి కారణం ప్రతిపక్ష పార్టీలే".. అవ్వాతాతల పెన్షన్ల విషయంలో వైసీపీ

విద్యా దీవెన కోసం సీఎం జగన్ బటన్ నొక్కి నెల దాటినా అతీగతీ లేదు. అవ్వాతాతల పింఛన్ల విషయంలో చెప్పినట్టు వలంటీర్లు లేరని సాకులు చెప్పలేరు. పడితే నేరుగా ఖాతాల్లోకి వచ్చే ఈ నిధుల జాప్యాన్ని విపక్షంపైనా నెట్టేయలేరు. అయితే, 'దీవెన' నిధులపై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను ఆరా తీస్తే, ఇచ్చిన సమాధానం విని విద్యార్థులు, యాజమాన్యాల ప్రతినిధులు నోరెళ్లబెడుతున్నారు. కోడ్ అమల్లో ఉన్నందున ఫీజుల విడుదలలో జాప్యం జరుగుతోందట! వాస్తవానికి మార్చి 1న బటన్ నొక్కితే... 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. పింఛన్ల జాప్యం విషయంలో చేసినట్టే బట్టతలకు, మోకాలికి ముడిపెట్టి అడ్డగోలుగా వాదిస్తున్న అధికారుల తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

చేసిన దుష్ప్రచారం ఇది. సరే ఇదంటే ఇప్పుడు చేస్తున్న పంపిణీ కాబట్టి కొందరు తెలిసీ తెలియక నమ్మేశారు. కానీ నెల రోజుల కిందట బటన్ నొక్కిన పిల్లల ఫీజుల డబ్బులు

మిగతా 12వ పేజీలో...

రైతన్నతోనూ రాజకీయమే!

ఇన్‌పుట్ సబ్సిడీకి ఉత్తుత్తి నొక్కుడు

కోడ్‌కు 10రోజుల ముందు నొక్కిన సీఎం

ఇప్పుడు ఈసీ అనుమతిస్తేనే.. చెల్లింపులట!

అస్మదీయ కాంట్రాక్టర్ల కోసం ఖజానా ఖాళీ

ఆ విషయం దాచి 'విపత్తు' రైతులకు మోసం

ఇరవై రోజులుగా తిరుగుతున్న బాధితులు

పోలింగ్‌కు ముందు ఖాతాల్లోకి వేసే 'వ్యూహం'?

జగన్ ఓటు ఎత్తుగడలతో రైతులకు అవస్థలు!





(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా కరువు, తుఫాన్‌కు నష్టపోయిన లక్షలాది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపుల కోసం సీఎం జగన్ బటన్ నొక్కి, నెల రోజులైనా.. ఖాతాలకు నయాపైసా జమ కాలేదు. 2023 ఖరీఫ్‌లో కరువు, డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన 11.59లక్షలమంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.1,294కోట్లు విడుదల చేస్తున్నట్లు గత నెల ఆరో తేదీన జగన్ క్యాంప్ కార్యాలయం కంప్యూటర్‌లో బటన్ నొక్కారు. కానీ అసలు నిధులే

మిగతా 12వ పేజీలో...

పాక్ టెర్రరిస్టులపై రా గురి!

- వారి దేశంలోనే వారిపై స్కాట్..
- 2020 నుంచి 20 మంది హతం
- వెల్లడించిన గార్డియన్ కథనం
- ఆరోపణలను ఖండించిన భారత్

లండన్, ఏప్రిల్ 5: మోదీ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విదేశాల్లో ముఖ్యంగా పాకిస్థాన్‌లో భారత వ్యతిరేకులుగా భావిస్తున్న వారిని హతమార్చే కొత్త ధోరణి మొదలైందని బ్రిటన్‌కు చెందిన గార్డియన్ పత్రిక వెల్లడించింది. 2020 నుంచి 2023 వరకు దాదాపు 20 మంది ఈ విధంగా ప్రాణాలు కోల్పోయారని, ఈ హత్యలు భారత గూఢచార సంస్థ 'రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్' (రా) పర్యవేక్షణలో జరిగాయని ఆరోపించింది. ఈ మేరకు భారత్, పాకిస్థాన్ నిఘా, గూఢచార సంస్థల అధికారులతో గార్డియన్ ప్రతినిధి మాట్లాడి వివరాలు సేకరించినట్లు తెలిపింది. రా ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో పనిచేస్తుంది. కాగా, ఇటువంటి అనధికారిక ఆపరేషన్ల గురించి గతంలో రా వర్గాలు స్పందించేవి కావని, కానీ, ఈసారి మాత్రం రా అధికారులు తమ ప్రతినిధితో వివరంగా మాట్లాడటం గమనార్హమని గార్డియన్ పేర్కొంది. ఈ మేరకు ఇద్దరు రా అధికారులను ఉటంకిస్తూ.. 2019లో జరిగిన పుల్వామా దాడి అనంతరం రా వ్యూహం మారిందని, భారత వ్యతిరేక శక్తులు భారత్‌లో దాడికి దిగకముందే వారిని గుర్తించి నిర్మూలించటం అనే కొత్త పంథాను ఎంచుకున్నారని తెలిపింది. ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్, రష్యా గూఢచార సంస్థ కేజీబీల నుంచి ఈ మేరకు స్ఫూర్తి తీసుకున్నామని, ఇటువంటి ఆపరేషన్లకు ప్రభుత్వంలో అత్యున్నత స్థాయి ఆమోదం తప్పనిసరి అని సదరు అధికారులు చెప్పినట్లు ఈ కథనం వెల్లడించింది. 2018లో సౌదీఅరేబియా ప్రభుత్వ విమర్శకుడు, జర్నలిస్టు జమాల్ ఖషోగ్గీ హత్య కూడా తమను ఆలోచింపజేసిందని ఆ అధికారులు తెలిపారు. 'హత్య జరిగిన కొన్ని నెలల తర్వాత ప్రధాని కార్యాలయంలో రా అత్యున్నతస్థాయి అధికారులు సమావేశమయ్యారు. సౌదీలు ఇటువంటి పని చేసినప్పుడు మనం ఎందుకు చేయకూడదని ఓ అధికారి ప్రశ్నించారు' అని వెల్లడించారు. మరోవైపు, గార్డియన్ ప్రతినిధి పాకిస్థాన్ గూఢచర్య, నిఘా సంస్థలతో కూడా మాట్లాడారు. 2020 నుంచీ తమ దేశంలో ఈ తరహా హత్యలు జరుగుతున్నాయని, 2023లో వీటి సంఖ్య బాగా పెరిగిందని, ఆ ఒక్క ఏడాదిలోనే దాదాపు 15 మంది హత్యకు గురయ్యారని పాక్ వర్గాలు తెలిపాయి. అన్నీ కూడా గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో సంభవించిన మరణాలేనని పేర్కొన్నారు. యూఏఈ కేంద్రంగా రా అధికారులు స్లీపర్ సెల్స్‌ను ఏర్పాటు చేశారని, పాకిస్థాన్‌లోని నిరుపేద యువకులను చేరదీసి పెద్ద ఎత్తున డబ్బులను ఎరజూపి ఈ హత్యలకు పురమాయిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ హత్యల పరంపర ఈ ఏడాది నుంచి నిలిచిపోయింది. కెనడాలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య, అమెరికాలో మరో ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూ హత్యకు కుట్ర నేపథ్యంలో అటు కెనడా, ఇటు అమెరికా ప్రభుత్వాలు భారత్ ప్రమేయంపై బహిరంగంగా ఆరోపణలు చేశాయి. ఈ నేపథ్యంలోనే పాకిస్థాన్‌లో లక్షిత హత్యలు నిలిపివేయాలని ఢిల్లీ నుంచి ఆదేశాలు వచ్చాయని రా అధికారి ఒకరు వెల్లడించినట్లు గార్డియన్ పేర్కొంది. అయితే, ఈ హత్యల్లో తమ ప్రమేయం లేదని, ఇది భారత వ్యతిరేక దుష్ప్రచారమని భారత విదేశాంగశాఖ పేర్కొన్నట్లుగా గార్డియన్ తెలిపింది.

'మెయిన్ కోర్స్' ముందుంది

- గత పదేళ్లలో అభివృద్ధిపై ఆకలి మాత్రమే పుట్టించాం
- అవినీతిపై పోరాటం చేస్తే తప్పా: ప్రధాని మోదీ



జైపూర్, ఏప్రిల్ 5: గడిచిన పదేళ్ల పాలనలో అభివృద్ధిపై ఆకలి మాత్రమే పుట్టించామని, మెయిన్ కోర్స్ ముందుందని ప్రధాని మోదీ తెలిపారు. భారత సైన్యాన్ని అవమానించడం, ప్రజల్లో విభజన తీసుకురావడం ద్వారా కాంగ్రెస్ పార్టీ విపక్షానికే పరిమితమైందని వ్యాఖ్యానించారు. రాజస్థాన్‌లో మూడు రోజుల పాటు పర్యటిస్తున్న ప్రధాని రెండో రోజైన శుక్రవారం చురు జిల్లాలో బీజేపీ అభ్యర్థుల తరఫున నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశం నవీన భారతంగా ఆవిర్భవించిందన్నారు. పాకిస్థాన్‌లోని శత్రుస్థావరాలపై విరుచుకుపడడమే దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. "ఈ రోజు శత్రువులకు కూడా తెలుసు.. ఇక్కడున్నది మోదీ అని, ఇది నవీన భారతదేశమని" అని ప్రధాని తెలిపారు. "ఇప్పటి వరకు ఏం జరిగిందనేది పెద్ద విషయం కాదు. ఇప్పటి వరకు ఏం జరిగిందనేది కేవలం ట్రైలర్ మాత్రమే. మోదీ ఇప్పటి వరకు చేసింది కేవలం ఆకలి మాత్రమే పుట్టించింది. మెయిన్ కోర్స్ ఇక ప్రారంభంకానుంది" అని వివరించారు. గడిచిన పదేళ్ల కాలంలో ఈడీ ఒక్కటే రూ.లక్ష కోట్లకు పైగా అవినీతి సొమ్మును స్వాధీనం చేసుకుందని ప్రధాని తెలిపారు. అవినీతిపై ఇలాంటి చర్యలు తీసుకుంటే తప్పేంటని ఆయన ప్రజలను ప్రశ్నించారు.

బీజేపీలో చేరిన సుమలత

బెంగళూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటి, మండ్య లోక్‌సభ సభ్యురాలు సుమలత కమలదళంలో చేరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో మండ్య నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. ఏడాదిగా బీజేపీకి మద్దతు ఇస్తూ వస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్‌ను ఆశించారు. జేడీఎస్‌తో పొత్తు కారణంగా మండ్య టిక్కెట్ లభించలేదు. రెండు రోజుల క్రితం బీజేపీలో చేరుతున్నట్టు ప్రకటించిన సుమలత, శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కాషాయ కండువా కప్పుకొన్నారు. మోదీని మరోసారి ప్రధానిగా చూసేందుకు శాయశక్తులా పనిచేస్తానని సుమలత ప్రకటించారు.

నేడు 'అగ్నికుల్' ప్రయోగం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 5: భారత అంతరిక్ష రంగంలో మరో ప్రైవేటు రాకెట్ ప్రయోగానికి రంగం సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్‌లో ఏర్పాటుచేసిన ప్రైవేట్ ప్రయోగ వేదికపై నుంచి అగ్నికుల్ రాకెట్ శనివారం ఉదయం 6.04 గంటలకు నింగిలోకి ఎగరనుంది. ప్రస్తుతం ప్రయోగ వేదికపై ఉన్న ఈ రాకెట్‌కు పలు తనిఖీలు చేసి ప్రయోగానికి సిద్ధం చేస్తున్నారు. 300 కిలోల పేలోడ్‌ను 700 కిలోమీటర్ల దూరంలోని కక్ష్యలోకి చేరవేసే విధంగా ఈ రాకెట్‌ను డిజైన్ చేశారు.

'సంఘం'లో ఆయనొక్కరేనా?

- ఐపీఎస్‌ల అసోసియేషన్‌లో ఇంకెవరూ లేరా?
- మరోసారి కాంతి రాణా 'సంతకం'.. 'ఆంధ్రజ్యోతి' కథనానికి ఖండన

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో 144మంది ఐపీఎస్ అధికారులు ఉన్నారు. వీరికి ఒక సంఘం కూడా ఉంది. ఆ సంఘానికి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ఇతర కార్యవర్గ సభ్యులూ ఉన్నారు. కానీ.. విజయవాడ నగర కమిషనర్ కాంతి రాణా 'ఐపీఎస్ అధికారుల సంఘానికి' ఏకైక ప్రతినిధి అన్నట్లుగా వ్యవహరిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఆయన 'సంఘం' ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ హోదాలో ఒక ప్రకటన జారీ చేశారు. నిర్దిష్టంగా ఫలానా కథనానికి ఖండన లేదా వివరణ ఇవ్వడం సహజం! కానీ.. అదేదీ లేకుండానే 'ఆంధ్రజ్యోతి' పేరు ప్రస్తావిస్తూ పోలీసు అధికారుల స్థైర్యం దెబ్బతీసే కథనాలు ప్రచురిస్తున్నారంటూ ఆక్రోశించారు. శాంతి భద్రతలు, ప్రజా రక్షణ కోసం అహోరాత్రులు శ్రమించే వారిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. గతంలో ఇదే కాంతి రాణా ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి ఆర్కే మీనా పేరుతోనే 'ఫర్' సంతకం చేసేసి ఇలాంటి ఖండన జారీ చేశారు. 'నాకు తెలియకుండా నా పేరుతో ఎలా ప్రకటన ఇస్తావు?' అంటూ మీనా మండిపడ్డారు. ఇలా ఒకసారి ఇప్పటికే ఒకసారి 'సంఘం చేయని సంతకం' పెట్టిన విజయవాడ కమిషనర్ కాంతి రాణా... మరోసారి 'సంఘం' పేరు వాడుకున్నారు. ఇటీవల బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి 22 మంది ఐపీఎస్‌లపై నిర్దిష్ట ఆరోపణలు చేస్తూ, వారిని ఇప్పుడున్న పోస్టుల నుంచి తప్పించాలని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. అందులో కాంతిరాణా పేరూ ఉంది. ఆ వివరాలను 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. బహుశా... దీనిపైనే 'సంఘం' తరఫున ఆయన స్పందించి ఉంటారని తెలుస్తోంది.

సీఎం రమేశ్‌పై కేసు నమోదు

చోడవరం(అనకాపల్లి జిల్లా), ఏప్రిల్ 5: డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారుల విధులకు ఆటంకం కలిగించారన్న అభియోగంపై అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు సహా ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చోడవరం శివారు గాంధీ గ్రామంలోని శిలపరశెట్టి రామకృష్ణ, శిలపరశెట్టి బుజ్జికి చెందిన టైల్స్ దుకాణంపై డీఆర్ఐ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సమాచారం తెలియడంతో సీఎం రమేశ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, టీడీపీ, జనసేన కార్యకర్తలు పెద్దసంఖ్యలో దుకాణం వద్దకు చేరుకున్నారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని చెప్పిన సీఎం రమేశ్ అక్కడినుంచి వెనుదిరిగారు. అయితే తమ విధులకు ఆటంకం కలిగించారంటూ డీఆర్ఐ ఏడీ ఎంఎస్ఆర్కే సోమేశ్ గురువారం రాత్రి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఎం రమేష్, కేఎస్ఎన్ఎస్ రాజు, టైల్స్ వ్యాపారి రామకృష్ణ, అతని సోదరుడు బుచ్చిబాబు, వారి ఇద్దరు కుమార్తెలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వార్తలు సమాప్తం

- తొలి తెలుగు టీవీ న్యూస్‌రీడర్ శాంతిస్వరూప్ ఇక లేరు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): "నమస్కారం.. ఈ రోజు వార్తల్లో ముఖ్యాంశాలు.." అనే పలకరింపుతో నాలుగు దశాబ్దాల కిందట తెలుగు ప్రేక్షకులకు పరిచయమై, కోట్లాదిమంది మదిలో ఓ అందమైన జ్ఞాపకంగా నిలిచిపోయిన ఆ స్వరూపం ఇక కనపడదు. ఆ గాత్రం ఇక వినపడదు. టెలీప్రాంప్టర్ లేని రోజుల్లోనే.. కాగితం చూడకుండా, నేరుగా ప్రేక్షకుల వైపు చూస్తూ.. మోముపై చెదరని చిరునవ్వుతో, స్పష్టమైన ఉచ్చారణతో వార్తలు చదివి వినిపించిన తొలి తెలుగు టీవీ న్యూస్ రీడర్.. జయంతి శాంతిస్వరూప్(74) ఇక లేరు. కొంతకాలంగా మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్న ఆయనకు రెండు రోజుల క్రితం గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు వెంటనే ఆయన్ను ఆస్పత్రిలో చేర్చగా.. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. శాంతిస్వరూప్ పుట్టిపెరిగిందంతా.. హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలోనే. నారాయణగూడ న్యూసైన్స్ కాలేజీలో బీఎస్సీ చదివే సమయంలో నాటకాలు రాసి ప్రదర్శిస్తుండేవారు. 1970లో ఆకాశవాణి వార్తా విభాగంలో క్యాజువల్ ఎనౌన్సర్‌గా చేరి ఏడాదిపాటు పనిచేశారు. తర్వాత దూరదర్శన్‌లో చేరారు. 1983, నవంబర్ 14న సాయంత్రం 7 గంటలకు దూరదర్శన్‌లో మొట్టమొదటిసారిగా ప్రసారమైన వార్తా బులెటిన్‌లో వార్తలు చదివి, తొలి తెలుగు టీవీ న్యూస్‌రీడర్‌గా చరిత్రకెక్కారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఆరేళ్లపాటు ప్రసారమైన 'ప్రజలతో ముఖ్యమంత్రి' కార్యక్రమానికి సంధానకర్తగా వ్యవహరించారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు దూరదర్శన్‌లో పనిచేసిన శాంతి స్వరూప్ 2011లో పదవీ విరమణ పొందారు. న్యూస్‌రీడర్‌గానే కాదు.. కవిగా, రచయితగానూ శాంతి స్వరూప్‌కు గుర్తింపు ఉంది. శాంతిస్వరూప్ అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం అంబర్ పేట శ్మశానవాటికలో పూర్తయ్యాయి. శాంతిస్వరూప్ మృతిపట్ల.. సీఎం జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, తదితర రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు.

పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారెంటీ

ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం కోటా.. ఈబీసీలకు 10 శాతం

- 25 గ్యారెంటీలతో 5 న్యాయాల అమలు
- 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేత
- కాంగ్రెస్ మేనిఫెస్టో 'న్యాయ పత్రం' విడుదల



న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే గత పదేళ్ల అన్యాయ కాలాన్ని సరిదిద్దే విధంగా సమగ్ర సామాజిక, ఆర్థిక, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. మోదీ హయాంలో పదేళ్లుగా కొనసాగుతున్న ఏక వ్యక్తి, ఏక పార్టీ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడి, దేశ ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక న్యాయం కల్పించడం, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పునరుద్ధరిస్తామని తెలిపింది. ఈ మేరకు సమాజంలోని అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన ప్రతిపక్షపార్టీ కాంగ్రెస్ శుక్రవారం 'న్యాయ పత్రం' పేరుతో 45 పేజీల ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మేనిఫెస్టో కమిటీ చైర్‌పర్సన్ చిదంబరం, సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ విలేకరుల సమక్షంలో పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. 'పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారెంటీ' కింద 25 గ్యారంటీలను మేనిఫెస్టోలో ప్రకటించింది. 2025 నుంచి చేపట్టే కేంద్రప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో మహిళలకు 50% రిజర్వేషన్, 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ, విద్య, ఉద్యోగాల్లో ఆర్థికంగా వెనకబడిన అన్ని కులాల వారికి (ఈబీసీలకు) 10% రిజర్వేషన్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ప్రస్తుతం ఉన్న 50% పరిమితిని తొలగించేలా రాజ్యాంగ సవరణ, కులాల వారీగా జనగణన వంటి కీలక హామీలను న్యాయపత్రంలో కాంగ్రెస్ ప్రకటించింది. డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసిన 25 ఏళ్ల లోపు యువతలో ప్రతీ ఒక్కరికీ ఏడాదిపాటు అప్రెంటిషిప్ (ఉద్యోగ శిక్షణ) హక్కును కల్పించటంతోపాటు ఆ సమయంలో రూ.లక్ష చెల్లిస్తామని కీలక హామీని ఇచ్చింది. రైతులు దీర్ఘకాలికంగా డిమాండ్ చేస్తున్న పంటలకు కనీస మద్దతు ధరకు (ఎమ్మెస్పీకి) చట్టబద్ధమైన గ్యారెంటీ కల్పించడంతోపాటు వ్యవసాయ వ్యయాల కమిషన్‌ను చట్టబద్ధమైన సంస్థగా ప్రకటిస్తామని తెలిపింది. ఉపాధి హామీ పథకం కింద రోజువారీ వేతనాన్ని రూ.400కు పెంచుతామని వెల్లడించింది. మహాలక్ష్మి పథకం కింద పేద కుటుంబాల మహిళలకు ఏడాదికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ఏపీకి ప్రత్యేకహోదాను కల్పిస్తామని ప్రకటించింది.

రవీంద్రుడు కలలు గన్న సమాజమా ఇది?

కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో గత పదేళ్ల మోదీ హయాంలో ధ్వంసమైన ప్రజాస్వామిక విలువలను, దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను సవివరంగా ప్రస్తావించింది. 2014కు ముందుకంటే మీ జీవితం ఇప్పుడు మెరుగ్గా ఉందా? రవీంద్రుడు కలలు కన్న భయం లేని సమాజంలో జీవిస్తున్నారా? అని దేశ ప్రజానీకాన్ని కాంగ్రెస్ ప్రశ్నించింది. గత పదేళ్ల అన్యాయ కాలం నుంచి ప్రజలు విముక్తి పొందేందుకు 2024 సార్వత్రిక ఎన్నికలు ఒక అవకాశమని, మతం, భాష, కులం తదితర అంశాలకు అతీతంగా ఆలోచించి ప్రజలందరి కోసం పనిచేసే ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడేందుకు తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.


మేనిఫెస్టోలోని ముఖ్యాంశాలు

- పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గింపు. వ్యవసాయ పరికరాలు, యంత్రాలకు జీఎస్టీ నుంచి మినహాయింపు. రైల్వే ప్రైవేటీకరణ నిలిపివేత.
- అగ్నివీర్ పథకం రద్దు. ఇంతకుముందులాగా పూర్తికాలం పాటు సైనికుల నియామకం.
- పెద్దనోట్ల రద్దు, పెగాసస్, రాఫెల్, ఎన్నికల బాండ్లు తదితర వివాదాస్పద నిర్ణయాలు, ఒప్పందాలు, అవినీతిపై దర్యాప్తు.
- విద్యాసంస్థల్లో కుల వివక్ష లేకుండా చూసేందుకు రోహిత్ వేముల చట్టం.
- రాజస్థాన్‌లో గత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన తరహాలో ఆరోగ్య సంరక్షణకు రూ.25 లక్షల మేర నగదు రహిత బీమా.
- రెగ్యులర్ ప్రభుత్వోద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతి నియామకాల రద్దు.
- ఉన్నత విద్య చదివే, పీహెచ్‌డీ చేసే ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ రెట్టింపు. క్రీడల్లో మంచి ఫలితాలు సాధించే 21 ఏళ్లలోపు విద్యార్థులకు నెలకు రూ.10 వేలు.
- జమిలి ఎన్నికల ప్రతిపాదనను తిరస్కరిస్తాం.
- ఈవీఎంలతో వీవీపాట్ స్లిప్‌ల లెక్కింపు జరిగేలా చర్యలు. ఎంపీ, ఎమ్మెల్యే ఫిరాయిస్తే వెంటనే చట్టసభ సభ్యత్వం రద్దయ్యేలా పదో షెడ్యూలులో సవరణ.
- పోలీసులు, దర్యాప్తు, నిఘా సంస్థలు నిర్దేశిత చట్టాలకు అనుగుణంగా పని చేసేలా చర్యలు. ఆయా సంస్థలు పార్లమెంటు పర్యవేక్షణలో పని చేసేలా విధానపరమైన నిర్ణయం.

ఏపీకి ప్రత్యేక హోదా

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా. జమ్ము కశ్మీర్‌కు, పుదుచ్చేరిలకు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా. రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో లఢక్‌లోని గిరిజనప్రాంతాలను కలిపేలా చట్ట సవరణ.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	45.0	25.0
కర్నూలు	43.5	29.1
తిరుపతి	42.4	26.0
విజయవాడ	39.8	26.8
ఒంగోలు	37.6	27.6
విశాఖపట్నం	37.0	27.2

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేర్పులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులుచేర్పులు చేశారు. అయోధ్యలో బాబ్రీ కట్టడం కూల్చివేత, గుజరాత్ అల్లర్లు, హిందుత్వ అంశాల్లో సవరణలు చేశారు. ఈ విషయమై ఎన్‌సీఈఆర్‌టీ ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. అధికారులు మాత్రం ఇది సాధారణంగా పుస్తకాల నవీకరణలో భాగంగా జరిగే ప్రక్రియేనని పేర్కొన్నారు. 11, 12వ తరగతుల రాజనీతి శాస్త్రం పాఠ్యపుస్తకాలు, మరికొన్ని పుస్తకాల్లో మార్పులు చేసినట్లు వెల్లడించారు. ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన పాఠ్యాంశాల ముసాయిదా కమిటీ సిద్ధం చేసిన మార్పులను ఓ డాక్యుమెంట్‌లో వివరించారు. దాని ప్రకారం.. రామజన్మభూమి ఉద్యమాన్ని 'రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల ప్రకారం' అని మార్చారు. గతంలో 11వ తరగతి పాఠ్యపుస్తకంలో చాప్టర్ 8లో సెక్యులరిజం గురించి ప్రస్తావిస్తూ.. "2002లో గుజరాత్‌లోని గోద్రా అల్లర్ల అనంతరం 1000 మందికి పైగా, ముఖ్యంగా ముస్లింలను ఊచకోత కోశారు" అని ఉండేది. ప్రస్తుతం దాన్ని "2002లో గుజరాత్‌లోని గోద్రా అల్లర్ల అనంతరం 1000 మందికిపైగా చనిపోయారు" అని మార్చారు. కశ్మీర్ అంశంపైనా మార్పులు చేశారు.

అవ్వా తాతలపై ఎవరికి ప్రేమ?

రాష్ట్ర విభజనకు ముందు వృద్ధులు, వితంతువుల పింఛను రూ.200 మాత్రమే. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఒకేసారి రూ.1000కి పెంచారు. ఆ తర్వాత 1000 నుంచి 2 వేలు చేశారు. ఇక దివ్యాంగుల పింఛను రూ.500 నుంచి రూ.1500లకు, ఆ తర్వాత మూడు వేలకు పెంచారు. అదే జగన్ పాలనలో 'రూ.3 వేల పెన్షన్' హామీకి మెలిక పెట్టి, జాప్యం చేస్తూ సాగదీశారు.

(మొదటి పేజీ తరువాయి)

ఐదేళ్లలో 2 వేలుకు పెంచారు. కొత్తగా 19 లక్షలకు పైగా మంజూరు చేశారు. సొంతూరిలోనే గాక ఎక్కడైనా పెన్షన్ తీసుకునే పోర్టబులిటీ వెసులుబాటు కల్పించారు. వరుసగా రెండు నెలలు తీసుకోకపోయినా మూడో నెలలో మూడు నెలల పెన్షన్ కలిపి ఇచ్చేవారు. దీనివల్ల ఎక్కడో దూరప్రాంతాలకు వలస వెళ్లిన వారికి ఎంతో వెసులుబాటు ఉండేది.జగన్ ప్రభుత్వం వచ్చాక అంతా 'రివర్స్'. రకరకాల నిబంధనలతో పెన్షన్లలో కోతలు పెట్టారు. కొత్తవి ఇవ్వాలంటే పాతవి తొలగించాల్సిన పరిస్థితి. దాదాపు 4 నుంచి 6 లక్షల పాత పెన్షన్లు కట్ చేశారు. పోర్టబులిటీ వెసులుబాటు లేదు. అయితే పెన్షన్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వంపై అబద్ధాలు చెప్పడం, సొంత డబ్బా కొట్టుకోవడం జగన్‌కు అలవాటుగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అబద్ధాలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక అబద్ధాలు చెబుతున్నారు. ఇప్పుడు ఎన్నికల ముందు మళ్లీ అదేతీరు. రాజకీయ స్వార్థంకోసం పింఛన్ల పంపిణీ విషయంలో ప్రతిపక్షాలపై నిందలు వేస్తూ, అవ్వాతాతలకు అవస్థలు పెడుతున్నారు.

బాబు హయాంలో ఘనం

జగన్ ప్రభుత్వంలో కంటే చంద్రబాబు హయాంలో ఎక్కువ పెన్షన్లు మంజూరు చేశారు. అలాగే పెన్షన్ మొత్తాన్ని అధికంగా పెంచారు. అయితే జగన్ సర్కారు ఈ విషయంలోనూ అసత్యాలు చెబుతోంది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో 35.32 లక్షల పింఛన్లు ఇచ్చేవారు. అప్పటి వరకు వృద్ధాప్య, వితంతువులకు రూ.200, దివ్యాంగులకు రూ.500 ఇచ్చేవారు. 2014 జూన్ 19న చంద్రబాబు ప్రభుత్వం పెన్షన్లను ఐదురెట్లు పెంచుతూ జీవో జారీ చేసింది. 200 పెన్షన్లు ఉన్నవారికి రూ.1000, దివ్యాంగులకు రూ.1500కు పెంచారు. ఆ తర్వాత గత ఎన్నికలకు ఆర్నెల్ల ముందు పెన్షన్ల మొత్తాన్ని రూ.1000 నుంచి రూ.2 వేలకు, రూ.1500 పొందుతున్న దివ్యాంగులకు రూ.3 వేలకు పెంచారు. 2019 జనవరి నుంచి అమల్లోకి తెస్తూ రెండు నెలల పెన్షన్లను ఒకేసారి ఫిబ్రవరిలో పంపిణీ చేశారు. అప్పటికి రాష్ట్ర వ్యాప్తంగా 54.06 లక్షలు పెన్షన్లు ఉన్నాయి. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 19 లక్షలకు పైగా పెన్షన్లు మంజూరు చేస్తే... జగన్ వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 12 లక్షల పెన్షన్లు కూడా కొత్తవి మంజూరు చేయలేదు. అయితే చంద్రబాబు 39 లక్షలు మాత్రమే పెన్షన్లు ఇచ్చారని, తాము 66 లక్షలకు తీసుకెళ్లామని పదే పదే అబద్ధాలు చెప్తున్నారు. అలాగే పెన్షన్‌ను 3 వేలుకు పెంచుతామన్న హామీ విషయంలోనూ జగన్ మాట తప్పారు. అధికారంలోకి వచ్చాక వెంటనే అమలు చేయకుండా ఏటా రూ.250 పెంచుతామని మెలిక పెట్టారు. ఆ హామీని కూడా సక్రమంగా అమలు చేయకుండా అవ్వాతాతలను మోసం చేశారు. పెన్షన్ మొత్తం పెంపుదల ఆలస్యం కావడంతో ఒక్కో పెన్షన్‌దారుడు రూ.13,500 నష్టపోయారు. పెన్షన్‌దారులకు జగన్ సర్కార్ రూ.8505 కోట్లు ఎగ్గొట్టేసింది.

జగన్ వచ్చాక కోతలు

వైసీపీ ప్రభుత్వంలో కొత్త పెన్షన్లు రావాలంటే ఉన్న పెన్షన్లను తొలగించేలా పరిస్థితి తయారైంది. ఆరంచెల విధానంతో ఉన్న పెన్షన్లను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త పెన్షన్లు ఇస్తున్నారు. ప్రతి ఆర్నెల్లకోసారి పెన్షన్లు పొందుతున్న వారిని తొలగించే ప్రక్రియ నిరంతర ప్రక్రియగా మారిందని వాపోతున్నారు. దీంతో పెన్షన్‌దారుల కంటికి నిద్రలేకుండా పోయిందని చెప్తున్నారు. ఆరంచెల విధానంతో సుమారు 4 లక్షల నుంచి 6 లక్షల దాకా పెన్షన్లు రద్దు చేసినట్లు తెలుస్తోంది. అలాగే ఎక్కడైనా పెన్షన్ తీసుకునే పోర్టబులిటీ వెసులుబాటును కూడా వైసీపీ సర్కార్ తొలగించింది. పెన్షన్‌దారులు ఒకటో తేదీన సొంత ఊళ్లలో లేకపోతే ఆ నెల పెన్షన్ దూరమైనట్లే. వరుసగా రెండు నెలలు పెన్షన్ తీసుకోకపోతే పెన్షన్ పూర్తిగా రద్దవుతుంది. దీనివల్ల... నగరాలు, పట్టణాల్లో ఉన్న తమ వారసుల వద్దకు వెళ్లిన వారు లక్ష మంది దాకా పెన్షన్లు కోల్పోయారని అంచనా.

సీఎంగా బాధ్యత లేదా?

- అవ్వాతాతలను ఇబ్బంది పెట్టొద్దని చెప్పలేరా?
- ఇంటివద్దకే పింఛన్ పంపాలని సూచించలేరా?

'మేమంతా సిద్ధం' బస్సుయాత్రలో ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్ష నేత తరహాలో వ్యవహరిస్తుండటం గమనార్హం. అసలు పింఛన్ల పంపిణీ బాధ్యత తనదికాదన్నట్లుగా ఆయన మాట్లాడుతున్నారు. ముందుగా ఎంపిక చేసిన కొందరు వృద్ధులను జగన్ తన వద్దకు పిలిపించుకుంటున్నారు. 'ఇంటికి వచ్చే పింఛన్లు ఇస్తున్నారా? మీరే సచివాలయానికి వెళ్తున్నారా?' అని అమాయకంగా అడుగుతున్నారు. తమకు ఇంకా పింఛన్లు ఇవ్వలేదని వృద్ధులు సమాధానం చెబితే.. 'అయ్యయ్యో' అంటూ దీర్ఘాలు తీస్తున్నారు. వలంటీర్లను చంద్రబాబే తీసేయించారని, ఇంటింటికీ పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారన్నట్టు చెబుతున్నారు. వృద్ధులతో జగన్ మాట్లాడిన సంభాషణలను నీలిమీడియా ప్రసారం చేస్తోంది. పింఛన్ల పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను తప్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన సంగతి తెలిసిందే. వలంటీర్లను వైసీపీ పూర్తిస్థాయిలో తమ రాజకీయ కార్యకలాపాల కోసం వాడుకుంటుండటమే దీనికి కారణం. సహజంగా ఇలాంటి ఆదేశాలు వచ్చినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి తక్షణమే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారు. ఎందుకంటే.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ అత్యవసర సహాయక చర్యలపై ముఖ్యమంత్రి సమీక్షలు నిర్వహించి, ప్రభుత్వ యంత్రాంగానికి తగు సలహాలూ, సూచనలూ, ఆదేశాలూ జారీ చేయొచ్చు. వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున వృద్ధుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను అందించాలని... వలంటీర్లను పక్కన పెట్టినందున గ్రామ సచివాలయ సిబ్బంది, ఇతరుల సేవలను వాడుకోవాలని ఆదేశించవచ్చు. కానీ, జగన్ దీనిపై సమీక్షించనే లేదు. 'వలంటీర్లు లేకుంటే ప్రపంచమంతా ఆగిపోతుంది' అని చెప్పడమే లక్ష్యంగా ఇందులో రాజకీయ ప్రయోజనాన్ని వెతుక్కున్నారు. తాను నియమించిన వలంటీర్ల వ్యవస్థతో పింఛన్ల పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం నిరాకరించినందున ప్రభుత్వ యంత్రాంగమేదీ పనిచేయకూడదనే రీతిలో కక్షకట్టారు.

ఆలస్యానికి అసలు కారణం...

విపక్షాలవల్లే పింఛన్ల పంపిణీలో జాప్యం జరిగిందని వైసీపీ చోటా నేతల నుంచి సీఎం దాకా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నిజానికి... ఏప్రిల్ నెలలో పింఛన్ల పంపిణీకి ఆలస్యంగా నిధులు విడుదల చేశారు. ఖజానాలో ఉన్న నిధులను బిల్లులు, ఐదేళ్ల క్రితం నాటి బకాయిల చెల్లింపులకు మళ్లించి, ఆర్బీఐ నుంచి అప్పు తీసుకున్నాక నిధులు విడుదల చేశారు. జగన్ సర్కారు పింఛన్ల పంపిణీని ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడంతో పాటు అవ్వాతాతలు ఇబ్బందులు పడేలా చేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనికంతటికీ ప్రతిపక్షాలే కారణమని వైసీపీ నేతలు నిందలు వేస్తున్నారు.

వలంటీర్లు లేనట్లా? ఉన్నట్లా?

'అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థపైనే తొలి సంతకం చేస్తా' అని జగన్ ఒక విచిత్రమైన ప్రకటన చేశారు. అంటే... ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థ లేదని ఆయన ఉద్దేశమా? వైసీపీ ఎంతగా బలవంతంచేసినా 50 వేలమంది వలంటీర్లు కూడా రాజీనామాలు చేయలేదు. ఇంకా రెండు లక్షల మంది విధుల్లోనే ఉన్నారు. ఎన్నికల కమిషన్ ఆంక్షలతో తాత్కాలికంగా వారి సేవలు నిలిపేశారు. మరి... మళ్లీ అధికారంలోకి రాగానే మొదటి సంతకం వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుపై పెడతామని జగన్ చెప్పడమేమిటో?

నైరుతి ఆశాజనకం

- జూన్ నాటికి ఎల్‌నినో బలహీనం.. రుతుపవనాల సీజన్‌లో మంచి వర్షాలు
- ఐఎండీ డీజీ మృత్యుంజయ మహాపాత్ర

విశాఖపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యవసాయ రంగానికి వెన్నెముకగా భావించే నైరుతి రుతుపవనాల సీజన్ ఈసారి ఆశాజనకంగా ఉంటుందన్న సంకేతాలను భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఇచ్చింది. గతేడాది నుంచి ప్రపంచాన్ని ముఖ్యంగా భారత ఉపఖండంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులకు కారణమైన ఎల్‌నినో బలహీనపడుతోంది. జూన్ నాటికి ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు నెలకొంటాయని, ఆ తర్వాత జూలై నెలాఖరుకల్లా లానినా పరిస్థితులు ఏర్పడనున్నందున నైరుతి రుతుపవనాల రెండో భాగంలో మంచి వర్షాలు కురుస్తాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర అంచనావేశారు. ఈ ఏడాది శీతాకాలంలో యురేషియా (ఐరోపా, ఆసియా)పై మంచు తక్కువగా కూడా జూన్ నుంచి సెప్టెంబరు వరకు నాలుగు నెలల నైరుతి సీజన్‌కు అనుకూలమని ఆయన పేర్కొన్నారు. ఈ నెలాఖరు నాటికి నాలుగు నెలల రుతుపవనాల సీజన్‌పై తొలి అంచనా నివేదిక విడుదల చేస్తామని శుక్రవారం ఆయన వెల్లడించారు. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు వేడెక్కడం ద్వారా ఏర్పడిన ఎల్‌నినో తీవ్రత ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో గరిష్ఠ స్థాయికి చేరింది. మార్చి నుంచి ఎల్‌నినో బలహీనపడడం మొదలైంది. ఏప్రిల్ నుంచి తటస్థ పరిస్థితులు ఏర్పడతాయని నిపుణుల అంచనా వేస్తున్నారు. మే నెల నాటికి ఎల్‌నినో మరింత బలహీనపడి, జూన్ నాటికి పూర్తిగా తగ్గి... తటస్థ పరిస్థితులు ఏర్పడతాయి. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో బలహీన దిశ వైపు పయనిస్తున్నప్పటికీ ఇంకా అక్కడ వేడిగా ఉన్న ఉపరితల ఉష్ణోగ్రతల ప్రభావంతో భారత్ వైపుగా వేడి గాలులు వీస్తున్నాయి. దీంతో దేశంలో మార్చి నుంచే ఎండలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం అనేక ప్రాంతాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. వడగాడ్పులు వీయడంతోపాటు పలుచోట్ల 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జూన్ వరకూ అనేక ప్రాంతాల్లో వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

వర్షాలకు లానినా అనుకూలం..

ఎక్కువగా వర్షాధారంపై వ్యవసాయం సాగే భారత్‌కు నైరుతి రుతుపవనాలు ఎంతో కీలకం. గతేడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో 866.6 మి.మీ.కుగాను 820 మి.మీ. వర్షపాతం (సాధారణం కంటే ఆరు శాతం తక్కువ) నమోదైంది. దీంతో ప్రధానంగా దక్షిణ, ఈశాన్య భారతంలో అనేక ప్రాంతాలు తీవ్ర దుర్భిక్షం ఎదుర్కొన్నాయి. అయితే ఈ ఏడాది నైరుతి సీజన్‌లో మంచి వర్షాలు కురుస్తాయని ఐఎండీ డీజీ మహాపాత్ర అంచనా వేశారు. జూలై తర్వాత లానినా ఏర్పడనున్నందున సీజన్‌లో చివర రెండు నెలలు ఆగస్టు, సెప్టెంబరుల్లో మంచి వర్షాలు కురుస్తాయంటున్నారు. నాలుగు నెలల నైరుతి సీజన్‌లో వర్షపాతాన్ని అంచనా వేయడానికి మూడు అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటామని, మొదటిది పసిఫిక్ సముద్రంలో ఎల్‌నినో, రెండోది హిందూ మహాసముద్రంలో ఐవోడీ (ఇండియన్ ఓషన్ డైపోల్) కాగా మూడోది ఉత్తర హిమాలయాలు, యురేషియాపై మంచు కురవడం అని మహాపాత్ర పేర్కొన్నారు.

నిప్పుల కొలిమిలా రాష్ట్రం

- ఎండలకు తోడైన వడగాలి.. 94 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు
- పోరుమామిళ్లలో 44.5 డిగ్రీలు.. నంద్యాలలో 43.7 డిగ్రీలు నమోదు

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన ఎండ, పొడి వాతావరణం ప్రభావంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు శుక్రవారం అగ్నిగుండంలా మారాయి. ఎండలకు వడగాలులు కూడా తోడవడంతో ఈ వేసవి సీజన్‌లో తొలిసారిగా అనేక ప్రాంతాలు నిప్పులకొలిమిని తలపించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండ ఠారెత్తించింది. విపత్తుల నిర్వహణ సంస్థ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 94 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 159 మండలాల్లో గాడ్పులు వీచాయి. ప్రధానంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ, మధ్య కోస్తాలోని కొన్ని ప్రాంతాల్లో గాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంది. అనేకచోట్ల 40 డిగ్రీల నుంచి 43 డిగ్రీలు, పలుచోట్ల 43, 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా కడప జిల్లా పోరుమామిళ్లలో 44.5 డిగ్రీల గరిష్ఠ నమోదైంది. భారత వాతావరణ శాఖ అబ్జర్వేటర్‌లలో మాత్రం నంద్యాలలో 43.7 డిగ్రీలు నమోదైందని, ఇది శుక్రవారం దేశంలో అత్యధిక ఉష్ణోగ్రతగా అధికారులు తెలిపారు. కాగా శనివారం రాష్ట్రంలో 179 మండలాల్లో తీవ్ర గాడ్పులు, 209 మండలాల్లో గాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

ముస్లిం మహిళపై వైసీపీ నేత భార్య దాష్టీకం

- అర్ధరాత్రి నమాజ్ చేసుకుని ఇంటికి వెళ్తుండగా దుర్భాషలు
- శ్రీనివాసరెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు
- నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఘటన




బాధితురాలితో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, జగన్‌తో కలిసి ఉన్న నందికొట్కూరు మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరెడ్డి(ఫైల్)



శ్రీనివాస రెడ్డి ఇంటి ఎదుట అర్ధరాత్రి సమయంలో ఆందోళన చేస్తున్న ముస్లింలు

నందికొట్కూరు, ఏప్రిల్ 5: నంద్యాల జిల్లాలో గత నెల ముస్లిం యువకుడి హత్య ఘటన మరువక ముందే.. మరో ముస్లిం మహిళపై వైసీపీకి చెందిన దంపతులు తన ప్రతాపాన్ని చూపారు. పవిత్ర రంజాన్ మాసంలో బడేరాత్ సందర్భంగా పట్టణంలోని సుబ్బారావుపేటకు చెందిన ఓ ముస్లిం మహిళ శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో మసీదులో తరావీహ్ నమాజ్ అనంతరం ఇంటికి బయలుదేరారు. నందికొట్కూరు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆ సమయంలో తన ఇంటి ముందు కూర్చొన్నారు. ఈ క్రమంలో బురఖాలో వెళ్తున్న మహిళ ఎవరో ఆరా తీయాలంటూ తన భార్యను పురమాయించారు. ఆమె ఆ మహిళ వద్దకు వెళ్లి "నువ్వెవరు?" అని ప్రశ్నించడంతో బడేరాత్ సందర్భంగా మసీదులో నమాజ్‌కు వెళ్లి వస్తున్నానంటూ సమాధానమిచ్చారు. అయితే, శ్రీనివాస రెడ్డి భార్య ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. "ఈ సమయంలో ఏం నమాజ్ ఉంటుంది? నువ్వు దొంగతనం చేయడానికే వచ్చావ్. ముస్లింలను నమ్మకూడదు" అంటూ దుర్భాషలాడారు. మహిళ విలపిస్తూ తన కుటుంబసభ్యులకుసమాచారాన్ని అందించారు. దీంతో ఆమె భర్త, కుమారులు శ్రీనివాసరెడ్డి ఇంటి వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో తన కుమారుడిని శ్రీనివాసరెడ్డి భార్య చెప్పుతో కొట్టారని బాధిత కుటుంబం ఆరోపించింది. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోమని శ్రీనివాసరెడ్డి బెదిరించడంతో మసీదులో ఉన్న తమ బంధువులకు, మత పెద్దలకు బాధితులు సమాచారం అందించారు. ముస్లింలు శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత శ్రీనివాసరెడ్డి ఇంటిని ముట్టడించారు. ఆయన కారు అద్దాలను ధ్వంసం చేశారు. శ్రీనివాసరెడ్డి బయటకు వచ్చి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు శ్రీనివాసరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. బాధిత కుటుంబాన్ని టీడీపీ సీనియర్ నేత బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి జయసూర్య పరామర్శించారు.

వేసవిలో శ్రీవారి దర్శనానికి సామాన్యులకే ప్రాధాన్యం

- టైంస్లాట్ సర్వదర్శన టోకెన్ల కోటా 35 వేలకు పెంపు
- తొలిసారిగా భక్తులకు అందుబాటులో టీటీడీ తెలుగు క్యాలెండర్: టీటీడీ ఈవో



ధర్మారెడ్డి

తిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యం కల్పిస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. క్యూలైన్లు, కంపార్టుమెంట్లలో నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, వైద్య సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. అలాగే ఎండ నుంచి ఉపశమనం కల్పించేందుకు చలువ పందిళ్లు, కాళ్లు కాలకుండా చలువ సున్నం వేశామన్నారు. పలు ప్రదేశాల్లో తాత్కాలిక షెడ్లు కూడా ఏర్పాటుచేశామన్నారు. దాదాపు 2,500 మంది శ్రీవారి సేవకులతో భక్తులకు సేవలందిస్తున్నట్టు వివరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్వయంగా కుటుంబ సభ్యులతో వచ్చే ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తున్నామని తెలిపారు. దీంతో 250 టికెట్ల కంటే వీఐపీ బ్రేక్ మించడం లేదన్నారు. ఈ క్రమంలో దాదాపు 3 గంటలు అధికంగా సామాన్య భక్తులకు దర్శన సమయం లభిస్తోందన్నారు. మొదటిసారిగా 5 వేల ఉగాది తెలుగు క్యాలెండర్లను టీటీడీ ప్రచురించిందని, వచ్చే వారం నుంచి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌లో ఇచ్చే టైంస్లాట్ సర్వదర్శన టోకెన్ల కోటాను 25 వేల నుంచి 35 వేలకు పెంచామన్నారు. మార్చి నెలలో 21.10 లక్షల మంది శ్రీవారిని దర్శించుకోగా, రూ.118.49 కోట్లు హుండీ ఆదాయం లభించిందన్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ జి.నరేందర్



తిరుమల ఆలయం వద్ద జస్టిస్ నరేందర్

తిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ శుక్రవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్న ఆయనకు రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

8 నుంచి సాగర్ కుడికాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్, ఏప్రిల్ 5: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని కుడి కాల్వకు ఈ నెల 8నుంచి 18వ తేదీవరకు నీటిని విడుదల చేయనున్నారు. కుడికాల్వ కింద ఉన్న గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో తాగునీటి అవసరాల నిమిత్తం నీటిని విడుదల చేయాలని ఏపీ నీటి పారుదలశాఖ అధికారులు కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు(కేఆర్ఎంబీ) మూడు రోజుల క్రితం లేఖ రాశారు. దీంతో స్పందించిన కేఆర్ఎంబీ ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు రోజుకు 5వేల క్యూసెక్కుల చొప్పున 5 టీఎంసీల నీటిని విడుదల చేసుకోవడానికి అనుమతి ఇచ్చింది. ఈ నీటితో ఆయా జిల్లాల్లో ఉన్న 461 సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను తాగు నీటి అవసరాలకు నింపుకోవాలని ఏపీ నీటి పారుదలశాఖ అధికారులు ఆయా జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పాలీసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

అమరావతి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పాలీసెట్-2024 దరఖాస్తు గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారంతో దరఖాస్తు గడువు ముగిసినప్పటికీ విద్యార్థులు, తల్లిదండ్రుల వినతులతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 27న యథావిధిగా జరుగుతుందని, అందులో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టంచేశారు. ప్రవేశ పరీక్షకు సన్నద్ధమయ్యే వారికోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ఈ నెల 8 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

మత్స్యకారుల బోటులో మంటలు

- విశాఖ తీరానికి 30 నాటికల్ మైళ్ల దూరాన ప్రమాదం
- తొమ్మిది మందిని కాపాడిన కోస్ట్ గార్డ్
- బాధితులకు కేజీహెచ్‌లో చికిత్స

విశాఖపట్నం/కాకినాడ సిటీ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ తీరం నుంచి సముద్ర జలాల్లో 30 నాటికల్ మైళ్ల దూరంలో చేపల వేట సాగిస్తున్న కాకినాడకు చెందిన బోటు ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. బోటులోని గ్యాస్ సిలిండర్ పేలడంతో శుక్రవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన 9 మంది మత్స్యకారులు గత నెల 26న విశాఖ సముద్ర జలాల్లో చేపలవేటకు వెళ్లారు. భవాని అనే పేరుగల ఈ బోటు రిజిస్ట్రేషన్ నంబర్ ఏపీ47గా గుర్తించారు. ఈ ప్రమాదంలో బోటు యజమాని ఎస్.సత్తిబాబుతోపాటు 8మంది మత్స్యకారులు గాయాలపాలయ్యారు. బోటులో మంటలు ఎగిసిపడడంతో సమీప బోట్లలోని మత్స్యకారులు వీరిని రక్షించారు. కోస్ట్‌గార్డ్‌కు సమాచారం అందించడంతో డీఐజీ రాజేశ్ మిట్టల్ నేతృత్వంలో ఘటనాస్థలానికి చేరుకుని గాయాలపాలైన మత్స్యకారులకు ఇండియన్ కోస్ట్ గార్డ్ నౌక సీజీఎస్ వీరలో ప్రథమ చికిత్స చేసి డాక్ యార్డ్ జెట్టీ వద్దకు చేర్చారు. అక్కడి నుంచి వీరిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వారిలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మత్స్యశాఖ జేడీ కరుణాకరరావు పరిస్థితిని సమీక్షిస్తున్నారు, బాధితులంతా సురక్షితంగానే ఉన్నారని, ఎవరికీ ప్రాణాపాయం లేదని తెలిపారు. కాకినాడ జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించడంతో మెరుగైన వైద్య సహాయం కోసం ఆయన విశాఖ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు.



విశాఖ సముద్ర జలాల్లో ప్రమాదవశాత్తూ దగ్ధమైన కాకినాడ బోటు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉద్వేగ ప్రచారాలు

ఆటల్లో కానీ, పోరాటాల్లో కానీ, గెలుపు కోసం పోటీ ఉండే ఏ రంగంలో అయినా కానీ, సకల పక్షాలూ అంగీకరించే కొన్ని కట్టుబాట్లు, కట్టుదిట్టాలు ఉంటాయి. నియమాలను ఉల్లంఘించకుండా చూడడానికి ఒక పర్యవేక్షణా ఉంటుంది. అయినా సరే, విజయమే ముఖ్యమైన వారు ఎలాగో అలాగ, హద్దు మీరి అయినా సరే, పై చేయి కావాలని చూస్తారు. తీర్పరి స్థానంలో ఉండే పెద్దమనిషి, బుద్ధిమంతుడూ, ధైర్యవంతుడూ అయితే, తప్పును గుర్తించి, నియమాన్ని అమలు జరుపుతాడు. తటస్థుడు కూడా లోపాయికారీగా ఏదో ఒక పక్షానికి చెందిన మనిషి అయితే, అక్కడ న్యాయానికి ఆస్కారం ఉండదు. ఎన్నికల ప్రక్రియ కూడా అంతే. ఎన్నో ఎన్నికలు, అనుభవాల తరువాత, ఇప్పుడు మనం చూస్తున్న నియమ నిబంధనలు అమలులోకి వచ్చాయి. నిజానికి ఆస్కారం ఉన్న అక్రమాలతో పోలిస్తే, ఇప్పుడు ఉన్న హద్దులు సరిపోవు. ఎన్నికల సంఘం నిర్ణయించిన అభ్యర్థి ప్రచార ఖర్చుకు, వాస్తవంలో జరిగే ఖర్చుకు ఎంత వ్యత్యాసం ఉందో గమనిస్తే, న్యాయబద్ధమైన ఎన్నికల ప్రక్రియను నిర్వహించడానికి కావలసినంత నైతికతా చట్రం మనం ఇంకా రూపొందించుకోలేదని తెలిసిపోతుంది.

కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్లుగా తటస్థులు ఎంపిక కాకుండా, తమ వారినే నియమించుకోవడానికి వీలుగా చట్టానికే సవరణ తేవడానికి కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం వెనుకాడలేదు. న్యాయస్ఫూర్తికి కలుగుతున్న విఘాతాన్ని, ప్రజల దృష్టిలో కలిగే అప్రదిష్ఠను ఏ మాత్రం ఖాతరు చేయలేదు. అంతేకాదు, ఎన్నికల ప్రచార సందర్భంగా పెట్టుకున్న ఎన్నో విధినిషేధాల విషయంలో స్వయంగా అధికారపార్టీయే అనేక ఉల్లంఘనలు చేస్తున్నది. ప్రతిపక్షాలకు, ప్రాంతీయ పార్టీలకు చెందిన నాయకులు ఎక్కడన్నా పొరపాటున నోరుజారినా వెంటనే నోటీసులు అందుతున్నాయి. సాక్షాత్తూ, ప్రధానమంత్రే మతప్రమేయాన్ని ధ్వనింపజేసే వ్యాఖ్యలు చేసినప్పుడు, ప్రతిపక్షాలు ఫిర్యాదు చేసినా ఎన్నికల సంఘం ఖాతరు చేయడం లేదు. వాట్సాప్ ద్వారా ప్రధానమంత్రి తన ప్రభుత్వ లబ్ధిదారులకు పంపుతున్న సందేశాలను మాత్రం విరమింపజేయడం విశేషం. కానీ, ప్రభుత్వ యంత్రాంగం ద్వారానే అనేక నియమోల్లంఘనలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల సమయంలో 'కేరళ స్టోరీ' సినిమాను దూరదర్శన్‌లో ప్రసారం చేయాలని తలపెట్టడం మీద వివాదం తెలిసిందే.

ప్రజలలో భావోద్వేగాలు కలిగించడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత పార్లమెంటు ఎన్నికలకు ముందు 'పుల్వామా' సంఘటన కలిగించిన ప్రభావం తెలిసిందే. ఈ సారి అటువంటి సంఘటన ఏదీ జరగనందువల్ల, పొరుగుదేశాలతో ఉద్రిక్తతల వాతావరణం కూడా లేనందువల్ల, ప్రస్తుత అధికారపార్టీ గట్టి జాతీయవాది అని కానీ, పొరుగు దేశాల వల్ల బాధితురాలు అని కానీ, దేశ ప్రయోజనాల కోసం ఎంతకైనా వెళ్లగలిగే సాహసి అని కానీ ప్రచారం జరగడానికి ఆస్కారం లేకపోయింది. అయినా సరే, తమకు సహాయం కాగలిగిన సంఘటనలు సంభవించకున్నా కానీ, కృత్రిమమైన వివాదాలను సామాజిక మాధ్యమాల ద్వారా రేకెత్తించే ప్రయత్నం జరుగుతోంది. యాభై ఏళ్ల కిందటి కచ్చతీవు దీవి అప్పగింత అంశం, ఒక సమాచార హక్కు ప్రశ్న ద్వారా, రంగం మీదికి ఒక వివాదంగా వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు, దేశాన్ని రక్షించకపోగా, బాధ్యతారహితంగా భూభాగాలను కూడా పరులకు ఇచ్చారన్న భావాన్ని ప్రజలలో కలిగించడానికి ఈ వివాదం ప్రయత్నిస్తోంది.

మరి కొన్ని ప్రయత్నాలు, పైకి ప్రతికూలంగా కనిపిస్తాయి కానీ, పరోక్షంగా మోదీ ప్రభుత్వ ప్రతిష్ఠను మరింత బలాన్ని చేకూర్చేవి. గత మూడు సంవత్సరాల కాలంలో భారతీయ ఏజెంట్లు పాకిస్థాన్‌లోకి జొరబడి, 20 మందికి పైగా టెర్రరిస్టు అనుమానితులను చంపారనే వార్త 'ది గార్డియన్' పత్రికలో వచ్చింది. కెనడాలోని ఖలిస్తానీవాదుల మీద భారత్ గురిపెట్టిందని, గత ఏడాది అమెరికాలోనూ ఒక ప్రయత్నం చేసిందని ఆ మధ్య వార్తలు వచ్చాయి. ఈ వార్తలను భారత ప్రభుత్వం అధికారికంగా ఖండించింది కానీ, వాటి ప్రచారం తమ ప్రతిష్ఠను పెంచుతుందని అధికారపార్టీ భావిస్తుంది. వాస్తవాధీన రేఖను దాటి వైమానిక దాడి జరపడం ఎట్లాగైతే, సాహసచర్యగా కీర్తి పొందిందో, పాకిస్థాన్‌లోకి చొరబడి ప్రత్యర్థులను చంపగలగడం కూడా మోదీ ప్రభుత్వ ఘనతగానే కనిపిస్తుంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో, స్వయంగా దేశరక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ ఇంట్లోకి చొచ్చుకు వెళ్లి చర్య తీసుకోవడాన్ని మరొక్కసారి ప్రస్తావించి సమర్థించారు. అది పైకి చూడడానికి దేశభద్రతా విధాన ప్రకటనే, కానీ, అదే సమయంలో అది, ఎన్నికల ప్రచారం కాకుండా పోతుందా? అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు సందర్భంగా అమెరికా, జర్మనీ, ఐక్యరాజ్యసమితి చేసిన ప్రకటనలు మన ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యంగా భారత్ చెబుతోంది, గట్టిగా ప్రచారం చేస్తోంది. ప్రపంచం అంతా కలిసి మోదీ మూడోసారి ఎన్నిక కాకుండా కుట్ర చేస్తున్నదని జాతీయ ఇంగ్లీషు చానెల్స్‌లో ప్రసారమవుతున్న కథనాలు గమనిస్తే, విమర్శలు సానుకూల అంశాలుగా మారిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. జాతీయ ఇంగ్లీషు చానెళ్లలో ప్రతిసాయంత్రం ప్రసారమవుతున్న చర్చలు, కథనాలు అన్నీ వాస్తవానికి ఒకపార్టీ ప్రచార ఖర్చు కింద లెక్క వేయాలి. కానీ, అవి ప్రచ్ఛన్నంగా మాత్రమే ప్రచారం చేస్తున్నాయి. నేరుగా జరిగే ఉల్లంఘనలనే పట్టించుకోని ఎన్నికల సంఘం ఈ పరోక్ష ప్రచారాలను ఏమని అభ్యంతరపెట్టగలదు?

మతం, కులం, ప్రాంతీయతత్వం వంటి వాటితో ప్రచారాంశాలను రూపొందించకూడదన్న నిబంధన ఉన్నట్టే, జాతీయవాదాన్ని, దేశభక్తిని ఉపయోగించుకుంటూ రాజకీయ ప్రచారాలు చేయకూడదన్న నియమం కూడా ఉండాలి.

ముఖ్యమంత్రిని దించేయడం ఎలా?

అవినీతికి పాల్పడ్డాడన్న అభియోగం మీద పదవీబాధ్యతల్లో తలమునకలై ఉన్న ఓ ముఖ్యమంత్రిని అరెస్టుచేసిన వ్యవహారంలో అనేక రాజకీయ, న్యాయ, రాజ్యాంగపరమైన అంశాలు ఇమిడివున్నాయి. ఇది రాజ్యాంగనైతికతకు సంబంధించిన విషయం కూడా. అందువల్ల, ప్రతీ అంశాన్నీ, 'నిజా'న్నీ లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఈ కేసులో ఆరోపణ ఏమంటే, లంచం ఇచ్చినవారికి ప్రభుత్వపరంగా మేలు చేకూర్చేందుకు ముఖ్యమంత్రి లంచం పుచ్చుకున్నారని. ప్రస్తుతానికి ఇది అవినీతి ఆరోపణే తప్ప, తప్పు జరిగిందన్న నిర్ధారణ అయితే కాలేదు. నేరం రుజువై, దోషి అని తేలేవరకూ ఎవరైనా సరే, నిరపరాధే. ఈ సూత్రానికి, విలువకు భిన్నంగా ఏ వ్యవస్థా వ్యవహరించడానికి లేదు.

ఇప్పుడు అసలు చర్చ చేద్దాం. ఒక వ్యక్తి ఓ రాజకీయపార్టీ సభ్యుడు. ఆ పార్టీ ఎన్నికల్లో పోటీచేస్తుంది, పార్టీకి చెందిన అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో గెలిచి శాసన సభ్యులవుతారు. వారంతా ఆ వ్యక్తిని తమ నాయకుడుగా ఎన్నుకుంటారు, అతడితో గవర్నర్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయిస్తారు. ముఖ్యమంత్రి, మంత్రివర్గసహచరులు బాధ్యతలు స్వీకరిస్తారు, కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. గత ఏడున్నర దశాబ్దాల్లో ఇలా వందలసార్లు జరిగింది. నిజానికి ఇందులో కొత్తగా కనిపించేదీ ఏమీ ఉండదు. రాజ్యాంగపరంగానూ, రాజకీయకోణంలోనూ జరగాల్సింది కూడా ఇదే. తన విధులు నిర్వర్తించే విషయంలోనూ, బాధ్యతలు చక్కబెట్టడంలోనూ ముఖ్యమంత్రికి పరిపూర్ణమైన స్వేచ్ఛ ఉండాలన్నది నిర్వివాదాంశం. తన విధుల్లో భాగంగా ఆయన గవర్నర్‌కు సలహాలు ఇవ్వాలి, మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలి, ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవాలి, ప్రజల సాధకబాధకాలు వినాలి. అసెంబ్లీలో మాట్లాడాలి, చర్చలు చేయాలి, సభ్యులందరి అభిప్రాయాలు తెలుసుకోవాలి. తీర్మానాలు, బిల్లులపైన ఆయన ఓటుచేయాలి. అన్నింటికీ మించి, మన వ్యవస్థ ఇప్పటికీ రికార్డులు, ఫైళ్ళ మీదనే ఆధారపడి కొనసాగుతోంది, ప్రతీదీ రాతకోతలమీదే నడుస్తోంది. అందువల్ల ముఖ్యమంత్రి స్వయంగా ఫైళ్ళమీద రాయడం, సంతకాలు చేయడం వంటివి ఆయన పనుల్లో ముఖ్యమైనవి. పైన చెప్పినవన్నీ కూడా ఒక ముఖ్యమంత్రి బందీగా ఉన్నప్పుడు లేదా స్వేచ్ఛగా లేనప్పుడు ఎంతమాత్రం నిర్వర్తించలేడు.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

ముఖ్యమంత్రిని ఓడించడానికి లేదా పదవినుంచి తప్పించడానికి చాలా దారులున్నాయి. ఎన్నికల విధానంలో ఐదేళ్ళకోమారు లేదా అంతకుముందు గానీ ఆయనను, ఆయన పార్టీని ఓడించవచ్చు. అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం లేదా, ఆర్థిక బిల్లును తిరస్కరించడం లేదా అతిముఖ్యమైన తీర్మానానికి అడ్డుకొట్టడం వంటి సభాసంబంధిత ప్రక్రియలతోనూ ఆ పనిచేయవచ్చు. అయితే, ఇటువంటి సందర్భాల్లో మెజారిటీదే విజయం, సంఖ్యాబలం ఉన్నవారిదే పైచేయి. కనుక, ఒక ముఖ్యమంత్రిని దించేయడానికి కొన్ని అడ్డదారులొచ్చాయి. నిర్దిష్టమైన సంఖ్యలో ఎమ్మెల్యేలు అధికార పక్షానికి రాజీనామాచేయడం లేదా మరోపార్టీలో చేరిపోవడం ఆపరేషన్ లోటస్‌లో భాగంగా జరుగుతూండటం చూస్తున్నాం. ఇటువంటి చర్యల ద్వారా అధికారపక్షం మైనారిటీలోకి జారిపోయి కుప్పకూలిపోతుంది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ ఇలా పార్టీ ఫిరాయించిన వారిపై అనర్హతవేటు వేసేందుకు, ఫిరాయింపులను నిరోధించేందుకు ఉపకరిస్తుంది కానీ, దానిని అమలు చేయకుండా, నిస్సిగ్గుగా ఉల్లంఘించడం జరిగిపోతున్నది.



ఇదంతా చట్టబద్ధంగా జరుగుతున్నదే... కానీ, రాజకీయకోణంలో అత్యంత దుర్మార్గమైనది. వెస్ట్‌మినిస్టర్ పాలనావిధానాన్ని ఆమోదించుకున్న ఈ దేశంలో, ఒక ముఖ్యమంత్రిని అరెస్టుచేయడం, నిర్బంధించడం ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలు, విలువలకు భిన్నమైనది కాదా? అధికారంలో ఉన్న రాజకీయశక్తులు తమ ప్రయోజనాలకు వీలుగా రాజ్యాంగ విలువలను ఈ విధంగా భ్రష్టుపట్టించవచ్చునా?

ముఖ్యమంత్రిని దించడానికి ఇంకా ఏమైనా మార్గాలున్నాయా? నేను అన్వేషించినంతమేరకు, నాకు తెలిసినంతవరకూ ఇంకేమీ లేవు. కానీ, మనదగ్గర కొందరు అతితెలివైన వాళ్ళున్నారు. ముఖ్యమంత్రిని నిర్బంధించడానికి, అతడి స్వేచ్ఛ, స్వతంత్రతలను హరించడానికి వారొక మార్గం కనిపెట్టారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఓ ఎఫ్ఐఆర్ లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) రిజిస్టర్ చేస్తారు. ప్రశ్నించాల్సి ఉన్నదనీ, విచారణకు రావాలనీ పిలిచి, అరెస్టు చేస్తారు. ఈ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ మరీ బరితెగించింది. ముఖ్యమంత్రి అరెస్టుకావడంతోనే ఆయన రాజీనామా చేయాలన్న డిమాండ్ ఊపందుకుంటుంది. ముఖ్యమంత్రి అయితేనేమి, అతడూ అన్ని ప్రక్రియలూ దాటాల్సిందే అన్న వాదనతో, కోర్టుల చుట్టూ తిరగడం, బెయిల్ కోసం దరఖాస్తులు పెట్టుకోవడం, పోలీసు రిమాండు, జుడీషియల్ రిమాండ్, కోర్టుల ఆదేశాలమీద అప్పీళ్ళు, చివరకు బెయిల్ దరఖాస్తును సుప్రీంకోర్టు ఆమోదించడం లేదా కాదనడం వరకూ ఈ సుదీర్ఘ ప్రక్రియలన్నీ తప్పడం లేదు. కానీ, ఇంతలోగా అతడి ప్రభుత్వం దుర్బలంగా మారుతుంది. అంతవరకూ శత్రుదుర్భేద్యంగా ఉన్న అతడి కోట కాస్తా బలహీనపడుతుంది. అటూఇటూ ఊగి చివరకు కూలిపోతుంది. అరెస్టయిన ముఖ్యమంత్రి స్థానంలోకి తాత్కాలికంగా మరొకరు వచ్చికూర్చున్నా వారికీ ఇదే ప్రమాదం పొంచివుంటుంది, చివరకు అరెస్టుకావడమూ తప్పదు. ఇలా వెంటాడివేధిస్తున్నప్పుడు ముఖ్యమంత్రి స్థానంలో ఒకరి తరువాత మరొకరిని వరుసపెట్టి తమవారిని కూచోబెట్టగలిగే, పరిస్థితులకు ఎదురొడ్డి నిరంతరం పోరాడగలిగే సామర్థ్యం ఏ రాజకీయపార్టీకీ ఉండదు. కాబట్టి, అవినీతి ఆరోపణల తక్షణ రాజకీయ లక్ష్యం–ముఖ్యమంత్రిని గద్దె దించడం–సంపూర్ణంగా నెరవేరుతుంది.

ఇదంతా చట్టబద్ధంగా జరుగుతున్నదే. కానీ, రాజకీయకోణంలో అత్యంత దుర్మార్గమైనది. రాజ్యాంగపరంగా ఇది సహేతుకమైనదేనా అన్న విషయంపై లోతైన చర్చ జరగాలి. ఇక, నా ప్రశ్న మరింత లోతైనది. వెస్ట్‌మినిస్టర్ పాలనావిధానాన్ని ఆమోదించుకున్న ఈ దేశంలో, ఒక ముఖ్యమంత్రిని అరెస్టుచేయడం, నిర్బంధించడం రాజ్యాంగనైతికతకు లోబడినదేనా? ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలు, విలువలకు అది భిన్నమైనది కాదా? అధికారంలో ఉన్న రాజకీయశక్తులు తమ ప్రయోజనాలకు వీలుగా రాజ్యాంగ విలువలను ఈ విధంగా భ్రష్టుపట్టించవచ్చునా?

రాజకీయకక్షలతో వచ్చిపడే ఈ తరహా ప్రమాదాన్ని కొన్ని దేశాలు గుర్తించి ప్రభుత్వ అత్యున్నత స్థానాలకు కొన్ని ప్రత్యేక రక్షణలు కల్పించాయి. పదవిలో ఉన్నప్పుడు వారిని అరెస్టుచేయడం దాదాపుగా అసాధ్యం చేశాయి. ఇది ఎందుకంత ముఖ్యమైనదో, పాత్రలను కాస్తంత అటుఇటుగా మార్చి ఓ ఉదాహరణగా చూద్దాం. ఒక రాష్ట్ర ప్రభుత్వం తన భౌగోళిక పరిధుల్లో ఈ దేశ ప్రధాని నేరం చేశాడంటూ కేసుపెట్టి, ఆయనను అరెస్టుచేసిందని అనుకుందాం. ప్రధానమంత్రిని పోలీసు లేదా జుడీషియల్ కస్టడీకి ఓ మేజిస్ట్రేటు అప్పగించాడనీ ఊహిద్దాం. ఈ పరిణామాలు ఎంత తీవ్రమైనవో, వాటి ప్రభావం దేశంమీద ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ప్రత్యేక రక్షణలు కరువైన తరుణంలో, ఒక ముఖ్యమంత్రికి శాసనసభలోనూ, ప్రధానమంత్రికి లోక్‌సభలోనూ ఉన్నబలమే రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్న ప్రత్యేక రక్షణగా న్యాయస్థానాలు ఎందుకు చూడకూడదు? మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గెలవాలన్నా, రాజ్యాంగనైతికత వెలగాలన్నా ఈ ప్రశ్నకు సమాధానం సాధించాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

చిత్తూరు జిల్లాకు జగన్ అపకారం!

ఉమ్మడి చిత్తూరు జిల్లా రాయలసీమలో భాగమైనా అన్ని విధాలా భిన్నంగా ఉంటుంది. గతంలో ఉత్తర ఆర్కాడు నుంచి కొంత, కడప జిల్లా నుండి కొంత ప్రాంతంతో ఏర్పడినందున మిశ్రమ భావజాలం ఏర్పడింది. భాష, యాస వేరుగా ఉంటుంది. రెండు, మూడు దశాబ్దాల చరిత్ర పరిశీలిస్తే రాయలసీమలోని ఇతర జిల్లాల్లో సంభవించిన సాగునీటి ఉద్యమాల జాడ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మచ్చుకు కూడా కన్పించదు. ఆ దిశగా కృషి చేసిన వారూ లేరు. తత్ఫలితంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బాగా వెనుకబడిన జిల్లాలుగా పేరొందిన ఆదిలాబాద్, అనంతపురం, శ్రీకాకుళం జిల్లాల్లో కూడా ఎప్పటినుంచో కొద్దోగొప్పో శాశ్వత సాగునీటి వసతి వుంటే... ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సెంటు భూమికి కూడా ఆ వసతి లేదు.

ఎన్టీ రామారావు అధికారం చేపట్టిన తర్వాత తెలుగు గంగ నీళ్ల చెన్నై నగరానికి తాగునీటికి తరలించడంతో, జిల్లా తూర్పు ప్రాంతంలో మూడు, నాలుగు మండలాలకు మాత్రమే సాగునీటి వసతి ఏర్పడింది. చెన్నైకి తాగునీరు సరఫరా సమయంలో అధికారులు కరుణిస్తే 45 వేల ఎకరాలకు, అదీ ఒక పంటకు సాగునీరు అందిస్తున్నారు. ఈ ఏడు కండలేరు జలాశయం డెడ్ స్టోరేజీకి చేరినందున, తుదకు తాగునీటికి కూడా కటకటలాడవలసినదే. ఎన్టీఆర్ హయాంలోనే జిల్లా తూర్పు ప్రాంతానికి ప్రతిపాదించబడిన గాలేరు-నగరి రెండవ దశ జిల్లా పశ్చిమ ప్రాంతానికి ఉద్దేశించిన హంద్రీ-నీవా పథకాల జలాలు కాగితాలపైననే దశాబ్దాలుగా ప్రవహిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తుంగభద్ర జలాలతో పాటు 28.168 టియంసిలు నిల్వ చేసుకొనే మధ్య తరహా ప్రాజెక్టులుంటే, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కేవలం 5.21 టియంసిలు నిల్వ చేయగల రిజర్వాయర్లు మాత్రమే ఉన్నాయి. ఇందులో తిరుపతి తాగునీటికి మాత్రమే ఉద్దేశించిన కళ్యాణి డ్యాం (0.91 టియంసి) ఉంది. పేరుకు కొన్ని మధ్య తరహా ప్రాజెక్టులున్నా, ఒక్క దాని కింద కూడా ఐదువేల ఎకరాలు సాగు కావడం లేదు. కొసమెరుపు ఏమంటే పేరుకు మధ్యతరహా ప్రాజెక్టులుగా రికార్డుల్లో నమోదై వున్నా అన్నింటినీ మైనర్ ఇరిగేషన్ కిందనే జలవనరుల శాఖ జమ చేస్తోంది. ఏనాడూ మధ్య తరహా ప్రాజెక్టుల పద్దుల కింద బడ్జెట్‌లో నిధులు విడుదల చేయలేదు.

ఉమ్మడి జిల్లా వైశాల్యం 37,43,565 ఎకరాలైతే 30.08 శాతం అడవులున్నాయి. ఉమ్మడి జిల్లాలో సాగయ్యే భూమి 9,97,726 (26.65 శాతం) ఎకరాలుంటే చెరువులు, భూగర్భ జలాలపై ఆధారపడి కేవలం 4,33,507 (11.58 శాతం) ఎకరాల్లో మాత్రమే వ్యవసాయం చేస్తున్నారు. మిగిలిన భూమి దాదాపు 5 లక్షల ఎకరాలకు పైగా వర్షాధారంగా సాగు చేస్తున్నారు. సాగునీటి వసతిలో ఇంత అధ్వాన పరిస్థితి రాష్ట్రంలో మరొక జిల్లాలో లేదు. కృష్ణాపురం (0.200 టియంసిలు), కాళంగి (0.240), బహుదా (0.398), పెద్దేరు (0.560), ఆరణియార్(1.85), మల్లిమడుగు (0.18) ఉన్నా ఏనాడూ వీటి కింద పూర్తి నిల్వ సామర్థ్యంతో నీళ్లు ఉండి రైతులకు అందించిన సందర్భం లేదు. 1.85 టియంసిల నిల్వ సామర్థ్యం గల ఆరణియార్ రిజర్వాయర్ అవిభక్త మద్రాసు రాష్ట్రంలో నిర్మితమై ఆంధ్ర రాష్ట్రానికి బదలాయింపబడింది. కాని ఈ జలాశయానికి అవసరమైన కాచ్‌మెంట్ ఏరియా నీటి సరఫరా లేదు. గాలేరు-నగరి రెండవ దశలో భాగంగా 61 కిలోమీటర్లు మల్లిమడుగు నుండి ప్రతిపాదించబడిన కైలాసగిరి కెనాల్.. ఆరణియార్ జలాశయం చేరవలసి ఉంది. అది ప్రస్తుతం అటకెక్కింది. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టిన నీలం సంజీవరెడ్డి శ్రీకాళహస్తిలో ఉప ఎన్నికలో ఎన్నికైన తర్వాతనే కాళంగి, మల్లిమడుగు స్వర్ణముఖి లాంటి మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణం జిల్లాలో జరిగింది. తర్వాత ఎన్టీఆర్ హయాం వరకు జిల్లాను పట్టించుకొన్నవారు లేరు.



కృష్ణ, గోదావరి డెల్టాల్లోనే చివర భూములకు నీళ్లు సరిగా అందడం లేదని రైతులు గోల పెడుతున్నారు. ఈ నేపథ్యంలో మిగులు జలాల ఆధారంగా చిత్తూరు జిల్లాకు రెండవ దశ కృష్ణ జలాలు అందుతాయని ఎలా ఊహించగలం? వైయస్ రాజశేఖర రెడ్డి హయాంలో గాలేరు–నగరి రెండవ దశకు గ్రహణం పడితే, జగన్మోహన్ రెడ్డి హయాంలో టెండర్లన్నీ రద్దు చేసి మరణ శాసనం రాశారు.

నిన్న మొన్నటి వరకు హంద్రీ-నీవా గొడవ మీడియాకెక్కింది కాబట్టి గాలేరు-నగరి పథకం విషాద కథనం చూద్దాం. ఈ పథకం ప్రతిపాదించినపుడు గాలి పథకమని ఎగతాళి చేశారు గాని, వాస్తవంలో చిత్తూరు జిల్లాకు చెంది గాలిలో దీపమైంది. పలు మార్పులు చేర్పులు తర్వాత 2006లో చిత్తూరు జిల్లా నగరి వద్ద ముఖ్యమంత్రిగా డాక్టర్ రాజశేఖర రెడ్డి పునాది రాయి వేసిన సమయంలో జలవనరుల శాఖ ఈ పథకం గురించి అధికారయుతంగా ఒక బుక్‌లెట్ ప్రచురించింది. డీపీఆర్ మేరకు తొలి దశ కింద కడప జిల్లాకు 22.183 టియంసిలు, రెండవ దశ కింద చిత్తూరు జిల్లాకు 10.772టియంసిలు (తిరుమల తాగునీటికి ఒక టియంసి కలిపి) కేటాయింపులున్నాయి. ఇందులో గండికోట జలాశయం నిల్వ సామర్థ్యం 16.484 టియంసిలుగా చూపారు. కడప జిల్లాలో వామికొండ (1.600), సర్వారాయ సాగర్ (3.059), ఉద్ది మడుగు (1.040) సామర్థ్యంతో ప్రతిపాదించారు. ప్రస్తుతం సర్వారాయ సాగర్ వరకు నిర్మాణం జరిగి ఆగిపోయింది. తదుపరి ఆచరణలో గండికోట నిల్వ సామర్థ్యం 26 టియంసిలతో నిర్మాణం చేపట్టడమే కాకుండా, డిపిఆర్‌లో లేకున్నా గండికోట నుండి నికరజలాలు కేటాయింపులున్న తుంగభద్ర ఎగువ కాలువ ఆయకట్టుకు ఎత్తిపోతల పథకం శరవేగంగా నిర్మాణం జరిగింది. అందులో భాగంగానే పైడిపాలెం రిజర్వాయర్ నిర్మాణం. గండికోటతో పాటు ఎత్తిపోతల పథకం వేగంగా నిర్మాణం జరిగినా చిత్తూరు జిల్లాతో పాటు కడప జిల్లాలోని రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో పథకం నిర్మాణం అటకెక్కింది. డిపిఆర్ మేరకు కడప జిల్లాకు 22.183 టియంసిల కేటాయింపులుంటే ఒక్క గండికోట నిల్వ సామర్థ్యం 26 టియంసిలకు పెరిగింది. కృష్ణ, గోదావరి డెల్టాల్లోనే చివర భూములకు నీళ్లు సరిగా అందడం లేదని రైతులు గోల పెడుతున్నారు. ఈ నేపథ్యంలో మిగులు జలాల ఆధారంగా చిత్తూరు జిల్లాకు రెండవ దశ కృష్ణ జలాలు అందుతాయని ఎలా ఊహించగలం? డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి హయాంలో గాలేరు-నగరి రెండవ దశకు గ్రహణం పడితే, జగన్మోహన్ రెడ్డి హయాంలో తన తండ్రి నిర్వహించిన టెండర్లన్నీ రద్దు చేసి మరణ శాసనం రాశారు.

2006 జూన్ 4న నగరి వద్ద రాజశేఖర రెడ్డి పునాది రాయి వేసిన సమయంలో చిత్తూరు జిల్లాకు చెంది ఈపాటికే వున్న మల్లిమడుగు 0.18 నుండి 2.858 టియంసిలు విస్తరణతో పాటు మరొక ఆరు రిజర్వాయర్లు ప్రతిపాదించారు. బాలాజీ రిజర్వాయర్ (3.000), పద్మ సాగర్ (0.450), శ్రీనివాస సాగర్ (0.448), వేణుగోపాల్ సాగర్ (2.683), వేపగుంట రిజర్వాయర్ (0.533), అడవి కొత్తూరు రిజర్వాయర్ (0.800) మొత్తం ఏడు రిజర్వాయర్లకు 10.772 టియంసిలు నీళ్లు కేటాయించబడ్డాయి. ఈ జలాశయాలకు జల యజ్ఞం కింద టెండర్లు పిలిచినా నిర్మాణం మాత్రం ముందుకు సాగలేదు. 2014–19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో ప్రధాన కాలువ అలైన్‌మెంట్ మారిపోయింది. కొన్ని జలాశయాల నిర్మాణం పక్కన పెట్టారు. జల యజ్ఞం కింద పిలవబడిన టెండర్లతో జలాశయాల నిర్మాణం కుంటినడక సాగుతున్న దశలో ముఖ్యమంత్రి అయిన జగన్మోహన్ రెడ్డి ఏకంగా టెండర్లన్నీ రద్దు చేశారు. అయిదేళ్లు గడుస్తున్నా పట్టించుకోలేదు. పైగా గాలేరు-నగరి, హంద్రీ-నీవా అనుసంధానం పేర మంత్రి పెద్దిరెడ్డి ఇలాకాలో 6.5 టియంసిలతో మూడు రిజర్వాయర్ల నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇచ్చారు.

ఇటీవల కుప్పం ప్రాంతానికి హంద్రీ-నీవా జలాలు తరలించడం... అనంతపురం, చిత్తూరు జిల్లా ప్రజల మధ్య తంపులు పెట్టినట్లే. నీటి కేటాయింపులు లేకున్నా గాలేరు–నగరి, హంద్రీ-నీవా అనుసంధానం పేరుతో జలాశయాలకు అనుమతి ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి చర్య మున్ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లా (పైగా జిల్లా వేరైంది) ప్రజల మధ్య తగాదాలకు కారణం కావచ్చు. వాస్తవంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మేలు చేయకపోగా, అపకారానికి ఆస్కారమిచ్చారు. దురదృష్టమేమంటే దాదాపు 5.5 టియంసిలతో తన నియోజకవర్గంలో గాలేరు–నగరి రెండవ దశ కింద జలాశయాల నిర్మాణం ఉన్నా మంత్రిగా రోజా చేసిన కృషి శూన్యం. అలాగే తిరుపతి, తిరుమలకు శాశ్వత తాగునీటి వసతి కల్పించేందుకు రెండవ దశలోని బాలాజీ రిజర్వాయర్ నిర్మాణం ఆగిపోయినా తిరుపతి ఎమ్మెల్యేగా టీటీడీ చైర్మన్‌గా కరుణాకర్ రెడ్డి చొరవ చూపలేదు. ప్రధానమైన అంశమేమంటే ఒకవేళ కొత్త ప్రభుత్వం ఏర్పడినా 1989లో ప్రతిపాదించిన రెండవ దశ నిర్మాణ వ్యయం ఎంత పెరుగుతుందో చెప్పలేము.

• వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

'క్విడ్ ప్రో కో' మరో రూపం ఎలక్టోరల్ బాండ్స్!

కేజ్రీవాల్ అరెస్టుపై యాగీ ఎందుకు' అనే శీర్షికన మార్చి 26న ఆంధ్రజ్యోతి పత్రికలో బీజేపీ నాయకులు సత్యకుమార్ వ్యాసం రాశారు. అందులో ప్రజాస్వామ్యం, అవినీతి వంటి అనేక అంశాలు ప్రస్తావించారు. 1975 ఎమర్జన్సీ నుంచి నేటి పరిస్థితిని పోల్చి కొన్ని విషయాలు తెలిపారు.

ఆ విషయాలన్నీ పక్కన పెట్టి ఆయన వేసిన, బాగా ఆశ్చర్యమైన ఒక ప్రశ్నకు సమాధానం వెతక్కోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని రాజకీయ పార్టీలకు అవసరం. అవి ఆ పని చేస్తాయా, చేయవా అనేది వారి విజ్ఞతకే వదిలెయ్యాలి. అందులో సామాన్యులు చేయగలిగిందేమీ లేదు. అయితే సామాన్యులు కూడా ఆయన వేసిన ప్రశ్నకు సమాధానం వెతకడం, ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు అత్యవసరం.





ఎన్నికల బాండ్ల గురించి ప్రస్తావిస్తూ ఆయన వేసిన ప్రశ్న ఏమిటంటే 'రాజకీయ పార్టీలు నిధులు సమకూర్చుకోవడానికి ఇంతకంటే మెరుగైన విధానమేదైనా ఉందని సూచిస్తే మోదీ ప్రభుత్వం తప్పకుండా ఆమోదిస్తుంది' అని పేర్కొన్నారు. ఇది చాలా విలువైన ప్రశ్న. చూడ్డానికి తేలికగా కనబడుతుంది కానీ, కొద్దిగా లోతులకు వెళ్లి సమాధానం వెతికితే అనేక రాజకీయాలు, వివిధ రాజకీయ పార్టీల అసలు నైజాలు ప్రజలకు అవగతం మవుతాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలది కీలకమైన స్థానం. అలాంటి రాజకీయ పార్టీలను కార్పొరేట్ బ్రోకర్లుగా మార్చే పథకమే ఎలక్టోరల్ బాండ్ల పద్ధతి. అందువల్ల ఈ పథకంలో పారదర్శకత లేదు, నైతికత అంతకంటే లేదు. నిజంగా ప్రజాసేవ చేయాలనుకునే ఏ పార్టీ అయినా కేవలం ప్రజల నుండి నిధులు సమకూర్చుకుంటేనే వారి మాటలను నమ్మవచ్చు.

సాధారణంగా మన నిజ జీవితంలో మనకు సహాయం చేసిన వారికి తిరిగి సహాయం చేయడం పరిపాటి. అది అవసరం కూడా. రాజకీయ పార్టీలన్నీ ఎటువంటి మినహాయింపులూ లేకుండా తాము ప్రజా సేవ చేయడానికే పని చేస్తున్నామని తెలుపుతారు. తాము కార్పొరేట్ల కోసం పని చేస్తామని ఎవరూ తెలపరు. కానీ విచిత్రంగా అనేక పార్టీలు ఒక్క వామపక్షాలు మినహా గెలిచిన తరువాత ప్రజలకు చేసే సేవ కంటే ఎక్కువ భాగం తరతమ స్థాయిలలో కార్పొరేట్ ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయనేది ఆచరణలో మనం చూస్తున్నాం. ఎందుకిలా జరుగుతోంది అన్నది పరిశీలించవలసిన విషయం.

ప్రజల కోసం పనిచేసే వారైతే వారి పార్టీలకు అవసరమైన నిధులు కూడా ప్రజల నుండే వసూలు చేసుకోవాలి. అప్పుడు మాత్రమే కేవలం ప్రజా ప్రయోజనాలే మిన్నగా పని చేస్తారు. కానీ మన దేశంలో కమ్యూనిస్టేతర పార్టీలేవీ ప్రజల నుండి నిధులు సమకూర్చుకోవడం లేదు. ఈ పార్టీలన్నీ నిధుల కోసం ఆధారపడేది కార్పొరేట్ సంస్థల మీదే. తెలుగు రాష్ట్రాలలో కూడా ప్రధాన ప్రాంతీయ పార్టీలకు ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు భారీగానే సమకూరాయని సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఎన్నికల కమిషన్ ప్రకటించిన వివరాలను బట్టి తెలుస్తోంది.

తమది పెద్ద పార్టీ కాబట్టి ఎక్కువ నిధులు వచ్చాయని సత్యకుమార్ ఎంత సమర్థించుకోవడానికి ప్రయత్నించినా, పోనీ ఆయన చెప్పిన లెక్కన చూసినా ఒక్క విషయం మాత్రం స్పష్టంగా తెలిసేదేమిటంటే వారి సీట్ల సంఖ్య, వచ్చిన ఓట్ల కంటే రెట్టింపుకు పైగా బీజేపీకి నిధులు వచ్చాయన్నది వాస్తవం.

అసలు ఇటువంటి నిధుల సేకరణను ఎన్నికల బాండ్ల ద్వారా చట్టబద్ధం చేసింది మోదీ ప్రభుత్వమే. అంతే కాక, ఎవరు, ఎవరికి, ఎంత నిధులు ఇచ్చారనేది కూడా గోప్యంగా ఉంచేలా చేసింది కూడా మోదీ ప్రభుత్వమే. ఎందుకిలా చేసిందన్నది కొద్దిగా ఆలోచించే వారెవరికైనా ఇట్టే అర్థమవుతుంది. దీన్ని సమర్థించుకోవడానికి వారు చేస్తున్న ఇంకో వింత వాదన ఏమిటంటే ఈ బాండ్ల ద్వారా నల్లధనం బయటకు వచ్చి తెల్లధనంగా మారుతుందని. దీనర్థం ఏమిటంటే కార్పొరేట్ల నల్లధనాన్ని తెల్లదిగా మార్చే ఏజెంట్లుగా రాజకీయ పార్టీలు వ్యవహరించడన్నమాట. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలది కీలకమైన స్థానం. అలాంటి రాజకీయ పార్టీలను కార్పొరేట్ బ్రోకర్లుగా మార్చే పథకమే అవుతుంది ఇది. అందువల్ల ఈ పథకంలో పారదర్శకతా లేదు, నైతికత అంతకంటే లేదు. సుప్రీంకోర్టు జోక్యం లేకపోతే ఈ విషయాలేవీ ఎప్పటికీ తెలిసేవే కావు. కోర్టు అంత గట్టిగా చెప్పినా స్టేట్‌బ్యాంకు వివరాలను తెలపడానికి ఎన్ని నాటకాలాడిందో చూసాం. పారదర్శకత లేకుండా అంత గోప్యం ఎందుకు వహించవలసి వచ్చింది అన్నది మోదీ ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

వాస్తవంగా బీజేపీ ఈ నిధులు సమకూర్చుకోవడానికి ఒక కొత్త పద్ధతి కూడా కనిపెట్టింది. అదేమిటంటే ఈడీ, సీబీఐ, ఇన్‌కంటాక్స్ వంటి సంస్థల ద్వారా కంపెనీలపై దాడులు చేయించడం, ఆ కంపెనీలు తరువాత భారీగా ఎన్నికల బాండ్లు కొనడం, వాటిని బీజేపీ మార్చుకోవడం వంటి అంశాలన్నీ వివిధ పత్రికలు, న్యూస్ చానళ్లలో చూస్తూనే ఉన్నాం. భారీ మొత్తంలో బీజేపీకి అందిన ఈ నిధులతోనే అనేక రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను మోదీ ప్రభుత్వం కూల్చేసింది. ఎమ్మెల్యేలను బజార్లో సరుకులుగా కొనేసింది. అలా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది. తిరిగి తామేదో ఘనకార్యం చేసేశామని, తాము తమ మిత్రపక్షాలే అత్యధిక రాష్ట్రాలలో అధికారంలో ఉన్నామని గొప్పలు చెప్పుకుంటోంది. కానీ వాస్తవాలను గమనిస్తే నిజంగా ఎన్నికల ద్వారా బీజేపీ అధికారంలోనికి వచ్చింది తక్కువే. మిగిలిన సందర్భాలన్నీ ఈ నిధుల సహాయంతో ప్రభుత్వాలను కూల్చినవే. దీన్నిబట్టి తెలుస్తున్నదేమిటంటే ఎన్నికల బాండ్లు కేవలం కార్పొరేట్లకు సేవ చేయడమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థకే భంగకరంగా ఉంటాయన్నది ఈ దేశ పౌరులు అర్థం చేసుకోవడం దేశ ప్రయోజనాలకు అత్యవసరం.

సరిగ్గా ఈ కార్పొరేట్ల నుంచి నిధులు తీసుకోవడం వల్లనే, మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలకు, అడవులను, గనులను. ఖనిజాలను, ఆఖరుకు సముద్రంతో సహా సహజవనరులన్నింటినీ కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోంది. దీనినే క్విడ్ ప్రో కో అంటారు. ఇది దేశ ప్రయోజనాలకు తీవ్ర హానికరం. మోదీ ప్రభుత్వ ఈ కపట నీతిని ప్రజలు అర్థం చేసుకోవాలి. నిజంగా ప్రజాసేవ చేయాలనుకునే ఏ పార్టీ అయినా కేవలం ప్రజల నుండే నిధులు సమకూర్చుకుంటేనే వారి మాటలను నమ్మవచ్చు. ఈ విషయంలో నిస్సందేహంగా కమ్యూనిస్టు పార్టీలే ఆదర్శం.

▪ ఎ. అజ శర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

నాయకత్వ సమస్యకు పరిష్కారమేమిటి?

రాజకీయాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి. అలాంటి రాజకీయాలు మళ్ళీ సమాజాన్నే ప్రతిబింబిస్తాయి. ఓ ఆర్థిక నేరస్థుడో, ఓ హంతకుడో అధికారం చేపడితే అమాయకులైన ప్రజలను సదరు వ్యక్తి మోసం చేసి ఓట్లు వేయించుకున్నాడనుకోవడం హాస్యాస్పదం. నేర ప్రవృత్తిగల వ్యక్తులు అందలమెక్కారంటే, అందుకు కారణం... సమాజంలో అదే తరహా నేర ప్రవృత్తి గల ప్రజలు అధిక సంఖ్యాకులు కావడమేనని సూత్రీకరిస్తే, అది తప్పెలా అవుతుంది?

ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీలు ప్రతిపక్ష నాయకులను అవినీతి కేసుల్లో జైళ్లకు పంపుతున్నప్పటికీ అధికార పార్టీలు నిజాయితీకి నిలయాలని ప్రజలు భ్రమపడే పరిస్థితి లేదు. రాజకీయాలంటేనే రొచ్చుగుంట, రాజకీయ నాయకులందరూ అవినీతిపరులేనని ప్రజలు భావిస్తుండడమే రాజకీయ చైతన్యం కొరవడడానికి ప్రధాన కారణం. అంతేకాదు, రోజురోజుకూ ప్రజలు కూడా అవినీతి రొంపిలోకి లాగబడుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఉచిత పథకాలు అనుచితాలవుతున్నాయి. పెరుగుతున్న సంపదలో పేదలు భాగస్వాములు కాకుండా, వారికి తమ స్థితి పట్ల పూర్తి అవగాహన రాకుండా చేయడంలో రాజకీయ పెట్టుబడిదారులకు ఉచిత పథకాలు వజ్రాయుధాలుగా ఉపయోగపడుతున్నాయి. సంక్షేమం మాటున సంపద దోపిడీ చేసినవారు, జనాన్ని మతం మత్తులో ముంచి ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని నిస్సిగ్గుగా ముందుకు తీసుకెళ్తున్న వారు మహానేతలుగా చెలామణీ కావడం దేశ భవితకు హానికరం.


ఇన్ని రాజకీయ పార్టీలు, ఇంతమంది రాజకీయవేత్తలు, ఇంత జనాభా ఉన్న దేశంలో ప్రధానమంత్రి పదవికి పోటీపడగల సమర్థుడైన మరో వ్యక్తి ముందుకు రాకపోవడం వింతకు లోనయ్యే స్థితికాదు, చింతకు గురయ్యే పరిస్థితి. స్వతంత్రం వచ్చినపుడు మన దేశ జనాభా సుమారు ముప్పైనాలుగు కోట్లు. అపుడు త్యాగశీలురు, ధీరోదాత్తులు, మేధావులైన రాజకీయనేతలెందరో ఉండేవారన్నది చరిత్ర చెబుతున్న సత్యం. ప్రస్తుత భారతదేశ జనాభా నూటనలభై కోట్లకు పైనే, అక్షరాస్యత కూడా ఎంతో పెరిగింది, అయినా సమర్థులైన నాయకుల కొరత ఎందుకొచ్చిందో తెలుసుకోవడం ప్రజలకే అవసరం. ఎందుకంటే అంతిమంగా తమ భవితవ్యాన్ని నిర్ణయించబోయేది రాజకీయాలే. మంచి పౌరులతో కూడిన సమాజంలోనే మంచి రాజకీయం వీలవుతుంది. అటువంటి సమాజమే మంచి నాయకులను లోకానికి అందించగలుగుతుంది. సామాజిక జీవనంలో నిజాయితీ, పౌరుడిగా తమ బాధ్యతలు నిర్వహించడంలో నిబద్ధత కలిగి ప్రజాస్వామిక దృక్పథంతో వ్యవహరించే ప్రజలే దేశానికి అవసరం. వారి నుంచే దేశాన్ని పురోగమనం దిశగా నడిపించే నాయకుడు అవతరిస్తాడు.

– గౌరాబత్తిన కుమార్‌బాబు

ఎన్నికల్లో సోదిలోకి రాని ఆర్థిక అంతరాలు

కొంతమంది ప్రపంచ స్థాయి ఆర్థికవేత్తల అభిప్రాయం ప్రకారం భారత్‌లో నేడు ఆర్థిక అంతరాలు బ్రిటిష్ వారి పాలనలో కన్నా ఘోరంగా ఉన్నాయి. గణాంకాల ఆధారంగా వారు చెప్పిన విషయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో సంపద సృష్టి బాగానే జరుగుతున్నా, అది కొద్దిమంది చేతిలోనే కేంద్రీకృతమౌతుంది. దేశ సంపదలో 44 శాతం ఒక్క శాతం ధనికుల చేతిలో ఉంది. ఆ ఒక్క శాతం మంది జాతీయ ఆదాయంలో 22 శాతం మేరకు పొందుతున్నారు. ఏభై శాతం ప్రజలు జాతీయ ఆదాయంలో 15 శాతానికి మించి పొందలేకపోతున్నారు. అంటే జాతీయ ఆదాయం ఎంత పెరిగినా జనాభాలో సగం మందికే దక్కేది... అది కూడా 15 పైసల వాటానే. ఇలా అసమానతలు పెరగడానికి ఇప్పటి ప్రభుత్వ విధానాలే కారణం. ధనికులపై విధించే పన్నులు తక్కువ, వారు పొందే రాయితీలు ఎక్కువ. పేదలు ప్రత్యక్షంగా, పరోక్షంగా కట్టే పన్నులు ఎక్కువ, వారికి దొరికే ఊరట.. తక్కువ. అయితే అసమానతలు తగ్గే విధానాల్ని అమలు చేస్తామని ఎవరూ మాట్లాడడం లేదు. వృద్ధి వైపు దేశాన్ని పరుగులు పెట్టిస్తామంటున్నారు కానీ, ఆ వృద్ధి ఫలాలు అందరికీ అందేలా విధానాలు రూపుదిద్దగలమని జాతీయ పక్షాలు మాట్లాడడం లేదు. బహుశా దానివల్ల ధనికులు దూరమై, విరాళాలు అందవని భయమేమో? చూశాం కదా, ఎన్నికల బాండ్ల రూపంలో దివాళా కంపెనీలు కూడా పార్టీలకు ఎలా ఫండ్స్ ఇచ్చాయో. వేర్వేరు నివేదికల ప్రకారం 2000 సంవత్సరంలో 35 శాతం ఉన్న నిరుద్యోగిత, నేడు 65 శాతానికి పెరిగింది. పేదరికం, పోషకాహార లేమి గణనీయంగా ఉన్నాయి. ఇప్పటికీ వైద్యం, విద్యపై పౌరులు భరించాల్సిన ఖర్చు ఎక్కువే. ఈ సమస్యల్ని గమనంలోకి తీసుకోకుండా వృద్ధిలో ముందంజ వేయడం సాధ్యమా? పేదలకి, మధ్యతరగతికి భారమైన విద్య, వైద్యం చవకగా అందుబాటులోకి రావాలి. యువత గణనీయంగా ఉన్న భారత్ శక్తిమంతం కావడమే కాదు అసమానతలు లేని సమాజంగా మారాలి. ఇప్పుడున్న విధానాలతో అది సాధ్యం కాదు. మెరుగైన విధానాల కోసం, అవి ఎన్నికల్లో ప్రాధాన్యత గల అంశాలుగా మారడం కోసం నడుం కట్టాల్సింది పౌర సమాజమే.

– డి.వి.జి. శంకరరావు



రూ. కోటి బంగారం కొట్టేశారు

నగర పోలీసులకు ఎన్నికల తనిఖీల ధమాకా

- విజయవాడ రైల్వేస్టేషన్‌లో 3 కేజీల బంగారం పట్టివేత
- బిల్లులు లేకపోవడంతో సగం నొక్కేసి మిగిలింది వెనక్కి..



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో పోలీసుల తనిఖీలు జోరుగా సాగుతున్నాయి. ఈ తనిఖీల పేరుతో కొందరు పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. నగరానికి చెందిన ఓ పోలీసు ఉన్నతాధికారి సహకారంతో సత్యనారాయణపురం పోలీసులు ఇటీవల సుమారు రూ.కోటి విలువైన బంగారం బిస్కెట్లను మాయం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఎస్ఎన్ పురం పోలీసుల చేతివాటం

వివరాల్లోకి వెళితే.. నగరంలోని పలువురు బంగారం వ్యాపారులు పొరుగు రాష్ట్రాల నుంచి బంగారం బిస్కెట్లను తెప్పించుకోవడం ఎప్పటి నుంచో జరుగుతోంది. మన రాష్ట్రంలోని ధరలతో పోలిస్తే 22 క్యారెట్ల 100 గ్రాముల బిస్కెట్ సుమారు రూ.50 వేల వరకు తక్కువకు రావడమే దీనికి కారణం. కేరళ, కర్నాటకలోని వ్యాపారుల నుంచి ఈ బిస్కెట్లను కొని తెస్తుంటారు. వీటికి ఎలాంటి బిల్లులు ఉండవు. దొంగ బిల్లులతో తెచ్చేందుకు వ్యాపారులు తమకు నమ్మకస్థమైన గుమస్తాలను వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో ఇటీవల గవర్నరుపేటకు చెందిన ఓ బంగారం వ్యాపారి తనకు నమ్మకస్తుడైన వ్యక్తి ద్వారా రైలుమార్గంలో బిస్కెట్లను తెప్పించారు. రైల్లో వచ్చిన వ్యక్తి సుమారు రూ.2 కోట్ల విలువచేసే 3 కిలోల బంగారం బిస్కెట్లను తీసుకొచ్చాడు. సమాచారం తెలుసుకున్న సత్యనారాయణపురం పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో తనిఖీల పేరుతో ఆ వ్యక్తి వద్ద ఉన్న బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. బంగారానికి సంబంధించి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో యజమానిని స్టేషన్‌కు పిలిపించారు. బిల్లులు లేని బంగారం కావడంతో మొత్తం సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగిస్తామని బెదిరించడంతో యజమాని కాళ్ల బేరానికి వచ్చారు. ఏదోలా తన బంగారం తనకు ఇప్పించాల్సిందిగా అభ్యర్థించాడు. దీంతో పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం బిస్కెట్లలో సగం తమ వద్ద ఉంచుకుని మిగిలిన కిలోన్నర యజమానికి అప్పగించారు. సుమారు రూ.కోటి విలువైన బంగారం బిస్కెట్లను పోలీసులు నొక్కేసినా బయటకు చెప్పుకోలేక సదరు యజమాని బంధువుల వద్ద తన బాధను వెళ్లబోసుకున్నారు. పోలీసులు నొక్కేసిన కిలో బంగారం ఓ పోలీసు ఉన్నతాధికారికి చేరగా, మిగిలిన మొత్తాన్ని ఇతర పోలీసు సిబ్బంది పంచుకున్నట్లు సమాచారం. మరో దొంగతనం కేసులో క్రైం పోలీసులు ఒక నేరస్థుడి నుంచి పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో విలువైన చైన్లను పక్కకు మళ్లించి, మిగతా వాటినే కేసులో రికవరీగా చూపించినట్లు సమాచారం.



బీఆర్టీఎస్ రోడ్డులో ఎండమావులు



ఫ్రైడే

సూర్యుడు నడినెత్తిన నాట్యం చేస్తున్నాడు. ఉదయం 9 గంటలైతే చాలు.. భానుడి భగభగలకు నగరం మండిపోతోంది. ఇక అత్యవసర పనుల కోసం బయటకు వస్తున్నవారు నానా ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఎండ వేడిమి విపరీతంగా ఉండటంతో బెజవాడ బ్లేజ్‌వాడను తలపించింది.

భజనచంద్రపై వేటు

- డీపీవో బాధ్యతల నుంచి అవుట్
- ఇన్‌చార్జి డీపీవోగా యాదవ్



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఒక ప్రభుత్వ అధికారై ఉండి.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా అధికార పార్టీకి వీరభజన చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) జయచంద్ర గాంధీపై వేటు పడింది. ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించి అధికార పార్టీకి ప్రచారం చేస్తున్న జయచంద్ర గాంధీని డీపీవోగా బాధ్యతల నుంచి తప్పించాలని జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు నిర్ణయించారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీపీవోగా డ్వామా ఏపీడీ యాదవ్‌ను నియమించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆదేశాలు ఇచ్చేందుకు డీఆర్వోకు కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం నోట్‌ఫైల్ పంపారు. డీఆర్వో నుంచి తదుపరి ప్రక్రియ పూర్తి కాగానే, డీపీవో జయచంద్ర గాంధీకి ఆదేశాలు అందుతాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, డీపీవో జయచంద్ర గాంధీ తన ప్రవర్తన మార్చుకోకపోవటంతో ఎంసీసీ ఉల్లంఘనల కింద కలెక్టర్ ఢిల్లీరావు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

వైసీపీకి వీరవిధేయుడిగా..

జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)గా బాధ్యతలు స్వీకరించింది మొదలు జయచంద్ర గాంధీ అధికార పార్టీకి తన స్వామిభక్తిని చాటారు. జిల్లాకు డీపీవోగా రావటానికి కారణమైన జగ్గయ్యపేట వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు రుణపడి ఉంటానని ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీల గ్రూపులలో పోస్టులు చేయటం కలకలం సృష్టించింది. ఆ తర్వాత పలు వాట్సాప్ గ్రూపుల్లో అధికార పార్టీకి అనుకూల ప్రచారం చేశారు. ఇదే సందర్భంలో ప్రతిపక్షాలపై, ఆయా పార్టీల అధినేతలపై బురదజల్లేలా పోస్టులు కూడా చేస్తూ వస్తున్నారు. కోడ్ అమల్లో ఉన్నా అధికార పార్టీ స్వామిభక్తిని చూపిస్తూ వస్తున్నారు. వాట్సాప్ డీపీలలో ముఖ్యమంత్రి జగన్ బొమ్మలను పెట్టుకుంటున్నారు. డీపీవో జయచంద్ర గాంధీ వ్యవహారాలు జిల్లా యంత్రాంగానికి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో కూడా కలెక్టర్ ఢిల్లీరావు డీపీవో పోస్టులపై సున్నితంగా తలంటారు. అయినా కలెక్టర్ ఆదేశాలను కూడా ఆయన బేఖాతరు చేస్తూ రాజకీయ పలుకుబడిని ప్రదర్శిస్తున్నారు. తన పద్ధతి మాత్రం మార్చుకోవటం లేదు. తనకున్న అధికార పార్టీ మద్దతుతో రానురానూ జిల్లా యంత్రాంగాన్ని కూడా ఖాతరు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న ఢిల్లీరావు వెంటనే అతనిని విధుల నుంచి తప్పించాలని నిర్ణయించి నోట్‌ఫైల్ పంపారు.

ముగ్గురు వలంటీర్లు అవుట్

విస్సన్నపేట, ఏప్రిల్ 5 : అధికార పార్టీ నాయకురాలి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముగ్గురు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో జి.విజయ్‌కుమారి శుక్రవారం తెలిపారు. పుట్రేల సచివాలయం-1 పరిధిలో వైసీపీ తిరువూరు అసెంబ్లీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు సతీమణి, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సుధారాణి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు కె.మహేశ్, కె.సుధాకర్, టి.రాజేశ్‌పై వేటు వేసినట్లు విజయ్‌కుమారి తెలిపారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలుంటాయని పేర్కొన్నారు.



గోల్డ్ మ్యాన్

శరీరం మొత్తం స్వర్ణాభరణాలతో శుక్రవారం ఓ భక్తుడు శ్రీవారిని దర్శించుకోవడం అందరి దృష్టినీ ఆకర్షించింది. మంగళగిరి మండలం పెద్దవడ్లపూడికి చెందిన గడ్డిపాటి సాంబశివరావు శ్రీవారి పరమ భక్తుడు. ఈ ఆభరణాలు దాదాపు 3 కేజీల బరువుంటాయని సాంబశివరావు తెలిపారు.

- తిరుమల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి)



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-23 (శని)

సహర్ (ఉదయం) : 4-45 (ఆది)



ఏడో డివిజన్‌లోని స్కూల్ ఇదే..

సర్కారు బడి.. కన్నుపడి..

మహనీయుల ఉన్నతాశయానికి ఆనవాలుగా 80 ఏళ్ల కిందట ఏర్పడిన ఓ విద్యా నిలయం.. విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిత్యం కళకళలాడే దేవాలయం.. 15 సెంట్లు.. సుమారు రూ.5 కోట్ల విలువైన ఈ పాఠశాలపై స్థానిక వైసీపీ నాయకుల కన్నుపడింది. నూతన విద్యావిధానం పేరిట వైసీపీ ప్రభుత్వం వచ్చాక మూతబడిన ఈ పాఠశాలను కాజేయాలనే కుట్రకు తెరలేపారు. కల్యాణ మండపం పేరుచెప్పి కొట్టేయాలని చూస్తున్నారు. స్థానికులు అడ్డుపడుతుండటంతో వైసీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ వద్ద పంచాయితీ పెట్టారు. విషయం బయటకు పొక్కడంతో ప్రస్తుతం వ్యవహారం స్తబ్దుగా సాగుతోంది.

ఏడో డివిజన్‌లో మూతపడిన స్కూల్‌పై వైసీపీ నేతల కన్ను

- 15 సెంట్లు.. రూ.5 కోట్ల విలువైన బడిని కాజేయాలనే కుట్ర
- స్కూల్‌ను పునఃప్రారంభించాలని కోరుతున్న స్థానికులు
- కుదరదంటూ కల్యాణ మండపం ప్రతిపాదన
- కమిటీగా ఏర్పడిన వైసీపీ డివిజన్ నాయకులు
- ప్రైవేట్ వ్యక్తుల పేరిట పన్ను, విద్యుత్ మీటర్ మార్పునకు దరఖాస్తు
- వైసీపీ నేత దేవినేని అవినాష్ వద్ద పంచాయితీ

మొగల్రాజపురం : స్థానిక ఏడో డివిజన్‌లో కమిలిబాబా ఆశ్రమం ఎదురుగా దాదాపు 80 ఏళ్ల కిందట పాఠశాల ఏర్పాటైంది. ఆ తరువాత అది ఎయిడెడ్ పాఠశాలగా రూపాంతరం చెందింది. మొదట్లో పూరి గుడిసెలో నడిచిన ఈ పాఠశాల స్థానంలో 1995లో సీఎస్ఐ కృష్ణా-గోదావరి డయాసిస్ సీఎస్ఐ పాఠశాలల మేనేజర్ రెవరెండ్ టి.పరమానందం కొత్త పాఠశాల భవనం కోసం శంకుస్థాపన చేశారు. అప్పుడు భవన నిర్మాణ కమిటీ కన్వీనర్‌గా కార్పొరేటర్ జల్లి విల్సన్, ఆర్గనైజర్‌గా పరస రాజరత్నాన్ని నియమించారు. 1999లో అప్పటి శాసన సభ్యురాలు చెన్నుపాటి రత్నకుమారి తన నిధుల నుంచి రూ.75 వేలు, ఎంపీగా ఉన్న వడ్డే శోభనాద్రీశ్వరరావు తన నిధుల నుంచి రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. స్థానికులు, రైతుల విరాళాలు రూ.9 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించి 1999, జూలై 11న ప్రారంభించారు.

వైసీపీ వచ్చాక..

వైసీపీ ప్రభుత్వం వచ్చాక రెండేళ్ల కిందట ఈ పాఠశాలను మూసివేశారు. నూతన విద్యావిధానాన్ని అమల్లోకి తెచ్చిన వైసీపీ పలు ఎయిడెడ్ పాఠశాలలను మూసివేసింది. ఆ జాబితాలో ఈ పాఠశాల కూడా చేరింది. ఇక్కడి విద్యార్థులను జమ్మిచెట్టు వద్ద ఉన్న బీఎస్ఆర్‌కే పాఠశాలకు పంపేశారు. దీంతో ఈ పాఠశాల మూతపడింది. ప్రస్తుతం పాఠశాల భవనం.. ఒకప్పటి భవన నిర్మాణ కమిటీ ఆర్గనైజర్‌గా ఉన్న పరసా రాజారత్నం కుమారుడు సుమన్ పర్యవేక్షణలో ఉంది.



పాఠశాల పునఃప్రారంభం కోసం పోరాడాలంటూ స్థానికుల ఫ్లెక్సీ

కొట్టేయాలనే కుట్ర

ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ పాఠశాల భవనంపై స్థానిక వైసీపీ నాయకుల కన్నుపడింది. దీనిని ఎలాగైనా చేజిక్కించుకోవాలనే కుట్రతో ఈ స్కూల్లో టెంట్ సామాన్లు, క్యాటరింగ్, కల్యాణ మండపం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన తీసుకొచ్చారు. ఇందుకోసం స్థానిక కార్పొరేటర్ వద్ద రెండు వారాల కిందట ఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి స్థానిక పెద్దలు, స్థానికులు సుమారు 150 మందికిపైగా హాజరయ్యారు. వీరిలో 90 శాతం మంది అక్కడ పాఠశాల తిరిగి ప్రారంభించాలని గట్టిగా చెప్పారు. 1 నుంచి 5వ తరగతి వరకూ చదువుకునే విద్యార్థులు.. దూరంగా జమ్మిచెట్టు వద్ద ఉన్న పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్న సమస్యను చెప్పారు. అక్కడ కూడా సీట్లు అయిపోవడంతో మరింత దూరంగా, ఆరో డివిజన్‌లో ఉన్న పాఠశాలకు కొందరు విద్యార్థులు వెళ్తున్నారని పేర్కొన్నారు. కాబట్టి స్థానిక పిల్లలకు చేరువగా ఉన్న పాఠశాలను పునఃప్రారంభించాలని కోరారు. అయినా.. స్థానిక వైసీపీ నేతలు అంగీకరించలేదు. ఐదుగురితో ఓ కమిటీ ఏర్పాటుచేసి ప్రైవేట్ వ్యక్తుల పేరిట పన్ను, కరెంట్ మీటర్ మార్చడానికి దరఖాస్తు చేసేశారు. కానీ, కుదరలేదు. దీంతో వైసీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సహాయం కోరారు. ఈ విషయం తెలిసి స్థానికులు కూడా అవినాష్‌ను ఆశ్రయించడంతో ఈ విషయంపై ప్రస్తుతం వివాదం నడుస్తోంది.

రెండ్రోజుల్లో..



శివారు ప్రాంతాలకు తాగునీటి విడుదలకు ఏర్పాట్లు

- ప్రకాశం బ్యారేజీ వద్ద ప్రస్తుతం ఐదడుగుల నీటిమట్టం
- ఏడడుగులకు చేరితేనే కాలువలకు విడుదల చేసే అవకాశం
- జిల్లాలో 266 తాగునీటి చెరువులు
- శివారు ప్రాంతాల్లోని తాగునీటి చెరువులను నింపేందుకు అధికారులు చర్యలు తీసుకునేనా?

వేసవికాలంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం కాలువలకు నీటిని విడుదల చేసేందుకు ఇంకో రెండు రోజుల సమయం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. పులిచింతల ప్రాజెక్టు నుంచి ఈనెల ఒకటో తేదీనే నీటిని విడుదల చేశారు. కృష్ణానదిలో నీరు అడుగంటడంతో ప్రకాశం బ్యారేజీ వద్దకు ఈ నీరు చేరేందుకు కొంత ఆలస్యం పడుతుంది. శుక్రవారం సాయంత్రానికి బ్యారేజీ వద్ద ఐదడుగుల నీటిమట్టం ఉన్నట్లు నీటి కొలతల శాఖ అధికారులు చెబుతున్నారు. అక్కడి నీటిమట్టం ఏడు లేదా ఎనిమిది అడుగులకు చేరితేనే కాలువలకు నీటిని విడుదల చేసేందుకు అవకాశం ఉంటుందని అధికారుల మాటగా ఉంది. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి మట్టం పెరిగితే వారం పాటు కాలువలకు నీటిని విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. సుమారు రెండు వేల క్యూసెక్కుల నీటిని కేవలం తాగునీటి అవసరాల కోసమే విడుదల చేస్తామని ఈ నీటితో జిల్లాలోని తాగునీటి చెరువులను నింపుతామని అధికారులు అంటున్నారు.

(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం) : పులిచింతల ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసినా ప్రకాశం బ్యారేజీ వద్ద కనీసం ఎనిమిది అడుగుల మేర నీరు నిల్వ ఉండటానికి మరో రెండ్రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని నిల్వ చేసినా ఈ నీరు శివారు ప్రాంతాలకు చేరేందుకు ఒకటిన్నర రోజుల సమయం పడుతుంది. శివారు ప్రాంతాలకు నీరుచేరి కాలువల్లో నీటిమట్టం పెరగటానికి మరోరోజు సమయం పడుతుందని, ఆ తర్వాతే బ్రాంచి కాలువల ద్వారా తాగునీటి చెరువులకు నీటిని విడుదల చేస్తామని నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం బందరు, కేఈబీ కాలువల షట్టర్లు ఎత్తి ఉంచారు. కాలువల్లో ఉన్న మురుగునీరు బయటకు పోగొట్టి, తాజా నీటిని చెరువుల్లో నింపాల్సి ఉంది. ఇందుకు ఒకపూట సమయం పట్టే అవకాశం ఉంది.

- మిగతా 6లో

ప్రకాశం బ్యారేజీకి 3వేల క్యూసెక్కులు విడుదల

విజయవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీకి 3వేల క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ నుంచి విడుదల చేశారు. ఈ నీరు శుక్రవారం రాత్రికి బ్యారేజీకి చేరుకుంది. ప్రకాశం బ్యారేజీ తూర్పు, పశ్చిమ కాల్వలకు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం కేఆర్ఎంబీకి కొద్దిరోజుల క్రితం లేఖ రాసింది. సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తున్నందున అన్ని కాలువల్లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని జలవనరుల శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. వాస్తవానికి ఈ నీరు గురువారమే చేరుకోవాల్సి ఉంది. సాగర్ నుంచి పులిచింతలకు వచ్చిన తర్వాత అక్కడి నుంచి ప్రకాశం బ్యారేజీకి చేరుకుంటుంది. మొత్తం 3వేల క్యూసెక్కుల నీరు వచ్చిన తర్వాత ఏయే కాల్వకు ఎంతెంత మొత్తంలో తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేయాలో నిర్ణయిస్తామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీలో 1.68 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. జూన్‌లో వర్షాలు కురిసే వరకు ఈ నీటితోనే సరిపెట్టుకోవాల్సి ఉంటుంది.

శఠగోపం

పోరంకి వసంత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి ఆలయ భూముల్లో గోల్‌మాల్

- ఆక్రమణదారుల చెరలో 15 ఎకరాలు.. కొమ్ముకాస్తున్న ఈవో
- 7.75 ఎకరాల వేలంలోనూ చేతివాటం
- దేవదాయ శాఖ ఆదాయానికి గండి



దేవదాయ శాఖ భూములకు రక్షకులు కావాల్సిన అధికారులే భక్షకులుగా మారుతున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే భూములు ఆక్రమించుకుంటున్నా కాసులకు కక్కుర్తిపడి ఆక్రమణదారులకు కొమ్ముకాసేలా రికార్డులను తారుమారు చేస్తున్నారు. వేలం పాటల నిర్వహణలో సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ లక్షలాది రూపాయల ఆదాయానికి గండికొడుతున్నారు. పోరంకిలోని వసంత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి దేవస్థాన భూముల్లో అదే జరుగుతోంది.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : పోరంకిలోని వసంత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానాలకు సుమారు 15 ఎకరాలు ఉంది. ఈ భూమిని పలువురు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఈ ఆక్రమణలను అరికట్టాల్సిన అధికారి అయిన ఈవో సదరు ఆక్రమణదారులతో కుమ్మక్కై, వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. పోరంకి తూముల వద్ద జంగాలమాన్యం సుమారు 10 ఎకరాల 54 సెంట్లను సుమారు 100 మందికి పైగా ఆక్రమించుకున్నారు. మరో 3 ఎకరాల 35 సెంట్ల భజంత్రీల మాన్యాన్ని సుమారు 10 మందికి పైగా ఆక్రమించుకున్నారు. తాడిగడప వంతెన సమీపంలో ఉన్న 96 సెంట్ల భూమిని ఆరుగురు ఆక్రమించుకున్నారు. వీటిపై న్యాయస్థానాల్లో దేవదాయ శాఖకు అనుకూలమైన తీర్పులు వచ్చినా ఆక్రమణదారుల నుంచి దేవాలయ భూములను స్వాధీనం చేసుకోవడానికి ఈవో మీనమేషాలు లెక్కిస్తున్నారు.

వేలంలో నిబంధనలకు పాతర

ఆక్రమణలో ఉన్న భూములు పోనూ ప్రస్తుతం ఈ ఆలయాలకు పోరంకిలో మరో ఏడు ఎకరాల 75 సెంట్ల మెట్ట భూమి ఉంది. ఈ భూమికి బహిరంగ వేలంపాట నిర్వహించడంలో ఈవో సుబ్బారెడ్డి నిబంధనలు పాటించలేదు. ఈ ఏడాది మార్చి 26న ఏడెకరాల 75 సెంట్లకు నిర్వహించిన వేలంపాటను గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించారు. కోట్లాది రూపాయల విలువ చేసే ఈ భూములకు జరిగిన వేలంపాటలో ముగ్గురు రైతులు మాత్రమే పాల్గొనడం దీనికి నిదర్శనం. ముగ్గురు రైతులు కూడా ముందే ఈవోతో మిలాఖత్ అయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. ముగ్గురు రైతుల్లో తలశిల శివశేఖర్‌బాబు అనే రైతు ఏడెకరాల 75 సెంట్లను ఏడాదికి రూ.3 లక్షలకు పాడుకున్నట్లు ఆలయ సిబ్బంది చెబుతున్నారు. ఈ వ్యవహారంలో ఈవో, మరో అధికారిణి సదరు పాటదారుడితో కుమ్మక్కై దేవస్థానం ఆదాయానికి సుమారు రూ.12 లక్షల పైచిలుకు గండి కొట్టారని పోరంకికి చెందిన రైతు డి.సతీశ్ ఆరోపిస్తున్నారు. వేలంపాట నిర్వహించడానికి అనుసరించాల్సిన నిబంధనలేవీ ఈవో పాటించలేదని ఆరోపించారు. వేలం నిర్వహిస్తున్నట్లు పోరంకిలో బహిరంగ చాటింపు వేయించాల్సి ఉన్నా అలా చేయలేదు. గ్రామ సచివాలయం వద్ద కనిపించి కనిపించనట్టుగా ఒక కరపత్రం అంటించి వేలంపాట మమ.. అనిపించారు. వేలంపాటలో ఎక్కువ రైతులు పాల్గొనేలా ఈవో వ్యవహరించి ఉంటే.. సదరు భూమికి ఏడాదికి రూ.8 లక్షల వరకూ పాడుకునేందుకు చాలామంది రైతులు సిద్ధంగా ఉన్నారని, ఈ లెక్కన దేవదాయ శాఖకు రూ.12 లక్షల పైచిలుకు గండికొట్టారని రైతులు చెబుతున్నారు. కాగా, వేలం నిర్వహణకు ముందస్తుగా దేవదాయ శాఖ కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉన్నా అది లేకుండా బహిరంగ వేలంపాట నిర్వహించారని సతీశ్ ఆరోపిస్తున్నారు. దేవదాయ శాఖ కమిషనర్ స్పందించి దేవాలయాల ఆదాయాన్ని పెంచేలా ఏడెకరాల 75 సెంట్ల భూమికి మళ్లీ వేలంపాట నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

నా ఇష్టం వచ్చినట్టు నిర్వహిస్తా.. : సుబ్బారెడ్డి, ఈవో

వేలంపాట తన ఇష్టం వచ్చినట్లు నిర్వహిస్తానని ఈవో సుబ్బారెడ్డి అన్నారు. తనను అడిగే అధికారం ఎవరికీ లేదన్నారు. ఈ భూమి వేలంపాట నిర్వహించడానికి కమిషనర్ లేదా ఇతర అధికారుల అనుమతి ఉందా అని ప్రశ్నిస్తే తన వద్ద ఏమిలేదని, అధికారుల వద్దే ఉన్నాయంటూ సమాధానం చెప్పారు. భూమి బహిరంగ వేలంపాటకు నిబంధనలు పాటించారా అని ప్రశ్నించగా, అన్నీ పాటించామని ముక్తసరిగా సమాధానమిచ్చారు.

క్యూఆర్ కోడ్ ద్వారా రైల్వే జనరల్ టికెట్లు

▸▸ తొలుత 19 కౌంటర్లలో అమలు

- 6లో..


వెండి నాగపడగలను ఆలయ ఈవోకి అందజేస్తున్న దాతలు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి బంగారు, వెండి ఆభరణాల బహూకరణ

మోపిదేవి, ఏప్రిల్ 5 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి తెనాలికి చెందిన సాయి వెంకయ్య శిష్య బృందం బంగారపు ఉత్తర జంధ్యములు, విజయవాడకు చెందిన పొన్నూరి హరికిరణ్ కుటుంబసభ్యులు వెండి నాగ పడగ, మచిలీపట్నంకు చెందిన రామకృష్ణ సుబ్రహ్మణ్యేశ్వరరావు వెండి నాగ పడగలను బహూకరణగా అందజేశారు. శుక్రవారం వారు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 83 గ్రాముల బంగారంతో ప్రత్యేకంగా తయారు చేసిన రూ.5.50 లక్షల విలువ గల ఉత్తర జంధ్యముల లాకెట్‌ను ఈవో ఎస్.ఎస్.చక్రధరరావుకు అందజేశారు. 937 గ్రాముల వెండి నాగపడగ, 929 గ్రాముల మరో వెండి నాగపడగను ఈవోకి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 5 : సాంకేతిక విద్యతో పాటు విద్యార్థులు ప్రాథమిక, తార్కిక నైపుణ్యాలను కలిగి ఉండటంతో పాటు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని నూజివీడు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ డైరెక్టర్ ఎం.చంద్ర శేఖర్ అన్నారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల 26వ వార్షికోత్సవ వేడుకలకు చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కళాశాల టాపర్స్‌కు బంగారు పతకాలు, నగదు బహుమతులను పంపిణీ చేశారు. ఈ ఏడాది డాక్టరేట్ సాధించిన అధ్యాపకులను సన్మానించారు. బెస్ట్ ప్రాజక్టులకు నగదు బహుమతి ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ బెస్ట్ మెకానికల్ టీచర్ అవార్డు గ్రహీత, ప్రిన్సిపాల్ బుర్రా కరుణకుమార్‌ను సన్మానించారు. విద్యార్థులు, అధ్యాపకుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. కళాశాల కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ ద్వారా రైల్వే జనరల్ టికెట్లు

- తొలుత 19 కౌంటర్లలో అమలు



రైల్వేస్టేషన్, ఏప్రిల్ 5 : విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, తెనాలిలోని 19 కౌంటర్లలో జనరల్ ప్రయాణికులు క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్లను పొందవచ్చు. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు, త్వరితగతిన టికెట్లను పొందేందుకు పైలెట్ ప్రాజెక్ట్ కింద విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, తెనాలిలోని 19 కౌంటర్లలో క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టినట్టు విజయవాడ రైల్వే డీఆర్ఎం కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. బుకింగ్ కౌంటర్లలో ఆయా స్టేషన్లలో ప్రయాణికుడు వెళ్లవలసిన గమ్యస్థానాలకు ఎంత ఛార్జీ అవుతుందనేది ఫేర్ రిపీటర్ సౌలభ్యం కూడా ఉంది. మొబైల్ పేమెంట్ యాప్ ద్వారా ప్రయాణికుడు ఛార్జీలు తదితరాలను నిర్ధారించుకుని క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బు చెల్లించవచ్చు. ఈ సందర్భంగా సీనియర్ కమర్షియల్‌మేనేజర్ వావిలపల్లి రాంబాబు మాట్లాడుతూ, క్యూఆర్ కోడ్ విధానాన్ని తొలిదశలో నాలుగు స్టేషన్లలో జనరల్ టికెట్ల కౌంటర్ల వద్ద అందుబాటులోకి తీసుకువచ్చామని, క్రమేణ డివిజన్‌లోని అన్ని ప్రధాన స్టేషన్లలోనూ ప్రవేశపెడతామని తెలిపారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ, జనరల్ టికెట్ ప్రయాణికులకు సౌలభ్యంగా ఉండేందుకు క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టినందుకు వాణిజ్య విభాగ సిబ్బందిని, అధికారులను అభినందించారు.


బుద్ధప్రసాద్‌ను కలిసి మద్దతు తెలుపుతున్న జనసేన, బీజేపీ నాయకులు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : మండలి

అవనిగడ్డ, ఏప్రిల్ 5 : అవనిగడ్డ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి ధ్యేయమని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. జనసేన పార్టీలో చేరిన తర్వాత ఆయన పాత్రికేయుల సమావేశంలో పార్టీ ఎందుకు మారాల్సి వచ్చింది, తన లక్ష్యం గురించి వెల్లడించారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, సహజ వనరులు దోపిడీకి గురయ్యాయని, సాగునీరు అందక వేలాది ఎకరాల్లో పంటలు పండించుకోలేని దుస్థితి ఏర్పడిందని బుద్ధప్రసాద్ వివరించారు. సుదీర్ఘకాలం ఈ అంశాలపై పోరాటాలు చేశానని, పొత్తులో భాగంగా నియోజకవర్గ సమస్యలను దృష్టిలో ఉంచుకుని పవన్ కళ్యాణ్ తనను పార్టీలోకి ఆహ్వానించారని, దానికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆశీస్సులు లభించటంతో తాను జనసేనలో చేరి ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు బుద్ధప్రసాద్ తెలిపారు. నియోజకవర్గానికి అభివృద్ధి ఫలాలు తీసుకురావటమే లక్ష్యంగా పనిచేస్తానని మండలి తెలిపారు. అందరినీ కలుపుకుని ఎన్నికలకు ముందుకు వెళ్తానని తెలిపారు. జనసేన టిక్కెట్ వచ్చిన సందర్భంగా మండలికి నియోజకవర్గానికి చెందిన వివిధ మండలాల నుంచి జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

గద్దె పోరాట ఫలితమే కృష్ణా రిటైనింగ్ వాల్

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి


మాట్లాడుతున్న పట్టాభి, భవకుమార్, గద్దె అనురాధ,

పటమట, ఏప్రిల్ 5 : తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఉద్యమ ఫలితంగా కృష్ణా రిటైనింగ్ వాల్ నిర్మాణం జరిగిందని, దీనిపై బహిరంగ చర్చకు తామంతా సిద్ధంగా ఉన్నామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి, గద్దె అనురాధ, బొప్పన భవకుమార్‌లు సవాల్ విసిరారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంపై వాస్తవాలను తెలియజేసే వీడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ, 2014-19 మధ్య చంద్రబాబు అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. 2019 తర్వాత అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. వైసీపీ తూర్పు ఇన్‌చార్జి అవినాశ్ నియోజకవర్గంలో ఏ విధమైన అభివృద్ధి చేయకపోగా, అంతా తానే చేశానని ప్రచారం చేసుకుంటున్నాడన్నారు. పార్టీలు మారడం దోచుకోవడం, దాచుకోవడమే ఆయన తత్వమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే రిటైనింగ్ వాల్ ఆవశ్యకతను వివరించిన గద్దె, 2015-16 సంవత్సరంలో ప్రారంభించి 2019 నాటికి 2.5 కిలోమీటర్ల మేర గోడ పూర్తిచేశారని గుర్తుచేశారు. మిగిలిన కొద్ది భాగాన్ని పూర్తి చేయడానికి వైసీపీ పాలనలో 150 ఇళ్లను తొలగించి, ఒక్కొక్క ఇంటికి రూ.3లక్షలు వసూలు చేసి అవినాశ్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. నిన్నటి వరకు గద్దె రామ్మోహన్ తన రాజకీయ గురువు అని చెప్పిన కేశినేని నాని, రిటైనింగ్ వాల్ మొత్తం జగన్ పూర్తి చేశారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గద్దె అనురాధ మాట్లాడుతూ, దేవినేని అవినాశ్ తప్పుడు ప్రచారాన్ని తట్టుకోలేకే బొప్పన భవకుమార్ వైసీపీ వీడి టీడీపీలోకి వచ్చారన్నారు. బొప్పన భవకుమార్ మాట్లాడుతూ, అవినాశ్ ఎమ్మెల్యేగా తనకు ఓటు వేయమని అడుగుతున్నాడే తప్ప, వైసీపీ ఎంపీకి ఓటు వేయాలని అడగటం లేదన్నారు.

ఏడు అసెంబ్లీ స్థానాలూ గెలుస్తాం

- విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)
- కూటమి సమన్వయ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

విజయవాడ, వన్‌టౌన్, ఏప్రిల్ 5 : ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలను గెలిచి చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌లకు కానుకగా ఇస్తామని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. శుక్రవారం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన టీడీపీ-బీజేపీ-జనసేన అభ్యర్థులు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, జిల్లా అధ్యక్షులతో రామవరప్పాడు రింగ్ సెంటర్‌లోని హోటల్‌లో సమన్వయ సమావేశం జరిగింది. ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు అవసరమైన చర్యలపై


టీడీపీ-బీజేపీ-జనసేన సమన్వయ సమావేశంలో నేతలు

సమావేశంలో చర్చించారు. అనంతరం మీడియా సమావేశంలో కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, మూడు పార్టీలు కలిసి ఒకే మాటమీద నిలబడి ఎన్నికలలో జగన్‌ను ఓడించి ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలోను అభ్యర్థులను గెలిపించుకుని మోదీ, పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడులకు కానుకగా ఇస్తామన్నారు. ఇందుకు సంబంధించి లోకల్ మ్యానిఫెస్టోను తయారు



చేస్తున్నట్టు చెప్పారు. పశ్చిమ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరి మాట్లాడుతూ, జగన్‌రెడ్డి రాష్ట్రానికి ఏం చేసాడన్నది ప్రజలకు బాగా తెలుసునన్నారు. ఏకపక్షంగా ప్రజలు అతడిపై తిరగబడడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తిరోగమనంలో ఉన్న రాష్ట్రం పురోగమించాలంటే జగన్ గద్దె దిగాల్సిందేనన్నారు. ఏ ఒక్క ఓటు మిస్ కాకుండా పోల్ మేనేజ్‌మెంట్ ఎలా చేయాలన్న దానిపై సమావేశంలో చర్చించామని తెలిపారు. ఎన్డీఏ కూటమి భవిష్యత్తు కార్యాచరణపై కూడా చర్చించిట్టు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ, హై కమాండ్ ఆదేశాల మేరకు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో సమన్వయ సమావేశాలు జరుగుతున్నట్టు తెలిపారు. ఎన్నికలకు 38 రోజుల సమయమే ఉందన్నారు. ఈ నెల 18వ తేదీన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించారన్నారు. బహిరంగ సభల నిర్వహణకు మూడుపార్టీల నుంచి అధినాయకుల రాకపై చర్చించామన్నారు. సోషల్ మీడియా ప్రచారంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఒక ఉమ్మడి మ్యానిఫెస్టోను తయారు చేస్తున్నట్టు దానిని త్వరలో శివనాథ్ విడుదల చేస్తారని తెలిపారు. ఏడు నియోజకవర్గాలకు సంబంధించి కూడా విడివిడిగా మ్యానిఫెస్టోలు వస్తాయని చెప్పారు. విధ్వంసకుడు జగన్‌రెడ్డిని తరిమికొట్టేందుకు మూడు పార్టీలు కంకణం కట్టుకున్నాయని చెప్పారు. జరగనున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును మార్చేందుకేనన్నారు. సెంట్రల్ టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించినట్టు చెప్పారు. జనసేన జిల్లా అధ్యక్షుడు బండిరెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ, స్థానిక మ్యానిఫెస్టోలు, బహిరంగ సభల నిర్వహణపై చర్చించినట్లు తెలిపారు. తూర్పు టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ, పేటీఎం బ్యాచ్‌తో టీడీపీ, ఎన్డీఏ మధ్య జగన్‌రెడ్డి చిచ్చు పెట్టి వివాదాలు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రజల్లో మార్పు మొదలైందని, ఇక ఎవరు ఎన్ని చేసినా ఎన్డీఏ గెలుపును ఆపలేరన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ, ఎన్డీఏ అభ్యర్థులందరూ గెలిచేవిధంగా వ్యూహ, ప్రతివ్యూహాలు రూపొందించుకున్నట్టు చెప్పారు. ఎన్నికల తరువాత ఏపీ రాజకీయ ముఖచిత్రం మారిపోతుందన్నారు.

ఆగస్టు నుంచి ఒకటినే ఉద్యోగులకు జీతాలు

- కేశినేని శివనాథ్(చిన్ని)



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కేశినేని శివనాథ్, నెట్టెం రఘురామ్

విద్యాధరపురం, ఏప్రిల్ 5 : కొద్ది రోజుల్లో రాష్ట్రంలో వచ్చేది టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వమని, ఇకపై ప్రతినెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తామని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) స్పష్టం చేశారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 'చంద్రబాబు గెలుపు-పెన్షనర్ల పిలుపు' కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే పెన్షనర్లు, ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే పించన్లు, వేతనాలు, అందజేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా వేతనాలు, పించన్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. బీఆర్టీఎస్ రోడ్డులో జరిగిన ఉద్యోగులు, పెన్షనర్ల ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మేధావులు మౌనం వహిస్తే రాష్ట్రానికి శాపమని, ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌తో కలిసి పెన్షనర్లకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏపీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జేఏసీ ఛైర్మన్ జి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, మేధావులు మాట్లాడకపోతే రాష్ట్రం నాశనమవుతుందన్నారు. వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు చంద్రబాబునాయుడును సీఎం చేసేందుకు శాయశక్తులా కృషి చేయాలన్నారు. ఏపీ సచివాలయ సంఘం మాజీ అధ్యక్షుడు పి.గురవయ్య, మాట్లాడుతూ, 2019 తరువాత ఉద్యోగులు, పెన్షనర్ల పరిస్థితి చీకటిమయంగా మారిందన్నారు. అఖిల భారత పెన్షనర్ల సంఘం రాష్ట్ర విభాగం కార్యదర్శి పి.నాగరాజు, ఏపీఎన్జీవో సంఘం మాజీ కార్యదర్శి జి.విజ్ఞంచౌదరితో పాటు పెన్షనర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంపద సృష్టించే పార్టీలను బలపరచండి

- వల్లభనేని బాలశౌరి

గుడివాడ, ఏప్రిల్ 5 : వనరులను సొంత ప్రయోజనాల కోసం దోచుకుని యువత జీవితాలను నాశనం చేసిన వైసీపీకి బుద్ధిచెప్పి, భావితరాల మనుగడ కోసం సంపదను సృష్టించే జనసేన, టీడీపీ, బీజేపీ కూటమికి అధికారం ఇస్తే దేశం, రాష్ట్రం పూర్తిస్థాయిలో యువతకు అందుబాటులోకి వస్తాయని మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. శుక్రవారం స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో జనసేన, టీడీపీ, బీజేపీ ఆత్మీయ సమావేశంలో వల్లభనేని బాలశౌరి పాల్గొన్నారు. గుడివాడలో రాజకీయ కోవిదులు పిన్నమనేని కోటేశ్వరరావు, రావి శోభనాద్రిచౌదరి, రావి వెంకటేశ్వరరావులతో తనకు మంచి సంబంధాలున్నాయన్నారు. గుడివాడలో అధికార పార్టీ స్థానికంగా విభేదాలు సృష్టించి ఐక్యతను దెబ్బతీసేందుకు అనేక కుట్రలు పన్నుతున్నదన్నారు. సమన్వయంతో పని చేస్తే టీడీపీ కూటమి గెలుపు సులువే అన్నారు. వెనిగండ్ల రాము మాట్లాడుతూ, ఐదేళ్ల వ్యవధిలో నియోజకవర్గంలో జరిగిన కొద్దిపాటి అభివృద్ధి బాలశౌరి వల్లేనని గుర్తు చేశారు. గుడివాడ అభివృద్ధి చెందాలంటే బాలశౌరిని గెలిపించాలన్నారు. తొలుత పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలశౌరిని గజమాలతో ఘనంగా సత్కరించారు.


మాట్లాడుతున్న ఉమ్మడి ఎంపీ అభ్యర్థి బాలశౌరి

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ నాయకులు రామినేని వెంకటకృష్ణ, గుత్తికొండ శ్రీరాజబాబు, టీడీపీ నాయకులు యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

బందరులో బ్రహ్మరథం..

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 5 : మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు, టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి శుక్రవారం రాత్రి మచిలీపట్నం చేరుకున్నారు. ఆయనకు మాజీ మంత్రి, అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, కొనకళ్ల బుల్లయ్య, బీజేపీ నాయకులు, తదితరులు ఘన స్వాగతం పలికారు. మూడు స్తంభాల సెంటర్‌లోని వినాయకుడి గుడిలో బాలశౌరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోనేరుసెంటర్, రేవతీ, లక్ష్మీటాకీసు, జిల్లా పరిషత్, చిలకలపూడి, పరాసుపేట, నాయర్‌బడ్డీ, రామానాయుడుపేట, బుట్టాయిపేట, కోటావారితుళ్లు, జవ్వారుపేట, ఇనకుదురుపేట, చింతచెట్టు సెంటర్ల మీదుగా నాగపోతరావు సెంటర్‌కు చేరుకున్నారు. తెలుగు మహిళ అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ తదితరులు బాలశౌరికి హారతులిచ్చారు.


ర్యాలీలో బాలశౌరి, కొల్లు రవీంద్ర, రామకృష్ణ

ఐటీని పరిచయం చేసింది చంద్రబాబే

- యువత భవితను నాశనం చేసిన జగన్ : వసంత వెంకట కృష్ణ ప్రసాద్

మైలవరం, జి.కొండూరు, గొల్లపూడి, ఏప్రిల్ 5 : ప్రపంచానికే ఐటీని పరిచయం చేసిన ఘనుడు టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడని, యువత భవితను నాశనం వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. తెలుగు యువత మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడు లంకా లితీష్ ఆధ్వర్యంలో స్థానిక ఫంక్షన్ హాల్లో శుక్రవారం నియోజకవర్గ తెలుగు యువత ఆత్మీయ సమావేశంలో, జి.కొండూరులో అంకెం సురేష్ నివాసం వద్ద గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో, విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి, షాబాదలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, యువత చదివిన చదువులకు సరైన ఉద్యోగాలు లేక కూలిపనులు చేసుకుంటున్నారంటే వైసీపీ నేతలు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ఏపీ సీఎం పుట్టుకతోనే వృద్ధుడా అన్న శ్రీశ్రీ మాటలు గుర్తుకువస్తున్నాయన్నారు. హైదరాబాద్‌ను సాఫ్ట్‌వేర్ అడ్డాగా మార్చింది చంద్రబాబే అన్నారు. అమెరికాలో నేడు తెలుగు యువత బాగా స్థిరపడిందంటే అది చంద్రబాబు ముందు చూపే అన్నారు. తాయిలాలను ఎరగా చూపి జగన్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ అధికారదాహంతో యువత భవితను నాశనం చేస్తున్నాడని దుయ్యబట్టారు. రానున్న ఎన్నికల్లో యువత ముఖ్య భూమిక పోషించాలన్నారు. పవన్ త్యాగం, ఆశయాలు ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. నారా లోకేశ్ స్ఫూర్తితో అందరూ ఐకమత్యంతో పనిచేసి కూటమి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. లంక లితీశ్, సజ్జా అజయ్, నూతలపాటి నాగభూషణం, నాగుల్ మీరా, జంపాల సీతారామయ్య, కె.విజయబాబు, పజ్జూరు వెంకటేశ్వరరావు (బుల్లి), తదితరులు పాల్గొన్నారు.


మైలవరంలో మాట్లాడుతున్న వసంత

టీడీపీ, జనసేన ర్యాలీపై నిఘా ఉంచండి

- వలంటీర్లకు డిప్యూటీ మేయర్ భర్త మెసేజ్

మచిలీపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని కుయుక్తులకు తెరతీస్తున్నారు. రాజీనామా చేసిన వలంటీర్లను కూడా వాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, టీడీపీ నాయకులు శుక్రవారం మచిలీపట్నంలో నిర్వహించిన ర్యాలీలో వైసీపీ నాయకులు ఎవరెవరు పాల్గొన్నారో తనకు తెలియజేయాలని మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భర్త శీలం బాబ్జీ వలంటీర్లకు శుక్రవారం వాయిస్ మెసేజ్ పెట్టారు. ర్యాలీలో వైసీపీ శ్రేణులు పాల్గొంటే వెంటనే పూర్తివివరాలతో తనకు సమాచారం ఇవ్వాలని సందేశం పంపారు. శుక్రవారం గంగులతోటలో ఇఫ్తార్‌విందు ఉందని వలంటీర్లంతా కుటుంబసభ్యులతో కలిసి విందుకు హాజరు కావాలని వాయిస్ మెసేజ్ పెట్టారు. ఈ విషయం బయటకు రావడంతో వైసీపీ నాయకుడి తీరుపై జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు ఈ అంశంపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

రెండ్రోజుల్లో..

(5వ పేజీ తరువాయి)

● జిల్లాలో 266 తాగునీటి చెరువులు

కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, కృత్తివెన్ను, బంటుమిల్లి, దివి మండలాల్లోని తాగునీటి చెరువుల్లో నీటిమట్టం తగ్గిపోయింది. దీంతో రక్షిత మంచినీటి పథకాలు పనిచేయని స్థితికి చేరుకున్నాయి. నీటివనరులు అందుబాటులో లేకపోవటంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు ప్రారంభించారు. కాలువలకు నీరు విడుదలైతే జిల్లాలోని 266 తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాల్సి ఉంది. ఆరు రోజుల పాటు కాలువలకు నీటిని విడుదల చేస్తామనీ, తాగునీటి చెరువులను నింపుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. తాగునీటి చెరువుల్లోకి కాలువల్లో ఉన్న నీటిమట్టాన్ని బట్టి నీటిని నింపుకోవాలని, అనంతరం మోటార్లు, ఆయిల్ ఇంజన్ల ద్వారానైనా పూర్తిస్థాయిలో నింపాల్సి ఉందని చెబుతున్నారు. జిల్లాలోని అన్ని తాగునీటి చెరువులను నింపేందుకు ఏర్పాట్లు చేశామని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. తీర ప్రాంతంలోని తాగునీటి చెరువులకు ఎంతమేర, ఎన్నిరోజులపాటు నీటిని విడుదల చేస్తారు? ఎప్పటికి ఈ గ్రామాల్లోని చెరువులను నింపుతారు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. బంటుమిల్లి ఛానల్ ద్వారా బంటుమిల్లి, కృత్తివెన్ను తాగునీటి చెరువులను నింపాల్సి ఉంది. ఈ ప్రాంతంలో ఇప్పటికే తాగునీటి చెరువులు పూర్తిస్థాయిలో అడుగంటాయి. అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించి శివారు ప్రాంతాలకు నీటిని చేరేలా చూడాల్సి ఉంది.

● తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో 2.5 మీటర్ల నీటి మట్టం

మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్, పెడన మున్సిపాలిటీ, బందరు, గూడూరు మండలాల్లోని 120 గ్రామాలకు తాగునీటి వనరుగా ఉన్న తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో శుక్రవారం నాటికి 2.5 మీటర్లకు నీటిమట్టం చేరింది. ఈ సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సామర్థ్యం 5.5 మీటర్లు. అయితే సగానికి సగం నీరు తగ్గిపోయింది. 8వ తేదీ సాయంత్రానికి గానీ తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పక్కనే ఉన్న బందరు కాలువకు తాగునీరు వచ్చే అవకాశం లేదు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 1800 మిలియన్ లీటర్లను నింపాల్సి ఉంది. రోజుకు 270 మిలియన్ లీటర్లను నింపేలా మోటార్లు ఏర్పాటు చేశారు. కనీసంగా ఏడు రోజులపాటు నీటిని విడుదల చేస్తేనే ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నింపే అవకాశం ఉంటుంది.

● 500 క్యూసెక్కులు విడుదలైతే తాగు నీటి చెరువులు నిండేది

బందరు కాలువలకు సంబంధించి 500లకుపైగా క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తేనే తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీటి చెరువులను నింపేందుకు నీరు సరిపోతుంది. బందరు కాలువకు వచ్చే నీటిని విద్యుత్ మోటార్లతో తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోని మళ్లిస్తే దిగువ ప్రాంతాల్లోని తాగునీటి చెరువులకు పూర్తిస్థాయిలో నీరు వెళ్లని పరిస్థితి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను నింపేందుకు అధికారులు ఏ తరహా చర్యలు తీసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారింది.


ఆళ్ల చిన్న సైదమ్మను పార్టీలోకి ఆహ్వానిస్తున్న సౌమ్య

వైసీపీ నుంచి టీడీపీలోకి గుడిమెట్ల సర్పంచ్

చందర్లపాడు, ఏప్రిల్ 5 : ఎన్నికల వేళ వైసీపీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన యాభై కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. చందర్లపాడు మండలం గుడిమెట్ల సర్పంచ్ ఆళ్ల చిన్న సైదమ్మ శుక్రవారం రాత్రి తన అనుయాయులతో కలిసి కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య సమక్షంలో టీడీపీలో చేరారు. ఆళ్ల సైదమ్మ సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి ఎమ్మెల్యే సోదరులతో వివాదాలు తలెత్తుతూ వచ్చాయి. సైదమ్మ భర్త ఆళ్ల కాటమరాజు గుడిమెట్ల పంచాయతీ సర్పంచ్‌గా 35 ఏళ్లపాటు పని చేశారు. బలమైన తన వర్గంతో వైసీపీకి షాక్ ఇచ్చారు. సుమారు యాభై కుటుంబాలకు చెందిన రెండు వందల మందితో ఆమె టీడీపీలో చేరారు. సైదమ్మ చేరికతో మండలంలోని పలు గ్రామాలలో బీసీలు టీడీపీ వైపు నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. సైదమ్మ తదితరులకు సౌమ్య టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు వానిరెడ్డి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు మేకల సుధాకర్‌బాబు, ఉన్నం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

- డీపీవో జయచంద్ర విధుల నుంచి తొలగింపు
- నామినేషన్ల ప్రక్రియకు పక్కా ప్రణాళికలు : ఢిల్లీరావు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు హెచ్చరించారు. ఉల్లంఘనలకు పాల్పడిన జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జయచంద్ర గాంధీని విధుల నుంచి తప్పిస్తున్నట్టు చెప్పారు. అధికారులు, ఉద్యోగులు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నడుచుకోవాల్సిందేనని చెప్పారు. జిల్లాలో ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ప్రభుత్వ అతిథి గృహం సమాచార పౌరసంబంధాల శాఖ మీడియా సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లను ఢిల్లీరావు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ వంటి అంశాలతో పాటు జూన్ 4వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ వరకు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మార్చి 16వ తేదీ నుంచి ఇప్పటి వరకు రూ. 6.25 కోట్ల నగదు, మద్యం, బంగారం, వెండి, మత్తు పదార్థాలు, విలువైన వస్తువులను సీజ్ చేయటం జరిగిందన్నారు. 4300 లీటర్ల మద్యాన్ని సీజ్ చేయటం జరిగిందన్నారు. ఉల్లంఘనలకు సంబంధించి 867 ఫిర్యాదులను స్వీకరించి వీటిలో 837 పైగా పరిష్కరించామన్నారు. రాజకీయ పార్టీల డోర్ టు డోర్ ప్రచారానికి, ర్యాలీలకు తక్షణం అనుమతులు జారీ చేస్తున్నామన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు ప్రచారానికి అయ్యే ఖర్చును పార్టీల ఖర్చులో రాయటం జరుగుతుందని, ఏప్రిల్ 18 నుంచి జూన్ 4వ తేదీ వరకు అభ్యర్థుల ఖర్చులో రాయటం జరుగుతుందన్నారు. ఈ నెల 14వ తేదీ వరకు ఫారం-6 కు సంబంధించిన చేర్పులకు అనుమతి ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఓటరుకు ఏ4 సైజుతో కూడిన ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 840 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో వెబ్‌క్యాస్టింగ్, వీడియోగ్రఫీ, మైక్రో అబ్జర్వర్ల పరిశీలన ద్వారా పర్యవేక్షణ జరుపుతామన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సిబ్బంది కోసం బస్సులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పోలింగ్ విధులు నిర్వహించే పీవోలు, ఏపీవోలకు ఈనెల 13, 14 తేదీలలో మొదటి దశ, 29వ తేదీన రెండవ దశ శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. పోలింగ్ నిర్వహణకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లను అవసరానికి మించి 120 శాతం పైగా సిద్ధం చేశామన్నారు. 85 సంవత్సరాలు పైబడిన, అర్హులైన పీడబ్ల్యూడీ ఓటర్లు, హోం ఓటింగ్‌కు ఫామ్ 12డీలను ఈనెల 29వ తేదీలోగా సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీములు పూర్తి పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద సీఆర్‌పీఎఫ్, స్టేట్ పోలీసు, సివిల్ ఆఫీసర్లతో గట్టి నిఘా ఉంచామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

గుణదల, ఏప్రిల్ 5: ప్రేమించమని లేదంటే ప్రాణాలు తీయడానికి వెనుకాడను అంటూ బెదిరింపులకు దిగుతున్న యువకుడిపై గుణదల పోలీసులు శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం మధురానగర్ బావి రోడ్డులో తల్లి, తమ్ముడితో ఉంటున్న బాలిక(13) 8వ తరగతి చదువుతోంది. అదే ప్రాంతంలో బార్బర్ షాపులో పనిచేస్తున్న నవీన్ అనే యువకుడు బాలికను తరచూ ప్రేమిస్తావా లేదా అంటూ బెదిరిస్తుండటంతో స్థానికుల సాయంతో కొద్ది రోజుల క్రితమే ఒకసారి మందలించారు. అయినా అతనిలో మార్పు రాకపోగా గురువారం రాత్రి ట్యూషన్ నుంచి బాలిక ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చి బైక్ ఎక్కుతావా లేక చంపేయమంటావా అంటూ బెదిరించడంతో ఆ బాలిక తప్పించుకుని ఇంటికి ఏడ్చుకుంటూ వెళ్లింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లి గుణదల పోలీసులు ఆశ్రయించింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు నవీన్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నరుపేటలో ముమ్మర తనిఖీలు

వన్‌టౌన్, ఏప్రిల్ 5: ఎన్నికల దృష్ట్యా గవర్నరుపేట పోలీస్‌స్టేషన్ సీఐ డి.వి రమణ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వివిధ బజార్లలో షాపుల వద్ద ఎంక్రోచ్‌మెంట్లను గుర్తించి తొలగింప చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా ఉన్న వాటిని తొలగించారు. రద్దీ ప్రాంతమైన నవరంగ్ థియేటర్ వద్ద, 5వ నెంబర్ రూట్, పలు ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు.


నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో


ఆంధ్రరత్న భవన్‌లో


బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో


చిత్తరంజన్ గ్రంథాలయంలో


18వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో

జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివి

● ఘనంగా భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

చిట్టినగర్, ఏప్రిల్ 5: సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎనలేని కృషి చేశారని కార్పొరేషన్ అదనపు కమిషనర్ సత్యవతి అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత అదనపు బాబు జగ్జీవన్‌రామ్ సత్యవతి పలువురు అధికారులతో కలసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకొని యువతరం ముందుకు సాగాలన్నారు. మేనేజర్ బీ.శ్రీనివాస్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

● ఫ్రైజర్‌పేట ఎర్రకట్ట రోడ్డులో టీడీపీ పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్ మాధవ్ పలువురు నాయకులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళంచారు.

● టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) కేశినేని ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం 49వ డివిజన్ ఫ్రైజర్‌పేట ఎర్రకట్ట ప్రాంతంలో అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందజేశారు. తెలుగుయువత పశ్చిమ అధ్యక్షుడు ఆర్ మాధవ, డివిజన్ అధ్యక్షులు బడుగు వెంకన్నలు పాల్గొని పేదలకు భోజనం అందజేశారు.

● ఎర్రకట్ట రోడ్డులో టీడీపీ సీనియర్ నాయకులు గుర్రం కొండ పలువురు నాయకులతో కలసి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 46 డివిజన్ అధ్యక్షుడు డి. ప్రభుదాస్. బడుగు వెంకన్న, అమర్‌బాబు, ఎలీషా, కిరణ్‌కుమార్, చరణ్ పాల్గొన్నారు.

● బంగారయ్య కొట్టు సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రిన్సిపాల్ రాజు డేవిడ్ పలువురు ఉపాధ్యాయులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

గవర్నర్‌పేట: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి గ్రంథాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రేడ్-2 గ్రంథాలయాధికారిణి జి.ఉమారాణి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, ఏపీసీసీ ఉపాధ్యక్షుడు వి. గుర్నాథం, బైపూడి నాగేశ్వరరావులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు మేడా సురేష్, పిపై కిరణ్, శ్రీనివాస్, గణేష్, శివప్రసాద్, రత్నాకర్ పాల్గొన్నారు.

బాబూజీ జీవితం అందరికీ ఆదర్శనీయం

విజయవాడ లీగల్ : సమతావాది బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శనీయమని, ఆయన జీవితాన్ని ప్రేరణగా తీసుకొని ప్రతిభతో ఉన్నతంగా ఎదగాలని బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల రాజా అన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా న్యాయవాదులతో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాయింట్ సెక్రటరీ కలతోటి క్రాంతి కుమార్, న్యాయ వాదులు కందుల శ్రీనివాస్, లాం ఇజ్రాయేలు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పి. సంపత్‌కుమార్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

రాణిగారితోట: అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. డివిజన్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. పీరుబాబు, విజయ్, శాంతిబాబు, వెంకటేశ్వరరెడ్డి, గంద్ర వేంకటేశ్వర్లు, దుర్గ, మరియమ్మ, బాబు, భద్ర, పుట్ల రమణ పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్: టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి తంగిరాల కొండలరావు ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన చల్లగాలి అనిల్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమల వేసి నివాళులు అర్పించారు. కొడాలి వంశీ, దుర్గారావు, విజయ్‌కుమార్, రవి, పాల్గొన్నారు. ● లూనా సెంటర్ వద్ద ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం జైపాల్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పైడి శ్రీను, పాల్గొన్నారు.

పాయకాపురం: 64వ డివిజన్ కండ్రికలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి వింజమూరి సతీష్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరుచూరి ప్రసాద్, పలగాని శివ, దిలీప్, కంకణాల బాబు పాల్గొన్నారు.

బుద్దా వెంకన్న కార్యాలయంలో.

విద్యాధరపురం: వన్‌టౌన్‌లోని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుద్దా వెంకన్నతో పాటు పార్టీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా ఆధ్వర్యంలో పశ్చిమ ఎస్సీ సెల్ కమిటీ సభ్యులు, నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కామాదేవరాజ్, కొట్టేటి హనుమంతరావు, బూదాల నందకుమారి, తుపాకుల రమణమ్మ, శ్రీరామ్ శెట్టి నాగేంద్ర, కాండ్రేగుల రవీంద్ర పలువురు నాయకులు పాల్గొన్నారు.


భవానీపురం ఎన్‌డీఏ కార్యాలయంలో


కేబీఎన్ కాలేజీలో

● పశ్చిమ బీజేపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్ర రామారావు అధ్యక్షతన భవానీపురం ఎన్‌డీఏ ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పశ్చిమ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

● కొత్తపేటలోని కేబీఎన్ కాలేజీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణ రావు తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌లు డి.పవన్‌కుమార్, ఎం.సాంబశివరావు, కల్మబేగం, ఎన్‌సీసీ ఆఫీసర్ టి.వి జయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పిలిస్తే పలికే కమ్యూనిస్టులను గెలిపించాలి

● సీపీఐ పశ్చిమ అభ్యర్థి కోటేశ్వరరావు

చిట్టినగర్, ఏప్రిల్ 5: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పిలిస్తే పలికే కమ్యూనిస్టులను గెలిపించాలని సీపీఐ పశ్చిమ అభ్యర్థి జీ. కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం 49 ,50 డివిజన్‌లో ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు సాగిస్తున్న తమకు ఓటు వేయాలన్నారు. ప్రజలు విజ్ఞప్తితో ఆలోచించి స్థానికంగా పిలిస్తే పలికే కమ్యూనిస్టులకు కంకికొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. డివిజన్ కార్యదర్శులు బోరా రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



లబ్బీపేట, ఏప్రిల్ 5: రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు తమ సంస్థ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా అందజేసినట్లు ముస్లిం డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు షేక్ వలి తెలిపారు. లబ్బీపేటలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం 155 మంది పేద ముస్లిం కుటుంబాలకు 1500 విలువ గల తోఫా కిట్‌లను పంపిణీ చేశారు. సొసైటీ సభ్యులు ముక్తార్ అలీ, అహ్మద్ షరీఫ్, క్రేన్ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.


శివనాథ్‌ను కలిసిన వైసీపీ సిటీ మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ నాహీద్ అంజుమ్

టీడీపీకి నాహిద్ మద్దతు

విద్యాధరపురం, ఏప్రిల్ 5: టీడీపీతో కలిసి పనిచేస్తానని చంద్రబాబు నాయకత్వం ఈ రాష్ట్రానికి అవసరమని వైసీపీ సిటీ మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ నాహీద్ అంజుమ్ అన్నారు. శుక్రవారం ఆయన గురునానక్ కాలనీలోని ఎన్‌టీఆర్ భవన్‌లో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)ని కలిసి మద్దతు పలికారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ నాహీద్‌ను పార్టీలోకి చేర్చుకుంటున్నామని తెలిపారు. కండువా కప్పి నాహీద్‌ను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ విజయవాడ యువజన విభాగం, విద్యార్థి సంఘం నాయకుడు దాడి మురళీ శుక్రవారం కేశినేని శివనాథ్(చిన్ని) సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి చిన్ని సాదరంగా ఆహ్వానించారు. నరసింహ చౌదరి, కామాదేవరాజ్, పేటేటి రాజమోహన్, గొట్టుముక్కల రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

విద్యాధరపురం, ఏప్రిల్ 5: లారీ ఢీకొని యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం గొల్లపూడి సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం వెస్ట్ ఇబ్రహీంపట్నం కొత్తూరు ప్రాంతానికి చెందిన మల్లాది శ్రీను పెద్ద కుమారుడు నాగశివ(19) గురువారం మోటర్ సైకిల్‌పై ఇంటి నుంచి విజయవాడ బస్టేషన్‌కు బయలుదేరాడు. గొల్లపూడి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ నాగశివను ఢీకొంది. ఈ సంఘటనలో నాగశివకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బంధువులు సంఘటనా స్థలానికి వెళ్లి బాధితుడిని గొల్లపూడిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు తల్లి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్ని వర్గాల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం


ప్రచారంలో గద్దె క్రాంతి

గద్దె క్రాంతి

భారతీనగర్, ఏప్రిల్ 5: భారత మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగానే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాలన సాగిందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన తర్వాత కూడా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు పాలన సాగిస్తారని గద్దె క్రాంతి అన్నారు. శుక్రవారం తూర్పుపరిధి 3వ డివిజన్‌లో కనకదుర్గా నగర్ మెయిన్ రోడ్డులో గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం టీడీపీ ద్వారానే సాధ్యమని అన్నారు. టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్, తూర్పుఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌లకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తాడి బాబూరావు, మారుతీ మోహన్, గుత్తికొండ మోహనరావు, పేరేపి ఈశ్వర్, యలమంచిలి పండు, అశోక్, మురారి బాలాజీ ప్రసాద్, గుణమాల రాజశేఖర్, భార్గవ్, రత్నశ్రీ, ధీరజ్, రవితేజ, పాల్గొన్నారు.

గుణదల: తూర్పులో అవినీతి వైసీపీకి చోటు లేదని గత రెండు పర్యాయాలుగా ప్రజలు ఇచ్చిన తీర్పే తిరిగి పునరావృతం కాబోతుందని టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక 2వ డివిజన్లోని కార్మికనగర్లో శుక్రవారం ఇంటింటికి వెళ్లి గద్దె రామ్మోహన్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. దాసరి గాబ్రియేలు, సుగసాని కృష్ణప్రసాద్, దేవరపల్లి శ్రీహరి, కోయా శివ, వెల్లంకి సుధాకర్, నాళం నరేంద్ర, పి.రత్నశ్రీ, లింగం నాగలక్ష్మి, అనసూయ, టి.వెంకట్, ఎన్. చిన్నా పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధం

● కేశినేని జానకీ లక్ష్మి


మేనిఫెస్టోను స్థానికులకు వివరిస్తున్న కేశినేని జానకీ లక్ష్మి

అజిత్‌సింగ్‌నగర్, గుణదల, ఏప్రిల్ 5 : ఒక్క ఛాన్స్ అని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ దుర్మార్గపాలనతో విసిగిపోయిన ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని సతీమణి కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. 26వ డివిజన్ చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన కాలువ ఒడ్డున ఆ పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు వివరించారు. అనంతరం కేశినేని జానకీ లక్ష్మి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. బొండా సుజాత, వల్లభనేని రాజేశ్వరి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం

ఎస్‌బీ సీఐ డి.కాశీవిశ్వనాథ్


ఇఫ్తార్ విందులో పాల్గొన్న సీఐ కాశీ విశ్వనాథ్, వెలగా జోషి

పటమట, ఏప్రిల్ 5 : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం అని స్పెషల్ బ్రాంచ్ సీఐ డి. కాశీవిశ్వనాథ్ తెలిపారు. రంజాన్ చివరి శుక్రవారం ఆటోనగర్ ఏటీఏ రోడ్‌లో స్టార్ మసీదులో యునైటెడ్ ముస్లిం మైనార్టీ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సీఐ కాశీ విశ్వనాథ్, వెలగా జోషిలు పాల్గొన్నారు. కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ ఐకమత్యం, మత సామరస్యానికి చిహ్నం అని, పవిత్రమైన రంజాన్ మాసం దానధర్మాలకు ప్రతీక అని చెప్పారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుఎంఎంఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు బెజవాడ నజీర్, మొహబూబ్ సుభానీ, మౌలానా మొహమ్మద్‌లు పాల్గొన్నారు.

డీసీపీ పరిశీలన


సిబ్బందితో మాట్లాడుతున్న అదిరాజ్‌సింగ్‌రాణా

వన్‌టౌన్, ఏప్రిల్ 5: డిప్యూటీ పోలీసు కమిషనర్ (డీసీపీ) అదిరాజ్‌సింగ్ రాణా శుక్రవారం సూర్యారావుపేట పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌లోని నెలకొన్న అన్ని పరిస్థితులపైనా ఆయన ఆరా తీశారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులతో కూడా ఆయన మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి, వాటిని వెంటనే డిస్పోచ్ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల పెండింగు పరిస్థితిని, సిబ్బంది పనితీరును పరిశీలించారు. కేసుల పరిష్కారంలో పారదర్శకత అవసరమని తెలిపారు.



ఈ చెత్తను తొలగించరా..?

విద్యాధరపురం, ఏప్రిల్ 5: భవానీపురం ప్రాంతంలోని కృష్ణానదీ తీరాన ఉన్న పున్నమి ఘాట్, భవానీఘాట్‌లలో చెత్తాచెదారం భారీగా పేరుకు పోయింది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. దోమలు కూడా విపరీతంగా విజృంభిస్తుండడంతో అనారోగ్యంపాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.


ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం • 6 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com

‘రామాయణ్’ కోసం ఆస్కార్ సంగీత దర్శకులు



మూడు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న ‘రామాయణ్’ షూటింగ్ ఇటీవల మొదలైన విషయం విదితమే. నితీశ్ తివారి దర్శకత్వంలో నవిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమా గురించి కానీ, నటీనటుల గురించి కానీ అధికారిక ప్రకటన ఏమీ వెలువడక పోయినప్పటికీ యూనిట్ సభ్యుల నుంచి లీక్ అవుతున్న విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఆస్కార్ అవార్డ్ పొందిన ఇద్దరు సంగీత దర్శకులు ఈ సినిమాకు సంగీతం అందించనున్నారు. వారిలో ఒకరు ఏ.ఆర్. రెహమాన్ కాగా మరొకరు హాలీవుడ్ సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్. ‘రామాయణ్’ చిత్రంతో జిమ్మర్ భారతీయ చిత్ర పరిశ్రమకు పరిచయమవుతున్నారు. ‘గ్లాడియేటర్’, ‘పైరెట్స్ ఆఫ్ ది కరేబియన్’, ‘ది డార్క్ నైట్ ట్రయాలజీ’ , ‘ది లయన్ కింగ్’, ‘నో టైమ్ టు డై’ తదితర చిత్రాలకు ఆయన సంగీత దర్శకత్వం వహించారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17న ‘రామాయణ్’ చిత్ర వివరాలు దర్శకనిర్మాతలు వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మొదటి భాగాన్ని ఏప్రిల్ నుంచి జులై వరకూ చిత్రీకరించనున్నారు. వచ్చే ఏడాది దీపావళికి తొలి భాగాన్ని విడుదల చేస్తారు.

కృష్ణమ్మ రాక ఖాయం



సత్యదేవ్ కథానాయకుడిగా నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ ‘కృష్ణమ్మ’. వి. వి గోపాలకృష్ణ దర్శకత్వంలో కృష్ణ కొమ్మలపాటి నిర్మిస్తున్నారు. దర్శకుడు కొరటాల శివ సమర్పిస్తున్నారు. ‘కృష్ణమ్మ’ విడుదల తేదీ ఖరారైంది. మే3న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం శుక్రవారం ప్రకటించి, టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ‘రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కించిన చిత్రమిది. కృష్ణమ్మ టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూస్తే అర్థమవుతుంది. సత్యదేవ్ హీరోగా మరో మెట్టు ఎక్కుతాడు’ అన్నారు. అతీరారాజ్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో లక్ష్మణ్, అర్చన, కృష్ణ, రఘు కుంచె కీలకపాత్రలు పోషించారు. సంగీతం: కాలభైరవ. సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి

సరికొత్త లుక్‌లో శ్రీవల్లి



సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం ‘పుష్ప 2: ది రూల్’. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ‘పుష్ప’ చిత్రానికి ఇది కొనసాగింపు. తొలిభాగంలో శ్రీవల్లి పాత్రలో హీరోయిన్‌గా రష్మిక తనదైన నటన, యాసతో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆమె పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమె గెటప్‌ను తెలుపుతూ చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. చీరకట్టులో తీక్షణంగా చూస్తూ శ్రీవల్లి పాత్రలో కొత్తగా కనిపించారు. ఆగస్టు 15న ‘పుష్ప 2’ ప్రేక్షకుల ముందుకు రానుంది. అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 8న టీజర్‌ను విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్, ధనంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

కాలేజ్ స్టూడెంట్

రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటిస్తున్న చిత్రం ‘ది గర్ల్‌ఫ్రెండ్’. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఈ అందమైన ప్రేమకథలో దీక్షిత్‌శెట్టి, రష్మికకు జోడీగా నటిస్తున్నారు.ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో రష్మిక కాలేజ్ స్టూడెంట్ పాత్రలో అలరించనున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్. సినిమాటోగ్రఫీ: కృష్ణన్ వాసంత్

ఈతరం ప్రేమకథలో...



యువ కథానాయకుడు అశోక్‌గల్లా నటిస్తున్న తదుపరి చిత్రం ఖరారైంది. శుక్రవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా అశోక్‌గల్లా కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఉద్భవ్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీగౌరీ ప్రియ కథానాయిక. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. ప్రేమ, హాస్యం కలబోసిన ఈ తరం ప్రేమకథగా ఈ చిత్రం రూపొందుతోంది. ‘ది స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ’ శైలిని అనుకరిస్తూ రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. దీన్నిబట్టి అమెరికా నేపథ్యంలో కథ సాగుతుందని తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

అశోక్ గల్లా కథానాయకుడిగా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘దేవకీ నందన వాసుదేవ’. ఈ చిత్రం నుంచి ‘ఏమయ్యిందే’ అంటూ సాగే సాంగ్ ప్రోమోను యూనిట్ విడుదల చేసింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించారు. వారణాసి మానస కథానాయికగా నటిస్తున్నారు.

భయపెట్టే భవనమ్



బ్లాక్‌బస్టర్ చిత్రాల నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిలిమ్స్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఆర్.బి చౌదరి, వాకాడ అంజన్‌కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మాతలుగా బాలాచారి కూరెళ్ల దర్శకత్వంలో ‘భవనమ్’ అనే చిత్రం రూపొందుతోంది. సప్తగిరి, ధనరాజ్, షకలకశంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన తారాగణం. శుక్రవారం ‘భవనమ్’ ఫస్ట్‌లుక్, టీజర్‌ను యూనిట్ విడుదల చేసింది. ‘ది హాంటెడ్ హౌస్’ అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందిన ఈ చిత్రం టీజర్ సస్పెన్స్, థ్రిల్లింగ్ హారర్‌తో పాటు ఫన్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకుంది. చరణ్ అర్జున్ నేపథ్య సంగీతం అలరించింది. మేలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మురళీమోహన్ రెడ్డి

ఇటలీలో ప్రభాస్



ప్రభాస్ హీరోగా నటిస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రం ‘కల్కి 2898 ఏడీ’ షూటింగ్ ప్రస్తుతం ఇటలీలో జరుగుతోంది. ప్రభాస్, బాలీవుడ్ నటి దిశ పటానీ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో తీసిన కొన్ని ఫొటోలను దిశా షేర్ చేశారు. అలాగే ప్రభాస్‌తో తను దిగిన సెల్ఫీని కూడా ఆమె షేర్ చేయడంతో ఆ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. వీటిని అభిమానలు షేర్ చేస్తూ హ్యాపీ మూడ్‌లో ఉన్నారు. ప్రభాస్ సరసన దీపిక పదుకోణ్ నటిస్తున్న ‘కల్కి’లో సీనియర్ నటుడు కమల్ హాసన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. అమితాబ్ బచ్చన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. గతం, భవిష్యత్‌తో ముడిపడిన కథతో రూపొందున్న ఈ చిత్రాన్ని అగ్ర నిర్మాత అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు కలిగిన ఈ సినిమా కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించిన ‘ఫ్యామిలీస్టార్’ చిత్రం శుక్రవారం విడుదలై చక్కటి ప్రేక్షకాధరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు చిత్రబృందంతో కలసి సక్సెస్‌ను సెలబ్రేట్ చేశారు.

తాప్సీ పెళ్లి ఖర్చు ఎంతో తెలుసా?



తన బాయ్‌ఫ్రెండ్, మాజీ బాడ్మింటన్ ఆటగాడు మాతీస్ బో తో హీరోయిన్ తాప్సీ వివాహం మార్చి 22న జరిగినా ఇంతవరకూ ఆమె ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. కనీసం పెళ్లి ఫొటోను కూడా సోషల్ మీడియాలో రిలీజ్ చేయలేదు. అయితే వీరి పెళ్లికి సంబంధించిన కొన్ని ఫొటోలు ఇటీవల లీక్ అయి వైరల్ అయ్యాయి. వీరి పెళ్లి ఎక్కడ జరిగింది?, ఎలా జరిగింది?, ఎంత ఖర్చు అయింది? అన్న సమాచారం తెలిసింది. తాప్సీ సన్నిహితులు వెల్లడించిన వివరాలు ఏమిటంటే.. తాప్సీ పెళ్లి డానిష్, హిందూ సంప్రదాయాల ప్రకారం జరిగింది. రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని ఏకలవ్య స్టార్ హోటల్‌లో జరిగింది. ఇది చాలా ఖరీదైన హోటల్ కావడంతో పెళ్లి ఏర్పాట్లు, భోజనాలకే రూ. 60 నుంచి 80 లక్షల వరకూ ఖర్చు అయిందని అంటున్నారు. మిగిలిన అన్ని ఖర్చులు కలిపితే కోటి రూపాయలు దాటిందని అంటున్నారు. కుటుంబ సభ్యులు, అతి ముఖ్యులైన స్నేహితులే హాజరైనా పెళ్లి మాత్రం చాలా గ్రాండ్‌గా జరిగిందని అంటున్నారు. డీజే గణేశ్, అభిలాష్ తాప్లియాల్, డెల్‌రాజ్ బున్‌షా తదితరులు ఆట పాటలతో హోరెత్తించి, అతిథులను ఆనంద పరిచారట.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 6 ఏప్రిల్ 2024

నారింజ పాయసం

క్లిష్ట్వా నారంగ మజ్జాం వే పచెత్సర్పిషి తాపితె
తత్ర ఖండం చ నిక్షిప్య పక్వం మత్వావతారయేత్!
శీతీభూతె వినిక్షిప్య మాత్రేవార్థశృతం వయః!
నారంగక్షీరిణీ చైషా సుగంధ సురభీకృతా!

కొన్ని కలయికలు విచిత్రంగా అనిపిస్తాయి. పుల్లగా ఉండే నారింజ పండుతో పాయసం వండుకోవటం అలాంటిదే. ఇదెలా సాధ్యం అంటే రాజకీయ సమీకరణాల్లాగే పాక శాస్త్రంలో కూడా కొన్ని సమీకరణాలుంటాయి. వాటిని అనుసరిస్తే 'అబ్బబ్బ పులుపు నే తిననే తినను... నేలకేసి కొడతా...' అని పిల్లలు పాడుకునే పాటలోని నారింజ పండుకి బద్ధ విరోధి అయిన పాలతో సఖ్యత కుదర్చవచ్చు. మామూలుగా అయితే ఈ రెండు విరుద్ధ పదార్థాల కలయిక విషంతో సమానం. కానీ, క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో చెప్పిన పద్ధతిలో సంస్కరిస్తే అది అమృతతుల్యమైన పాయసం అవుతుంది. పాక శాస్త్ర అద్భుతం ఇదే.

గోదావరి జిల్లాల్లో నారింజ వాడకం ఎక్కువ. దీంతో పచ్చడి, పప్పు, పులిహోర ఎక్కువగా వండుకుంటూ ఉంటారు. పైత్యాన్ని, కఫాన్ని తగ్గిస్తుందని దీని వాడకం ఎక్కువ. దీంట్లో సి-విటమిన్ ఎక్కువే కానీ, రసం తీసుకుని తాగితేనే ఈ సి-విటమిన్ మనకు అందుతుంది. పొయ్యి మీద వండిన తరువాత సి-విటమిన్ ఉండదు. కానీ, తక్కిన విటమిన్లు, ఫాస్ఫరస్, క్యాల్షియం, పొటాషియం లాంటివి పదిలంగానే ఉంటాయి.

నారింజ మనకు దొరకకపోయినా, చక్కగా పండిన కమలాలు, బత్తాయిలతో కూడా మనం క్షేమశర్మ చెప్పిన పద్ధతిలో పాయసాన్ని కాచుకోవచ్చు. అదెలాగంటే...

- బాగా పండిన నారింజ, బత్తాయి, కమలాల్లో దేన్నయినా తీసుకోండి. చక్కగా కడిగి పొడి బట్టతో తుడిచి, పై తొక్కు తీసేయండి. లోపల ఉండే తెల్లని పొరని కూడా వలిచేయండి.
- తొనల్లో గింజలు ఏరేసి, రసాన్ని, లోపలి ముత్యాల్నీ ఓ కప్పు



లోకి తీసుకోండి.
- బాండీలో తగినంత నెయ్యి వేసి కాగిన తరువాత ఆ నేతిలో ఈ నారింజ ద్రవాన్ని కలిపి, కలియబెడుతూ కాసేపు ఉడికించండి.
- ఉడికిన తరువాత ఆ ద్రవంలో చాలినంత పంచదార కలిపి, అది కరిగేవరకూ పాకం పట్టండి. ఇప్పుడీ బాండీని పొయ్యి మీంచి దింపి పక్కన పెట్టుకోండి.
- ఈ మొత్తానికి ఎన్ని పాలు సరిపోతాయో ఉజ్జాయింపున

> **'నారంగ' అనే సంస్కృత పదంలోనుంచో, 'నారింజ' అనే తెలుగు పదంలోనుంచో 'న' అనే నెగెటివ్ అక్షరం పోయి 'ఆరెంజ్' అనే ఇంగ్లీషు పదం (సిట్రస్ సైనెన్సిస్) ఏర్పడిందని భాషావేత్తలు చెబుతారు. దీనికి 'విశదం'... అంటే రక్తాది ధాతువులు ప్రవహించే నాళాలను శుభ్రపరచే గుణం ఉంది. గుండెకు మంచిది. శరీరానికి ఉత్తేజాన్నిస్తుంది. బలాన్నిస్తుంది. వాతాన్ని తగ్గిస్తుంది. అలసటను పోగొడుతుంది. అజీర్తిని, కడుపులో దోషాల్ని, పురుగుల్ని, కడుపు నొప్పిని హరిస్తుంది. చలవనిస్తుంది. నోటికి రుచిని పుట్టిస్తుంది. ఆకలిని కలిగిస్తుంది.**

తీసుకుని ఒక పొంగు వచ్చే వరకూ మరిగించండి.
- రెండూ బాగా చల్లారాక పంచదార పాకం పట్టిన ద్రవంలో ఈ పాలు పోసి, బాగా కలిసిపోయే దాకా కలపండి.
- ఇందులో జాజికాయ, జాపత్రి, ఏలకుల పొడి, జీడిపప్పు లాంటివి నేతిలో వేగించి కలిపి, చిటికెడంత పచ్చకర్పూరం కూడా చేరిస్తే చక్కటి నారింజ పాయసం తయారైనట్టే.
- ఆరెంజ్ మిల్క్ అని ఇంగ్లీషులో పిలిస్తే పిల్లలక్కూడా ఇది ఇష్టం అనిపిస్తుంది.

'విష్టంభిని హరేద్వాతం పిత్తం చ గురుపాచికా' అంటూ దీని గుణాల్ని వివరించాడు క్షేమశర్మ. ఇది వాతాన్ని, పైత్యాన్ని తగ్గిస్తుంది. ఆలస్యంగా అరుగుతుంది. మలబద్ధకం కలిగిస్తుంది. అందుకని జీర్ణశక్తిని అనుసరించి దీన్ని తీసుకోవాలన్నాడు.

పులుపు సరిపడని వారికి, సిట్రస్ ఫ్రూట్స్ తీసుకొంటే జలుబొచ్చేవారికీ ఇది అనుకూలంగా ఉంటుంది. జబ్బు పడి లేచిన వాళ్లకు ఏదీ తినబుద్ధిగా ఉండదు. అలాంటివాళ్లకి ఇది ఉపయోగపడవచ్చు. స్కూలు నుంచి ఇంటికి రాగానే పిల్లలకు ఇవ్వదగిన మంచి పానీయం ఇది. వేసవిలో దీన్ని ఫ్రిజ్జులో పెట్టుకుని చల్లగా తాగితే వడదెబ్బ తగలకుండా ఉంటుంది. దప్పిక తీరుతుంది.

మిల్క్‌షేక్ పద్ధతిలో చేసినదానికన్నా ఇలా పాక ప్రక్రియలో తయారు చేసిన 'క్షీర పాకం' లేదా పాయసం ఎక్కువ గుణవత్తరంగా ఉంటుంది. శాస్త్రీయమైంది కూడా. నిమ్మకాయతో తప్ప తక్కిన అన్ని తీపి, పులుపుగా ఉండే సిట్రస్ ఫలాలతో ఈ క్షీర పాకాన్ని తయారు చేసుకోవచ్చు. వేసవిని ఇలా సురక్షితంగా గడపండి.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

కొత్త రుచుల ఉగాది

వసంతంలో వచ్చే పండుగ 'ఉగాది'. షడ్రుచుల మేళవింపు ఇది. ఈ పండుగను మన తెలుగురాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వివిధ పేర్లతో చేసుకుంటారు. మన దగ్గర 'కొబ్బరి బూరెలు', మహారాష్ట్రలో 'సాబుదాన వడ', కర్ణాటకలో 'కోసంబి', తమిళనాట 'ఉక్కరై' వంటకాలను చేస్తారు. ఈ వంటలను సులువుగా ఈ ఉగాది పండుగనాడు మీరూ చేసుకోండిలా...



ఉక్కరై



సాబుదాన వడ

ఉక్కరై

కావాల్సిన పదార్థాలు

పెసరపప్పు- చిన్న గ్లాసు, తరిగిన బెల్లం- రెండు గ్లాసులు, నెయ్యి- అర గ్లాసు, జీడిపప్పు- 2 టేబుల్ స్పూన్లు, రవ్వ- పావు గ్లాసు, తరగిన పచ్చి కొబ్బరి- పావు గ్లాసు, యాలకుల పొడి- అర టీస్పూన్

తయారీ విధానం

పెసరపప్పును ప్యాన్‌లో వేసి దోరగా వేయించుకోవాలి. ఆ తర్వాత నీళ్లు పోసి బాగా కడగాలి. కడిగిన పెసరపప్పును కుక్కర్‌లో వేయాలి. ఇందులోకి రెండు చిన్న గ్లాసుల నీళ్లు పోయాలి. కుక్కర్ మూత పెట్టి మూడు విజిల్స్ వచ్చేంత వరకూ కుక్ చేయాలి. ఈ లోపు ఓ గిన్నెను స్టవ్‌మీద పెట్టి అందులో తరిగిన బెల్లం వేయాలి. పావు గ్లాసు నీళ్లు పోసి కలుపుతూ ఉడికించాలి. బెల్లం అంతా కరిగి పొంగులా వచ్చేంత వరకూ ఉడికించాలి.

కుక్కర్‌లో ఉడికిన పెసరపప్పును గరిటెతో గట్టిగా ఒత్తాలి. ఆ తర్వాత మరో ప్యాన్‌లో నెయ్యి వేసి అందులో జీడిపప్పులను దోరగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. మిగిలిన నెయ్యిలోనే రవ్వను వేయాలి. పొంగులా వస్తూ ఉడుకుతుంది. ముద్దగా లేకుండా స్పూన్‌తో కంటిన్యూగా కలియతిప్పుతూ ఉడికించాలి. రవ్వ రంగు మారిన తర్వాత పచ్చి కొబ్బరి వేసి గరిటెతో తిప్పుతూ మూడు నిముషాల పాటు వేయించాలి. అందులో పెసరపప్పు మిశ్రమాన్ని వేసి బాగా కలపాలి. ఆ తర్వాత బెల్లం నీళ్లను వడబోయాలి. కంటిన్యూగా గరిటెతో తిప్పుతూంటే ద్రవ పదార్థం పోయి మెత్తని చూర్ణంలా ఉడుకుపడుతుంది. పొంగినట్లు వస్తున్నప్పుడు రెండు నిముషాల పాటు గరిటెతో కలిపాక యాలకుల పొడి వేసి మూడు నిముషాల పాటు కంటిన్యూగా కలిపిన తర్వాత వేయించిన జీడిపప్పు వేసి కలపాలి. రెండు నిముషాల తర్వాత బౌల్‌లో వేసి కొద్దిగా చల్లార్చి తింటుంటే నోట్లో ఇట్టే కరిగిపోతుంది.

సాబుదాన వడ

కావాల్సిన పదార్థాలు

సగ్గుబియ్యం- 1 కప్పు, బంగాళదుంపలు- 2, వేయించిన పల్లీలు- అరకప్పు, అల్లం పేస్ట్- అర టీస్పూన్, జీలకర్ర- 1 టీస్పూన్, పచ్చిమిర్చి- 1 (సన్నగా తరగాలి), కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు (సన్నగా తరగాలి), ఉప్పు- తగినంత, నిమ్మరసం- 1 టీస్పూన్, నూనె- డీప్ ఫ్రైకి సరిపడ

తయారీ విధానం

బౌల్‌లో సగ్గుబియ్యం వేసి మంచి నీళ్లలో మూడు గంటల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత నీటిని తీసేసి సగ్గుబియ్యాన్ని అరగంట పాటు అలానే ఉంచాలి. ఈ లోపు బంగాళదుంపలను ఉడికించి మెత్తగా చూర్ణం చేసుకోవాలి. పల్లీలు మెత్తగా కాకుండా పలుకులుగా మిక్సీ పట్టుకుని పెట్టుకోవాలి. బౌల్ తీసుకుని అందులో సగ్గుబియ్యం, బంగాళదుంప మిశ్రమం, పల్లీల మిశ్రమం, అల్లం పేస్ట్, జీలకర్ర, పచ్చిమిర్చి, కొత్తిమీర, నిమ్మరసం, తగినంత ఉప్పు వేయాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలపాలి. చపాతీ పిండిలా మెత్తగా కలపాలి. ముద్దగా చేసుకోవాలి. వడల్లా ఒత్తుకుని డీప్ ఫ్రై చేసుకోవాలి. ఈ సాబుదాన వడలు పల్లీలు లేదా కొబ్బరి చట్నీతో తింటే రుచిగా ఉంటాయి.



కొబ్బరి బూరెలు

కొబరి బూరెలు


కావాల్సిన పదార్థాలు

మినపప్పు పిండి- 1 కప్పు, బియ్యం పిండి- ఒకటి ముప్పావు కప్పు, ఉప్పు- రుచికి సరిపడ, తరిగిన బెల్లం- ఒకటిన్నర కప్పు, తరిగిన పచ్చి కొబ్బరి- 3 కప్పులు, జీడిపప్పు- 10 (నెయ్యిలో వేయించుకోవాలి), యాలకుల పొడి- కొద్దిగా, నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం

బౌల్‌లో మినప్పప్పు పిండి, మూడు స్పూన్ల బియ్యం పిండిని పక్కన ఉంచి మిగిలిన బియ్యం పిండితో పాటు కొద్దిగా ఉప్పు వేసి కొద్ది కొద్దిగా నీళ్లు పోస్తూ కలపాలి. మరీ చిక్కగా కాకుండా మరీ గట్టిగా కాకుండా కలపాలి.

ఒక ప్యాన్‌లో బెల్లంతో పాటు కొబ్బరి మిశ్రమం వేసి గరిటెతో కలపాలి. ప్యాన్‌కు అంటుకున్నట్లు వచ్చేంత వరకూ కలిపాక జీడిపప్పు వేయాలి. ఈ మిశ్రమాన్ని కలుపుతూ పదిహేను నిముషాల దాకా వేయిస్తే మిశ్రమం రంగు మారుతుంది. ఇందులో పక్కన ఉంచిన బియ్యం పిండి వేసి బాగా కలిపాక.. యాలకుల పొడి వేసి కలపాలి. ఈ కొబ్బరి స్టఫ్‌ను చిన్న ఉండల్లా చేసుకుని పక్కనబెట్టుకోవాలి. ఇప్పుడు పక్కన ఉంచుకున్న మినప్పప్పు మిశ్రమంలో కొద్దిగా నీళ్లు పోసి దోశపిండిలా కలపాలి. ఆ తర్వాత ఈ స్టఫ్ ఉండల్ని ఆ మిశ్రమంలో బాగా కలిపి ఈ ముద్దను వేడి చేసిన నూనెలో డీప్ ఫ్రై చేసుకోవటమే. ఈ కొబ్బరి బూరెలు క్రిస్పీగా ఉంటాయి. ఎంతో రుచిగా ఉంటాయి.



కోసంబరి

కోసంబరి

కావాల్సిన పదార్థాలు

పెసరపప్పు- పావు కప్పు, తరిగిన కీరా- ముప్పావు కప్పు, తరిగిన క్యారెట్- అరకప్పు, పచ్చిమిర్చి- 1 (సన్నగా తరగాలి), తరిగిన పచ్చి కొబ్బరి- పావుకప్పు, తరిగిన కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి తగినంత, బ్లాక్ పెప్పర్- పావు టీస్పూన్, నూనె- 1 టీస్పూన్, ఆవాలు- అరటీస్పూన్, కరివేపాకు- పది ఆకులు, ఎండుమిర్చి- 2, ఇంగువ- కొద్దిగా, వేయించిన పల్లీలు- 2 టేబుల్ స్పూన్లు,

తయారీ విధానం

బౌల్‌లో పెసరపప్పు వేసి మంచి నీళ్లు పోయాలి. గంటన్నరపాటు నానబెట్టాలి. ఆ తర్వాత నీళ్లను వడగట్టాలి. బౌల్‌లో నానబెట్టిన పెసరపప్పుతో పాటు తరిగిన కీరా, తరిగిన క్యారెట్, పచ్చిమిర్చి ముక్కలు, తరిగిన కొబ్బెర, కొత్తిమీర, బ్లాక్ పెప్పర్‌తో పాటు రుచికి తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి.

ప్యాన్‌మీద నూనె వేసి ఆవాలు, కరివేపాకుతో పాటు ఇంగువ, ఎండుమిర్చి తుంచి వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని స్పూన్‌తో కలపాలి. ఆ తర్వాత ఈ పోపును బౌల్‌లో ఉండే పెసరపప్పు మిశ్రమంలోకి వేసి కలపాలి. వేయించిన పల్లీలు వేసిన తర్వాత సర్వ్ చేసుకుని తినటమే తరువాయి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Pd13VZY లో చదవండి.

విన్నర్



రోల్‌మోడలే మెచ్చేలా..!

బ్యాటింగ్ మాస్ట్రో కింగ్ కోహ్లీని ఆరాధించింది. 'రాయల్ చాలెంజర్స్ బెంగళూరు' ఐపీఎల్ జట్టుకు వీరాభిమానిగా మారింది. పదేళ్లు తిరిగే సరికి... ఆ అమ్మాయే ఆర్సీబీ 'కప్' కల నెరవేర్చింది. నాడు స్టాండ్స్‌లో కేరింతలు కొట్టిన క్రేజీ గర్ల్... నేడు అదే జట్టు డగౌట్‌లో కూర్చొని ఆటను ఆస్వాదిస్తోంది. తన ఆరాధ్య క్రికెటర్ ప్రశంసలు... ఆల్‌రౌండర్‌గా జాతీయ జట్టు నుంచి పిలుపు... భారత మహిళ క్రికెట్‌లో యువ సంచలనం శ్రేయాంకా పాటిల్ విజయ యాత్ర ఇది.

పదిహేనేళ్ల ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) చరిత్రలో ఒక్కటంటే ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేదు 'రాయల్ చాలెంజర్స్ బెంగళూరు' (ఆర్సీబీ) జట్టు. విరాట్ కోహ్లీ లాంటి దిగ్గజ ఆటగాళ్లున్నా... ఇన్నేళ్లుగా ఆ జట్టు కల... కలగానే మిగిలిపోయింది. కానీ ఆ లోటును ఆర్సీబీ మహిళల క్రికెట్ జట్టు తీర్చింది. కప్పు కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన ఆ ఫ్రాంచైజీకి డబ్ల్యూపీఎల్ ట్రోఫీని అందించి అంతులేని ఆనందాన్ని ఇచ్చింది స్మృతి మందాన సారథ్యంలోని మహిళల జట్టు. ఆ విజయంలో కీలక పాత్ర పోషించింది... యువ ఆల్‌రౌండర్ శ్రేయాంకా పాటిల్. విశేషమేమంటే 'ఆర్సీబీ'లో బెంగళూరుకు చెందిన ఏకైక క్రికెటర్ శ్రేయాంకనే. గత నెలలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఫైనల్స్‌లో పన్నెండు పరుగులకే నాలుగు వికెట్లు పడగొట్టి ఆటను మలుపు తిప్పిన ఆమె... ఆర్సీబీ గెలుపును ఖరారు చేసింది. అంతేకాదు... మొత్తం ఎనిమిది మ్యాచుల్లో 13 వికెట్లతో టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా 'పర్పుల్ క్యాప్' గెలుచుకుంది. 'ఎమర్జింగ్ ప్లేయర్' అవార్డు కూడా దక్కించుకుంది.

పేసర్‌గా మొదలుపెట్టి...

కర్ణాటక బెంగళూరులో పుట్టిన శ్రేయాంక... అక్కడి ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదువుకుంది. ఎనిమిదేళ్లకే క్రికెట్ బ్యాట్ పట్టింది. ఆమె తండ్రి రాజేష్ పాటిల్‌కు క్రికెట్ అకాడమీ ఉంది. 'నేను ఆట మొదలుపెట్టేటప్పటికీ క్రికెట్ అంటే ఏంటో నాకు తెలియదు. మా నాన్నకు అకాడమీ ఉన్నా నాకు నెట్స్‌లో ఆడే అవకాశం ఏ రోజూ రాలేదు. దాంతో బంతి వేలాడదీసి (హ్యాంగింగ్ బాల్) బ్యాట్‌తో కొడుతుండేదాన్ని. లేదంటే ఫీల్డింగ్ చేసేదాన్ని. రోజూ ఇదే నా పని. అందుకే నాకు ఫీల్డింగ్ అంటే చాలా ఇష్టం. అప్పటికి బ్యాటింగ్ అనేది అసలు నా ఆలోచనల్లోనే లేదు. పేసర్‌గా మొదలుపెట్టాను. తరువాత లెగ్‌స్పిన్నర్‌గా మారాను. ఏదీ ఫలితం ఇవ్వలేదు. కొన్ని రోజులు వికెట్ కీపింగ్ చేశాను. అదీ అవ్వలేదు. ఇక చివరగా ఆఫ్‌స్పిన్ ప్రయత్నిస్తే... బాగా కుదిరింది' అంటూ చిన్ననాటి రోజులు గుర్తు చేసుకున్న శ్రేయాంక... కర్ణాటక అండర్-16 జట్టు ఎంపికకు సరిగ్గా వారం రోజుల ముందు ఆఫ్‌స్పిన్నర్‌గా మారింది. దానివల్లే రాష్ట్ర జట్టులో ఆమెకు చోటు దక్కింది.

ఒత్తిడిలో ఆటను ఆస్వాదిస్తా...

"అలా 2019లో పుదుచ్చేరితో తొలి మ్యాచ్ ఆడాను. ఒక వికెట్ తీశాను. అదే సమయంలో మా కోచ్ అర్జున్... 'నీలో ఎంతో ప్రతిభ ఉంది. బ్యాటింగ్ మీద కూడా దృష్టి పెట్టు' అన్నారు. క్రమంగా బ్యాటింగ్‌లో పట్టు సాధిస్తుంటే ఎంతో అద్భుతంగా అనిపించింది. కర్ణాటక జట్టులో నాలుగు, ఐదు స్థానాల్లో బ్యాటింగ్ చేసే అవకాశం లభించింది. అది నా ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది. ఇప్పుడు మీరందరూ చూస్తున్నారు కదా... భారత మహిళ జట్టులో ఫినిషర్‌గా నా పాత్రను! ఆ స్థానంలో బ్యాటింగ్‌ను ఎంతో ఆస్వాదిస్తున్నాను. అంతేకాదు... డెత్ ఓవర్లలో బౌలింగ్ చేయడానికి మొగ్గు చూపుతాను. ఎందుకంటే... ఒత్తిడిలో ఆడడం నాకు చాలా ఇష్టం. ఆస్ట్రేలియా క్రికెటర్ గ్రేస్ హారిస్ ఆట చూస్తుంటే ముచ్చటేస్తుంది. ప్రతి షాట్‌నూ ఆమె ఆస్వాదిస్తుంది. నా సూత్రం కూడా అదే... మన ఆటను మనం ఆస్వాదించాలి. లేదంటే క్రికెట్ ఆడడంలో అర్థమే లేదనేది నా అభిప్రాయం. అందుకే బ్యాటింగ్‌కు వెళ్లినా... బౌలింగ్‌కు వేసినా... నిర్భయంగా నా ఆట నేను ఆడేస్తుంటా" అంటుంది శ్రేయాంక.

ఆర్సీబీ అభిమాని నుంచి...

క్రికెట్‌లో ఓనమాలు దిద్దే రోజుల నుంచి శ్రేయాంక ఆరాధ్య క్రికెటర్... బ్యాటింగ్ దిగ్గజం విరాట్ కోహ్లీ. అతడిని చూస్తూనే ఆటపై మక్కువ పెంచుకుంది. అతడి ఆటను ఆస్వాదిస్తూ... అతడి స్ఫూర్తితో కఠోర సాధన చేసింది. 'కోహ్లీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్సీబీ అంటే నాకు చచ్చేంత ఇష్టం. బెంగళూరులో ఆ జట్టు ఆడిన ప్రతి మ్యాచ్‌కూ వెళ్లేదాన్ని. అలాంటిది ఇవాళ నేను అదే జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నానంటే ఎంతో గర్వంగా, అద్భుతంగా అనిపిస్తోంది. నాడు గ్యాలరీ నుంచి ఆటను ఆస్వాదించిన అమ్మాయి... నేడు ఆ జట్టు డగౌట్‌లో కూర్చొని ఆటలో భాగం కావడం, ఆర్సీబీ డబ్ల్యూపీఎల్ చాంపియన్‌గా అవతరించడంలో కీలక పాత్ర పోషించడం కలలా ఉంది. ఫీల్డింగ్‌లో బౌండరీ లైన్ దగ్గరకు వెళ్లినప్పుడు ప్రేక్షకులు 'శ్రేయాంక' అంటూ అరుస్తుంటే... ఎలా స్పందించాలో కూడా అర్థంకాలేదు. ఎందుకంటే అలాంటి పరిస్థితి నేను ఎప్పుడూ ఊహించలేదు. అవన్నీ తలుచుకొంటే నా మనసు ఉప్పొంగుతుంది' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది 21 ఏళ్ల శ్రేయాంక. మైదానంలో ఎంత చురుగ్గా ఉంటుందో... బయట ఆమె అంతే ఫ్యాషన్‌గా కనిపిస్తుంది. విభిన్న డ్రెస్సుల్లో, ట్రెండీ లుక్స్‌తో ఇన్‌స్టాలో ఎప్పటికప్పుడు అభిమానులను అలరిస్తుంటుంది.

డబుల్ ధమాకా...

దేశవాళీ క్రికెట్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్న శ్రేయాంకకు వెంటనే ఇండి-ఎ జట్టు నుంచి పిలుపు వచ్చింది. గత ఏడాది జూన్‌లో జరిగిన ఏసీసీ ఉమెన్స్ ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో భారత-ఎ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఆ టోర్నీలో తొమ్మిది వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచింది. అదే ఏడాది డిసెంబర్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత జట్టుకు ఎంపికైంది. ఆ వెంటనే ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో చోటు దక్కించుకుంది. అలా అద్భుతమైన ప్రదర్శనతో ఒకే నెలలో అటు టీ20లు, ఇటు వన్డేల్లో అరంగేట్రం చేసి డబుల్ ధమాకా కొట్టింది శ్రేయాంక. అనంతరం 'ఉమెన్స్ కరేబియన్ ప్రీమియర్ లీగ్'లో 'గయానా అమెజాన్ వారియర్స్' జట్టు తరుపున ఆడింది. అందులోనూ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించిన శ్రేయాంక పాటిల్... రాబోయే రోజుల్లో భారత మహిళల జట్టుకు వెన్నెముక అవుతుందనేది క్రికెట్ పండితుల మాట.

కోహ్లీ కలిసిన వేళ...

డబ్లూపీఎల్ ఫైనల్స్‌లో ఆర్సీబీ విజయం తరువాత శ్రేయాంక అద్భుత ప్రదర్శనను విరాట్ కొనియాడాడు. 'హాయ్ శ్రేయాంక... వెల్ బౌల్డ్' అంటూ ఆమెకు సందేశం పంపాడు. అది చూసి శ్రేయాంక ఆనందంతో ఎగిరి గంతేసింది. 'విరాట్‌కు నా పేరు తెలుసు' అంటూ ఎంతో భావోద్వేగానికి లోనైంది. ట్రోఫీ గెలుచుకున్నాక ఫ్రాంచైజీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన 'ఆర్సీబీ అన్‌బాక్స్ 2024' ఈవెంట్‌లో భాగంగా విరాట్ స్వయంగా వచ్చి శ్రేయాంక పక్కన నిలుచున్నాడు. ఊహించని ఆ ఘటనతో ఆమె నోట మాట రాలేదు. 'విరాట్ వల్లే క్రికెట్ చూడడం మొదలుపెట్టాను. అతడి స్ఫూర్తితో బ్యాట్ పట్టాను. అతనిలా ఎదగాలని కలలు కన్నాను. ఇవాళ... నా పక్కన కోహ్లీనే వచ్చిన నిలుచున్నాడు. నిజంగా నా జీవితంలోనే అత్యద్భుతమైన సందర్భం ఇది' అంటూ సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయింది శ్రేయాంక.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	మోహిత్ శర్మ (గుజరాత్)
203 పరుగులు	7 వికెట్లు






సాత్విక్, చిరాగ్ జోడీకి రాష్ట్రపతి అభినందనలు

అమలాపురం టౌన్: కొన్నాళ్లుగా అంతర్జాతీయస్థాయిలో అద్భుత విజయాలు సాధిస్తున్న బ్యాడ్మింటన్ స్టార్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. రాష్ట్రపతి కార్యాలయం నుంచి పిలుపు రావడంతో అమలాపురానికి చెందిన సాత్విక్ సాయిరాజ్, ముంబై కుర్రాడైన చిరాగ్ శెట్టి తమ కుటుంబసభ్యులతో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా షట్లర్లను ప్రత్యేకంగా అభినందించిన రాష్ట్రపతి ముర్ము.. వారి కుటుంబసభ్యులతో కలిసి అల్పాహార విందులో పాల్గొన్నారు.

మ్యాచ్‌లకు ఎంత వాడుతున్నారు?

▸ చిన్నస్వామిలో నీటి సరఫరాపై ఎన్జీటీ దృష్టి

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ప్రస్తుతం తీవ్ర నీటి ఎద్దడి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక చిన్నస్వామి స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్‌ల కోసం నీటి సరఫరాపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) దృష్టి సారించింది. వీటి కోసం ఎంత నీరు వినియోగిస్తున్నారనే విషయం తమకు తెలపాలని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ)తో పాటు సంబంధిత శాఖలను ఆదేశించింది. ఇందుకు మే 2 వరకు గడువు విధించింది. తాము ఆ నోటీసులను చదివామని, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగానే నడుచుకుంటున్నట్టు కేఎస్‌సీఏ సీఈవో సుబేందు ఘోష్ తెలిపాడు. ఇప్పటికే ఇక్కడ మూడు మ్యాచ్‌లు జరగ్గా.. ప్రతీ మ్యాచ్‌కు 75వేల లీటర్ల మంచి నీటిని వాడినట్టు ఆరోపణలు రావడంతో ఎన్జీటీ సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టింది.

తొలి రౌండ్‌లో అందరికీ డ్రా

క్యాండిడేట్స్ చెస్

టొరొంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ పురుషుల విభాగంలో తొలి రౌండ్‌ను భారత ఆటగాళ్లంతా డ్రా చేసుకున్నారు. అలాగే మహిళల కేటగిరీలో పరస్పరం తలపడిన కోనేరు హంపి-వైశాలి కూడా చెరో అర పాయింటుతో సరిపెట్టారు. ఫ్రాన్స్‌కు చెందిన ఫిరౌజా అలీరెజాతో నల్లపావులతో రుయ్ లోపెజ్ ఓపెనింగ్‌తో తలపడిన గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద 39 ఎత్తుల్లో డ్రాగా ముగించాడు. ఇక..గుకేష్-విదిత్ గుజ్‌రాతీ మధ్య తొలి రౌండ్ 21 ఎత్తుల్లో ఫలితం తేలకుండా ముగిసింది. మహిళల్లో కోనేరు హంపిని 41 ఎత్తుల్లో వైశాలి నిలువరించింది.

నాడు వద్దనుకున్నోడే.. నేడు కీలకమయ్యాడు!



న్యూఢిల్లీ: గత ఏడాది డిసెంబరు 19న జరిగిన ఐపీఎల్ వేలంలో ఛత్తీస్‌గఢ్ క్రికెటర్ శశాంక్ సింగ్‌ను పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేసిన సందర్భంలో పెద్ద గందరగోళం ఏర్పడింది. శశాంక్ పేరుతో ఇద్దరు వేలంలో నిలిచారు. శశాంక్‌ను పీబీకేఎస్ సొంతం చేసుకున్నట్టు ఆక్షనీర్ మల్లికా సాగర్ ప్రకటించింది. కానీ తాము కొనుగోలు చేసింది ఈ శశాంక్‌ను కాదని మరో శశాంక్‌నని ఫ్రాంచైజీ యజమానురాలు ప్రీతి జింతా, నెస్ వాడియా..ఆక్షనీర్ మల్లికా సాగర్‌తో వాదించారు. వారి వాదనను మల్లిక తోసిపుచ్చడంతో ప్రీతి, వాడియా నిరాశ చెందినట్టు కనిపించారు. ఇక..అన్‌క్యాప్డ్ ఆటగాడు శశాంక్‌ను తీసుకోవడం అస్సలు ఇష్టంలేదంటూ ఫ్రాంచైజీ ఓనర్లను క్రికెట్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేశారు. ఇక సీన్ కట్ చేస్తే..అదే శశాంక్ సింగే ఆకాశమే హద్దుగా చెలరేగి గుజరాత్‌పై పంజాబ్‌కు నమ్మశక్యంకాని విజయం అందించాడు. ఈనేపథ్యంలో ప్రీతి జింటా శశాంక్‌పై ప్రశంసల జడివాన కురిపించింది. 'శశాంక్ అందరిలాంటివాడు కాదు. అతడు మా జట్టుకు చాలా స్పెషల్. శశాంక్ పాజిటివ్ దృక్పథం, అంతులేని ఆత్మవిశ్వాసం ఎంతో నచ్చుతుంది. తనపై వచ్చిన వ్యాఖ్యలను, జోక్‌లను అతడు ఎంతో క్రీడా స్ఫూర్తితో తీసుకున్నాడు' అని చెప్పుకొచ్చింది.

ఉప్పల్‌లో తగ్గేదేలె..

రాణించిన బౌలర్లు । అదరగొట్టిన అభిషేక్, మార్‌క్రమ్ । చెన్నైపై సన్‌రైజర్స్ విజయం


మార్‌క్రమ్ (36 బంతుల్లో 50)


అభిషేక్ (12 బంతుల్లో 37)

హైదరాబాద్: క్రితం మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ఉప్పల్‌లో పరుగుల సునామీ సృష్టించగా.. ఈసారి బౌలర్లు మెరిశారు. సమష్టి రాణింపుతో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ స్వల్ప స్కోరుకే కట్టడి చేశారు. ఆ తర్వాత బ్యాటింగ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ (12 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 37) మెరుపు ఆరంభం ఇవ్వగా.. మధ్య ఓవర్లలో మార్‌క్రమ్ (36 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 50) చెలరేగాడు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లకు 165 పరుగులు చేసింది. శివమ్ దూబే (24 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 45), రహానె (30 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 35), జడేజా (23 బంతుల్లో 4 ఫోర్లతో 31 నాటౌట్) పర్వాలేదనిపించారు. ఆ తర్వాత ఛేదనలో హైదరాబాద్ 18.1 ఓవర్లలో 4 వికెట్లకు 166 పరుగులు చేసి గెలిచింది. ట్రావిస్ హెడ్ (31) రాణించాడు. మొయిన్ అలీకి రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు.

మెరుపు వేగంతో..: ఓ మాదిరి ఛేదన కోసం బరిలోకి దిగిన హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్ అభిషేక్ శర్మ టాప్‌గేర్‌లో తీసుకెళ్లాడు. అటు తమ కీలక పేసర్లు ముస్తాఫిజుర్, పతిరన లేకుండానే బరిలోకి దిగిన చెన్నై బౌలింగ్ బలహీనంగా కనిపించింది. దీంతో పవర్‌ప్లేలో 78 పరుగులతో ఎస్‌ఆర్‌హెచ్ మ్యాచ్ ఫలితాన్ని శాసించింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ హెడ్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో మొయిన్ అలీ అందుకోలేకపోయాడు. ఇక రెండో ఓవర్‌లో శివాలెత్తిన అభిషేక్ 4,6,6,6,4తో 27 పరుగులతో అదరగొట్టాడు. అయితే మూడో ఓవర్‌లో అతడిని చాహర్ అవుట్ చేయగా తొలి వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. హెడ్, మార్‌క్రమ్ పోటాపోటీ బౌండరీలతో కదం తొక్కారు. పవర్‌ప్లే అయ్యాక స్పిన్నర్లు ప్రభావం చూపడంతో పరుగుల వేగం కాస్త తగ్గింది. పదో ఓవర్‌లో హెడ్‌ను జడేజా అవుట్ చేసి రెండో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. 11-15 ఓవర్ల మధ్య ఒక్క ఫోర్ కూడా రాకపోవడంతో మ్యాచ్‌లో ఉత్కంఠ నెలకొంది. ఫిఫ్టీ పూర్తి చేసిన మార్‌క్రమ్‌ను, షాబాజ్ (18)ను మొయిన్ అలీ వరుస ఓవర్లలో అవుట్ చేశాడు. ఈ స్థితిలో గెలుపు సమీకరణం 26 బంతుల్లో 25 రన్స్‌కి మారింది. కానీ క్లాసెన్ (10 నాటౌట్), తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ (14 నాటౌట్) చెరో ఫోర్‌తో తేలిక చేశారు. అలాగే 19వ ఓవర్ తొలి బంతికే చక్కటి సిక్సర్‌తో నితీశ్ మ్యాచ్‌ను ముగించాడు.

సీఎస్‌కే తడ'బ్యాటు': టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఆట నిదానంగా సాగింది. క్రితం మ్యాచ్‌లో 500కు పైగా పరుగులు నమోదైన పిచ్ కాకుండా.. ఈ మ్యాచ్ ఇతర పిచ్‌పై సాగింది. ఈ స్లో పిచ్‌పై బ్యాటర్లు పరుగుల కోసం ఇబ్బందిపడ్డారు. శివమ్ దూబే ఒక్కడే స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. తొలి ఓవర్‌నే స్పిన్నర్ అభిషేక్‌తో వేయించగా.. పేసర్ భువనేశ్వర్ ఈసారి లైన్ అండ్ లెంగ్త్ బాల్స్‌తో కట్టడి చేశాడు. దీంతో ఓపెనర్ రచిన్ రవీంద్ర (12) నాలుగో ఓవర్‌లోనే భువీకి చిక్కాడు. అయితే ఐదో ఓవర్‌లో రహానె సిక్సర్.. ఆరో ఓవర్‌లో రుతురాజ్ 4,6తో పవర్‌ప్లేలో జట్టు స్కోరు 48కి చేరింది. ఇక షాబాజ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు వెళ్లిన రుతురాజ్ లాంగాన్‌లో క్యాచ్ ఇచ్చాడు. శివమ్ దూబే మాత్రం అదే ఓవర్‌లో 6,4తో జోరు చూపాడు. అలాగే స్పిన్నర్ మార్కండే ఓవర్‌లోనూ 4,6తో 15 రన్స్ రాబట్టాడు. కానీ మధ్య ఓవర్లలో పేసర్లు కమిన్స్, ఉనాద్కట్ పరుగులను కట్టడి చేశారు. రహానె హిట్టింగ్ చేయలేకపోయాడు. అటు నటరాజన్‌ను లక్ష్యంగా చేసుకుని దూబే రెండు వరుస సిక్సర్లు బాది 12వ ఓవర్‌లో స్కోరును వంద దాటించాడు. ఈ జోరు ఎక్కువసేపు కొనసాగకుండా దూబేను కమిన్స్ వెనక్కిపంపగా, తర్వాతి ఓవర్‌లోనే రహానెను ఉనాద్కట్ అవుట్ చేశాడు. దీంతో మూడో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక జడేజా-మిచెల్ క్రీజులో ఉన్నా తక్కువ ఎత్తులో వచ్చిన బంతులను ఆడేందుకు వీరు ఇబ్బంది పడ్డారు. దీంతో 14-17 ఓవర్ల మధ్య రెండు ఫోర్లు మాత్రమే వచ్చాయి. 18వ ఓవర్‌లో చెరో ఫోర్‌తో 13 రన్స్ రాగా.. ఇక చివరి రెండు ఓవర్లలోనూ జట్టు పరుగులు రాబట్టలేకపోయింది. ఆఖరి ఓవర్‌లో మూడో బంతికి డారిల్ మిచెల్ (13) వెనుదిరగగా.. ఉప్పల్‌లో అభిమానుల జోష్ మధ్య ధోనీ (1 నాటౌట్) మూడు బంతుల కోసం బరిలోకి దిగాడు. కానీ పేసర్ నటరాజన్ స్లో బంతులకు ధోనీ భారీ షాట్లు ఆడలేకపోయాడు. ఆఖరి బంతిని జడేజా ఫోర్‌గా మలచడంతో ఏడు పరుగులు లభించాయి.

నేటి మ్యాచ్
రాజస్థాన్ x బెంగళూరు
రా.7.30 నుంచి

స్కోరుబోర్డు

చెన్నై: రచిన్ (సి) మార్‌క్రమ్ (బి) భువనేశ్వర్ 12, రుతురాజ్ (సి) సమద్ (బి) షాబాజ్ 26, రహానె (సి) మార్కండే (బి) ఉనాద్కట్ 35, దూబే (సి) భువనేశ్వర్ (బి) కమిన్స్ 45, జడేజా (నాటౌట్) 31, మిచెల్ (సి) సమద్ (బి) నటరాజన్ 13, ధోనీ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 165/5; వికెట్ల పతనం:** 1/25, 2/54, 3/119, 4/127, 5/160; **బౌలింగ్:** అభిషేక్ 1-0-7-0, భువనేశ్వర్ 4-0-28-1, నటరాజన్ 4-0-39-1, కమిన్స్ 4-0-29-1, మయాంక్ మార్కండే 2-0-21-0, షాబాజ్ అహ్మద్ 1-0-11-1, ఉనాద్కట్ 4-0-29-1

హైదరాబాద్: హెడ్ (సి) రచిన్ (బి) తీక్షణ 31, అభిషేక్ (సి) జడేజా (బి) దీపక్ 37, మార్‌క్రమ్ (ఎల్బీ) మొయిన్ 50, షాబాజ్ (ఎల్బీ) మొయిన్ 18, క్లాసెన్ (నాటౌట్) 10, నితీశ్ (నాటౌట్) 14, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.1 ఓవర్లలో 166/4; వికెట్ల పతనం:** 1/46, 2/106, 3/132, 4/141; **బౌలింగ్:** దీపక్ చాహర్ 3.1-0-32-1, ముకేశ్ చౌదరి 1-0-27-0, తీక్షణ 4-0-27-1, తుషార్ 2-0-20-0, జడేజా 4-0-30-0, మొయిన్ అలీ 3-0-23-2, రచిన్ 1-0-3-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	3	3	0	0	6	2.518
రాజస్థాన్	3	3	0	0	6	1.249
చెన్నై	4	2	2	0	4	0.517
లఖ్‌నవూ	3	2	1	0	4	0.483
హైదరాబాద్	4	2	2	0	4	0.409
పంజాబ్	4	2	2	0	4	-0.220
గుజరాత్	4	2	2	0	4	-0.580
బెంగళూరు	4	1	3	0	2	-0.876
ఢిల్లీ	4	1	3	0	2	-1.347
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

మరిన్ని మ్యాచ్‌లకు కుల్దీప్ దూరం!

ముంబై: ఢిల్లీ క్యాపిటల్స్‌కు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ గజ్జల్లో నొప్పి కారణంగా విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 29 ఏళ్ల కుల్దీప్..రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్ తర్వాతి నుంచి ఈ నొప్పితో బాధపడుతున్నాడు. దాంతో తదుపరి రెండు మ్యాచ్‌లకూ యాదవ్ దూరమయ్యాడు. నొప్పి నుంచి కోలుకొని మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించేందుకు కుల్దీప్‌కు చాలా సమయం పట్టేలా ఉందని ఐపీఎల్ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి.


ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా శుక్రవారం గుజరాత్‌లోని సోమ్‌నాథ్ ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేశాడు.

సెమీస్‌లో బాలాజీ జోడీ

హూస్టన్ (యూఎస్): భారత టెన్నిస్ ఆటగాడు శ్రీరామ్ బాలాజీ ఏటీపీ హూస్టన్ ఓపెన్‌లో పురుషుల డబుల్స్ టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. జర్మనీకి చెందిన ఆంద్రీ బెగెమాన్‌తో కలిసి డబుల్స్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. క్వార్టర్స్‌లో బాలాజీ జంట 6-0, 6-3తో భారత్‌కే చెందిన అర్జున్/జీవన్ జోడీని చిత్తుచేసింది.



బిగ్ సీ ఉగాది ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ సీ ఉగాది పండగ సందర్భంగా వినియోగదారులకు వినూత్న ఆఫర్లు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉగాది పండగను పురస్కరించుకుని మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఎయిర్ కండీషనర్స్ కొనుగోలుపై ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించినట్లు బిగ్ సీ సీఎండీ యం బాలు చౌదరి వెల్లడించారు. ఈ ఉత్పత్తుల కొనుగోలుపై 7.5% వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌తో పాటు ఒక ఏడాది మొబైల్ ప్రొటెక్షన్ చెల్లింపుతో రెండో ఏడాది రూ.8,000 వరకు మొబైల్ ప్రొటెక్షన్‌ను అదనంగా పొందవచ్చన్నారు. అంతేకాకుండా ప్రతి మొబైల్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతిను కూడా అందించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ వాయిదా పద్ధతిలో మొబైల్స్, స్మార్ట్ టీవీ కొనుగోలు చేయవచ్చన్నారు. బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51% వరకు డిస్కౌంట్‌తో పాటు బజాజ్ ఫైనాన్స్ ద్వారా చేసే కొనుగోలుపై రూ.4,000 వరకు ఇన్‌స్టంట్ క్యాష్ బ్యాక్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పండగను పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లను ప్రకటించటం బిగ్ సీ ఆనవాయితీ అని ఈ సందర్భంగా బాలు చౌదరి తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,980 ▼	64,150 ▼	85,000 ▼
ముంబై	69,882 ▼	64,012 ▼	79,096 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ

హైదరాబాద్	375	విజయవాడ	403
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	403	వరంగల్	377
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్


హైదరాబాద్	154	గోదావరి	150
వరంగల్	154	విజయవాడ	150
కరీంనగర్	154	గుంటూరు	150
మహబూబ్‌నగర్	154	ఒంగోలు	150
కర్నూలు	154	చిత్తూరు	145
విశాఖపట్నం	129		

ఏడోసారీ అవే రేట్లు

రెపో రేటు మళ్లీ యథాతథం

2024-25 వృద్ధి, ద్రవ్యోల్బణ అంచనాల్లోనూ మార్పులేదు..

ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ



ముంబై: ఈ నెల 1 నుంచి ప్రారంభమైన కొత్త ఆర్థిక సంవత్సరం (2024-25)లో నిర్వహించిన తొలి ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం ప్రకటించింది. బ్యాంక్ రుణాలకు ప్రామాణికమైన కీలక వడ్డీ (రెపో) రేటును వరుసగా ఏడోసారీ యథాతథంగా కొనసాగించింది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీరేట్లు, ఈఎంఐలు మరికొంత కాలం స్థిరంగా కొనసాగనున్నాయి. "స్థూల ఆర్థికాంశాలు, పరిణామాలతో పాటు భవిష్యత్ ముఖచిత్రాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం 6.50 శాతంగా ఉన్న రెపో రేటును యథాతథంగా కొనసాగించాలని మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయించింది. ఎంపీసీలోని ఆరుగురు సభ్యుల్లో ఈ నిర్ణయానికి మద్దతుగా ఐదుగురు ఓటేయగా.. ఒకరు విబేధించారు. ఆర్థిక వృద్ధికి మద్దతిస్తూనే లక్ష్యానికి అనుగుణంగా ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు వడ్డీ రేట్లపై సర్దుబాటు ధోరణిని క్రమంగా ఉపసంహరించుకోవడంపై ఎంపీసీ దృష్టి కొనసాగించనుంది"ని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గతంలో ప్రకటించిన 7 శాతం వృద్ధి రేటు, 4.5 శాతం ద్రవ్యోల్బణం అంచనాలనూ ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగించింది. ద్రవ్యల్బణం, వృద్ధికి సంబంధించి దాస్ ఏమన్నారంటే..

ఈసారి సాధారణ వర్షపాతం నమోదుకానుందన్న అంచనాల నేపథ్యంలో ద్రవ్యోల్బణం అంచనాను యథాతథంగా కొనసాగిస్తున్నాం. ఈ మధ్య ప్రభుత్వం వంటగ్యాస్‌తోపాటు పెట్రోల్, డీజిల్ ధరలను స్వల్పంగా తగ్గించడం ధరల సూచీ దిగివచ్చేందుకు దోహదపడనుంది. అయితే, గడిచిన కొన్ని రోజుల్లో అంతర్జాతీయ గణనీయంగా పెరిగిన ముడి చమురు ధరల తీరుతెన్నును నిశితంగా గమనించాల్సి ఉంది.

ఆహార ధరల్లో అస్థిరతలు మున్ముందు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపనున్నాయి. ఈ ఏప్రిల్-జూన్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే అధికంగా నమోదు కానున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో పప్పు దినుసుల గిరాకీ-సరఫరా పరిస్థితితో పాటు ఈసారి వడగాలులు అధికంగా ఉండనున్న కారణంగా కూరగాయల ఉత్పత్తిని నిశితంగా గమనించాల్సి ఉంది.

వరుసగా నాలుగో ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి రేటు 7 శాతం, అంతకు పైగా వృద్ధి నమోదు కానుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో వృద్ధి రేటు 7.6 శాతంగా ఉండనుందని అంచనా.

812 టన్నులకు బంగారం నిల్వలు

విదేశీ మారక (ఫారెక్స్) నిల్వల విస్తరణ వ్యూహంలో భాగంగా బంగారం నిల్వలను పెంచుతున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. అధికారిక డేటా ప్రకారం.. ఈ మార్చి నాటికి ఫారెక్స్ నిల్వల్లోని బంగారం విలువ 5,148.7 కోట్ల డాలర్లకు చేరుకుంది. 2023 మార్చి నాటితో పోలిస్తే మరో 628.7 కోట్ల డాలర్ల మేర పెరిగింది. ఈ జనవరిలో ఆర్‌బీఐ 8.7 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. గడిచిన రెండేళ్లలో ఇదే అత్యధిక కొనుగోలు. ఈ జనవరి చివరినాటికి ఆర్‌బీఐ వద్దనున్న బంగారం నిల్వలు 812.3 టన్నులకు పెరిగాయి.

ప్రభుత్వ బాండ్ల కొనుగోలుకు మొబైల్ యాప్

రిటైల్ మదుపరులు ప్రభుత్వ సెక్యూరిటీస్(జీ-సెక్) లేదా ప్రభుత్వ బాండ్ల క్రయ, విక్రయాలు జరిపేందుకు వీలుగా ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. వ్యక్తిగత ఇన్వెస్టర్లు ఆర్‌బీఐ వద్ద గిల్ట్ అకౌంట్ల నిర్వహణ, ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా 2021 నవంబరులో ఆర్‌బీఐ రిటైల్ డైరెక్ట్ స్కీమ్‌ను ప్రారంభించింది.

యూపీఐ ద్వారా ఏటీఎంలో నగదు జమ

యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా చెల్లింపులు మన దైనందిక జీవితంలో భాగంగా మారిపోయాయి. అయితే, మనం చాలావరకు ఏదైనా షాపులో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు జరిపేందుకు లేదా ఎవరికైనా నగదు బదిలీ చేసేందుకు యూపీఐ సేవలను వినియోగించుకుంటున్నాం. గడిచిన కొన్నేళ్లలో యూపీఐ సేవల పరిధి విస్తృతమవుతూ వచ్చింది. ఇప్పుడు చెల్లింపులే కాదు.. యూపీఐ ద్వారా ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా చేసుకునే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇక యూపీఐ యాప్ ద్వారా ఏటీఎం లేదా బ్యాంక్‌ల క్యాష్ డిపాజిట్ మెషీన్ (సీడీఎం)లో నగదు జమ చేసే వసతి కూడా అందుబాటులోకి రాబోతోంది. ప్రస్తుతం డెబిట్ కార్డు ద్వారా మాత్రమే ఏటీఎంలో నగదు డిపాజిట్ చేసే అవకాశం ఉంది. త్వరలో యూపీఐ ద్వారానూ క్యాష్ డిపాజిట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తేబోతున్నట్లు ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాల ప్రకటనలో భాగంగా ఆర్‌బీఐ గవర్నర్ దాస్ తెలిపారు. అంటే, ఏటీఎంలో నగదు చేయడానికి డెబిట్ కార్డు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. యూపీఐ ద్వారా క్యాష్ డిపాజిట్ ప్రక్రియ కూడా నగదు ఉపసంహరణ తరహాలోనే ఉండనుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ వసతికి సంబంధించిన మార్గదర్శకాలను ఆర్‌బీఐ త్వరలోనే విడుదల చేయనుంది.

యూపీఐ సేవల పరిధిని మరింత విస్తృతం చేసేందుకు ఆర్‌బీఐ మరో నిర్ణయం తీసుకుంది. డిజిటల్ వాలెట్ వంటి ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్ల (పీపీఐ)ను సైతం థర్డ్ పార్టీ యూపీఐ యాప్‌లతో అనుసంధానించి చెల్లింపులు జరిపే వెసులుబాటు కల్పించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ప్రస్తుతం బ్యాంక్ అకౌంట్ల నుంచి యూపీఐ చెల్లింపులు జరిపేందుకు యూజర్లు తమ బ్యాంక్ అకౌంట్‌ను బ్యాంక్ యూపీఐ యాప్ లేదా పేటీఎం, గూగుల్ పే, ఫోన్‌పే వంటి థర్డ్ పార్టీ యూపీఐ యాప్‌లతో అనుసంధానించాల్సి ఉంటుంది. ప్రస్తుతం పీపీఐలకు మాత్రం ఇందుకు అనుమతి లేదు. ప్రస్తుతం పీపీఐ జారీదారు అప్లికేషన్ ద్వారానే యూపీఐ చెల్లింపులు జరిపేందుకు వీలుంటుంది. ఇకపై పీపీఐలను ఏదైనా థర్డ్‌పార్టీ యూపీఐ యాప్‌నకు కూడా లింక్ చేసే సౌలభ్యం లభించనుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

అవకాశాలు అందిపుచ్చుకోండి

ఐఎస్‌బీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో సెబీ చీఫ్ మాధవి



హైదరాబాద్: నేటి డిజిటల్ ప్రపంచంలో అందివస్తున్న అద్భుత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) విద్యార్థులను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ కోరారు. శుక్రవారం ఐఎస్‌బీ హైదరాబాద్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ), ది ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఎం), ది ఎగ్జిక్యూటివ్ ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఈఎఫ్‌పీఎం) కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేటి డిజిటల్ ప్రపంచంలో కాలం వేగంగా మారిపోతుంటే, ప్రపంచం కుదించుకుపోతూ అద్భుత అవకాశాలు కల్పిస్తోందన్నారు. కెరీర్ పరంగా ఉన్న అవకాశాలను జాగ్రత్తగా ఎంచుకోవాలని కోరారు. ఉద్యోగం-వ్యక్తిగత జీవితం మధ్య సమన్వయం పాటిస్తూనే ప్రభుత్వ-కార్పొరేట్ పాత్రలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. జీవిత లక్ష్యాల కోసం పని చేస్తూనే, తమ ఆప్తులతో సంబంధాలు కొనసాగేలా చూసుకోవాలని కోరారు. వ్యక్తిగత ఆసక్తుల కోసమూ కొంత సమయం కేటాయించుకోవాలని ఐఎస్‌బీ విద్యార్థులను కోరారు.

1 అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్).. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో విటెరో సెలెక్ట్ షోరూమ్‌ను ప్రారంభించింది. ఈ షోరూమ్‌లో విభిన్న రకాలైన విట్రిఫైడ్ టైల్స్ అందుబాటులో ఉండనున్నాయి. ప్రస్తుతం కంపెనీ దేశవ్యాప్తంగా 700 విటెరో షోరూమ్‌లను నిర్వహిస్తోంది. కాగా వచ్చే ఏడాది కాలంలో రాష్ట్రంలో కొత్తగా 40 అదనపు షోరూమ్‌లను ప్రారంభించాలని ఏఈఎల్ యోచిస్తోంది.

1 ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా.. హోమ్ షాపింగ్ స్ప్రీ పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తెచ్చింది. ఈ నెల 7 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుంది. అన్ని టాప్ బ్రాండ్స్‌పై ప్రత్యేక డిస్కౌంట్స్‌ను ఆఫర్ చేస్తున్నట్లు ప్రకటించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈఎంఐ కార్డ్స్‌పై ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్‌తో పాటు రూ.1,000 వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది.

హైదరాబాద్‌లో మివీ కొత్త ప్లాంట్

హైదరాబాద్: ఆడియో పరికరాల తయారీలో ఉన్న దేశీయ కంపెనీ మివీ తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందుకోసం రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడ వద్ద ఏడు ఎకరాల్లో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కేంద్రం కూడా ఉండే ఈ ప్లాంట్ ద్వారా 2,000 మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు ఏర్పడతాయని కంపెనీ సహ వ్యవస్థాపకురాలు, సీఎంఓ దేవభక్తుని మిథుల చెప్పారు. ఈ ప్లాంట్ అభివృద్ధి, విస్తరణ కోసం వచ్చే ఐదేళ్లలో రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు. తాము తయారు చేసే ఇయర్‌ఫోన్లు, సౌండ్‌బార్స్, స్పీకర్లు, గేమింగ్ యాక్సెసరీస్ వంటి ఆడియో పరికరాలకు అవసరమైన బ్యాటరీలు, డ్రైవర్లు, పీసీబీఏల వంటి విడి భాగాల్లో 80 శాతం వరకు ఇదే ప్లాంట్‌లో తయారు చేసుకోనున్నట్లు మిథుల తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం శంషాబాద్‌లో అద్దె భవనాల్లో నడుస్తున్న ప్లాంట్‌తో పాటు 1,000 మందికిపైగా సిబ్బందిని కంపెనీ ఈ కొత్త ప్లాంట్‌కు తరలించనుంది. శుక్రవారం నాడిక్కడ ఈ ప్లాంట్‌కు తెలంగాణ ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ శంకుస్థాపన చేశారు.

సెన్సెక్స్ మరింత పైకి

ఊపిరి పోసిన ఆర్‌బీఐ పాలసీ

ముంబై: నూతన ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ద్వైమాసిక పరపతి సమీక్షలో ఆర్‌బీఐ రెపో రేటును యథాతథంగా కొనసాగించడం ఈక్విటీ మార్కెట్‌కు ఊపిరి పోసింది. ప్రపంచ మార్కెట్లు ప్రతికూలంగా ట్రేడవుతున్నప్పటికీ దేశీయ మార్కెట్ పాజిటివ్‌గా నిలిచింది. సెన్సెక్స్ స్వల్ప లాభంతో మరో కొత్త రికార్డును నెలకొల్పింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 74,361.11 పాయింట్ల గరిష్ఠ స్థాయి, 73,946.92 పాయింట్ల కనిష్ఠ స్థాయి మధ్యన కదలాడి చివరికి 20.59 పాయింట్ల లాభంతో 74,248.22 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం 0.95 పాయింట్ల నామమాత్రపు నష్టంతో 22,513.70 వద్ద ముగిసింది.

లాభాల్లో బ్యాంక్, ఎన్‌బీఎఫ్‌సీ షేర్లు: సెన్సెక్స్ షేర్లలో కోటక్ బ్యాంక్ 2.09 శాతం లాభంతో అగ్రగామిగా నిలిచింది. ఈ షేరు రూ.1785.25 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ లాభాల్లో ముగియగా బ్యాంక్ ఆఫ్ బరోడా మాత్రం 0.24 శాతం నష్టాలతో క్లోజైంది. బీఎస్ఈ బ్యాంకెక్స్ 451.11 పాయింట్ల లాభంతో 54,590.61 వద్ద ముగిసింది. లాభపడిన ఎన్‌బీఎఫ్‌సీ షేర్లలో ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, బజాజ్ ఫిన్‌సర్వ్ ఉన్నాయి. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ 0.14 శాతం లాభపడి రూ.645 వద్ద స్థిరపడింది.

అదేబాటలో రియల్టీ షేర్లు: ఈ విభాగంలో గోద్రెజ్ ప్రాపర్టీస్, మహీంద్రా లైఫ్ స్పేస్ డెవలపర్స్, మాక్రోటెక్ డెవలపర్స్, డీఎల్ఎఫ్, ఒబెరాయ్ రియల్టీ, బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లాభపడ్డాయి. బీఎస్ఈ రియల్టీ ఇండెక్స్ 108.24 పాయింట్లు లాభపడి 7,392.99 వద్ద ముగిసింది.

జగన్.. నాయకుడివేనా?

(మొదటి పేజీ తరువాయి)

నిందితుడు, అధర్మం, అధికారం, డబ్బు ఉన్నాయని, ఎవరిని గెలిపిస్తారో ప్రజలే నిర్ణేతలని అన్నారు. కడప పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైఎస్ షర్మిల ఏపీ న్యాయ యాత్ర పేరిట శుక్రవారం కడప జిల్లాలోని బద్వేలు నియోజకవర్గం అమగంపల్లెలో బస్సుయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివేకానందరెడ్డి కూతురు, షర్మిల సోదరి డాక్టర్ సునీత పాల్గొన్నారు. తొలిరోజు కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు, అట్లూరు మీదుగా బస్సుయాత్ర సాగింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... వైఎస్ వివేకాను గొడ్డలితో నరికి చంపి ఐదేళ్లు గడిచినా నిందితులకు శిక్ష పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హంతకుడు అవినాశే అని సీబీఐ చెప్పిందని, ఫోన్‌కాల్స్, రికార్డులు, గూగుల్ మ్యాప్స్ ఇదే చెబుతున్నాయని, అయినా కేసు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. ఒకరోజు కూడా అవినాశ్ జైలుకు పోలేదని, అధికారం అడ్డుపెట్టుకుని బయట తిరుగుతున్నాడన్నారని ఆరోపించారు.


బద్వేలు సభలో షర్మిలను గెలిపించాలని కోరుతున్న సునీత

ఇద్దరినీ ఓడించాలి

'జగన్ రాష్ట్రానికే కాదు సొంత జిల్లాకు మంచి చేయలేదు. కనీసం మంచినీళ్లు ఇవ్వలేదు. పార్లమెంటు, రాజ్యసభ కలుపుకొని వైసీపీకి 31 మంది ఎంపీలున్నారు. ఒక్కరోజు కూడా విభజన హామీల గురించి ప్రశ్నించలేదు. వివేకా హత్య ఎవరు చేయించారో అందరికీ తెలుసు. అయినా నిందితులు దర్జాగా బయట తిరుగుతున్నారు. ఇది న్యాయమేనా, ధర్మమేనా..? డాక్టర్ వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రిగా ఎన్నో అద్భుతాలు చేశారు. ఇప్పుడు జగన్ సీఎంగా ఉన్నారు. రాష్ట్రాన్ని బీజేపీకి తాకట్టుపెట్టారు. విభజన హామీలు ఒకటీ అమలు కాలేదు. ప్రత్యేక హోదా లేదు. కడప స్టీలు ఫ్యాక్టరీ లేదు. ఈ రోజు వైఎస్సార్ బిడ్డ కడప ఎంపీగా పోటీ చేస్తోందంటే దానికి కారణం జగనే. బాబాయిని చంపిన హంతకుడికి మళ్లీ సీటు ఇచ్చారు. ఇది దుర్మార్గం, అన్యాయం. హంతకులు మళ్లీ చట్టసభలకు వెళ్లకూడదు. న్యాయం వైపున్న వైఎస్ షర్మిల కావాలో, అధర్మం వైపు ఉన్న అవినాశ్ కావాలో తేల్చుకోవాలి. హత్యా రాజకీయాలు చేసే అవినాశ్‌రెడ్డిని, కాపాడే జగన్‌రెడ్డిని ఇద్దరినీ ఓడించాలి. బీజేపీ పొత్తులో అవినాశ్‌ను జగన్ కాపాడుతూ బానిసలా మారారు. హంతకుడు చట్టసభలకు వెళ్లకూడదనే నేను ఎంపీగా పోటీ చేస్తున్నాను. ఓటు వేసే ముందు అందరూ ఒకసారి ఆలోచించాలి. నేను వైఎస్సార్ బిడ్డను, మీ బిడ్డను. కడప జిల్లా నా పుట్టినిల్లు. జమ్మలమడుగులో పుట్టా. వైఎస్సార్ హయాంలో మొదలైన ప్రాజెక్టులకు ఇప్పటికీ మోక్షం లేదు. జగన్ పాలనలో రాష్ట్రం అధ్వానంగా తయారైంది. మద్యనిషేధం అని చెప్పి కల్తీ మద్యం అమ్ముతూ జనాల ప్రాణాలు తీస్తున్నారు. చంద్రబాబు 2 లక్షల కోట్లు అప్పులు చేస్తే, జగన్ 7లక్షల కోట్లు అప్పు చేశాడు' అని షర్మిల అన్నారు.

హత్యా రాజకీయాలొద్దు: సునీత

"వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డిలు రామలక్ష్మణుల్లా ఉండేవారు. నాన్న చివరి కోరిక షర్మిలను ఎంపీ చేయాలని. నాన్నను చంపిన వారికే మళ్లీ జగన్ సీటు ఇచ్చారు. హత్యారాజకీయాలు వద్దు. వైఎస్ వివేకా మన మధ్య లేరు. ఆయన వద్దకు ఎప్పుడు పోయినా పలికేవారు. కడప ఎంపీ సీటు కోసం ఆయనను కిరాతకంగా హత్య చేశారు. ఈ పని చేయించింది ఎంపీ అవినాశ్‌రెడ్డి. ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తున్నారు. ఎంపీ సీటు షర్మిలకు ఇవ్వాలని వివేకా అడిగారు. అవినాశ్ వద్దని చెప్పారు. వివేకా హంతకులను జగన్ కాపాడుతున్నాడు. వారికి శిక్ష పడాలంటే అవినాశ్‌ను ఓడించాలి" అని డాక్టర్ సునీత అన్నారు.

అపూర్వ స్వాగతం

షర్మిల, సునీత సొంత జిల్లాలో చేపట్టిన బస్సుయాత్రకు అపూర్వ స్వాగతం లభించింది. మీటింగ్‌కు వెళ్లొదని వైసీపీ వారు హెచ్చరించినా, మండుటెండలో కదలివచ్చిన జనానికి షర్మిల అభివాదం చేస్తూ ముందుకుసాగారు. వివేకా హత్యను ప్రధానంగా ప్రస్తావించారు. 'ఓ పక్క రాజశేఖర రెడ్డి బిడ్డ నిలబడింది, ఇంకో పక్క రాజశేఖరరెడ్డి తమ్ముడిని చంపిన అవినాశ్‌రెడ్డి నిలబడ్డాడు. అమ్మా ధర్మం వైపు నిలబడండి' అని సునీతను చూపిస్తూ కోరారు.

జగన్ నియంత.. గద్దె దించాలి: కృపారాణి

కడప, టెక్కలి, ఏప్రిల్ 5: 'జగన్ ఒక నియంత. ఆ నియంతను గద్దె దించాలి' అని ఇటీవల ఆ పార్టీని వీడిన కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. 'ఐదున్నరేళ్లపాటు జగన్ కోసం, వైసీపీ అభివృద్ధి కోసం ఎంతో కష్టపడ్డాను. అయినా నాకు ప్రాధాన్యమివ్వకుండా పక్కన పెట్టారు' అని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గానికి చెందిన కృపారాణి ఇటీవల వైసీపీకి రాజీనామా చేశారు. శుక్రవారం కడప జిల్లా బద్వేల్‌లో నియోజకవర్గం అమంగంపల్లె నుంచి పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఎన్నికల యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా కృపారాణి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. 'షర్మిల నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది. కడపలో షర్మిలను గెలిపించుకోవాలి' అని కోరారు.


వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల సభలో మాట్లాడుతున్న షర్మిల


షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కృపారాణి





పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో మేడపైకి ఎక్కి చంద్రబాబు ప్రసంగాన్ని వింటున్న జనం, నర్సాపురంలో చంద్రబాబు రోడ్ షో

ఏప్రిల్ నుంచే 4వేలు పెన్షన్

"పెన్షనర్ల పట్ల జగన్ నీచంగా, దుర్మార్గంగా ప్రవర్తించాడు. ఆయనను ఈసీ ప్రశ్నించాలి. జగన్ చేతకానితనం, దురుద్దేశ చర్యలతో కొంతమంది పెన్షనర్లు చనిపోయారు. అవి ప్రభుత్వ హత్యలు. ఈ హత్యలు చేసిన ముఖ్యమంత్రికి ప్రభుత్వంలో కొనసాగే నైతిక హక్కు లేదు. వెంటనే రాజీనామా చేయాలి"

"నేను మెగా డీఎస్సీపై తొలి సంతకం పెడతానంటే.. జగన్ రాజీనామా చేసిన వలంటీర్ల నియామకంపై తొలి సంతకం చేస్తానంటున్నాడు. నాది సమాజ హితం. జగన్‌ది స్వార్థం. జాబ్ రావాలంటే రాష్ట్రంలో ఎన్డీయే రావాలి, గంజాయ్ కావాలంటే జగన్ రావాలి"

- చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

మరణాలకు నైతిక బాధ్యత వహిస్తూ జగన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో మీడియా సమావేశంలోనూ, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లో నిర్వహించిన ప్రజాగళం యాత్రలోనూ చంద్రబాబు మాట్లాడారు. పింఛనుదార్లను చంపేసి మరోసారి శవరాజకీయం చేసి లబ్ధి పొందాలని జగన్ ప్రయత్నం చేస్తున్నారని, ఇది క్షమించరాని నేరమని ఆగ్రహించారు.

వలంటీర్ల ఉద్యోగాలు ఉంటాయి...

"వలంటీర్ల వ్యవస్థను ఎన్నికల్లో జోక్యం చేసుకోనీయవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. పెన్షన్లు డోర్ డెలివరీ చేయవద్దని చెప్పలేదు. ఈసీ ఇచ్చిన ఆర్డర్ ఒకటైతే, జగన్ ప్రభుత్వం చేసిన పని మరొకటి. వలంటీర్లను అధికార పార్టీ ఎన్నికల కోసం ఉపయోగించుకుంది. జగన్..వలంటీర్లు తమ సైన్యం అంటున్నాడు. రాజీనామా చేసిన వలంటీర్లకు ఉద్యోగాలు ఇచ్చే మొదటి ఫైలుమీద సంతకం పెడతానని సిగ్గులేకుండా చెబుతున్నాడు. మేం తటస్థంగా ఉండమని మాత్రమే వలంటీర్లను అడిగాం. మీ వ్యవస్థకు మేం వ్యతిరేకం కాదు. ఇంకా మీలో బాగా చదువుకున్నవారి కెరీర్ పెరిగేలా, మరింత ఆదాయానికి ఏమి చేయాలో చేసే బాధ్యత మాదని పదేపదే చెప్పాం. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 26 వేల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. వారితో పింఛన్ల పంపిణీ చేయిస్తే ఒక రోజు కాకపోతే, రెండోరోజుకు అయిపోతుంది. అలాంటిది చేయలేదు. పైగా నేనేదో అడ్డుపడినట్టు ప్రచారం చేస్తున్నారు.. మేం చాలా స్పష్టంగా ఉన్నాం. వలంటీర్లు రాజకీయాల్లో జోక్యంచేసుకోవడానికి వీల్లేదు. వలంటీర్లకు పూర్తిగా హామీ ఇచ్చాం. మీ ఉద్యోగాలు ఉంటాయి. మీ కెరీర్ కూడా బిల్డప్ చేస్తామని చెప్పాం"

పెన్షన్ పేటెంట్ టీడీపీదే..

"పెన్షన్ల పేటెంట్ హక్కు టీడీపీదే. ఎన్నికల్లో గెలవగానే పెన్షన్లు పెంచుతామని మొదట చెప్పిన పార్టీ తెలుగుదేశం. మొదట తేదీనే ఇస్తాం. ఇంటి దగ్గరే ఇస్తాం. పెంచిన రూ.4వేలు ఇస్తాం. ఒకవేళ ఒక నెలలో తీసుకోకపోతే మూడు నెలల వరకూ ఒకేసారి తీసుకునే వెసులుబాటు ఇస్తాం. మీ ఇంటికి పెద్ద కొడుకుగా ఉంటాను. సైకో తాత్కాలికంగా ఆనందిస్తాడు. అంతిమంగా ధర్మం గెలుస్తుంది. గడిచిన ఐదేళ్లలో జగన్ రూ.13 లక్షలకోట్లు అప్పుతెచ్చాడు. ఖజానా ఖాళీ అయ్యింది. ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు ఇవ్వలేదు. జగన్‌ను చూస్తుంటే పాత సినిమాలో విలన్ నాగభూషణం గుర్తుకొస్తున్నాడు. ఫ్యాన్ అరిగిపోయింది. దాన్ని ముక్కలు ముక్కలు చేయాలి. జగన్ ఎక్స్‌పైర్డ్ మెడిసిన్."

వచ్చాడు.. బచ్చా

"నా 40 ఏళ్ల అనుభవంలో ఎవరూ నాతో పెట్టుకోలేదు. వచ్చాడు.. బచ్చా.. వదలను.. నా తడాఖా చూపిస్తా. జాబ్ రావాలంటే రాష్ట్రంలో ఎన్డీయే రావాలి. నిరుపేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్లను నిర్మించి ఇస్తాం. వైసీపీ ఇచ్చింది సెంటు స్థలం. దానికి కూడా లంచాలు తీసుకున్నారు. కొత్తగా భూహక్కు చట్టం తీసుకొచ్చారు. ఇప్పటివరకు జగన్ ప్రభుత్వ స్థలాలు అమ్ముకున్నాడు. ఈ చట్టం అమల్లోకి వస్తే ప్రజల ఇళ్లు, ఆస్తులు కూడా తనఖా పెట్టి అప్పులు తెచ్చుకుంటాడు. ఒంటిమిట్టలో ఒక కార్మికుడు తనకున్న నాలుగు ఎకరాల భూమి అమ్ముకుందామని అనుకున్నాడు. కానీ రికార్డులు తారుమారయ్యాయి. ఎవరికి చెప్పినా.. న్యాయం జరగలేదు. చివరికి రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత భార్య, కూతురు విషం తాగి మరణించారు." అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆక్వాకు రూపాయిన్నరకే విద్యుత్

- జోన్‌తో సంబంధం లేకుండా వర్తింపు
- రైతును రాజును చేస్తా : చంద్రబాబు

అధికారంలోకి రాగానే రైతులను ఆదుకుని రాజును చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లో నిర్వహించిన ప్రజాగళం యాత్రలో ఆయన మాట్లాడారు. "అధికారంలోకి రాగానే ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం చేసి, రాయితీలు కల్పిస్తాం. ఆక్వా రైతులకు జోన్‌తో నిమిత్తం లేకుండా రూపాయిన్నరకే విద్యుత్‌ను సరఫరా చేస్తాం." అని హామీ ఇచ్చారు.

టీడీపీలోకి రఘురామరాజు

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 5: పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో శుక్రవారం రాత్రి జరిగిన ప్రజాగళం సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో ఎంపీ కనుమూరి రఘురామకృష్ణరాజు టీడీపీలో చేరారు. చంద్రబాబు పార్టీ కండువా కప్పి ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... ఐదేళ్లపాటు జగన్ అవినీతి, అరాచక పాలనపై పోరాటం చేస్తూ తెలుగు ప్రజల పక్షాన నిలబడ్డవ్యక్తి రఘురామరాజు అని కొనియాడారు. రఘురామ మాట్లాడుతూ... జగన్‌ను గద్దె దింపడమే ధ్యేయంగా పోరాటం సాగిస్తానని తెలిపారు.

టీడీపీలోకి పాకాల జడ్పీటీసీ పద్మజారెడ్డి దంపతులు

చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని పాకాల మండల జడ్పీటీసీ సభ్యురాలు నంగా పద్మజారెడ్డి, ఆమె భర్త బాబురెడ్డి తమ అనుచరులతో కలసి శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. చంద్రగిరి ఇన్‌చార్జి పులపర్తి నాని ఆధ్వర్యంలో వీరు తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో ఉన్న చంద్రబాబును కలసి పార్టీ కండువా కప్పుకొన్నారు.


ద్వారకాతిరుమల ఆలయ తూర్పు రాజగోపురం వద్ద కుటుంబ సమేతంగా పురందేశ్వరి

ప్రజలు కోరుకుంటున్న మార్పు తథ్యం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 5: రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ మార్పును ఆకాంక్షిస్తున్నారని మే 13న జరుగనున్న ఎన్నికల్లో కచ్చితంగా ఆ మార్పు కనిపిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ కూటమి అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం ఆమె కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం పండితుల నుంచి వేదాశీర్వచనం, స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు స్వీకరించారు. తర్వాత ఆమె స్థానిక వైష్ణవి హోటల్ వద్ద విలేకర్లతో మాట్లాడారు. దేవదాయశాఖ ఉద్యోగులను ప్రభుత్వం ఎన్నికల విధులకు వినియోగించాలని చూస్తోందన్నారు. ఇది సరికాదన్నారు. కాగా, వైసీపీ పతనం ఖాయమని, దీనికి 37 రోజులు మాత్రమే సమయం ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ ఎన్నికల ఇన్‌చార్జ్ అరుణ్‌సింగ్ మదనపల్లెలో అన్నారు. దేశ, రాష్ట్ర ప్రజలకు.. కులమతాలు, రాజకీయ పార్టీలు, వర్గాలు, ప్రాంతాలకతీతంగా ఉచిత రేషన్ పంపిణీ, అందరికీ ఇళ్లు, అనేక సంక్షేమ పథకాలను అందించిన ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆయన దృష్టంతా ఆంధ్రప్రదేశ్‌పైనే ఉందని, ఇక్కడ జరుగుతున్న దోపిడీలు, దౌర్జన్యాలు, అక్రమాలు, బెదుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలు, భూఆక్రమణలు, ఇసుక మాఫియాల భరతం పట్టడం ఖాయమన్నారు. అందుకే రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపించాలని కోరారు.

రాక్షస పాలనను అంతంచేద్దాం: భువనేశ్వరి

- నంద్యాల జిల్లాలో 'నిజం గెలవాలి' పర్యటన

నంద్యాల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మంచి రోజులు రావాలంటే రాక్షస వైసీపీ పాలనను అంతం చేయాలని, అందుకు ప్రజలందరూ ఏకం కావాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండో రోజు నంద్యాల జిల్లాలో చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించారు. నంద్యాల పట్టణం వెంకటాచలం కాలనీకి చెందిన గాజుల అబ్దుల్ రహీమ్, 13వ వార్డుకు చెందిన వేములపాడు గురువరాజు, మహానంది మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన చిన్న మద్దిలేటి, బండి ఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కందుకూరి నరసింహాచారి, కసినేని వెంకటేశ్వర గౌడ్ కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించి బాధితులను ఓదార్చారు. వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని మండిపడ్డారు. గంజాయి, కల్తీ మద్యం, ఇసుక అక్రమ రవాణాతో జగన్ రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని దుయ్యబట్టారు. మహిళలపై కూడా అధికార పార్టీ దారుణాలకు ఒడిగడుతోందని, నీళ్లు రావడం లేదని మదనపల్లికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేస్తే, అక్కడి వైసీపీ నేతలు ఆమె రెండు కళ్లు ఊడబెరికారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ అరాచకాలకు ఈ ఐదేళ్లలో ఎంతోమంది టీడీపీ కార్యకర్తలు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.


ప్రసంగిస్తున్న భువనేశ్వరి


వృద్ధురాలి మృతదేహానికి దండ వేస్తున్న వైసీపీ నేత బిరంగల్ శ్రీనివాసరెడ్డి, ముత్తమ్మ (ఇన్‌సెట్)

వైసీపీ శవ రాజకీయం

- 3 నెలల కిందటే రద్దయిన పింఛన్ కోసం వెళ్లి వృద్ధురాలు చనిపోయిందని ఏడుపు
- రోత పత్రికలో రోత రాతలు.. విష ప్రచారం

కోసిగి, ఏప్రిల్ 5: ఎన్నికల వేళ అధికార పార్టీ వైసీపీ శవ రాజకీయాలకు పాల్పడుతోంది. పింఛన్లు అందక వృద్ధులు చనిపోతున్నారని, ఆ పాపమంతా విపక్ష నేత చంద్రబాబుదేనంటూ విష ప్రచారం చేస్తోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఎక్కడైనా వృద్ధులు చనిపోతే అక్కడకు వైసీపీ నాయకులు వాలిపోయి "ఈ చావులకు కారణం చంద్రబాబే" అంటూ దుర్మార్గపు ప్రచారానికి పాల్పడుతున్నారు. దీనికి తోడు రోత పత్రికలో రోత రాతలు ప్రచురిస్తూ అబద్ధాలను వాస్తవాలుగా చూపించే కుట్రకు పాల్పడుతున్నారు. తాజాగా కర్నూలు జిల్లా కోసిగిలో గురువారం మరణించిన 75 ఏళ్ల వృద్ధురాలి విషయంలోనూ ఇదే అరాచకానికి పాల్పడ్డారు. ఆమె పింఛను కోసం వెళ్లి.. మృతి చెందారంటూ రోత రాతలతో అబద్ధాలను నిజం చేసే ప్రయత్నం చేశారు. వాస్తవానికి ఆమెకు మూడు మాసాల కిందటే ప్రభుత్వం పింఛను నిలుపుదల చేసింది. అయినా.. ఇప్పుడు ఆమె.. వలంటీర్లను ఆపేయడంతో పింఛను కోసం వెళ్లి చనిపోయారంటూ ప్రచారం చేయడంపై వృద్ధురాలి కుటుంబమే ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

ఏం జరిగింది?

కోసిగి మండల కేంద్రంలోని 6వ వార్డులో నాడిగేని ముత్తమ్మ(75) అనే వృద్ధురాలు గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఆరు నెలల నుంచి ఆమె మంచానికే పరిమితమై.. కాలుకింద పెట్టలేని స్థితిలో ఉన్నారు. గత సంవత్సరం సెప్టెంబరు నుంచి కోసిగిలోని సచివాలయం-3 వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రీతి ప్రతినెలా వృద్ధురాలి ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. అయితే, జనవరి నెలలో వృద్ధురాలు ముత్తమ్మ ఆధార్‌కు ఈకేవైసీ కాకపోవడంతో అదే నెల 25న ముత్తమ్మ పింఛన్‌ను తొలగించారు. దీంతో ఆమెకు మూడు నెలలుగా పింఛనే లేకుండా పోయింది. జరిగింది ఇదీ. కానీ, శుక్రవారం రోత పత్రికలో 'పింఛన్ కోసం వెళ్లి వృద్ధురాలి మృతి' పేరుతో వార్తను ప్రచురించారు. దీనిలో కల్పిత కథను వండివార్చారు. కాగా, పింఛన్ కోసం వెళ్లి వృద్ధురాలి మృతి' వార్త నిజం కాదని కోసిగి ఎంపీడీవో ప్రభావతి తెలిపారు.

ఆరు నెలలుగా మంచానికే పరిమితం

ముత్తమ్మ ఆరు నెలల నుంచి అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. అయితే, గురువారం పింఛన్ కోసం వెళ్లి వృద్ధురాలు మృతి అన్న వార్త రావడం బాధాకరం. వృద్ధురాలి పింఛన్ జనవరిలోనే డిలీట్ అయింది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

- తిరుమలేశ్వరరెడ్డి, కోసిగి పంచాయితీ ఈవో


అనపర్తి సీటు నల్లమిల్లికే!



- రామకృష్ణారెడ్డి పట్టుతో వ్యూహం మార్చిన చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలోని అనపర్తి అసెంబ్లీ సీటును టీడీపీ వెనక్కి తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. పొత్తులో భాగంగా ఆ సీటును బీజేపీ కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నాయకత్వంలో పార్టీ నేతలు పెద్ద ఆందోళన చేపట్టారు. అక్కడ బీజేపీ అభ్యర్థిగా ఎంపిక చేసిన నేతకు స్థానికంగా పట్టు లేకపోవడంతో కమలనాథులు సైతం పునరాలోచనలో పడ్డారు. పైగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఎంపీగా పోటీ చేస్తున్న రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలో ఈ సీటు ఉండటంతో ఈ సమస్య పరిష్కారానికి ఆమె దృష్టి పెట్టారు. నల్లమిల్లి బీజేపీలో చేరితే ఆయనకు ఆ సీటు ఇస్తామని ఆఫర్ ఇచ్చారు. కానీ ఆయన ఈ ప్రతిపాదనకు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో అనపర్తిలో టీడీపీ నాయకత్వం ప్రత్యామ్నాయాలు అన్వేషించింది. అన్నమయ్య జిల్లా పరిధిలో తంబళ్లపల్లి సీటును బీజేపీకి ఇచ్చి అనపర్తి సీటును తాను తీసుకునే ప్రతిపాదనను తెరమీదికి తెచ్చింది. శుక్రవారం ఇక్కడ పర్యటించిన టీడీపీ అధినేత చంద్రబాబును నల్లమిల్లి కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా సీట్ల మార్పిడిపై ఆయనకు సంకేతాలు అందినట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. కాగా, రాయలసీమలో కూటమి తరఫున ప్రకటించిన సీట్లు, అభ్యర్థుల్లో ఇక మార్పులు ఉండే అవకాశం లేదని టీడీపీ వర్గాలు తెలిపాయి. అనంతపురం అర్బన్ టికెట్ ఇవ్వకపోవడంతో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయనకు పార్టీపరంగా కీలకమైన బాధ్యతలు అప్పగించి సంతృప్తి పరచాలని పార్టీ భావిస్తోంది. కర్నూలు జిల్లా మంత్రాలయం సీటుకు టీడీపీ అభ్యర్థిగా బీసీ వర్గాలకు చెందిన రాఘవేందర్‌ను ప్రకటించారు. ఆ నిర్ణయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు నచ్చచెప్పి సమస్యను పరిష్కరించాలని, ఒకసారి బీసీ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత మార్పు చేయడం సరికాదని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక కడప జిల్లా జమ్మలమడుగులో కూడా మార్పులకు అవకాశం లేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

వైసీపీకి ఇక్బాల్ రాజీనామా



- ఎమ్మెల్సీ పదవికి కూడా...
- 10న బాబు సమక్షంలో టీడీపీలో చేరిక..!

అమరావతి(ఆంధ్రజ్యోతి), హిందూపురం, ఏప్రిల్ 5: ఎన్నికల సమయంలో శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో వైసీపీకి షాక్ తగిలింది. ఎమ్మెల్సీ పదవికి, పార్టీ సభ్యత్వానికి మహ్మద్ ఇక్బాల్ శుక్రవారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లుగా వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్‌కు లేఖను పంపారు. శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేస్తూ శాసనమండలి చైర్మన్‌కు పంపిన లేఖలోనూ వ్యక్తిగత కారణాలతోనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్లుగా ఇక్బాల్ పేర్కొన్నారు. కాగా, పోలీసు అధికారిగా ఉమ్మడి రాష్ట్రంలో పేరున్న షేక్ మహ్మద్ ఇక్బాల్‌ను 2019 ఎన్నికల్లో వైసీపీ హిందూపురం అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో దించింది. ఎన్నికలకు కొన్నిరోజుల ముందే ఆయన పార్టీలోకి వచ్చినా.. పురంలో మైనార్టీ సామాజికవర్గం బలంగా ఉండటంతో మంచి ఓట్లు సాధించారు. కానీ టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ చేతిలో ఓడిపోయారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. గత జూలైలో ఆయనకు సమాచారం ఇవ్వకుండా దీపికను హిందూపురం ఇన్‌చార్జిగా నియమించారు. అప్పటి నుంచి ఆయన అసమ్మతితో ఉన్నారు. ఈ క్రమంలో ఆయనకు ఈసారి ఎమ్మెల్యే టికెట్ లభించలేదు. ఇక పార్టీలో ఉండి ప్రయోజనం లేదని భావించిన ఇక్బాల్.. ఎమ్మెల్సీ పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. ఇక్బాల్ త్వరలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిసింది. ఈ నెల 10న చేరిక దాదాపు ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం.

పవన్ కోసం ఇల్లు సిద్ధం

- చేబ్రోలు బైపాస్ రోడ్డులో ఎంపిక.. ఇక్కడే హెలిప్యాడ్ నిర్మాణం కూడా

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 5: "కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని 54 గ్రామాల్లో ఏదో ఒకచోట నివాసముండేందుకు ఇల్లు చూసుకుంటా. పురుహూతికా అమ్మవారు ఆశీస్సులతో ఎక్కడ ఉండాలని సూచిస్తారో అక్కడే ఉండి ప్రజలందరికీ అందుబాటులో ఉంటాను" అని చెప్పిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆ దిశగా వేగంగా అడుగులు వేశారు. చేబ్రోలులో ఒక అభ్యుదయ రైతు నిర్మించిన కొత్త ఇంటిని ఎంపిక చేసుకున్నారు. ఇక్కడే ఉగాది వేడుకలు జరుపుకోనున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్ రోడ్డు పక్కన తన పంటపొలాల్లో రైతు ఓదూరి నాగేశ్వరరావు మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించుకున్నారు. ఈ భవనాన్ని పవన్ నివాసముండేందుకు ప్రాథమికంగా ఎంపిక చేశారు. జనసేనాని తన సొంతింటిని నిర్మించుకునేవరకూ ఇక్కడే ఉంటారు. ఈ ఇంటికి శుక్రవారం గృహప్రవేశం కూడా పూర్తయింది. తుది మెరుగులు దిద్దుతున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌ను పూర్తిగా వాహనాల పార్కింగ్‌కు, మొదటి ఫ్లోర్‌లో ఆఫీసు నిర్వహణకు, రెండు, మూడు అంతస్తులు కలిపి డూప్లెక్సు తరహాలో నిర్మించారు. పవన్‌కు అనువుగా ఉంటుందని భావించిన పార్టీ నేతలు దీనిని ఎంపిక చేశారు. ఓదూరి నాగేశ్వరరావు పవన్ అభిమాని కావడంతో ఇంటిని ఇచ్చేందుకు అంగీకరించినట్టు జనసేన వర్గాలు చెబుతున్నాయి. తనకు అద్దె వద్దని, కేవలం ఒక రూపాయి ఇస్తే చాలని ఆయన చెప్పినట్టు సమాచారం. ఉగాది వేడుకల్లో పాల్గొనేందుకు పవన్ పిఠాపురం రానున్న నేపథ్యంలో అప్పటికే ఈ ఇంటిని సిద్ధం చేసి ఇక్కడే కార్యక్రమాన్ని నిర్వహించాలని జనసేన పార్టీ నేతలు నిర్ణయించారు. ఈ ఇంటికి సమీపంలోనే పంటపొలాల్లో హెలిప్యాడ్ ఏర్పాటు పనులు కూడా ప్రారంభమయ్యాయి.


చేబ్రోలు బైపాస్ రోడ్డు పక్కన పవన్ నివాసానికి ఎంపిక చేసిన ఇల్లు

రేపటి నుంచి మళ్లీ జనంలోకి పవన్

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జ్వరం నుంచి కోలుకున్న జనసేనాని పవన్ కల్యాణ్ తదుపరి పర్యటనకు సిద్ధమయ్యారు. వారాహి విజయ భేరి యాత్రలో భాగంగా పవన్ ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటన రీషెడ్యూల్ ఖరారైంది. 7న అనకాపల్లిలో నిర్వహించే సభలో పవన్ పాల్గొననున్నారు. 8న యలమంచిలి నియోజకవర్గంలో పర్యటిస్తారు. అక్కడ నిర్వహించే సభలో పాల్గొంటారు. పిఠాపురం పర్యటన తర్వాత పవన్ కల్యాణ్ అనారోగ్యానికి గురైన సంగతి తెలిసిందే. దీంతో తొలి విడత షెడ్యూల్ మొత్తం రద్దు చేశారు. ఆయన ఆరోగ్యం మెరుగు పడటంతో ఎన్నికల ప్రచార యాత్రకు సిద్ధమయ్యారు. 9వ తేదీ ఉదయం పిఠాపురం చేరుకొని ఉగాది వేడుకల్లో పాల్గొంటారు. ఆ తర్వాత నెల్లిమర్ల, విశాఖ దక్షిణం, పెందుర్తి నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు.

రాష్ట్రంలో కూటమి గెలవబోతోంది: నాగబాబు



తుని రూరల్, ఏప్రిల్ 5: 'జగన్‌రెడ్డికి ప్రచారం పిచ్చి తారస్థాయికి వెళ్లిపోయింది. ఇంకోసారి అవకాశం ఇస్తే ప్రజల ముఖాలపై కూడా జగన్‌రెడ్డి బొమ్మ పచ్చబొట్టు పొడుస్తారేమో..!' అని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే నాగబాబు సందేహాన్ని వ్యక్తం చేశారు. తుని నియోజకవర్గంలో జనసేన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'కూటమి గెలవబోతోంది. అవినీతి అక్రమాలతో చెలరేగిపోతున్న వైసీపీని తుంగలోకి తొక్కబోతున్నాం. తుని నియోజకవర్గ శాసనసభ్యుడు దాడిశెట్టి రాజా నంబర్ వన్ క్రిమినల్. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై వ్యక్తిగతంగా నోరుపారేసుకుని అసత్యపు ఆరోపణలు చేయడం ఆయనకు అలవాటుగా మారింది. హత్యా రాజకీయాలు చేసే దాడిశెట్టి రాజాను చిత్తుచిత్తుగా ఓడించాలి. వైసీపీ పాలనలో ఒక్క అవినీతి కూడా జరగలేదని జగన్‌రెడ్డి చెప్పడం అతిపెద్ద జోక్. అనకాపల్లి లోక్‌సభ స్థానానికి పోటీ చేసేందుకు నేను సిద్ధమయ్యా. పొత్తు పరిణామాల్లో బీజేపీకి ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. పవన్ చెప్పగా మరుక్షణమే తప్పుకున్నా. వైసీపీ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్ ఎంపీ కాకుండానే కాకినాడలో మైనింగ్ మాఫియా నడిపి కోట్లు దోచుకుంటున్నారు. జనసేన ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించుకోవాలి. ఆయన అందరికీ అందుబాటులో ఉంటారు' అని నాగబాబు అన్నారు.

చట్టనిబంధనలకు లోబడే జిల్లా కేంద్రాలు

» అభ్యంతరాలు పరిగణించిన తర్వాతే తుది నోటిఫికేషన్

» ప్రభుత్వ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం



అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటు, జిల్లా ప్రధాన కేంద్రాల ప్రకటనపై అభ్యంతరాలను ఆహ్వానించి, వాటిని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ప్రభుత్వం తుది నోటిఫికేషన్ జారీ చేసిందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్టనిబంధనలకు లోబడే వ్యవహరించిందని పేర్కొంది. హిందూపురం పార్లమెంటరీ నియోజకవర్గాన్ని శ్రీసత్యసాయి జిల్లాగా ఏర్పాటు చేసి, పుట్టపర్తిని జిల్లా ప్రధాన కేంద్రంగా ప్రకటించడం, అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేసి, రాయచోటిని కేంద్రంగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. అలాగే తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రాపురాన్ని కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విలీనం చేస్తూ ఇచ్చిన ఆదేశాలు చట్ట నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని పేర్కొంది. కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం గురువారం తీర్పు ఇచ్చింది. హిందూపురం నియోజకవర్గాన్ని శ్రీసత్యసాయి జిల్లాగా ఏర్పాటు చేసి, పుట్టపర్తిని జిల్లా ప్రధాన కేంద్రంగా ప్రకటిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హిందూపూర్ అఖిలపక్ష కమిటీ కన్వీనర్ బాలాజీ మనోహర్ 2022లో పిల్ దాఖలు చేశారు. అలాగే అన్నమయ్య జిల్లాను ఏర్పాటు చేసి, జిల్లా ప్రధాన కేంద్రంగా రాయచోటిని ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ జిల్లా కేంద్ర సాధన సమితి కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ, మరికొంతమంది ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. రాజంపేటను జిల్లా ప్రధాన కేంద్రంగా ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇదేకాకుండా తూర్పుగోదావరిలోని రామచంద్రాపురాన్ని కోనసీమ జిల్లాలో విలీనం చేయడాన్ని సవాల్ చేస్తూ వై.వీరవెంకట సత్యనారాయణరామరాజు పిల్ వేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ ధర్మాసనం విచారణ జరిపింది.

ఒకవైపే సీఎస్ చూపు

తెలంగాణకు వెళ్లేందుకు 2వేలమంది ఉద్యోగులు.. సీఎస్ సంతకం కోసం ఎదురుచూపులు

» వారిని కాదని 'సంతకాల దొంగ'కు ఏర్పాట్లు

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఉద్యోగులకు ఆదర్శప్రాయంగా ఉండాల్సిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి కేవలం ఒక్క వైపే చూస్తున్నారు. తన పేషీలో అటెండర్‌గా పని చేస్తూ సీఎంవోలో సీఎం సంతకం సహా మిగిలిన సెక్రటరీల డిజిటల్ సంతకాలు చోరీ చేసి, సొమ్ము చేసుకున్న ఘనుడికి రాచమర్యాదలు జరుగుతున్నాయి. సీఎంవోలో డిజిటల్ సంతకాల చోరీ అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన తర్వాత సీఐడీ క్రిమినల్ కేసు పెట్టి సీఎస్ పేషీ అటెండర్ అబ్దుల్ రజాక్ సహా సీఎంవోలో పనిచేస్తున్న మరో నలుగురిని అరెస్టు చేసింది. ఆ ఐదుగురు రెండు నెలలపాటు జైల్లో ఉన్నారు. ఆ తర్వాత బెయిల్ వచ్చింది. ఈ ఐదుగురిలో ఒక్క రజాక్‌ని మాత్రమే తెలంగాణలోని లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌లో విధులు నిర్వర్తించడానికి సీఎస్ డిప్యుటేషన్‌పై పంపారు. మిగిలిన నలుగురూ చిరుద్యోగులు. హోటళ్లలోనో, మరో చోటో పనిచేస్తున్నారు. ఇది జరిగి మూడు నెలలవుతోంది. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే, అకస్మాత్తుగా అబ్దుల్ రజాక్‌ను శాశ్వతంగా తెలంగాణకు పంపాలని నిర్ణయించారు. ఈ మేరకు రజాక్ ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చారు. 2021లో సచివాలయంలో పనిచేస్తున్న క్లాస్ - 4 ఉద్యోగులు దాదాపు 200 మంది తెలంగాణకు వెళ్లేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చింది. జీవో వచ్చిన 10 రోజుల్లోనే దాదాపు 200 మంది ఉద్యోగులు తెలంగాణకు వెళ్లిపోయారు. ఇందులో రజాక్ కూడా ఉన్నారు. కానీ, ఆయన వెళ్లలేదు. ఇక్కడ సీఎంవోలో, సీఎస్ పేషీలో పనిచేస్తూ, డిజిటల్ సంతకాల చోరీ ద్వారా రెండు చేతులా అక్రమార్జన చేస్తూ ఉండిపోయారు. ఒక్కసారిగా స్కామ్ బయటపడడం, అరెస్టవడం, బెయిల్‌పై బయటకు రావడం జరిగిపోయాక వీరిలో కొత్త భయం మొదలైంది. ప్రభుత్వం మారితే సీఎంవోలో స్కామ్ అంతా తవ్వితే ఇంకేం బయటపడతాయో, అప్పుడెవరెవరు ఇరుక్కుపోతామోనని ఆందోళన పడుతున్నారు. అందుకే ఆ స్కామ్ ఆనవాళ్లు పూర్తిగా చెరిపేయడంలో భాగంగానే రజాక్‌ను తెలంగాణకు పంపించేస్తున్నారని తెలుస్తోంది.



2021లో క్లాస్ - 4 ఉద్యోగుల కేటగిరీలో తెలంగాణకు వెళ్లేందుకు తనకు అవకాశం లభించినా కొవిడ్ కారణంగా వెళ్లలేకపోయాను, ఇప్పుడు ఆ అనుమతి వినియోగించుకొనే చాన్స్ ఇవ్వమని రజాక్ వినతి పత్రం ఇచ్చారు. సాధారణంగా ఏ కేడర్‌లో ఉన్నప్పుడు అనుమతి లభిస్తే ఆ కేడర్‌లోనే అంతర్రాష్ట్ర బదిలీ జరగాలి. కానీ, రజాక్‌కు క్లాస్ -4 ఉద్యోగిగా ఉన్నప్పుడు అనుమతి లభించింది. ఆ తర్వాత ఆయనకు ప్రమోషన్ వచ్చి క్లాస్ - 3 ఉద్యోగి అయ్యారు. ఇప్పుడు ఆ అవకాశం ఎలా వినియోగించుకోగలరు? పైగా క్రిమినల్ కేసులో అరెస్టై బెయిల్‌పై ఉన్న ఉద్యోగిని వేరే రాష్ట్రానికి శాశ్వతంగా ఎలా పంపిస్తారు ? ఈ వ్యక్తి ఫోన్ ద్వారా సీఎంవో స్కామ్‌కి సంబంధించి లక్షల రూపాయల లావాదేవీలు జరిగాయని సీఐడీ గుర్తించింది. ఇలాంటి వ్యక్తిపై సీఎస్ కనబరుస్తున్న ప్రత్యేక శ్రద్ధ పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆ ఉద్యోగులను చూడరా?

విభజనచట్టం ప్రకారం ఏర్పాటైన కమిటీ సూచనల మేరకు రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జరగాలి. కానీ, ఏపీ వైపు నుంచి ఎలాంటి ముందడుగు పడడంలేదు. దాదాపు 2,000 మంది సీఎస్ జవహర్‌రెడ్డి చేయాల్సిన ఒక్క సంతకం కోసం ఎదురుచూస్తున్నారు. వారిలో భార్య, భర్త చెరో చోట, పిల్లలు మరో చోట, తల్లిదండ్రులు ఇంకో చోట ఉన్న కేసులే దాదాపుగా అన్నీ. సీఎస్ ఒప్పుకొంటే వారంతా తెలంగాణకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందుకోసం సీఎస్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. మంత్రులతో సిఫారసు కూడా చేయించుకుంటున్నారు. కానీ,వీరిని సీఎస్ కనికరించడం లేదు.

ఇది ఏనాటి బంధమో!

అబ్దుల్ రజాక్ అరెస్టయ్యేవరకు సీఎస్ కార్యాలయం అటెండర్‌గా పనిచేశారు. 15 ఏళ్లుగా వివిధ సీఎస్‌ల వద్ద ఈ వ్యక్తి అటెండర్‌గా పనిచేస్తున్నారు. 2004 నుంచి 2014 వరకు సీఎంవోలో పని చేశారు. ఆ సమయంలో జవహర్ రెడ్డి సీఎం కార్యాలయ కార్యదర్శిగా ఉన్నారు. 2014-19 వరకు కూడా రజాక్ సీఎంవోలో అటెండర్‌గానే ఉన్నారు. 2019లో ప్రభుత్వ సలహాదారు పీవీ రమేశ్ దగ్గర అటెండర్‌గా చేశారు. ఆ తర్వాత నీలం సాహ్ని దగ్గర అటెండర్‌గా చేస్తూ, ఆమె ఎన్నికల కమిషనర్ కాగానే, ఆమెతో పాటు ఎన్నికల కమిషన్‌కి వెళ్లిపోయారు. ఆ తర్వాత జవహర్ రెడ్డి సీఎంవోలోకి రాగానే తిరిగి సీఎంవోలో అటెండర్‌గా చేరారు. ఆ తర్వాత జవహర్ రెడ్డి సీఎస్ అయ్యాక ఆయన వెంటే రజాక్ కూడా సీఎస్ కార్యాలయానికి వచ్చారు. కెరీర్ మొదట్నుంచీ సీఎంవో, సీఎస్ కార్యాలయం తప్ప మరెక్కడా పనిచేయడం లేదంటేనే రజాక్ ఎంతటి సమర్థుడో అర్థం చేసుకోవచ్చునని సచివాలయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

వలంటీర్లా.. కార్యకర్తలా?

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం రహస్య సమావేశం ఏర్పాటు చేశారు. 'అవసరమైతే వలంటీరు ఉద్యోగానికి రాజీనామా చేయండి. వైసీపీ కార్యకర్తగా జగనన్న గెలుపుకోసం పనిచేయండి'.. అని దిశానిర్దేశం చేశారు. వందలసంఖ్యలో హాజరైన వలంటీర్ల కు నగదు కూడా అందజేసినట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ ముందూ అదే మా ట! కోడ్ వచ్చాకా అదే మాట! 'వలంటీర్లంతా మా పార్టీ కార్యకర్తలు' అన్నదే వైసీపీ విధానం. మరి... దేశంలో ఎక్కడైనా 'పార్టీ కార్యకర్తల'తో ప్రభుత్వ పథకాలు అమలు చేస్తారా? పింఛను పంపిణీ చేయిస్తారా? అందుకు ఎన్నికల నియమావళి ఒప్పుకొంటుందా? వైసీపీ ఇంతగా బరితెగించడంవల్లే... వలంటీర్ల ను పింఛను సహా ప్రభుత్వ పథకాల పంపిణీకి దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. మరి... ఈ విషయంలో తప్పెవరిది? వలంటీర్లను కార్యకర్తల్లా వాడుకుంటున్న వైసీపీదా? ఎన్నికల కమిషన్‌దా? వైసీపీ నేతల తీరుతో చాలామంది వలంటీర్లు కూడా తలలు పట్టుకుంటున్నారు. కాగా, వలంటీర్లతో ఏర్పాటు చేసిన రహస్య సమావేశం గురించి టీడీపీ వర్గాలు ఎన్నికల స్పెషల్ ఫ్లైయింగ్ స్క్వాడ్స్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లభించలేదు. వారు సమావేశ ప్రాంగణానికి వెళ్లామా.. వచ్చామా.. అన్నట్టుగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

- కాకినాడ, ఆంధ్రజ్యోతి

పెన్షన్ డబ్బులతో బెట్టింగ్

» రూ.5 లక్షలు కాజేసిన సచివాలయ ఉద్యోగి

» గుణదల పీఎస్‌లో కేసు నమోదు

విజయవాడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పింఛన్లకు ఇవ్వాల్సిన సొమ్ములతో క్రికెట్ బెట్టింగ్ ఆడాడు ఓ సచివాలయ ఉద్యోగి. మొదటి రోజు పింఛన్లను పంపిణీ చేసి విగిలిన సొమ్ముతో బెట్టింగ్ ఆడాడు. చివరికి కటకటాల పాలయ్యాడు. వివరాలివీ.. కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన ఊటుకూరి నాగమల్లి విజయవాడ మధురానగర్‌లో ఉన్న 208వ నంబరు సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. నగర పాలక సంస్థ జోనల్ 2లో విధు లు నిర్వర్తిస్తున్న జోనల్ కమిషనర్ కంచర్ల ప్రభుదాసు ఈ నెల మూడో తేదీ సాయంత్రం 6 గంటలకు పెన్షన్ల పంపిణీకి సంబంధించి రూ.5.41 లక్షలను నాగమల్లికి అందజేశారు. ఆ రోజు రాత్రి 8 గంటల వరకు ఆయన మొత్తం 14 మంది లబ్ధిదారులకు రూ.42 వేలను పంపిణీ చేశాడు. మిగిలిన రూ.4.99 లక్షలను మర్నాడు ఉదయం నుం చి పంపిణీ చేయాల్సి ఉంది. కానీ, నాలుగో తేదీ అందుబాటులో లేకుండాపోయాడు. అధికారులు ఆయనకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో ప్రభుదాసు గుణదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు... నాగమల్లిని విజయవాడలో శుక్రవారం అరెస్టు చేశారు. అతడిని విచారించగా ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమైనప్పటి నుంచి బెట్టింగ్‌లు ఆడుతున్నట్లు తేలింది. ఫోన్‌లో డెల్లా427 అనే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని బెట్టింగ్‌లు ఆడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అతడిని అరెస్టు చేసిన పోలీసులు మొత్తం సొమ్మును అతడి కుటుంబ సభ్యుల నుంచి రికవరీ చేశారు. నాగమల్లిని రిమాండ్‌కు తరలించారు.

పింఛన్ల పంపిణీలో వలంటీరు

మెంటాడ ఏప్రిల్ 5: విజయనగరం జిల్లా మెంటాడ మండలం జయతి గ్రామంలో దామోదర్ అనే వలంటీరు వెల్ఫేర్ అసిస్టెంట్‌తో కలిసి శుక్రవారం పించన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ విషయం తెలిసి స్థానిక టీడీపీ నాయకులు అభ్యంతరం తెలుపగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. గట్టిగా నిలదీసేసరికి అక్కడి నుంచి జారుకున్నాడు. కానీ, మళ్లీ కాసేపటికే వచ్చాడు. ఈ విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. వలంటీరు దామోదర్ మాట్లాడుతూ పింఛన్ లబ్ధిదారులు తనకు తెలియదని వెల్ఫేర్ అసిస్టెంట్ చెప్పడంతో ఇళ్లు చూపించడానికి వెళ్లానని చెప్పాడు.

ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్‌గా ద్వారకానాథ్ రెడ్డి



అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్‌గా సీనియర్ న్యాయవాది ఎస్.ద్వారకనాథ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు బార్ కౌన్సిల్ ఛైర్మన్‌గా ఉన్న గంటా రామారావు ఇటీవల ఈ పదవికి రాజీనామా చేశారు. నూతన కార్యవర్గం ఎన్నికలో భాగంగా.. శుక్రవారం నామినేషన్ల గడువు ముగిసే సమయానికి ద్వారకనాథ్‌రెడ్డి ఒక్కరే పోటీలో నిలిచారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఆలూరు రామిరెడ్డి ప్రకటించారు. వైస్ ఛైర్మన్‌గా విశాఖపట్నానికి చెందిన ఎస్.కృష్ణమోహన్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హైకోర్టు పూర్వపు జస్టిస్ రామలింగేశ్వరరావు ఇకలేరు

ఏలూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు పూర్వ జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు(68) శుక్రవారం ఉదయం జర్మనీలో మృతి చెందారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన ఆయన కొద్దిరోజుల కిందట జర్మనీలో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లారు. రెండురోజుల కిందట అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. అంత్యక్రియలు హైదరాబాద్‌లోనే నిర్వహిస్తామని ఆయన కుమార్తె రచన తెలిపారు. కాగా, 13 వేల కేసుల్లో తీర్పులిచ్చిన ఆయన హయాంలో 'సమత' కేసు ఒక సంచలనం.

ఉత్తుత్తి నొక్కుడుతో జగన్మాయ

పిల్లల ఫీజులకేం చెబుతారు?

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా ఎందుకు విడుదల చేయలేదు? ఫీజుల బటన్‌కు వలంటీర్లతో పనిలేదు. అప్పటికి ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి రాలేదు. ఎలాంటి ప్రతికూలతలు లేనప్పుడే బటన్ నొక్కారు. అయినా మార్చి 1న నొక్కిన బటన్ డబ్బులు ఇప్పటికీ విద్యార్థుల ఖాతాల్లోకి చేరలేదు. మరి ఇప్పుడు ఈ నెపాన్ని ఎవరికిపై నెడతారు? దీనికీ ప్రతిపక్షాలనే కారణంగా చూపిస్తారా?

నిధుల్లేకుండానే నొక్కారు

రాష్ట్రంలో ఉన్నతవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మొదటి క్వార్టర్ నగదును ప్రభుత్వం మార్చి 1న విడుదల చేసింది. జగన్ ఆ రోజున బటన్ నొక్కి అట్టహాసంగా ఫీజులు విడుదల చేసినట్లు ప్రకటించారు. 9,44,666 మంది విద్యార్థులకు రూ.708.68కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. బటన్ నొక్కినందున సాంకేతికంగా విడుదల చేసినట్లు చూపేందుకు అక్కడక్కడా అతి కొద్దిమంది విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో ఫీజులు జమ చేశారు. వారికి తప్ప ఇంకెవరికీ ఫీజులు విడుదల చేయలేదు. బటన్ నొక్కి నేటికి 36 రోజులు గడిచినా ఫీజులు విద్యార్థులకు అందలేదు. అంటే జగన్ ఉత్తుత్తి బటన్ నొక్కేశారు. అప్పటికే విద్యా దీవెన ఫీజుల విడుదలలో జాప్యం నెలకొనడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. దానిని తగ్గించుకునే ఎత్తుగడ వేసిన జగన్ వాస్తవంగా ఖజానాలో నిధుల్లేకపోయినా, ఊరికే బటన్ నొక్కి వదిలేశారు. దీనిపై ఆరా తీస్తే... ఎన్నికల కోడ్ కారణంగా జాప్యం జరుగుతున్నదంటూ అధికారులు పొంతన లేని సమాధానం చెబుతున్నారు. బటన్ నొక్కి ఫీజులు ఇవ్వకుండా జగన్ మాయ చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు. సీఎం బటన్ నొక్కనంతవరకు మౌనంగానే ఉన్న కాలేజీల యాజమాన్యాలు బటన్ నొక్కిన వెంటనే విద్యార్థులపై ఒత్తిడి చేయడం ప్రారంభించాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఫీజులు చెల్లించాలని పట్టుబడుతున్నాయి. దీంతో వేరే దారిలేక తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ఫీజులు చెల్లిస్తున్నారు. అందులోనూ ఇది పరీక్షల సమయం కావడంతో విద్యార్థులను యాజమాన్యాలు ఇబ్బందిపెడతాయనే ఆందోళనతో తల్లిదండ్రులు ఏదోక విధంగా ఫీజులు కడుతున్నారు. ఇంజనీరింగ్ పరీక్షలు ఈనెలాఖరుతో ప్రారంభమవుతాయి. మిగిలిన ఉన్నత విద్యా కోర్సులు కూడా ముగింపు దశకొచ్చాయి. దీంతో హాల్‌టికెట్లు ఆపేస్తారేమోననే భయంతో ప్రభుత్వం నుంచి ఫీజులు రాకపోయినా చెల్లిస్తున్నారు.

అంతా మనోళ్లే... అందుకే అడగరు

ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ ప్రస్తుతం బస్సు యాత్ర చేస్తున్నారు. పలు సభల్లో ప్రసంగిస్తున్నారు. యాత్రలో మధ్య మధ్య ఆగుతూ దారిలో కనిపించిన వారితో మాట్లాడుతున్నారు. కానీ రాష్ట్రవ్యాప్తంగా 9.5లక్షల మంది విద్యార్థులకు రూ.700 కోట్ల ఫీజులు ఆగిపోయినా దాని గురించి సీఎంను ఎవరూ ఒక్క మాటా అడగట్లేదు. జగన్ యాత్రల్లో పలు చోట్ల యువత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొంటున్నా విచిత్రంగా ఫీజుల గురించి అడగడమే లేదు. ఇదంతా చూస్తే, యాత్ర మధ్యలో సీఎం జగన్ పలకరింపులన్నీ ప్లాన్ ప్రకారం జరుగుతున్నట్టు అనిపిస్తోందని విద్యా రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రైతన్నతోనూ రాజకీయమే!

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేయకుండా, బటన్ నొక్కడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కోడ్‌కు పది రోజుల ముందు సీఎం బటన్ నొక్కినా.. డబ్బులు విడుదల చేయలేదు. తీరా ఎన్నికల కోడ్ వచ్చాక.. నిధుల మంజూరుకు ఈసీ అనుమతి కావాలంటున్నారు. దీంతో రైతులు 20 రోజులుగా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అసలు నిధులు ఇవ్వకుండా, ఆదరాబాదరాగా బటన్ నొక్కి, రైతుల్ని మోసం చేశారని మండిపడుతున్నారు. నిజానికి ఖజానాలో నిధులు నిండుకుని, బ్యాంకులకు సొమ్ము చేరలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సీఎస్ తీర్మానం మర్మం ఏమిటో?: ఎన్నికల కోడ్‌కు ముందే ఖజానాలో ఉన్న సొమ్మంతా అధికార పార్టీకి అనుకూలమైన కాంట్రాక్టర్లకు ఊడ్చిపెట్టారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అందుకే పింఛన్ల పంపిణీకి కూడా సొమ్ము లేక జాప్యం చేశారని చెబుతున్నారు. అయితే, పోలింగ్‌కు ముందు రైతుల ఖాతాలకు జమ చేయడం ద్వారా రైతులను ఆకర్షించవచ్చనేది ప్రభుత్వ పెద్దల ఎత్తుగడగా కనిపిస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, ప్రభుత్వం నుంచి ఎవరికైనా వ్యక్తిగత లబ్ధి చేకూర్చాలంటే.. ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి. అయితే కరువు, తుఫాన్లు వంటి ప్రకృతి విపత్తులతో నష్టపోయిన వారికి సాయం చేయడానికి కేంద్ర విపత్తుల నిర్వహణ చట్టంలో వెసులుబాటు ఉంది. ఈ నిబంధనతో నిధులు విడుదలకు ఎన్నికల సంఘం అనుమతి ఇస్తుందని ఓ ఉన్నతాధికారి చెప్పారు. కానీ ఖజానాలో నిధులు లేకపోయినా.. ముందు బటన్ నొక్కి, ఎన్నికల కోడ్ వచ్చే వరకు నగదు చెల్లింపులు ఆపితే.. తర్వాత ఎన్నికల సంఘం అనుమతితో పోలింగ్ సమయంలో సొమ్ము విడుదల చేయవచ్చన్న ఉద్దేశంతోనే ప్రభుత్వ పెద్దలు ఎత్తుగడ వేశారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్క్రీనింగ్ కమిటీ తీర్మానం చేసి, తాజాగా ఈసీఐకి లేఖ రాసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఒకవేళ పోలింగ్‌కు ముందు నగదు చెల్లింపులకు ఎన్నికల సంఘం అనుమతిస్తే.. రైతులకు నగదు బదిలీ ద్వారా అధికార పార్టీకి సానుకూలత ఏర్పడుతుందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. అయితే ఎన్నికల సంఘం నిధులు విడుదలకు ఎప్పుడు అనుమతిస్తుందో స్పష్టత లేదు.



డీజీపీకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమ

అన్ని పార్టీల అభ్యర్థులకు సమ ప్రాధాన్యం

» టీడీపీ అభ్యర్థులపై కేసుల జాబితా ఇప్పించండి: డీజీపీకి టీడీపీ వినతి

విజయవాడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల క్షేత్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులకు పోలీసులు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని టీడీపీ నేతలు కోరారు. శుక్రవారం విజయవాడలోని డీజీపీ నివాసంలో ఆయన్ను కలసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దాదాపు రెండేళ్ల తర్వాత డీజీపీని కలిసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని నేతలు వ్యాఖ్యానించారు. టీడీపీ నేత వర్ల రామయ్య మాట్లాడుతూ.. 'ఎన్నికల్లో పోటీ చేసే టీడీపీ అభ్యర్థులపై రాష్ట్రంలో ఎక్కడెక్కడ, ఏయే కేసులు ఉన్నాయో ఆ వివరాలు వెంటనే ఇవ్వాలని కోరాం. జాబితా ఇస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. దాడులు చేస్తుంటే హత్యాయత్నం కేసు పెట్టకుండా పెట్టీ కేసులు పెడుతున్నారు' అని ఆరోపించారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు నోటీసులు ఇవ్వడాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని దృష్టికి తీసుకెళ్లామని వర్ల రామయ్య తెలిపారు. దేవినేని ఉమ మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను జగన్ పాటించడం లేదని విమర్శించారు.

కోడ్ తర్వాత రూ.47.49 కోట్ల సొత్తు స్వాధీనం

» 4584 ఎఫ్ఐఆర్‌లు నమోదు: సీఈవో మీనా

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి శుక్రవారం వరకు రూ.17.50 కోట్లతోపాటు మద్యం, బంగారం, వెండి తదితర మొత్తం రూ.47.49 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. సీవిజిల్ యాప్ ద్వారా 7838 ఫిర్యాదులు రాగా 90 శాతం పరిష్కరించినట్లు తెలిపారు. 8681 లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. నోటిఫికేషన్ విడుదలైన మార్చి 16 నుంచి ఇప్పటి వరకు 4584 ఎఫ్ఐఆర్‌లు నమోదనట్లు తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసేలా పంచి పెట్టడానికి సిద్ధం చేసిన 1.56 కోట్ల విలువైన వస్తువులను, మరో రూ.5.24 కోట్ల విలువ చేసే ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 32 హింసాత్మక సంఘటనలు జరిగాయని, అందులో ఒకరు మరణించారని పేర్కొన్నారు. కాగా, రాజకీయ పార్టీలు, సంఘాలు, లేదా ఏ వ్యక్తి అయినా ఫిర్యాదులు, విజ్ఞాపనలు సమర్పించాలనుకుంటే, సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సచివాలయంలో తనకు నేరుగా అందజేయవచ్చని మీనా తెలిపారు. ప్రభుత్వ సెలవు దినాల్లో సచివాలయం గ్రౌండ్ ఫ్లోర్ రూమ్ నంబరు 129లోని ఫిర్యాదు సెల్ అందుబాటులో ఉంటుందని మీనా తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


అటవీ మార్గంలో శ్రీశైలానికి నడచివస్తున్న కర్ణాటక భక్తులు

శ్రీగిరిపై నేటి నుంచి ఉగాది ఉత్సవాలు

శ్రీశైలం, ఏప్రిల్ 5: శ్రీశైలం మహాక్షేత్రంలో శనివారం నుంచి ఉగాది మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శనివారం ఉదయం స్వామివారి యాగశాల ప్రవేశంతో ప్రారంభమై 10వ తేదీన ముగియనున్నాయి. ఐదు రోజులపాటు జరిగే ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకుంటున్నారు. వేలాది మంది కన్నడ భక్తులు అటవీమార్గం గుండా పాదయాత్రగా వస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దేవస్థానం ఏర్పాట్లను పూర్తి చేసింది. ఉత్సవాల సందర్భంగా మల్లన్న స్పర్శదర్శనాన్ని నిలుపుదల చేశారు. ఉత్సవాలు ముగిసేవరకు కేవలం స్వామివారి అలంకరణ దర్శనం మాత్రమే ఉంటుంది.

సౌదీ రోడ్డు ప్రమాదంలో మామా అల్లుళ్ల మృతి

- కూతురు, ఆమె పిల్లలకు తీవ్ర గాయాలు
- గుంటూరు నుంచి వచ్చిన మామకు స్వాగతం పలికి
- ఇంటికి తీసుకెళ్తున్నంతలోనే ఘోరం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సౌదీ అరేబియాలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నర్రవాడకు చెందిన ఒక ప్రవాసీ కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. అదే కుటుంబానికి చెందిన మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చేరారు. మృతులు మామా అల్లుళ్లు కాగా, మామ సెలవుల్లో తన కూతురి వద్ద గడపడానికి ప్రత్యేకించి ఆంధ్రా నుంచి సౌదీలో అడుగిడిన కొద్దిసేపటికే ఈ ఘోరం జరిగింది. నర్రవాడకు చెందిన భవనాసి సత్యబాబు కొన్నాళ్లుగా సౌదీలోని జుబేల్ పారిశ్రామిక నగరంలో పనిచేస్తూ కుటుంబంతో అక్కడే ఉంటున్నారు. గుంటూరు రత్నగిరినగర్‌కు చెందిన సత్యబాబు మామ.. అన్న వెంకట రామరావు తన అల్లుడు, కూతురు కీర్తి, ఇద్దరు మనవళ్లతో గడపడానికి గురువారం హైదరాబాద్ నుంచి బయలుదేరి సౌదీకి విమానంలో వచ్చారు. ఆయనకు ఇక్కడి దమ్మాంలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో కూతురు, అల్లుడు, ఇద్దరు మనవలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అంతా కలిసి కారులో ఆనందంగా జుబేల్‌కు తిరిగి వెళ్తుండగా భారీ వాహనం ఒకటి ఢీకొట్టడంతో మామా అల్లుళ్లు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన కీర్తిని, పిల్లలను ఆస్పత్రికి తరలించారు. కాగా, గల్ఫ్‌లో రంజాన్ పండుగ సెలవులు వారం రోజుల వరకు ఉంటాయి, మరో పది, పన్నెండు రోజుల వరకు మృతదేహాలను స్వదేశానికి పంపించడం కుదరదని ఆ కుటుంబానికి సహకరిస్తున్న తెలుగు ప్రవాసీ సంఘం (సాటా) ప్రతినిధులు ముజ్జమ్మీల్ శేఖ్, తారక్, పవన్ తెలిపారు.

2 నుంచి ఏపీఆర్‌సెట్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 5: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్ల భర్తీ కోసం చేపట్టిన ఏపీఆర్‌సెట్‌ను మే 2 నుంచి 5వరకు నిర్వహించనున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు విడతలుగా ఈ పరీక్షలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఈ నెల 10వ తేదీ నుంచి రాష్ట్ర ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, రాష్ట్రంలోని 14 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

జగన్‌ను 16 నెలలు జైల్లో పెట్టిన నల్లారిని చిత్తుగా ఓడిస్తాం: పెద్దిరెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 5: తప్పుడు కేసులతో అన్యాయంగా సీఎం జగన్మోహన్‌రెడ్డిని 16 నెలలు జైలులో పెట్టి వేధించిన అప్పటి సీఎం, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుంగనూరు మండలం ఆరడిగుంట, వనమలదిన్నె పంచాయతీల్లో మహిళా సంఘసభ్యులతో నిర్వహించిన ఎన్నికల ప్రచార సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రథమ శత్రువైన మాజీ సీఎం కిరణ్ వల్లే రాష్ట్ర విభజన జరిగిందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకపోవడానికి ఆయనే కారణమని అన్నారు. ఎన్నికల్లో తనకంటే ఎక్కువ మెజార్టీ వైసీపీ ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డికి వచ్చేలా చూడాలని ప్రజలను కోరారు. గతంలోనే మిథున్ ఇద్దరు కేంద్ర మంత్రులను ఓడించగా, ఇప్పుడు మాజీ సీఎంనే చిత్తుగా ఓడించి ఇంటికి పంపుతారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రిగా పదవులు అనుభవించి ప్రస్తుతం బీజేపీలోకి వెళ్లడం సిగ్గుచేటున్నారు. సీఎంగా కిరణ్ పాలనలో పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకున్నారని, ఇప్పుడు పుంగనూరుకు ఎలా వస్తారని దుయ్యబట్టారు.

ప్రభుత్వ తీరుతో రేషన్ డీలర్ల వ్యవస్థ నిర్వీర్యం

- రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు మాధవరావు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 5: రాష్ట్రంలో రేషన్ డీలర్ల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు దివి లీలా మాధవరావు ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లకు సమాంతరంగా మరో వ్యవస్థను ప్రభుత్వం తీసుకురావడం వల్ల డీలర్లు రోడ్డున పడ్డారన్నారు. ఎన్టీఆర్, చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో రేషన్ డీలర్లు గౌరవప్రదంగా జీవించారని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో కమిషన్ పెంచి రేషన్ డీలర్లను ఆదుకున్నారని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయంవల్ల రాష్ట్రవ్యాప్తంగా 29,500 మంది డీలర్లు తీవ్రంగా నష్టపోయారన్నారు. తమను ఆదుకునే పార్టీలకే ఎన్నికల్లో మద్దతుగా నిలుస్తామని స్పష్టంచేశారు.

వైసీపీవి అబద్ధాలు

- కృష్ణలంక రిటైనింగ్ వాల్ నిర్మాణం టీడీపీ హయాంలో ప్రారంభించాం..
- టీడీపీ అభ్యర్థులు కేశినేని చిన్ని, గద్దె రామ్మోహన్

కృష్ణలంక, ఏప్రిల్ 5 : కృష్ణలంక కరకట్ట ప్రాంతం లోని రిటైనింగ్ వాల్ నిర్మాణం సీంగా చంద్రబాబు ఉన్న సమయంలోనే ప్రారంభమైందని, కాని తమ హయాం లోనేనని వైసీపీ నాయకులు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కృష్ణలంక 21వ డివిజన్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచారంల్లో భాగంగా వారు పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలోనే రిటైనింగ్ వాల్ మొదటి ఫేజ్ నిర్మాణం పూర్తయిందని, వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత రెండో ఫేజ్ వాల్ నిర్మాణం చేయకుండా తాత్సారం చేస్తుంటే టీడీపీ చేసిన ఆందోళనలతో రెండో ఫేజ్ నిర్మాణం ప్రారంభించారన్నారు. రాబోయేది ఉమ్మడి ప్రభుత్వమేనన్నారు. పాతపోలీసు స్టేషన్ రోడ్డు మీదుగా ప్రారంభమైన ప్రచార యాత్ర కరకట్ట మీదుగా రణదీవెనగర్ వరకు సాగింది. ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో కేశినేని శ్రీదేవి, వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, వల్లూరి మధు, కొర్రా అప్పన్న, కేశనం భావన్నారాయణ, మోటేపల్లి చిన్నా, చెన్నుపాటి ఉషారాణి, బీజేపీ నాయకులు వాసా పల్లపురాజు, పోతంశెట్టి నాగేశ్వరరావు, పొట్లూరి దుర్గాప్రసాద్, జనసేన నాయకులు కొవ్వూరు కిరణ్‌బాబు, పోతిరెడ్డి అనిత, పోతిరెడ్డి రమణ, మోపిదేవి మోహన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కేశినేని చిన్ని, గద్దె రామ్మోహన్


శివనాథ్ సమక్షంలో టీడీపీలో చేరిన ఎన్ఆర్ఐలు

ఏపీ అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

విద్యాధరపురం : రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నేతలు అన్నారు. కెనడాకు చెందిన వెంకట్ సురేష్ చౌదరి, లక్ష్మీకాంతరెడ్డి అన్నారు సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం ఆధ్వర్యంలో టీడీపీ కండువగా కప్పుకున్నారు.

నేటి నుంచి గాలిబ్ షహీద్ దర్గా ఉరుసు

- వేలల్లో భక్తుల రాక
- ఏర్పాట్లు చేసిన దర్గా కమిటీ


ముస్తాబైన గాలిబ్ షహీద్ దర్గా

భవానీపురం, ఏప్రిల్ 5 : 41వ డివిజన్‌లో భవానీపురంలో సయ్యద్ హజ్రత్ గాలిబ్ షహీద్ దర్గాలో 6, 7వ తేదీల్లో జరిగే 436వ ఉరుసు వేడుకలకు ఏర్పాట్లు చేశారు. దర్గా ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించినట్టు దర్గా కమిటీ కార్యవర్గం ముస్తాక్ అహ్మద్, అల్తాఫ్, రహీం, రెహ్మాన్, చంద్రబాబు బాషా, ఇషాక్,సత్తార్‌లు తెలిపారు. ముజావర్ల ఇంటి నుంచి శనివారం రాత్రి మహాత్ములకు చెందిన గంధాన్ని మేళ,తాళాల నడుమ భవానీపురం వీధుల్లో ఊరేగిస్తారు. ఆదివారం ఉదయం దర్గాలో గంధను ప్రవేశపెడతాన్నారు. రంజాన్‌లో ఉరుసు వేడుకలు రావడంతో కమిటీ చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అన్ని ఏర్పాట్లు చేసింది. భవానీపురం సీఐ వి.కృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు రానున్నారని కమిటీ తెలిపింది.

డ్రైవింగ్ సర్టిఫికెట్ల అందజేత



డ్రైవర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బాయన వెంకట్రావ్

పటమట, ఏప్రిల్ 5 : ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చిసెంటర్(అంపాపురం)లో డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 1069వ బ్యాచ్ ట్రైనీలకు, రక్తదానం చేసిన వారికి ఏపీ సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఘం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాయన వెంకటరావ్ శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. డ్రైవర్ల సాంకేతిక పరిజ్ఞానం రహదారి భద్రతకు దోహదపడుతుందన్నారు. కార్యక్ర మంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు, స్పోర్ట్సు కార్యదర్శి కొనేరు జగదేశ్వరరావు, ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు, అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

- సమతా సైనిక్‌దళ్


మాట్లాడుతున్న పాలేటి మహేశ్వరరావు

ధర్నాచౌక్, ఏప్రిల్ 5: ఎన్టీఆర్ జిల్లా కొత్తూరు తాడేపల్లిలో అక్రమ మైనింగ్ ద్వారా సంపాదించిన సుమారు రూ2 వేల కోట్లను జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేల గెలుపు కోసం వినియోగించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారని సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు ఆరోపించారు. మంత్రి జోగి రమేష్, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఆధ్వర్యంలో అక్రమంగా మైనింగ్ యథేశ్చగా జరుగుతుందన్నారు. దీనిని అరికట్టడంలో పోలీసు, మైనింగ్‌శాఖలు విఫలమైయ్యాయన్నారు. పోలవరం కుడి కాలువ గట్టు బలోపేతానికి పోసిన పోలవరం మట్టిని అక్రమంగా తరలించగా వచ్చిన సుమారు రూ.వెయ్యి కోట్లు మంత్రి అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో గుంటూరులో వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం వాడుతున్నారన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ అక్రమ మైనింగ్ గురించి తనకేమి తెలియదన్నట్టు ఎంపీ కేశినేని నాని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ అంశాలను ఎన్నికల కమిషన్, కేంద్ర సంస్థలకు ఫిర్యాదు చేస్తామన్నారు. అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకునేంతవరకు తమ పోరాటం ఆగదన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిల్లి సురేంద్రబాబు మాట్లాడుతూ గతంలో వసంత కృష్ణప్రసాద్‌ను మంచి వ్యక్తి అని పొగిడిన కేశినేని నాని వైసీపీలోకి వెళ్ళిన తర్వాత వసంత కృష్ణప్రసాద్ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. అవినీతి వైసీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

నేడు దేవదాయ శాఖ జోన్-2 పరిధి ఈవోల సమావేశం

వన్‌టౌన్, ఏప్రిల్ 5 : దేవదాయశాఖ జోన్-2 పరిధి (ఉమ్మడి కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లా)లోని ఆలయాల, సత్రాల కార్యనిర్వాహణాధికారులు(ఈవో)ల సమావేశం శనివారం పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమల దేవస్థానంలో జరగనున్నది.ఉన్నతాధికారులు తరచూ సమావేశాలు నిర్వహించడం వల్ల ఈవోలు తాము చేయవలసిన పనులు చేయలేకపోతున్నారన్నారు.

సీఎం జగన్‌కు జరిమానా విధించాలి

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 5 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనల్లో ప్రతి చోట చెట్లు నరికివేస్తున్నారని చెట్ల నరికివేతపై అటవీశాఖ స్పందించి జగన్‌పై కేసు నమోదు చేయాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మాట్లాడుతూ చెట్లను నరికివేసే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో చెట్ల నరికివేయించే కార్యక్రమానికి జగన్ స్వస్తి పలకాలని లేని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

ప్రజాగళం, రోడ్‌షోలను విజయవంతం చేద్దాం


పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్ 5 : చంద్రబాబు ప్రజాగళం సభను, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రోడ్‌షోను విజయవంతం చేయాలని కూటమి ఉమ్మడి అభ్యర్థి బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి జరిగిన టీడీపీ జనసేన బీజేపీ పోరంకి శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో గెలిచిన వెంటనే పోరంకి అభివృద్ధిపై చంద్రబాబుతో మాట్లాడి నిడమానూరు రోడ్డును వెడల్పు చేయడం, పంటకాల్వ రోడ్డును పోరంకి మీదుగా నిర్మించడం లాంటి ప్రధాన పనులు చేపట్టి కానూరుతో సమానంగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. పార్టీల కతీతంగా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. ఇప్పుడు నియోజవర్గంలోకి డంప్ అయిన వైసీపీ అభ్యర్థి మైలవరం, పెడనల్లో ఏమి చేశాడో పుంఖానుపుంఖాలుగా అక్కడి వారు చెబుతుంటే కడుపు రగిలిపోతోందని పేర్కొన్నారు. ఓడినా గెలిచినా స్థానికంగా ఉండి నిత్యం ప్రజల్లో తిరుగుతూ ప్రజలకు ఒక అండగా ఉంటూ భరోసానిస్తూ ఉన్నాననే ధైర్యం తనకుందన్నారు. కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, కుర్రా నరేంద్ర, ముప్పా రాజా, తాతపూడి గణేష్, కరిమికొండ సురేష్, కరిమికొండ శ్రీను, యండమనేని శ్రీనివాస్, పిచ్చియ్య, వంగూరి మురళి, బొల్లం వీరన్న, నెరుసు ఆంజనేయులు, శుభశేఖర్, మల్లయ్య, కాశీ విశ్వేశ్వరరావు, మంచినేని పరమేష్, ఆకునూరి సుబ్బారావు, బొప్పన లావణ్య, దండమూడి సాయిసుధ, చనుమోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంగీత పీఠం స్వర్ణోత్సవాలు 9 నుంచి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 5 : త్యాగరాజ సంగీత విద్యాపీఠం స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసుల సంగీత కచేరీలు ఏర్పా టు చేసినట్టు పీఠం ఉపాధ్యక్షుడు సింగరాజు గోవర్ధన్ తెలిపారు. ఉగాది సందర్భంగా ఈనెల 9వ తేదీన వాగ్గేయకార కీర్తనలను సింగరాజు కల్యాణి, విజయలక్ష్మి, కాశీపట్నపు ఉమ గానం చేస్తారన్నారు. గుం టూరు ద్రోణేంద్రకుమార్ వేణుగానం చేస్తారన్నారు. శిష్టు ప్రభాకర కృష్ణమూర్తి శాస్త్రి పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ వయొలినిస్టు గండూరి శ్రీనివాసమూర్తికి ఈనెల 10వ తేదీన ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. గండూరి నాగేశ్వరశర్మ గాత్ర కచేరీ, డి.వి. మోహనకృష్ణ గాత్ర కచేరీ ఏర్పాటు చేశామన్నారు.


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కేశినేని శివనాథ్, నెట్టెం


రామవరప్పాడు రింగ్‌లో..

సమతావాది బాబూ జగ్జీవన్‌రామ్

కృష్ణలంక, ఏప్రిల్ 5 : దేశ మాజీ ఉప ప్రధాని, సమతావాది బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయిం ట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో వి.శ్రీని వాసరావు తదితరులు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను స్మరించుకొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ అధికారులు పాల్గొన్నారు.


బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

టీడీపీ జిల్లా కార్యాలయంలో..

ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ 116వ జయంతిలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్‌వర్మ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ ఆయన జీవిత ప్రస్థానాన్ని వివరిస్తూ మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కోగంటి రామారావు, పరిశపోగు రాజేష్, దేవరపల్లి ఆంజనేయులు, దున్నా ఏసురత్నం, పామర్తి కిషోర్‌బాబు, కోడూరు ఆంజనేయవాసు, జాస్తి సురేష్, ఆర్.ప్రభాకర్, పి.వినయ్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య భవన్‌లో..

గవర్నర్‌పేట : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె. హర్షవర్ధన్ ఆధ్వర్యంలో శుక్రవారం లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్-బాబూ జగ్జీవన్‌రామ్ ఐక్య భవన్ వద్ద ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఐక్య భవన్ ప్రాంగణంలోని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రామవరప్పాడు రింగ్‌లో..

గుణదల : రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి శుక్రవారం జై ఆంధ్ర ఉద్యమ నాయకుడు లాం జయబాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం యువత రాజకీయాల్లోకి వచ్చి ఆయన తరహాలో నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని సమాజ సేవచేయాలని కోరారు. కార్యక్రమంలో డీబీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు, జాగృతి దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాసాని గణేష్ పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ భవన్‌లో ..

విద్యాధరపురం : గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయం ఎన్‌టీఆర్ భవన్‌లో శుక్రవారం జగ్జీవన్‌రామ్‌కు టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్‌వర్మ ఆధ్వర్యంలో ఘనంగా నేతలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), ఎన్‌టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌లు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను నాయకులు కొనియాడారు. పి.ప్రభాకర్, రెంటపల్లి శ్యామ్, దోమకొండ రవి కుమార్, దేవరపల్లి ఆంజనేయులు, నందిపాటి దేవానంద్ పాల్గొన్నారు.



లెనిన్ సెంటర్‌లోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ఐక్య భవన్‌లో..

దుర్గమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వన్‌టౌన్, ఏప్రిల్ 5 : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో శుక్ర వారం అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎండవేడిమి ఉన్నప్ప టికీ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా శీఘ్ర దర్శనం కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. పలువురు భక్తులు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. వేసవి దృష్ట్యా దేవస్థానం ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద భక్తులు సేద తీరారు. దేవస్థానం తరఫున భక్తులకు మజ్జిగ పంపిణీ జరిగింది.



అమ్మవారి దర్శనం కోసం క్యూలలో భక్తులు

శాంతి కల్యాణం..

ఆర్జిత సేవ కింద ఆలయంలో గంగా, పార్వతీ సమేత మల్లేశ్వరుల శాంతి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

ధర్మపదం వేదికపై..

ధర్మపదం వేదికపై శుక్రవారం గుడిపాటి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడిపాటి జయరామ సుధాకర్ యాగ రక్షణ హరికథ గానాన్ని వీనుల విందుగా వినిపించారు. వయోలిన్‌పై డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి, మృదంగంపై జగన్మోహిని వాయిద్య సహకారాన్ని అందించారు.


పందిరి కింద సేదతీరుతున్న భక్తులు


నూతనవధువరులకు ఆశీస్సులు అందజేస్తున్న అర్చకుడు

ఇమామ్‌తో బీజేపీ ఢీ

రాంపూర్‌లో ఆసక్తికరంగా లోక్‌సభ రాజకీయం.. జైలు నుంచే కీలక నేత ఆజంఖాన్ చక్రం

- ఢిల్లీ జామా మసీదు ఇమాంను బరిలో దింపిన ఎస్పీ.. పార్టీలో వర్గ పోరు

రాంపూర్... ఈ పేరు వినగానే రాజకీయ ఆసక్తి ఉన్న తెలుగు వారందరికీ గుర్తొచ్చే పేరు జయప్రద. రెండుసార్లు (2004, 2009) ఆమె ఆ నియోజక వర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) తరఫున పోటీ చేసి గెలిచి, పార్లమెంటులో అడుగుపెట్టారు. మోదీ ప్రభంజనంలో 2014లో ఆ సీటు బీజేపీ గెలిచినప్పటికీ.. 2019లో మళ్లీ ఎస్పీ తరఫున ఆజంఖాన్ పోటీ చేసి గెలిచారు. అయితే.. విద్వేషపూరిత వ్యాఖ్యల కేసులో ఆయన జైలుపాలయ్యారు! దాంతో, ఇప్పుడు సమాజ్‌వాదీ పార్టీ ఢిల్లీ జుమా మసీదు ఇమామ్ మొహిబుల్లా నద్వీని బరిలోకి దించింది. ఆయనతో బీజేపీ సిటింగ్ ఎంపీ ఘన్‌శ్యాం సింగ్ లోధీ ఢీకొంటున్నారు. దీంతో, ఇక్కడ ఆసక్తికర పోరు నెలకొంది. తొలుత కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న రాంపూర్ లోక్‌సభ నియోజక వర్గం కొంత కాలంగా సమాజ్‌వాదీ పార్టీ గుప్పిట్లో ఉంది. అందుకు కారణం ఆ పార్టీ నేత ఆజంఖాన్. ఆ నియోజకవర్గ ప్రాంతమంతా నాలుగు దశాబ్దాలుగా ఆయన కంచుకోట. రాంపూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఆయన ఏకంగా 10సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. లోక్‌సభ స్థానం నుంచి 2019లో ఒకసారి ఎన్నికయ్యారు. అయితే, ఆ తర్వాత ఆయన జైలుకు వెళ్లడంతో ఖాళీ అయిన ఈ సీటుకు 2022లో జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ తరఫున ఘన్‌శ్యాం లోధీ గెలిచారు. అయినా.. ముస్లింలు అధికంగా ఉండే నియోజకవర్గం కావడంతో ఆజం ఖాన్ పట్టు అలాగే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే, ఈసారి ఇక్కడ ఎస్పీ టికెట్ ఎవరికి ఇవ్వాలనే అంశంపై ఆ పార్టీలో సందిగ్ధం నెలకొంది. తన అనుచరులను అక్కణ్నుంచీ రంగంలోకి దింపాలని లేదా స్వయంగా అఖిలేశ్ యాదవే అక్కణ్నుంచీ పోటీ చేయాలని ఆజంఖాన్ ప్రతిపాదించారు. కానీ,



అందుకు అఖిలేశ్ ఒప్పుకోలేదు. అయినా ఆజంఖాన్ తన పట్టు వీడకపోవడంతో.. ఆయన ఖైదీగా ఉన్న సీతాపూర్ జైలుకు వెళ్లి మరీ కలిసి దీనిపై చర్చించారు. కానీ, ఆజంఖాన్ అనుచరులకు టికెట్ ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో ఆజంఖాన్ వర్గం ఆయన పేరుతో ఒక లేఖ విడుదల చేసింది. రాంపూర్ నుంచి పోటీ చేయడానికి అఖిలేశ్ తిరస్కరించినందున తాము ఈ ఎన్నికలను బహిష్కరించే ఆలోచనలో ఉన్నట్టు అందులో వెల్లడించింది. అఖిలేశ్ వారిని పట్టించుకోకుండా.. ఢిల్లీలోని సుప్రసిద్ధ జామా మసీదులో ఇమామ్‌గా ఉన్న మొహిబుల్లా నద్వీని రాంపూర్ బరిలోకి దించారు. ఆగమేఘాలపై ఆయన్ను ప్రత్యేక విమానంలో రప్పించి నామినేషన్ వేయించారు. దీంతో ఆజంఖాన్ అనుంగు అనుచరుడు.. ఆయనకు జైలు శిక్ష పడడం వల్ల రాంపూర్ సీటుకు జరిగిన ఉప ఎన్నికలో పోటీ చేసి ఓడిపోయిన అసీం రాజా కూడా నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు.. సమాజ్‌వాదీ పార్టీకే చెందిన సీనియర్ నేత అబ్దుల్ సలాం కూడా నామినేషన్ వేశారు.

నామినేషన్ వేసినా..

రాంపూర్ నియోజకవర్గానికి అసీం రాజా, అబ్దుల్ సలాం, మొరాదాబాద్‌కు ఎస్టీ హసన్ వేసిన నామినేషన్లను రిటర్నింగ్ ఆఫీసర్ తిరస్కరించారు. పార్టీ నుంచి ఏ, బీ ఫారాలు లేనందుకు అసీం, అబ్దుల్ నామినేషన్లను తిరస్కరించగా.. మొరాదాబాద్‌లో తమ అభ్యర్థి రుచి వీరాయేనంటూ సమాజ్‌వాదీ పార్టీ అధికారికంగా జిల్లా అధికారులకు లేఖ రాయడంతో ఏ, బీ ఫారాలున్నా హసన్ నామినేషన్‌ను తిరస్కరించారు. కాగా, ముస్లింల జనాభా ఎక్కువగా ఉండే రాంపూర్ తొలి నుంచీ కాంగ్రెస్ కంచుకోట. 1952 నుంచి 1971 దాకా కాంగ్రెస్ పార్టీ అక్కడ వరుస విజయాలు సాధించింది. 1977లో తొలిసారి అక్కడ కాంగ్రెసేతర నేత.. జనతా పార్టీకి చెందిన రాజేంద్ర కుమార్ శర్మ గెలుపొందారు. ఆ తర్వాత 1980 నుంచి 1989 దాకా ఈ నియోజక వర్గం కాంగ్రెస్ చేతిలో ఉంది. 1991, 1998, 2014 ఎన్నికల్లో.. 2022 ఉప ఎన్నికలో బీజేపీ గెలుపొందింది. 2004 నుంచి 2014 దాకా ఈ నియోజకవర్గ ఎంపీగా జయప్రద (సమాజ్‌వాదీ) ఉన్నారు. 2019లో ఆజంఖాన్ గెలిచినా.. ఆయనకు జైలు శిక్ష పడడంతో 2022లో ఉప ఎన్నిక వచ్చింది. అందులో బీజేపీ గెలిచింది. అప్పట్లో 42 వేల ఓట్ల తేడాతోనే బీజేపీ అభ్యర్థి లోధీ గెలిచారు.

\- సెంట్రల్ డెస్క్

భూగర్భంలో మహాసముద్రం

- భూ ఉపరితలానికి 700 కిలోమీటర్లలో లోతులో అనంత జలరాశి



న్యూయార్క్, ఏప్రిల్ 5: భూమిపైన ఉన్న సప్త సముద్రాల గురించే మనకు తెలుసు! కానీ.. భూమి అడుగున 700 కిలోమీటర్ల లోతులో ఓ మహాసముద్రం ఉందనే విషయం తెలుసా? అమెరికాలోని ఇలినాయ్ రాష్ట్రానికి చెందిన నార్త్‌వెస్ట్రన్ యూనివర్సిటీ శాస్త్రజ్ఞులు ఈ సంచలన విషయాన్ని వెల్లడించారు. భూమి రహస్యాలను తెలుసుకునే పరిశోధనలో భాగంగా వారు అమెరికావ్యాప్తంగా 2000 సెస్మోగ్రాఫ్‌లను (భూకంప తీవ్రతను కొలిచే పరికరాలు) ఏర్పాటు చేశారు. మనకు తెలియకుండా భూమి లోతుల్లో వచ్చే సూక్ష్మ భూప్రకంపనలను ఆ సెస్మోగ్రాఫ్‌లు నమోదు చేశాయి. అయితే.. ఆ భూకంప తరంగాలు భూమిలోని కొన్ని నిర్దిష్ట ప్రాంతాలకు వచ్చేసరికి వాటి వేగం మందగించడాన్ని శాస్త్రజ్ఞులు గుర్తించారు. భూపటలం భూమి ఉపరితలం నుంచి 40 కిలోమీటర్ల దాకా వ్యాపించి ఉంటుంది. అక్కణ్నుంచి కిందికి 2,865 కిలోమీటర్ల దాకా వ్యాపించి ఉండేది మ్యాంటిల్. అదుగో.. ఆ పొరలోనే రింగ్‌వుడైట్ అనే నీలిరంగు రాతిలో ఈ బ్రహ్మాండమైన జలరాశి తొణికిసలాడుతోందని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన జియోఫిజిసిస్ట్ స్టీవెన్ జాకబ్‌సెన్ తెలిపారు.

అమెరికాలో భూకంపం

అమెరికాలోని అత్యంత జనసాంద్రత ఉండే న్యూయార్క్ నగరంలో శుక్రవారం భూకంపం సంభవించింది. భూమి, భవనాలు కంపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. న్యూయార్క్‌తోపాటు చుట్టు పక్కల భూకంప ప్రభావిత నగరాలకు చెందిన ప్రజలు ఈ విషయంపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. రిక్టర్ స్కేల్‌పై 4.8 భూకంప తీవ్రత నమోదైంది. భూకంపం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు.

శాంతి స్వరూప్‌తో నా అనుబంధం సుదీర్ఘమైంది: చంద్రబాబు

- దూరదర్శన్ అంటే వార్తలు... వార్తలంటే శాంతి స్వరూప్: లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు న్యూస్ రీడర్, యాంకర్, రచయిత శాంతి స్వరూప్ మరణం పట్ల టీడీపీ అధినేత చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "తెలుగు దూరదర్శన్‌లో వార్తలు అనగానే మొదటగా గుర్తొచ్చేది శాంతి స్వరూప్. ఉమ్మడి రాష్ట్రానికి నేను సీఎంగా ఉన్నప్పుడు మేమిద్దరం కలసి 'ప్రజలతో ముఖ్యమంత్రి' అనే కార్యక్రమాన్ని ప్రతి సోమవారం చేసే వాళ్లం. ఆరేళ్ల పాటు సాగిన ఆ కార్యక్రమంలో ప్రజలు నేరుగా తమ సమస్యలు చెప్పుకుని, పరిష్కారం పొందేవారు. ఈ విధంగా మా అనుబంధం సుదీర్ఘమైంది" అని చంద్రబాబు గుర్తు చేశారు. శాంతి స్వరూప్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరో ప్రకటనలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్.. 'దూరదర్శన్ అంటే వార్తలు.. వార్తలంటే శాంతి స్వరూప్.. అన్నంతగా తెలుగు వీక్షకులకు దగ్గరైన ఆయన మరణం దిగ్భ్రాంతికి గురి చేసింది' అని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు.. 'దూరదర్శన్‌లో దాదాపు 28 ఏళ్లు తెలుగు వార్తలు చదివి, తెలుగు భాషకే వన్నె తెచ్చిన చిరస్మరణీయులు శాంతి స్వరూప్' అని అన్నారు.

'పోసాని'కి ఏం తెలుసు: మద్దిపట్ల

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి లాంటి నీచ నాయకులు అధికారంలో ఉంటే.. పోసాని కృష్ణమురళీ లాంటి నీతిమాలిన వ్యక్తులు నోటికొచ్చినట్లు మాట్లాడుతుంటారని టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్య ప్రకాశ్ శుక్రవారం మండిపడ్డారు. 'పాలన చేతకాని జగన్‌రెడ్డికి పోసాని లాంటి భజనగాళ్లు ఉండాల్సిందే. పోసుకోలు పోసాని... జగన్‌కు వత్తాసు పలకడం సిగ్గుచేటు. జగన్‌కు చిడతలు వాయించడం తప్ప ఇంకేం తెలుసు? రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టిన పులకేశి జగన్‌రెడ్డి' అని ధ్వజమెత్తారు.

నాటి పీపీఏ రద్దు... ఇప్పుడదే ముద్దా?: లంకా దినకర్

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): యాక్సెస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కోసం వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా ఉల్లంఘనలకు పాల్పడిందని బీజేపీ నేత లంకా దినకర్ ఆరోపించారు. విజయవాడలో ఆయన మాట్లాడుతూ.. 'సహజ వనరులు ఏ విధంగా కేటాయించాలో సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో పేర్కొన్నా రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది. ఏపీ ట్రాన్స్‌కోతో విండ్, సోలార్ ప్రాజెక్టుల కోసం సుజలాన్ ఎనర్జీ-యాక్సెస్ ఎనర్జీ కంపెనీలు ఉమ్మడి ఒప్పందం చేసుకున్నాయి. 2015-19 మధ్య జరిగిన ఈ పీపీఏని జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. గత ఏడాది అందులో ఒక కంపెని అయిన యాక్సెస్ ఎనర్జీకి పాత అగ్రిమెంటును పునరుద్ధరించింది. దీని వెనుక పెద్ద మతలబు ఉంది' అని అన్నారు.

శివానందరెడ్డికి టీ పోలీసుల నోటీసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): భూ దందాలు, అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ పోలీస్ అధికారి శివానందరెడ్డికి సీసీఎస్ పోలీసులు 41 ఏ సీఆర్‌పీసీ నోటీసులు జారీ చేశారు. ఆయనతో పాటు ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఆరోగ్యం రెడ్డికీ ఏప్రిల్ 4న నోటీసులు జారీ చేశారు. విచారణకు రావాలని ఆదేశించారు. ఏపీలోని నంద్యాలకు చెందిన మాండ్ర శివానందరెడ్డి గతంలో హైదరాబాద్‌లో పోలీస్ అధికారిగా పనిచేశారు. పదవీ విరమణ చేసిన తరువాత రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి అడుగుపెట్టిన ఆయన రాజేంద్రనగర్ శివారు ప్రాంతమైన బుద్వేల్ పరిధిలోని 281 ఎకరాల అసైన్డ్ భూమిని అక్రమంగా రిజిస్టర్ చేయించుకున్నారని కేసు నమోదయింది. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు ముగ్గురిని శుక్రవారం విచారించారు. తాజాగా మరింత సమాచారం కోసం శివానందరెడ్డికి, ఆరోగ్యం రెడ్డికీ 41ఏ నోటీసులు జారీ చేశామని సీసీఎస్ డీసీపీ పేర్కొన్నారు.

మదర్సా లౌకికవాదాన్ని ప్రభావితం చేయదు

- అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు మధ్యంతర స్టే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: ఉత్తరప్రదేశ్‌లోని 17 లక్షల మంది మదర్సా విద్యార్థులకు భారీ ఊరట లభించింది. యూపీ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్-2004 రాజ్యాంగ విరుద్ధమని, లౌకికవాద సూత్రాన్ని ఉల్లంఘిస్తుందని పేర్కొంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు శుక్రవారం మధ్యంతర స్టే విధించింది. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం హైకోర్టు నిర్ణయం ప్రాథమికంగా సరైందికాదని పేర్కొంటూ కేంద్రం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, మదర్సా బోర్డుకు నోటీసులు జారీ చేసింది. మదర్సా విద్యా చట్టం-2004లోని నిబంధనలను అలహాబాద్ హైకోర్టు తప్పుగా అర్థం చేసుకుందని, బోర్డు ఏర్పాటు లౌకికవాదాన్ని ప్రభావితం చేయదని వెల్లడించారు.

ఈ-గేమింగ్ పిటిషన్లపై 'సుప్రీం'లో విచారణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: కేంద్రం తమపై 28శాతం జీఎస్టీ విధించడాన్ని సవాల్ చేస్తూ దేశంలోని పలు హైకోర్టులలో ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలు దాఖలు చేసిన పిటిషన్‌లపై విచారణ ఇక నుంచి సుప్రీంకోర్టులో జరగనుంది. ఈ పిటిషన్‌లను ఉమ్మడిగా విచారించాలంటూ కేంద్రప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానాన్ని శుక్రవారం కోరగా.. తొమ్మిది హైకోర్టులలో దాఖలైన మొత్తం 27 పెండింగ్ పిటిషన్‌లను సుప్రీంకోర్టు తనకు బదిలీ చేసుకుంది. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌లపై విచారణ జరపనుంది. ఈ నెల 20లోగా సమాధానమివ్వాలని ధర్మాసనం కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది.

బర్త్ రిజిస్టర్‌లో తల్లిదండ్రుల మతం నమోదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: పిల్లల జననాన్ని రిజిస్టర్ చేసే సమయంలో తల్లిదండ్రుల మతం వివరాలు విడివిడిగా నమోదు చేస్తారు. బర్త్ రిజిస్టర్‌లో ఇంత వరకు 'కుటుంబ మతం' అన్న వివరాన్ని మాత్రమే నమోదు చేస్తుండగా, ఇకపై 'తల్లి మతం', 'తండ్రి మతం' వేర్వేరుగా రాస్తారు. కేంద్ర హోం శాఖ రూపొందించిన మోడల్ రూల్స్‌లో ఈ విషయాన్ని పొందుపరిచింది.

భారత ఎన్నికల్లో చైనా 'ఏఐ' జోక్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: అమెరికా అధ్యక్ష పదవికి 2016, 2020లో జరిగిన ఎన్నికల్లో.. రష్యా జోక్యం చేసుకుందని, ట్రంప్‌ను అధ్యక్షుడిగా చేసేందుకు ప్రయత్నించిందని ఆరోపణలు వచ్చాయి గుర్తుందా? ఇప్పుడు అదే తరహాలో.. మన దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను కృత్రిమ మేధతో (ఏఐ) ప్రభావితం చేయడానికి చైనా జోక్యం చేసుకునే అవకాశం ఉందని మైక్రోసాఫ్ట్ ఓ నివేదికలో హెచ్చరించింది. ఏఐ ద్వారా సృష్టించిన కంటెంట్‌ను.. చైనా సోషల్ మీడియా ద్వారా వైరల్ చేసే అవకాశ ఉందని పేర్కొంది.

విశాఖలో 'గనుల' మంత్రాంగం!

- కార్పొరేట్ కంపెనీతో గనుల శాఖ ఉన్నతాధికారి రహస్య భేటీ
- ప్రకాశం జిల్లాలో విలువైన ఖనిజానికి టెండర్‌పై కీలక చర్చ?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



విశాఖపట్నంలో ఇటీవల జరిగిన ఓ రహస్య సమావేశంలో గనుల శాఖకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిసింది. తాజాగా రాష్ట్రంలో బడా ప్రాజెక్టు దక్కించుకున్న ఓ కార్పొరేట్ కంపెనీ ఈ మీటింగ్‌ను ఏర్పాటు చేసింది. గత సోమవారం అత్యంత రహస్యంగా జరిగిన భేటీకి గనుల శాఖలోని ఓ ముఖ్య అధికారి హాజరై, కీలక అంశాలు చక్కబెట్టినట్లు తెలిసింది. అంతకుముందు విజయనగరంలో జరిగిన సమావేశంలో చర్చకొచ్చిన అంశాలకు కూడా ఇందులో పరిష్కారాలు కనిపెట్టినట్లు సమాచారం. ఛత్తీ‌స్‌గఢ్‌లోని ఒక కోల్‌మైన్‌పై ఆ కార్పొరేట్ కంపెనీ ఆశలు పెట్టుకుంది. ఆ మైన్ ఎండీసీ చేతిలో ఉన్నప్పటికీ అక్కడ ఏనుగుల సంరక్షణ కేంద్రం తెరపైకి రావడంతో మైనింగ్ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో మైనింగ్ నుంచి తప్పుకోవాలని ఎండీసీ భావించింది. అదే జరిగితే సదరు కోల్ మైన్‌ను దక్కించుకోవాలని ఆ సంస్థ భావిస్తోంది. మరోవైపు ప్రకాశం జిల్లాలో ఉన్న విలువైన ఖనిజంపైనా ఆ కార్పొరేట్ కంపెనీ కన్నేసింది. ఆ కంపెనీ ప్రతినిధులు తాడేపల్లికి వచ్చి ముఖ్యనేతను కలసి దీనిపై హామీ కూడా తీసుకున్నారు. ఆ తర్వాత పరిణామాలు శరవేగంగా మారిపోయాయి. అప్పటికే జాయింట్ వెంచర్‌లో ఉన్న కంపెనీ పక్కకు తప్పుకుంది. ఆ వెంటనే ఖనిజం తవ్వకం, ప్రాసెస్, అమ్మకాలు చేసేందుకు ఉమ్మడి భాగస్వామి కోసం సర్కారు టెండర్ పిలిచింది. ముందే అనుకున్నట్టుగా కార్పొరేట్ కంపెనీకే టెండర్ దక్కింది. టెండర్ నిబంధనలను వారికి అనుకూలంగా మార్చేశారు. ఉమ్మడి భాగస్వామ్య ఒప్పందంలో 11శాతం ఎండీసీకి, 89 శాతం ప్రైవేటు కంపెనీకి ఉండేలా నిబంధన తీసుకొచ్చారు. ఎండీసీ పేరిట ఉన్న ఖనిజాలను ప్రైవేటుకు దోచిపెట్టేలా నిబంధన తీసుకొచ్చారని, ఖనిజ వనరులను కార్పొరేట్‌కు కట్టబెట్టబోతున్నారంటూ ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేసినా సర్కారు, గనులశాఖ పట్టించుకోలేదు. ఇంతలో కోడ్ అమల్లోకి రావడంతో అధికారికంగా జరగాల్సిన టెండర్ ఒప్పందాలు నిలిచిపోయాయి. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం వస్తే టెండర్లు రద్దుచేసే ప్రమాదం ఉందని, కోడ్‌కు ముందే పాత తేదీలతో ఒప్పందాలు జరిగినట్టుగా సర్వం సిద్ధం చేయాలని అధికారులపై ఒత్తిళ్లు వచ్చాయని తెలిసింది. ఈ నేపథ్యంలో గతనెలలో విజయనగరంలో ఓ సమావేశం జరిగినట్లు తెలిసింది. టెండర్ దక్కించుకున్న ప్రైవేటు కంపెనీ ముఖ్యులతో పాటు గనులశాఖ ఉన్నతాధికారి ఈ భేటీలో పాల్గొన్నట్లు సమాచారం. తాజాగా ఈ నెల 1న విశాఖలో మరో రహస్య సమావేశం జరిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ భేటీకి గనులశాఖ ఉన్నతాధికారి ఒక్కరే వెళ్లారు. వెంట అధికారిక సిబ్బందిని కూడా తీసుకెళ్లలేదు. దాదాపు గంటన్నర పాటు జరిగిన సమావేశంలో ప్రకాశం జిల్లా టెండర్ అంశంపైనే కీలక చర్చ జరిగినట్లు తెలిసింది. కోడ్ రావడానికి ముందే ఎండీసీకి, ఆ కార్పొరేట్ కంపెనీకి మధ్య లిఖితపూర్వక ఒప్పందాలు జరిగినట్లుగా రికార్డుల తయారీ, ఇతర మేళ్ల గురించి చర్చలు జరిగినట్లు సమాచారం. ఆ సంస్థకే టెండర్ దక్కడం వెనక 'ఎన్నికల నిధి' అజెండా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. దీనితోపాటు ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయని తెలుస్తోంది. ఆ సమావేశం తర్వాత గనులశాఖ అధికారి విశాఖ నుం చి విజయవాడకు వచ్చారు. సాయంత్రానికి కార్యాలయానికి చేరుకొని ఆ టెండర్ ఫైలు, ఇతర అంశాలను సమీక్షించినట్లు తెలిసింది. విశాఖ భేటీలో ఏదో పెద్ద మతలబే ఉంటుందని ఎండీసీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఉద్యోగుల్లో చీలిక తెస్తున్నారు

- ఈసీఐకి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న వివిధ వర్గాల ఉద్యోగుల్లో చీలిక తెచ్చి ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు అధికార పార్టీ ప్రయత్నిస్తోందంటూ రాష్ట్ర సచివాలయ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ప్రమోషన్లలో రిజర్వేషన్ల అంశంలో 'క్యాచ్ అప్ రూల్'ను అమలు చేయాలంటూ ప్రభుత్వం నియమించిన మిడ్ లెవల్ అధికారుల కమిటీ ఇచ్చిన నివేదికను రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాలు వ్యతిరేకించాయి. దీంతో ప్రభుత్వం మిడ్‌లెవల్ అధికారులు ఇచ్చిన నివేదికను పరిశీలించాలంటూ ఐఏఎస్‌లతో మరో కమిటీ వేసింది. ఇప్పుడు ఈ కమిటీ సచివాలయంలో నిర్వహిస్తున్న కార్యాకలాపాలు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల మధ్య, మిగిలిన ఉద్యోగుల మధ్య చీలిక తెస్తున్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్రంలో 99 శాతం ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారు. ఈ సమయంలో మెజారిటీ ఉద్యోగులను లాక్కోవడం ద్వారా ప్రభుత్వం లబ్ధిపొందాలని భావిస్తోందని, దీని వల్ల ఎన్నికల కోడ్‌కు భంగం కలుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో జరిగిన ఏపీ సచివాలయ అధ్యక్షుడి ఎన్నికల సమయంలోనూ ప్రభుత్వం ఇదే వ్యూహం అమలు చేసి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను ఒకవైపు, మిగిలిన జనరల్ ఉద్యోగులను మరోవైపు లాగేసి ఆ ఎన్నికల్లో లబ్ధి పొందిన అంశాన్ని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కమిటీ కార్యాకలాపాలు కేంద్ర ప్రభుత్వ శాఖలకు డీఓపీటీ ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నాయని, అవే మార్గదర్శకాలు రాష్ట్రంలో 2003 నుంచి అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఈ కమిటీ తదుపరి కార్యాకలాపాలు నిర్వహించకుండా అడ్డుకోవాలని, తద్వారా ఉద్యోగులంతా ఐకమత్యంగా ఉండి ఎన్నికల్లో స్వేచ్ఛగా పాల్గొనే అవకాశం కల్పించాలని ఆ ఫిర్యాదులో సంఘం విజ్ఞప్తి చేసింది.

ప్రభుత్వ నిర్లక్ష్యమే 33 మందిని బలిగొంది

కేంద్ర ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు లేఖ

అమరావతి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 33 మంది చనిపోయారని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం చేసిన సూచనలను రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పట్టించుకోకుండా పెన్షన్లను గ్రామ సచివాలయాల వద్ద పంపిణీ చేయాలని సెర్ప్ సీఈవో ఆదేశాలిచ్చారని, దీంతో 33 మంది చనిపోయారని పేర్కొంటూ లేఖ రాశారు. గ్రామ, వార్డ్ సచివాలయాల్లో 1,34,694 మంది ఉద్యోగులు అందుబాటులో ఉన్న దృష్ట్యా వారి ద్వారా ఇంటి వద్దకే పంపిణీ చేయవచ్చన్నారు. టీడీపీని దోషిగా చేసి రాజకీయంగా లబ్ధి పొందేందుకు 40 డిగ్రీల ఎండలో వృద్ధులు, వికలాంగులను సచివాలయాలకు పిలిపించారన్నారు. సచివాలయాల వద్ద షామియానాలు, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించలేదన్నారు. దాని ఫలితంగా సుమారు 60 లక్షల మంది పెన్షన్‌దారులు తీవ్రమైన ఎండలో సచివాలయాలకు వెళ్లి ఇబ్బందులు పడ్డారన్నారు. ఇంటికి వెళ్లి పెన్షన్ అందించి ఉంటే 33 మంది వృద్ధుల ప్రాణాలు పోయేవి కావన్నారు. పెన్షన్ల పంపిణీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి అధికారపార్టీకి అనుకూలంగా పనిచేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం పరిధి దాటుతున్నారు: వర్ల

ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రచారంలో జగన్ ఎన్నికల చట్టం పరిమితులను దాటి ప్రసంగిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబుపై అమర్యాద, అసభ్య పదజాలంతో దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిని హంతకుడు, దెయ్యం అని ఓ సీఎం అనడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటన్నారు. ఎన్నికల చట్టం, ఐపీసీ ప్రకారం జగన్ చేసిన దుష్ప్రచారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈసీని వర్ల రామయ్య కోరారు.

94 శాతం పెన్షన్ల పంపిణీ

రాష్ట్రంలో శుక్రవారం నాటికి సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ 94 శాతం పూర్తయిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి పంపిణీ చేపట్టి నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించామన్నారు.

'రిజైన్ జగన్' ట్రెండింగ్

దేశవ్యాప్తంగా 'రిజైన్ జగన్' అనే హ్యాష్‌ట్యాగ్ ట్విటర్‌లో రెండో స్థానంలో ట్రెండ్ అవుతోంది. సామాజిక బాధ్యతను విస్మరించి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకున్న సైకో జగన్ రాజీనామా చేయాలంటూ నెటిజన్లు ట్వీట్లు చేస్తున్నారు.

చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డిలపై చర్యలు తీసుకోండి: టీడీపీ

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

భయపెడుతున్న ప్రొస్టేట్ క్యాన్సర్

- రానున్న కాలంలో రెండింతలు పెరగనున్న కేసులు: ల్యాన్సెట్ అధ్యయనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: పురుషుల పునరుత్పత్తి వ్యవస్థను ప్రభావితం చేసే ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు 2020-2040 మధ్య కాలంలో రెండింతలు పెరుగుతాయని ల్యాన్సెట్ అధ్యయనం వెల్లడించింది. అంతేకాకుండా దీనికి సంబంధించిన మరణాలు కూడా 85 శాతం పెరుగుతాయని పేర్కొంది. ఈ క్యాన్సర్ లక్షణాలు త్వరగా బయటపడవని, దీనివల్ల ఈ వ్యాధి ముదిరి ప్రాణాలకే ముప్పుగా పరిణమించిందని పేర్కొంది. అధిక బరువు లేదా ఊబకాయం ప్రొస్టేట్ క్యాన్సర్ రిస్క్‌ను రెట్టింపు చేస్తోందని వివరించింది. అలాగే ప్రొస్టేట్ క్యాన్సర్‌పై మగవారిలో సరైన అవగాహన లేకపోవడం వల్ల కూడా ఈ కేసుల్లో పెరుగుదల కనిపిస్తోందని ల్యాన్సెట్ కమిషన్ పేర్కొంది. ఈ క్యాన్సర్ ముప్పు అభివృద్ధి చెందని, చెందుతున్న దేశాల్లో అత్యధికంగా ఉందని తెలిపింది. అంతకుముందు ఈ క్యాన్సర్ 60 ఏళ్లు దాటిన వారికే ఎక్కువగా వచ్చేదని కాని ఇప్పుడు అంతకంటే తక్కువ వయసున్న వారిలోనూ ఇది బయటపడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. రానున్న కాలంలో ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు ఎక్కువగా పెరిగే అవకాశం ఉన్నందున ఈ వ్యాధి రిస్క్ ఎక్కువగా ఉన్నవారిని ముందుగా గుర్తించి.. వారికి తగిన కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా దీని ముప్పును తగ్గించవచ్చని లండన్ క్యాన్సర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రొస్టేట్ అండ్ బ్లాడర్ క్యాన్సర్ రీసెర్చ్ ప్రొఫెసర్ అయిన నిక్ జేమ్స్ పేర్కొన్నారు.

తెలుగు యువకుడి హంతకుడికి మరణ శిక్ష

- అమెరికాలో 22 ఏళ్ల తరువాత అమలు

హ్యూస్టన్, ఏప్రిల్ 5: ఓ తెలుగు యువకుడితో సహా ఇద్దరిని క్రూరంగా చంపిన హంతకుడికి 22ఏళ్ల తరువాత అమెరికాలో మరణ శిక్షను అమలు చేశారు. ఓక్లహోమా రాష్ట్రంలో 2002లో కాల్పులు జరిపి, ఇద్దరి మరణానికి కారణమైన 41 ఏళ్ల వ్యక్తికి గురువారం మరణ శిక్షను అమలు చేశారు. మెక్ అలెస్టర్ పట్టణం ఓక్లహోమా స్టేట్ జైలులో మైకేల్ డెవేన్ స్మిత్‌కు ప్రాణాంతక ఇంజక్షన్ ఇచ్చి శిక్షను అమలు చేసినట్లు అటార్నీ జనరల్ జెంట్నర్ డ్రమ్మండ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో అమలైన మొదటి మరణ శిక్ష ఇది. స్మిత్ 2002, ఫిబ్రవరి 22న రెండు వేర్వేరు ఘటనల్లో 24 ఏళ్ల శరత్ పుల్లూరు, 40 ఏళ్ల జనెట్ మూరెను కాల్చి చంపాడు. శిక్ష అమలైన తరువాత అటార్నీ జనరల్ ఓ ప్రకటన చేస్తూ.. 'ఎట్టకేలకు న్యాయం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులకు మనశ్శాంతి లభించాలని ప్రార్థిస్తున్నా. స్మిత్ బాధితులు ఇద్దరూ మంచి వ్యక్తులు, వాళ్లకు జరగాల్సింది కాదు. శరత్ తెలివైన యువకుడు. అతని కుటుంబంలో చదువుకోసం అమెరికా వచ్చిన మొట్టమొదటి వ్యక్తి. అతను తన కుటుంబానికి స్ఫూర్తి ప్రదాత. మంచి భవిష్యత్ ఉన్నవాడు' అని పేర్కొన్నారు. శరత్ కుటుంబ సభ్యులు స్పందిస్తూ.. 'ఎట్టకేలకు న్యాయం జరిగినందుకు కృతజ్ఞతలు' అన్నారు.

సీపీఐ సీట్లు ఖరారు

- కేటాయింపులపై షర్మిల ప్రకటన.. అభ్యర్థులను ప్రకటించిన రామకృష్ణ
- సీపీఎంతో కొనసాగుతున్న కాంగ్రెస్ చర్చలు

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు వామపక్షాలతో కాంగ్రెస్ సీట్ల చర్చలు ఒక కొలిక్కి వస్తున్నాయి. సీపీఐకి పొత్తులో భాగంగా గుంటూరు లోక్‌సభతో సహా ఎనిమిది అసెంబ్లీ స్థానాలను కేటాయిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శుక్రారం జాబితాను విడుదల చేశారు. విజయవాడ - పశ్చిమ, విశాఖపట్నం - పశ్చిమ, పత్తికొండ, తిరుపతి, రాజంపేట, ఏలూరు, కమలాపురం, అనంతపురం అసెంబ్లీ స్థానాలలో సీపీఐ పోటీ చేస్తుందని ఆమె వెల్లడించారు. కాగా ఆయా స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శుక్రవారం ప్రకటించారు. 'గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి జంగాల అజయ్ కుమార్ పోటీ చేస్తారు. అసెంబ్లీ స్థానాల్లో.. అత్తిలి విమల (విశాఖ పశ్చిమ) బండి వెంకటేశ్వరరావు (ఏలూరు), జీ కోటేశ్వరరావు (విజయవాడ పశ్చిమ), సీ జాఫర్ (అనంతపురం అర్బన్), పీ రామచంద్రయ్య (పత్తికొండ), పీ మురళి (తిరుపతి), భూక్య విశ్వనాథనాయక్ (రాజంపేట), గాలి చంద్ర (కమలాపురం) పోటీ చేస్తారు' అని రామకృష్ణ ప్రకటించారు.

సీపీఎంతో కొనసాగుతున్న కాంగ్రెస్ చర్చలు

సీపీఎం - కాంగ్రెస్ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. పొత్తులో భాగంగా అరకు, కర్నూలు లోక్‌సభ స్థానాలతోపాటు కురుపాం, అరకు, రంపచోడవరం, గాజువాక, గన్నవరం, విజయవాడ సెంట్రల్, మంగళగిరి, నెల్లూరు, కర్నూలు, సంతనూతలపాడు అసెంబ్లీ స్థానాలను తమ పార్టీకి కేటాయించాలని సీపీఎం రాష్ట్ర నేతలు కాంగ్రెస్ పార్టీని కోరారు. అరకు లోక్‌సభ స్థానంతోపాటు మరో 8 అసెంబ్లీ స్థానాలను కేటాయించేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చినప్పటికీ.. విజయవాడ సెంట్రల్, గాజువాక, కర్నూలు తదితర స్థానాల విషయంలో ఇరు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు.

బీసీల పక్షపాతి టీడీపీ

- ఎన్టీఆర్ హయాం నుంచి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నది తెలుగుదేశమే
- లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన బీసీ నేత తాడిశెట్టి మురళి

గుంటూరు, అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బీసీలను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఆదుకున్న ఘనత తెలుగుదేశం పార్టీదేనని టీడీపీ యువనేత లోకేశ్ గుర్తుచేశారు. శుక్రవారం లోకేశ్ ఆధ్వర్యంలో గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ నేతృత్వంలో నగరానికి చెందిన బీసీ సామాజికవర్గ నేత, మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీమోహన్ తన అనుచరులతో ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు బీసీల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు సోదరుడైన మురళి... టుబాకో బోర్డు వైస్ చైర్మన్‌గా, టీటీడీ సలహా మండలి సభ్యుడిగా, గుంటూరు జిల్లా ధార్మిక మండలి చైర్మన్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. శుక్రవారం ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, అనుయాయులు పార్టీలో చేరారు. ప్రస్తుతం స్వల్ప అస్వస్థతతో ఉండటం మూలంగా అతని సోదరుడు మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకటరావు పార్టీలో చేరిక వాయిదా పడింది. రెండు, మూడు రోజుల్లో ఆయన కూడా చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. తాడిశెట్టి మురళి మాట్లాడుతూ టీడీపీ, జనసేన - బీజేపీ కూటమిని గెలిపించేందుకు అందరం కష్టపడి పనిచేద్దామని, వైసీపీకి, జగన్‌కి బుద్ధి చెప్పాలంటే వారిని సింగిల్ డిజిట్‌కే పరిమితం చేయాలని అన్నారు. తాడిశెట్టి సోదరుల ఆధ్వర్యంలో గుంటూరు నగరం నుంచి అనుచరగణంతో భారీ ర్యాలీ చేపట్టారు. కాగా, అసత్యాలు, దుష్ప్రచారాలతో ఆర్యవైశ్యులను టీడీపీ నుంచి, చంద్రబాబు నుంచి దూరం చేయలేరని టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేశ్ అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలపై వైసీపీ ఆర్యవైశ్య నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టారు.



టీడీపీలో చేరిన బీసీ సామాజికవర్గ నేతల సమావేశంలో మాట్లాడుతున్న లోకేశ్, పక్కన టీడీపీలో చేరిన తాడిశెట్టి మురళి, ఆయన సతీమణి అమల

ఇంకెంతమందిని బలి తీసుకుంటావ్?: లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అంతులేని భూ దాహం, ధన వ్యామోహంతో ఇంకెందరు బీసీలను బలి తీసుకుంటావ్ జగన్‌రెడ్డీ? అంటూ టీడీపీ యువనేత లోకేశ్ మండిపడ్డారు. 'నీ మేనమామ, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ముఠా బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాసులు భూమిని కబ్జా చేసి, అత్యంత దారుణంగా హతమార్చింది. కాపాడాల్సిన ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి హంతకులకు మద్దతుగా నిలిచాడు. బీసీల భూముల్ని లాక్కొని, చంపేందుకేనా.. నా బీసీలు, నా బీసీలు అంటావ్ జగన్‌రెడ్డీ?' అని శుక్రవారం ఎక్స్ వేదికగా నిలదీశారు.

ప్రజాస్వామ్య పునరుద్ధరణే బాబూజీకి నిజమైన నివాళి: టీడీపీ

అవినీతి పాలకులు, నేరస్థులను గద్దె దించి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే దివంగత ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌కు నిజమైన నివాళి అని టీడీపీ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 6 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com



ఇందిరాగాంధీ ఉడాన్ అకాడమీలో
సీపీఎల్, ఏఎంఈ కోర్సులు

అమేథీలోని ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ (ఐజీఆర్‌యూఏ)- కమర్షియల్ పైలెట్ లైసెన్స్ (సీపీఎల్), ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్(ఏఎంఈ) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ/వైవా, పైలెట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

కమర్షియల్ పైలెట్ లైసెన్స్ (సీపీఎల్)

● కోర్సు వ్యవధి రెండేళ్లు. అభ్యర్థులు ఈ కోర్సుతో పాటు బీఎస్సీ(ఏవియేషన్) డిగ్రీలో కూడా చేరవచ్చు. దీని వ్యవధి మూడేళ్లు. రామ్ మనోహర్ లోహియా అవధ్ యూనివర్సిటీలో చదవాల్సి ఉంటుంది. సీపీఎల్ కోర్సులో ఏవియేషన్ సబ్జెక్ట్‌లకు సంబంధించి నిర్దేశిత సిలబస్, ఫ్లయింగ్-ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తయ్యాక డిగ్రీ తరగతులకు హాజరు కావాలి.

సీట్లు: సీపీఎల్ కోర్సులో మొత్తం 125 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 49, ఓబీసీలకు 34, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 13, ఎస్సీలకు 19, ఎస్టీలకు 10 సీట్లు కేటాయించారు. బీఎస్సీ(ఏవియేషన్) డిగ్రీలో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఒక్కో సబ్జెక్ట్‌లో కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ/ఎస్టీ/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. అభ్యర్థుల వయసు అడ్మిషన్ నాటికి కనీసం 17 ఏళ్లు ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 31 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీ వర్గాలకు 33 ఏళ్లు మించకూడదు. అభ్యర్థుల ఎత్తు కనీసం 158 సెం.మీ ఉండాలి.

ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ (ఏఎంఈ)

● కోర్సు వ్యవధి మూడేళ్లు. మొత్తం 30 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 12, ఓబీసీ అభ్యర్థులకు 8, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 3 సీట్లు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా పన్నెండోతరగతి/ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 50 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అడ్మిషన్ నాటికి అభ్యర్థుల వయసు కనీసం 17 ఏళ్లు ఉండాలి.

ఆన్‌లైన్ రిటెన్ టెస్ట్: ఇందులో అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. జనరల్ ఇంగ్లీష్, మేథ్స్, ఫిజిక్స్, రీజనింగ్ అండ్ కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్/పన్నెండో తరగతి స్థాయిలోనే ఉంటాయి. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

ఇంటర్వ్యూ/వైవా: ఆన్‌లైన్ రిటెన్ టెస్ట్‌లో అర్హత సాధించినవారిని మాత్రమే ఇంటర్వ్యూ/వైవాకి పంపుతారు. ఇక్కడ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. పదోతరగతి, ఇంటర్/పన్నెండోతరగతి మార్కుల పత్రాలు; కుల ధ్రువీరణ పత్రాలు, ఆదాయ పత్రాలు, అడ్మిట్ కార్డ్ వెంట తీసుకెళ్లాలి.

సీపీఎల్ కోర్సుకు పైలెట్ ఆప్టిట్యూడ్ టెస్ట్/సైకోమెట్రిక్ టెస్ట్ కూడా ఉంటాయి. వీటిలో అర్హత పొందిన వారితో తుది జాబితా రూపొందిస్తారు.


ముఖ్య సమాచారం
- **సీపీఎల్ కోర్సు ఫీజు:** రూ.45,00,000
- **ఏఎంఈ కోర్సు ఫీజు:** రూ.4.5 లక్షలు
- **దరఖాస్తు ఫీజు:** సీపీఎల్-జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.12,000; ఏఎంఈ- జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 9
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 24 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఆన్‌లైన్ రిటెన్ టెస్ట్ తేదీ:** జూన్ 3
- **ఇంటర్వ్యూ/వైవాల షెడ్యూల్ విడుదల:** ఏఎంఈకి జూన్ 21న; సీపీఎల్‌కి జూన్ 25
- **ఇంటర్వ్యూలు, వైవా, పైలెట్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ల ప్రారంభ తేదీ:** జూలై 16
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏఎంఈకి జూలై 22న; సీపీఎల్‌కి ఆగస్టు 26
- **కమిటెడ్ మనీ చెల్లించాల్సిన తేదీ:** ఏఎంఈ కోర్సుకు జూలై 31; సీపీఎల్ కోర్సుకు సెప్టెంబరు 6
- **జాయినింగ్ తేదీ:** ఏఎంఈకి ఆగస్టు 5న; సీపీఎల్‌కి సెప్టెంబరు 25
- **వెబ్‌సైట్:** igrua.gov.in

నైసర్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)కు చెందిన స్కూల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ (ఎస్‌సీఎస్)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో భాగంగా కెమిస్ట్రీ విభాగాల్లో రీసెర్చ్ వర్క్‌లు నిర్వహిస్తారు. రెండు నెలల వ్యవధి గల ఈ ప్రోగ్రామ్ మేలో ప్రారంభమౌతుంది. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5,000 స్టయిపెండ్; స్లీపర్ క్లాస్ రైల్వే ఫేర్/బస్ ఫేర్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ/ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం
- **ప్రోగ్రామ్ తేదీలు:** మే 12 నుంచి జూలై 12 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** www.niser.ac.in



విశాఖ ఐఐపీఈలో పీహెచ్‌డీ

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)- పీహెచ్‌డీ 2024 ఆటమ్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెగ్యులర్, స్పాన్సర్డ్, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఇండివిడ్యువల్ ఫెలోషిప్ కేటగిరీల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ట్యూషన్ ఫీజు ఉండదు.



స్పెషలైజేషన్‌లు: బయోసైన్స్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, ఎర్త్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. నిర్దేశించిన ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు కూడా అర్హులే. రెగ్యులర్ అభ్యర్థులకు వ్యాలిడ్ గేట్/నెట్ స్కోర్ ఉంటేనే సంస్థ రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ ఇస్తుంది. ఐఐటీలు, ఐఐఎస్సీలు, ఐఐపీఈ, ఆర్‌జీఐపీటీ సంస్థలనుంచి కనీసం 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్/డ్యూయెల్ డిగ్రీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/రెండేళ్ల ఎమ్మెస్సీ పూర్తిచేసినవారికి నేరుగా పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం కల్పించడంతోపాటు రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు. ఇండివిడ్యువల్ ఫెలోషిప్ కేటగిరీ కింద అప్లయ్ చేసుకోవాలంటే సీఎస్ఐఆర్/యూజీసీ/డీఎస్‌టీ/డీబీటీ/ ఐసీఎంఆర్ ఫెలోషిప్ పొంది ఉండాలి. వ్యాలిడ్ అవార్డ్ లెటర్‌ను దరఖాస్తుకు జత చేయాలి. స్పాన్సర్డ్ కేటగిరీ అభ్యర్థులకు నిర్దేశించిన ప్రకారం బోధన/రీసెర్చ్ అనుభవం ఉండాలి. వర్కింగ్ ప్రొఫెషనల్స్ ప్రోగ్రామ్‌లో చేరేనాటికి వారు పనిచేస్తున్న ప్రాజెక్ట్ వ్యవధి కనీసం రెండేళ్లు ఉండాలి.

రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్: సంస్థ నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులకు గరిష్ఠంగా అయిదేళ్లపాటు రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ ఇస్తారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.31,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.35,000 ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.30,000 ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.300; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 17 నుంచి 22 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 30
- **అడ్మిషన తేదీ:** జూలై 17
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in

నిట్ దుర్గాపూర్‌లో టీచింగ్ పోస్టులు

ఖాళీలు 43

పశ్చిమ బెంగాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దుర్గాపూర్...వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఫ్యాకల్టీ భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2/గ్రేడ్-1: **37 పోస్టులు**
2. అసోసియేట్ ప్రొఫెసర్: **5 పోస్టులు**
3. ప్రొఫెసర్: **1 పోస్టు**

విభాగాలు: బయోటెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ తదితరాలు

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 60 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.1500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. **చివరి తేదీ:** ఏప్రిల్ 30

దరఖాస్తులు హార్డ్‌కాపీలు పోస్టులో పంపేందుకు చివరి తేదీ: మే 10

వెబ్‌సైట్: nitdgp.ac.in/


జాబ్ కార్నర్

గోవాలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ)లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బెసిల్) దరఖాస్తులు కోరుతోంది.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదలో పారామెడికల్ ఉద్యోగాలు

ఖాళీలు 54

1. మెడికల్ ఆఫీసర్: **4 పోస్టులు**
2. ఫార్మసిస్ట్: **2 పోస్టులు**
3. వార్డ్ అటెండెంట్: **2 పోస్టులు**
4. పంచకర్మ టెక్నీషియన్(మేల్, ఫిమేల్): **10 పోస్టులు**
5. స్టాఫ్ నర్స్: **10 పోస్టులు**
6. పంచకర్మ అటెండెంట్: **7 పోస్టులు**
7. ల్యాబ్ అటెండెంట్: **6 పోస్టులు**
8. పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్: **1 పోస్టు**
9. ఓటీ టెక్నీషియన్: **1 పోస్టు**
10. గార్డెన్ సూపర్‌వైజర్: **2 పోస్టులు**
11. మ్యూజియం కీపర్: **2 పోస్టులు**
12. ఐటీ అసిస్టెంట్: **2 పోస్టులు**
13. అసిస్టెంట్ లైబ్రరీ ఆఫీసర్: **1 పోస్టు**
14. రిసెప్షనిస్ట్: **2 పోస్టులు**
15. హెల్ప్ డెస్క్ రిసెప్షనిస్ట్: **2 పోస్టులు**



అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, 12వ తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** ఏప్రిల్ 9

వెబ్‌సైట్: www.becil.com/vacancies

ఎన్‌ఎల్‌సీలో ఇండస్ట్రియల్ ట్రెయినీలు

నైవేలీ(తమిళనాడు)లోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం): **100 పోస్టులు**
2. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్): **139 పోస్టులు**

అర్హత: పదో తరగతి, ఐటీఐ, సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా

గరిష్ఠ వయోపరిమితి: యూఆర్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 37 ఏళ్లు; ఓబీసీ అభ్యర్థులు 40 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 42 సంవత్సరాలు మించకూడదు.

స్టయిపెండ్: నెలకు ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం) అభ్యర్థులకు రూ.18,000 - రూ.22,000. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్) అభ్యర్థులకు రూ.14,000 - రూ.18,000.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 19

వెబ్‌సైట్: https://www.nlcindia.in

అప్రెంటిస్‌లు

ఎన్‌ఎండీసీలో

ఖాళీలు 193

దంతెవాడ(ఛత్తీస్‌గఢ్)లోని భారత ప్రభుత్వ సంస్థ- నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎండీసీ), బైలదిల ఐరన్‌ఓర్ మైన్, కిరందుల్ కాంప్లెక్స్...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

1. ట్రేడ్ అప్రెంటిస్: **147 ఖాళీలు**
2. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: **38 ఖాళీలు**
3. టెక్నీషియన్ అప్రెంటిస్: **9 ఖాళీలు**

విభాగాలు: ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, ఫిట్టర్, వెల్డర్, మెకానిక్ డీజిల్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ తదితరాలు.

అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణత

ఇంటర్వ్యూ తేదీలు: ఏప్రిల్ 15, 16, 18, 19, 20, 21, 22, 25, 26

వేదిక: బైలా క్లబ్ అండ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్, బీఐఓఎం, కిరందుల్ కాంప్లెక్స్, కిరందుల్, దంతేవాడ, ఛత్తీస్‌గఢ్.

వెబ్‌సైట్: https://www.nmdc.co.in/careers

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో

ఖాళీలు 1113

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే... 2024-25 సంవత్సరానికి రాయ్‌పూర్ డివిజన్, వ్యాగన్ రిపేర్ షాప్(రాయ్‌పూర్)లో కింద పేర్కొన్న అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ట్రేడ్ అప్రెంటిస్

ట్రేడులు: వెల్డర్, టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, స్టెనోగ్రాఫర్(ఇంగ్లీష్, హిందీ), కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్, హెల్త్ అండ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, మెషినిస్ట్, మెకానిక్ డీజిల్, మెషిన్ రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండిషనర్, మెకానిక్ ఆటో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్.

అర్హత: అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 ఏప్రిల్ 2 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక: మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్ష మార్కుల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 1

వెబ్‌సైట్: https://secr.indianrailways.gov.in/

లిటిల్స్



మీకు తెలుసా?

● చిన్న తోక, తలమీద కిరీటంలాంటి ఈక ఉండే పక్షిని 'కాలిఫోర్నియా క్వయిల్' అని పిలుస్తారు. దీన్నే వాలీ క్వయిల్ అని పిలుస్తారు.

● మగపక్షుల రెక్కల్లో నలుపుదం, తెలుపు ఉండే ఆడపక్షుల్లో గోధుమరంగు, తెలుపు ఉంటాయి.

● ఇవి డస్ట్‌బాత్ చేయటానికి ఇష్టపడతాయి. బురదలో, మట్టిలో తిరుగుతుంటాయి.

● దాదాపు పన్నెండు గుడ్లు పెడతాయి. గోధుమ రంగు గుడ్లమీద చుక్కల్లా ఉంటాయి. ఆడ, మగ పక్షులు రెండు వీటిని 23 రోజుల పాటు పొదుగుతాయి. పుట్టిన పిల్లలు నాలుగువారాల్లో స్వతంత్రంగా బతుకుతాయి.

● వీటి ఆనవాళ్లు దక్షిణ అమెరికాలో 12 వేల సంవత్సరాల క్రితం ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు.



● 24 నుంచి 27 సెం.మీ పొడవుండే ఈ పక్షుల వింగ్ స్పాన్ కేవలం 32 సెం.మీ ఉంటుంది. వీటి బరువు మాత్రం 150 గ్రాముల నుంచి 190 గ్రాములు మాత్రమే ఉంటాయి.

● గంటకు అరవై నాలుగు కిలోమీటర్ల వేగంతో పరిగెత్తుతాయి.

● దక్షిణ అమెరికాలోని చిలీ, అర్జెంటీనాతో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో వీటి సంఖ్య ఎక్కువే.


● కాలిఫోర్నియాలో 1932 సంవత్సరంలోనే ఆ రాష్ట్ర పక్షిగా క్వయిల్‌ను గుర్తించారు. వాల్ట్ డిస్నీ మూవీస్‌లో ఈ పక్షులను 'బాంబి' పేరుతో చూపిస్తారు.

● కాలిఫోర్నియా క్వయిల్‌ను 'చికాగో' అని కూడా పిలుస్తారు.

+ ఇవి విత్తనాలు, పండ్లు, ఆకులు, పూలు, బెర్రీస్, పురుగులు తిని బతుకుతాయి.

● వీటి జీవనకాలం గరిష్ఠంగా నాలుగేళ్లు మాత్రమే ఉంటాయి.

6 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 274

		7	4		6	3		5
			5	8		9	4	
	2				9			
7	5							
2	9						5	3
							9	1
			6				3	
	3	9		7	1			
6		2	9		3	8		

సుడోకు - 273 సమాధానం

3	2	7	6	4	1	9	8	5
5	1	8	3	2	9	7	4	6
9	6	4	7	8	5	3	1	2
2	4	9	5	1	3	8	6	7
8	7	1	9	6	4	5	2	3
6	5	3	8	7	2	4	9	1
4	3	2	1	9	7	6	5	8
7	9	6	2	5	8	1	3	4
1	8	5	4	3	6	2	7	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 6 ఏప్రిల్ 2024

దేశీ మార్కెట్లోకి మోటోరోలా ఎడ్జ్



మోటోరోలా ఎడ్జ్ 50 ప్రొ ఇండియన్ మార్కెట్లోకి వచ్చింది. ఏఐ బ్యాకింగ్‌తో ట్రిపుల్ రేర్ కెమెరా సిస్టమ్, 50 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా దీనిలో ఉన్నాయి. 13-మెగాపిక్సెల్ సెన్సర్, అల్ట్రావైడ్ యాంగిల్ లెన్స్, 3ఎక్స్ ఆప్టికల్ జూమ్‌తో 10-మెగాపిక్సెల్ టెలిఫొటో షూటర్, ఓఐఎస్ సపోర్ట్ ఉన్నాయి. 8.19 ఎంఎం మందం, 186 గ్రాముల బరువు ఉంది. 4ఎన్ఎం ఆక్టా-కోర్ స్నాప్‌డ్రాగన్ పవర్‌కు తోడు 4,500ఎంఏహెచ్ బ్యాటరీ సపోర్ట్ ఉంది. వైర్డ్, వైర్‌లెస్ టర్బో చార్జింగ్ సదుపాయం ఉంది. 6.7 ఇంచీల 1.5కె పిఓలెడ్ కర్వ్‌డ్ డిస్‌ప్లే, 11హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు ఉన్నాయి. మూడేళ్ళ పాటు ఓఎస్, నాలుగేళ్ళ సెక్యూరిటీ అప్‌గ్రేడ్స్ ఉంటాయి. బ్లాక్ బ్యూటీ, లక్సే లావెండర్, మూన్‌లైట్ పెరల్ షేడ్ రంగుల్లో లభిస్తుంది. 8జీబీ + 256 జీబీ వేరియంట్ ధర రూ.31,999 కాగా 12జీబీ + 256జీబీ వేరియంట్ ధర రూ.35,999. రెండోది మాత్రం లాంచింగ్ ఆఫర్ కింద రూ.31,999కి లభించనుంది. మోటారాలా ఆన్‌లైన్‌కు తోడు రిటైల్ స్టోర్స్‌లో లభిస్తుంది.


ఈ నెలలోనే శాంసంగ్ గెలాక్సీ ఫోన్స్



ప్రొడక్ట్

శాంసంగ్ నుంచి ఈ నెలలో రెండు గెలాక్సీ ఫోన్‌లు విడుదల అవుతున్నాయి. అందులో ఒకటి ఎం55 5జీ కాగా రెండోది ఎం15 5జీ. ఈ నెల 8న ఇవి ఇండియన్ మార్కెట్లోకి రానున్నాయని సమాచారం. రెంటికీ శాంసంగ్ నాక్స్ సెక్యూరిటీ సపోర్ట్ ఉంది. గెలాక్సీ ఎం55 5జీ - 6.7 ఇంచీల ఫుల్ హెచ్‌డీ + సూపర్ అమోల్డ్ ప్లస్ డిస్‌ప్లే, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో వస్తోంది. వెయ్యి నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్ ఉంటుంది. విజన్ బూస్టర్ టెక్నాలజీని ఉపయోగిస్తుండటంతో సూర్యకాంతిలోనూ స్క్రీన్ స్పష్టంగా కనిపిస్తుంది. 5000ఎంఏ హెచ్ బ్యాటరీ, 45 వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ సదుపాయాలు ఉన్నాయి. ట్రిపుల్ కెమెరా యూనిట్ ఉంది. 50-మెగాపిక్సెల్ ప్రైమరీ సెన్సర్‌కు తోడు ఆప్టికల్ ఇమేజ్ స్టెబి లైజేషన్ ఉంది. సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 50 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా సెన్సర్ ఉంది. నైటోగ్రఫీ ఫీచర్ ఉంది. ఏఐ బ్యాక్డ్ టూల్స్ అంటే ఇమేజ్ క్లిప్పర్, ఆబ్జెక్ట్ ఎరేజర్ ఉన్నాయి. ఇందులో ఎం55 5జీ డెనిమ్ బ్లాక్, లైట్ గ్రీన్ షేడ్ రంగుల్లో లభ్యమవుతుంది. 8జీబీ + 128జీబీ వేరియంట్ ఎం15 5జీ విషయా నికి వస్తే దీనిలో మీడియాటెక్ డైమెన్సిటీ 6100 చిప్‌సెట్, 6.5 ఇంచీల సూపర్ అమోల్డ్ డిస్‌ప్లే 50-మెగా పిక్సెల్ ట్రిపుల్ రేర్ కెమెరాయూనిట్ ఉన్నాయి. హెడ్‌సెట్‌కు 6000ఎంఏహెచ్ బ్యాటరీ బ్యాకింగ్ ఉంది. దాంతో రెండు రోజుల పాటు బ్యాటరీ లైఫ్ ఉంటుంది. ఇది బ్లూ టోపెజ్, సెలస్టయిన్ బ్లూ, స్టోన్ గ్రే రంగుల్లో దొరకనుంది.

పెయిడ్ మోడ్‌లో గూగుల్ సెర్చ్!



విషయం ఏదైనప్పటికీ వెంటనే గూగుల్‌లో వెతుక్కునే దశకు చేరుకున్నాం. అయితే ఇప్పటివరకు సంబంధిత సేవలు అన్నీ ఉచితం. అయితే ఇకముందు అలా ఉండకపోవచ్చు. గూగుల్ తన సెర్చ్ ఇంజన్‌కు ఏఐ ఫీచర్స్‌ను పెంచుకోవాలని కూడా చూస్తోందని సమాచారం. ఆండ్రాయిడ్ అథారిటీని ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ఈ న్యూస్‌కు ఊతం. గూగుల్‌కు ప్రత్యేకించి సబ్‌స్క్రిప్షన్ సర్వీసులు జెమిని అడ్వాన్స్‌డ్ లేదా గూగుల్ వన్‌లో దీని జోడిస్తోంది. యూజర్ అనుభవాన్ని పెంచేందుకు ఈ చర్య తీసుకుంటోంది. అలాగే దీని ద్వారా రెవెన్యూ కలపవచ్చని అంటున్నారు. అలా కాకుంటే గూగుల్ సెర్చ్‌ని అలాగే ఫ్రీ సర్వీస్‌గా ఉంచి ప్రీమియర్ టైర్‌ని పరిచయం చేయడానికి తోడు ప్రకటనల ద్వారా ఆదాయం పెంచుకోవచ్చని భావిస్తున్నారు. యూజర్లకు మంచి అనుభవాన్ని అందించడం, అదే సమయంలో రెవెన్యూ పెంచుకోవడం అన్న రెండు లక్ష్యాలతో ఈ మార్పులకు గూగుల్ శ్రీకారం చుడుతోంది. సెర్చ్ జనరేటివ్ ఎక్స్‌పీరియెన్స్(ఎస్‌జీఈ) పేరిట గత ఏడాది మే నెలలోనే ఏఐ పవర్డ్ సెర్చ్ సర్వీసుని గూగుల్ ఆరంభించింది. ఆప్షనల్ ఫీచర్‌గా ఇది పనిచేస్తోంది. గూగుల్ రెవెన్యూపై ఇదంటా ప్రభావం చూపుతున్న నేపథ్యంలో గూగుల్ మార్పు దిశగా అడుగులు వేస్తోందని తెలిసింది.

వర్డ్‌పాడ్‌కు మైక్రోసాఫ్ట్ చెల్లుచీటీ ప్రత్యామ్నాయాలు ఇవే!

మైక్రోసాఫ్ట్ - విండోస్ 11లో వర్డ్‌ప్యాడ్‌కు స్వస్తి పలికింది. యూజర్ ఎక్స్‌పీరియెన్స్‌ను పెంచేందుకు వీలుగా మైక్రోసాఫ్ట్ ఈ చర్య తీసుకుంది. అసలు దీన్ని ఎందుకు తొలగించారన్నది మాత్రం స్పష్టంగా తెలియలేదు. బేసిక్ వర్డ్ ప్రాసెసింగ్ టాస్క్‌ల కోసం యూజర్లు దీన్ని ఉపయోగించేవారు. అయితే వర్డ్ ప్రాసెసింగ్ అవసరాల కోసం ప్రస్తుతం ఉన్న ప్రత్యామ్నాయాలను ఈ నేపథ్యంలో చూద్దాం.

నోట్‌ప్యాడ్: దశాబ్దాలుగా ఇది ఉంది. రిలయబుల్ టెక్స్ట్ ఎడిటింగ్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంది. అడ్వాన్స్‌డ్ ఫీచర్లు ఏవీ ఇందులో లేవు. అయినప్పటికీ టెక్స్ట్ టాస్క్‌లను త్వరగా చేసుకునేందుకు మంచి టూల్‌గానే ఉపయోగపడుతోంది.



ఆల్టర్నేట్

టైపొర: ఇది రైటర్ ఫ్రెండ్లీ సాఫ్ట్‌వేర్. ప్రివ్యూ సామర్థ్యాలు ఉన్నాయి. క్రియేటివ్ మైండ్ ఉన్న వ్యక్తులు దీన్ని అభిమానిస్తారు. ఫైల్ మేనేజ్‌మెంట్ ఫీచర్లకు తోడు వివిధ ఎక్స్‌పోర్ట్ ఫార్మేట్‌లను ఇది సపోర్ట్ చేస్తుంది.

ఎడిట్‌ప్యాడ్: ఇది ఆన్‌లైన్ ఎడిటర్. గ్రామర్ చెక్‌కు తోడు ప్లగారిజమ్ డిటెక్షన్, కంటెంట్ సమ్మరైజేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. సులువుగా షేరింగ్ ఆప్షన్స్ కూడా ఉన్నాయి.

1 రైటర్: బేసిక్ ఫంక్షనాలిటీకి తోడు అడ్వాన్స్‌డ్ ఫీచర్లు ఉన్నాయి. స్క్రీన్ రైటింగ్ స్పేస్‌ను అందిస్తోంది. మార్క్‌డౌన్ ఫైల్స్, ఐక్లౌడ్ డ్రైవ్ ఇంటిగ్రేషన్ సపోర్ట్ ఉన్నాయి. రైటర్లకు ఇదో మంచి చాయిస్.

గూగుల్ డాక్స్: డాక్యుమెంట్ ఎడిటింగ్‌కు ఇది పవర్‌హౌస్. సంప్రదాయ వర్డ్ ప్రాసెసర్లకు ఇది ప్రత్యామ్నాయం. పీడీఎఫ్ ఎడిటింగ్, రియల్‌టైమ్ కొలాబిరేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. వర్డ్ ప్యాడ్‌కు సరైన ప్రత్యామ్నాయం ఇదే అని కూడా చెప్పవచ్చు.

ఇన్ఫో

ఇన్‌స్టాగ్రామ్‌లో వానిష్ మోడ్

మెసేజ్‌లు పలు రకాలు. వాటిలో కొన్నింటికి పెద్ద ప్రాధాన్యం ఉండదు. ఒకసారి చూసిన తరవాత వాటితో పని అయిపోతుంది. అలాగే కొన్నింటిని వెంటనే తొలగించాల్సి వస్తుంది కూడా. అలాంటి వాటికోసమే 'వానిష్ మోడ్'ని ఇన్‌స్టాగ్రామ్ పరిచయం చేసింది. డైరెక్ట్ మెసేజ్‌ల పరిధిలో మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు ఇతర కంటెంట్ యూజర్‌కు అనుకూలంగా మాయం చేసుకునేందుకు ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది. దీనికోసం ఇన్‌స్టాగ్రామ్‌లో మెసెంజర్ ఫీచర్‌ను అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం...




- స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- మెసెంజర్ ఐకాన్ లేదా పేపర్ ఎయిర్‌ప్లేన్ ఐకాన్(సెండ్)ని టాప్ చేయాలి.
- వానిష్ మోడ్ పెట్టాలని అనుకున్న చాట్‌ని సెలెక్ట్ చేసుకోవాలి.
- చాట్‌లోనే వానిష్ మోడ్‌ని యాక్టివేట్ చేసేందుకు వానిష్ మోడ్‌ని స్వైప్‌అప్ చేయాలి. డిజేబుల్ చేయాలనుకున్నా మళ్ళీ స్వైప్‌అప్ శరణ్యం.

వానిష్ మోడ్‌లో పంపిన మెసేజ్ అ విధంగా నోటిపై అవుతుంది. అదే విధంగా వానిష్ మోడ్ లేని మెసేజ్‌లు సైతం అందుతూ ఉంటాయి. వానిష్ మోడ్‌లో ఉన్న వాటిని కాపీ, సేవ్, తిరిగి పంపుకొనే వెసులుబాటు ఉండదు. కనెక్ట్ అయిన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్స్‌తోనే ఈ పని వీలువుతుంది. ఈ ఫీచర్‌లో ప్రైవసీ ఉన్నప్పటికీ, చాలా జాగ్రత్తగా దీన్ని ఉపయోగించాలి. నమ్మకం ఉన్న వ్యక్తులతో సాగిస్తేనే మంచిది. డిజెపియరింగ్ మెసేజ్‌లను వేరే డివైజ్‌లతో పట్టుకునే అవకాశం ఇప్పటికీ ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. వానిష్ మోడ్ కదా అని ఆదమరిస్తే కొన్ని ఇబ్బందులు తప్పవు.

యూట్యూబ్ ఆఫ్‌లైన్ మ్యూజిక్ ఇప్పుడు డెస్క్‌టాప్‌పైనా..



ఆఫ్‌లైన్‌లో వినేందుకు వీలుగా మొబైల్స్‌లోకి యూట్యూబ్ మ్యూజిక్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది. ఇప్పుడు ఆ సదుపాయాన్ని డెస్క్‌టాప్ యూజర్లకూ కల్పిస్తున్నారు. ప్రస్తుతం దాని విడుదల కార్యక్రమం ఆరంభమైందని '9టు5 గూగుల్' మొదట గుర్తించింది. డెస్క్‌టాప్‌పై యూట్యూబ్ మ్యూజిక్ వెబ్‌సైట్‌ని ఓపెన్ చేస్తే 'న్యూ! డౌన్‌లోడ్ మ్యూజిక్ టు లిజన్ ఆఫ్‌లైన్' అని కనిపిస్తుంది. సైడ్‌బార్‌పై లైబ్రరీ పక్కన స్ర్కీన్‌పై ఇది ఉంటుంది. టాబ్‌పై క్లిక్ చేస్తే 'డౌన్‌లోడ్స్' కనిపిస్తుంది. ఎప్పుడంటే అప్పుడు లైబ్రరీ - డౌన్‌లోడ్స్ టాబ్‌తో యాక్సెస్ పొందవచ్చు. సింగ్యులర్ మ్యూజిక్ ట్రాక్స్‌కు తోడు పూర్తి ఆల్బమ్స్, ప్లేలిస్ట్‌లు లేదా పాడ్‌క్యాస్ట్‌లను కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఫైల్‌ని సేవ్ చేసుకునేందుకు డౌన్‌లోడ్ బటన్‌పై క్లిక్ చేయాలి. డౌన్‌లోడింగ్ ఇండికేటర్ కనిపిస్తుంది. డౌన్‌లోడ్ పూర్తికాగానే డౌన్‌లోడ్ టాబ్ కింద ఫైల్ కనిపిస్తుంది. కనీసం 30 రోజులకు ఒకసారైన యాక్టివ్ ఇంటర్నెట్ కనెక్షన్ ఉంటే చాలు డౌన్‌లోడ్ చేసింది అలాగే ఉంటుంది. నిజానికి మొబైల్ అప్లికేషన్‌కు కూడా ఇదే వర్తిస్తుంది.



'మెసేజెస్'కు శాటిలైట్ సపోర్ట్!

గూగుల్ - మెసేజెస్ యాప్‌నకు శాటిలైట్ మెసెజింగ్ సపోర్ట్‌ని జోడించే పనిలో ఉంది. మొబైల్ నెట్‌వర్క్ లేదా ఇంటర్నెట్ కనెక్టివిటీ లేకుండానే యూజర్లు మాట్లాడుకునే వెసులుబాటు దీంతో లభిస్తుంది. యాపిల్ లేటెస్ట్ బేటా వెర్షన్‌లో ఇది కనిపించిందని '9టు5 గూగుల్' పేర్కొంది. ఆ కథనంలో భాగంగా మూడు అభిప్రాయాలను వెల్లడించింది. అందులో మూడోది ఆసక్తికరంగా ఉంది. దాని ప్రకారం ఎమర్జెన్సీ సర్వీసులు సహా ఎవరికైనా మెసేజ్ చేసే అవకాశం ఉంటుంది. ఐఫోన్‌తో కేవలం ఎమర్జెన్సీ సర్వీసులకు మెసేజ్ చేసుకోవచ్చు. గూగుల్ మాత్రం ఇది ఎవరికైనా అంటుండటం గమనార్హం. ఇప్పటికే ఈ పనిలో ఉన్న జీపీఎస్ నేవిగేషన్ జెయింట్ గార్మిన్‌తో దీనికోసం భాగస్వామ్యం కుదుర్చుకోనుందని కూడా సమాచారం. ఆండ్రాయిడ్ 15 అధికారికంగా విడుదల కావడానికి ముందే పై సదుపాయం అందుబాటులోకి వస్తుందా అన్నది తెలియదు. ఆండ్రాయిడ్ ఓఎస్‌లో తదుపరి రాబోయే ఫీచర్ ఆటో కనెక్ట్ టు శాటిలైట్ కాగా శాటిలైట్ ఐకాన్ కూడా స్టాటస్‌బార్‌పై ఉండనుందని తెలిసింది. మొత్తానికి గూగుల్ మెసేజెస్ తన కోర్ విధులను మెరుగుపరుస్తోందని చెప్పవచ్చు.

'అకౌంట్ లేకుండానే'



ఓపెన్ ఏఐ సృష్టించిన చాట్‌జీపీటీ ఇకపై అందరికీ అందుబాటులోకి ఉండనుంది. ప్రత్యేకించి అకౌంట్ క్రియేట్ చేసుకోకుండానే ఈ ఏఐ టూల్‌ని పొందవచ్చు. అయితే ఇందులోనూ కొన్ని లాభ నష్టాలు ఉన్నాయి. ముఖ్యంగా సైన్ కాకుండా చాట్‌జీపీటీ ఉపయోగించుకునే వారికి కొన్ని పరిమితులు ఉంటాయి. ఓపెన్ ఏఐ బ్లాగ్‌పోస్ట్ ప్రకారం సైన్ చేయకుండానే యూజర్లు చాట్‌బోట్‌ని ఉపయోగించుకోవచ్చు. చాట్‌బోట్‌ను ఉచితంగా అందుబాటులోకి తీసుకువస్తే దాంతో సమకూరే ప్రయోజనాలు జనాలకు అర్థమవుతుందని ఓపెన్ ఏఐ తలపోస్తోంది. ఏఐతో యూజర్ చేసే సంభాషణ ఇప్పటికీ రికార్డు అవుతోంది. మోడల్ ట్రైనింగ్ కోసం దీన్ని ఉపయోగిస్తోంది. అయితే ఆ కసరత్తును తప్పించుకునే ఆప్షన్ యూజర్లకు ఉంది. అందుకోసం చాట్‌జీపీటీ సెట్టింగ్స్‌లోకి మొదట వెళ్ళాలి. సంభాషణను ప్రైవేటీకరించేందుకు వీలుగా దాన్ని టర్నాఫ్ చేయాలి. దాంతో ఇక చాట్స్ షేరింగ్, చాట్ హిస్టరీ, కస్టమ్ సూచనలతో ఒనగూరే ప్రయోజనాలు కూడా ఉండవు. అకౌంట్ వెర్షన్ మాదిరిగానే జీపీటీ 3.5 మోడల్‌ని న్యూవెర్షన్ కూడా వాడుకుంటుంది. ఓపెన్ ఏఐ ఇటీవల కంటెంట్ సేఫ్‌గార్డ్ ఫీచర్లను పరిచయం చేసింది. అయితే సైన్ కాకుండా చాట్‌జీపీటీని ఉపయోగించుకునే వారికి ఆ ఫీచర్ల సపోర్ట్ ఉంటుందా లేదా అన్నది మాత్రం తెలియరాలేదు. సైన్‌ఔట్ వెర్షన్ క్రమక్రమంగా అందుబాటులోకి రానుందని సమాచారం.

చాట్ జీపీటీ

డాల్-ఈ జనరేటెడ్ ఇమేజెస్ ఎడిటింగ్



చాట్‌జీపీటీ - ఇంటర్‌ఫేస్ పరిధిలోనే కొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. డాల్-ఈ ఇమేజెస్‌ను దీంతో నేరుగా ఎడిట్ చేసుకోవచ్చు. వెబ్, ఐఓఎస్, ఆండ్రాయిడ్ వెర్షన్లలో ఈ ఎడిటింగ్‌కు వీలు ఉంటుంది. ఇందుకోసం

- డాల్-ఈ ని ఉపయోగించి చాట్ జీపీటీ ఇమేజెస్‌ను జనరేట్ చేయాలి.
- ఇమేజ్ జనరేట్ అయితే చాలు, ఎడిట్ ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. కొత్త ఇంటర్‌ఫేస్ అక్కడ కనిపిస్తుంది. అది ఎడిటింగ్‌కు అనుమతిస్తుంది.
- సెలెక్ట్ టూల్ ఉపయోగించి ట్వీక్ చేయాలని అనుకుంటున్న పార్ట్‌లను హైలైట్ చేసుకోవాలి. సెలెక్ట్ టూల్‌ని కాదని కూడా ఇదే పని చేసుకోవచ్చు.
- టెక్స్ట్ ఫీల్డ్‌లోని ప్రాంప్ట్ ప్రకారం మార్పులను ఎంటర్ చేయాలి.
- మార్పులు కాగానే సేవ్ చేసుకుంటే సరిపోతుంది.

ఇందులో ముందుగా సెట్ చేసిన స్టయిల్స్ అంటే వుడ్‌కట్, క్లోజ్-అప్, లో యాంగిల్, ఆర్టిఫీషియల్ లైటింగ్ వంటివి ఉంటాయి. అందువల్ల పెద్దగా నైపుణ్యం లేకున్నప్పటికీ ఇమేజెస్ ఎడిటింగ్ చేసుకోవచ్చు.



ఆండ్రాయిడ్ 15

వాల్యూమ్ ప్యానల్‌లో మార్పులు!



అప్‌గ్రేడ్

ఆండ్రాయిడ్ 15 పూర్తి స్థాయిలో ఇంకా రూపుదిద్దుకోలేదు. అయినప్పటికీ వాల్యూమ్ ప్యానల్ రూపంలోనే కాదు ఫంక్షనాలిటీలోనూ మార్పులు ఉంటాయని 'ఆండ్రాయిడ్ అథారిటీ' పేర్కొంది. మొదటగా అప్-టు-డేట్ డిజైన్‌తో ఉండనుంది. స్లయిడర్స్ లుక్‌పరంగా చాలా పెద్దగా ఉంటాయి. పిక్సెల్స్‌లో బ్రైటనర్ స్లయిడర్ మాదిరిగా ఉండొచ్చు. లుక్స్ వరకు ఇదో గణనీయ మార్పు కానుంది. డిజైన్ అర్థవంతంగా మడుచుకునే విధంగా ఉంటుంది. వాల్యూమ్ సెట్టింగ్స్ అన్నీ కనిపించేలా ప్యానల్ ఉంటుంది. అనుకూలమైన సైజ్ కావడంతో యాప్ పనిచేస్తున్నప్పుడు ప్యానల్ ఆటోమేటిక్‌గా తగ్గుతుంది. అలాగే ఐకాన్‌ని టాప్ చేస్తే, ఆడియో స్ట్రీమ్ మ్యూట్‌లోకి వెళుతుంది. నాయిస్ కంట్రోల్ అదుపులోకి వస్తుంది. అంటే ఇక హెడ్‌ఫోన్లతో పనిచేస్తుంది. దీని రిలీజ్ మే నెల మధ్యలో ఉండొచ్చని భావిస్తున్నారు.

మీట్‌గీక్ యూజ్‌ఫుల్ యాప్



ఆఫీసుల్లో పదేపదే జరిపే సమావేశాలంటే విసుగెత్తే వ్యక్తుల కోసం ఉద్దేశించిన ఏఐ యాప్ 'మీట్‌గీక్'. సమావేశాలను రికార్డ్ చేయడమే కాదు, మీటింగ్ మినిట్స్‌ను ట్రాన్స్‌క్రైబ్, సమ్మరైజ్ చేయడంలో సహకరిస్తుంది ఈ యాప్. ఈ మీటింగ్ యాప్ నిమిషాల్లో పనులను చక్కబెడుతుంది. పలు ఏఐ ఫీచర్లకు కూడా ఇది నెలవు. దీంతో ఒనగూరే ప్రయోజనాల విషయానికి వస్తే....

- దీంట్లో మీటింగ్ ఎజెండా టెంప్లేట్స్ ఉంటాయి. మీటింగ్ మినిట్స్ నుంచి యాక్షన్ ఐటెమ్స్, ఇంటర్వ్యూలు, బ్రెయిన్ స్టార్మింగ్ సెషన్స్ వరకు అన్నింటికీ అవి ఉపయోగపడతాయి.
- ఏఐ సహకారంతో ఈ యాప్ సమావేశంలోని యాక్షన్ ఐటెమ్స్‌ను బైటకు తీస్తుంది. టాపిక్స్ వారీగా, ఇంపార్టెంట్ ఫ్యాక్ట్స్, సవాళ్ళు తదితరాలను అవగాహన కోసం విడదీస్తుంది.
- మెషీన్ లెర్నింగ్‌ను కూడా ఈ యాప్ ఉపయోగిస్తుంది. తద్వారా మీటింగ్‌లో జరిగే సంభాషణల నుంచి నేర్చుకునే వెసులుబాటును కల్పిస్తుంది. ఇది పర్సనలైజ్డ్ ఇన్‌సైట్స్, బిహేవియరల్ ట్రెండ్స్, ప్రాజెక్ట్ గోల్స్‌ను తేల్చుకునేందుకు ఉపయోగపడుతుంది.
- పరిమితంగా ఉపయోగించుకునే వరకు ఈ యాప్ ఉచితం. ఎలాంటి పరిమితులు లేకుండా ఫీచర్లు అన్నింటినీ ఉపయోగించుకోవాలంటే నెలకు 15 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

రిమైండర్స్ యాప్ 'డ్యూయాప్'



కొన్ని టాస్క్‌లను మర్చిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఆ విషయంలో అలెర్ట్ చేసేందుకు ఉపయోగపడేది 'డ్యూ యాప్'. ఐఓఎస్ యూజర్లకు ఇది బాగా ప్రయోజనకరం. పేరుకు తగ్గట్టు ఇది రిమైండింగ్ యాప్. డెడ్‌లైన్‌కు ముందు పనులు పూర్తయ్యేలా చూస్తుంది. రిమైండర్ల క్యాప్చర్ నుంచి సమయానికి వాటిని పంపడం వరకు సంబంధిత పనులన్నింటినీ నిర్వర్తిస్తుంది.

నేచురల్ డేట్-పార్సింగ్ ఫీచర్లతో ఇది ఇన్‌స్టాంట్‌గా పనిచేస్తుంది. ప్రాంప్ట్‌ను టైప్ చేస్తే చాలు, రిమైండర్‌తో వెంటపడుతుంది. కాలానుగుణంగా నోటిఫికేషన్లతో అలెర్ట్ చేస్తుంది. టాస్క్ పూర్తయ్యే వరకు వెంటపడుతుంది. అంటే పని పూర్తయ్యేవరకు రిమైండర్లతో వెంటాడుతుంది. యూజర్లు దీంట్లో రికరింగ్ టాస్కులను చేర్చుకోవచ్చు. అప్పుడు పదేపదే చేసే పనులు మర్చిపోవడానికి వీలు లేకుండా చేస్తుంది. దీంతో పని పూర్తవ్వడమే కాదు, కొన్ని సందర్భాల్లో ఇది ఉత్పాదకత పెంపునకు దోహదపడుతుంది. ఈ యాప్ ఐఓఎస్ డివైజ్‌లు అంటే మ్యాక్, ఐఫోన్, యాపిల్ వాచ్ తదితరాల్లో పనిచేస్తుంది. మరోలా చెప్పుకోవాలంటే ఐక్లౌడ్, డ్రాప్‌బాక్స్ సహాయంతో రిమైండర్, టైమర్ పరంగా సింక్ చేసుకోవచ్చు.